
సత్యమేవ జయతే
సాక్షి
WWW.SAKSHI.COM
పేజీలు: 14 వెల: ₹ 6.50
సంపుటి: 16 సంచిక: 67
బుధవారం 22-11-2023
SIMULTANEOUSLY PRINTED AT BANGALORE | CHENNAI | DELHI | VIJAYAWADA | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL



'సంక్షేమ పథకాల అమలే సర్కారు పని తీరుకు కొలమానం'


ప్రిక్వార్టర్స్‌లో ప్రణయ్
చైనా ఓపెన్ బ్యాడ్మింటన్ టోర్నీలో భారత ప్లేయర్ శుభారంభం - 12లో


4.7 లక్షల కోట్ల వ్యాపారం
ఈ పెళ్లిళ్ల సీజన్‌లో ఆ మేర వ్యాపారం జరగొచ్చని సీఏఐటీ అంచనా - 13లో


అవి దేశానికి శత్రువులు
అవినీతి, బంధుప్రీతి, బుజ్జగింపు రాజకీయాలు దేశానికి ప్రధాన శత్రువులని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు.
వివరాలు 6లో ▸


కార్మికులు కనిపించారు
ఉత్తరాఖండ్‌లోని సొరంగంలో చిక్కుకున్న కార్మికుల యోగక్షేమాలు తెలుసుకునేందుకు అధికారులు చేసిన ప్రయత్నాలు ఫలించాయి.
వివరాలు 6లో ▸



దేశ హితానికే జమిలి ఎన్నికలు
జమిలి ఎన్నికలు దేశ హితం కోసమే తప్ప, ఏ ఒక్క రాజకీయ పార్టీకీ సంబంధించింది కాదని మాజీ రాష్ట్రపతి కోవింద్ చెప్పారు.
వివరాలు 6లో ▸


బద్రీనాథ్ కన్నుమూత
కంటి చికిత్సలతో ఎందరో పేదల జీవితాల్లో వెలుగులు నింపిన శంకర నేత్రాలయ వ్యవస్థాపకుడు డాక్టర్ బద్రీనాథ్ కన్నుమూశారు.
వివరాలు 5లో ▸

మత్స్యకారులను ఆదుకుంటున్నాం..
అండగా ఉన్నాం
మంచి చేయాలనే తపనతో వారి సంక్షేమానికి కృషి చేస్తున్నాం: సీఎం జగన్

- ఓఎన్జీసీ పైపులైన్‌తో నష్టపోతున్న వారికి ఇప్పటికే మూడు విడతల్లో రూ. 323.72 కోట్లు ఇచ్చాం
- నాలుగో విడతగా రూ. 161.86 కోట్ల ఆర్థిక సాయం చేస్తున్నాం
- ఐదేళ్ల టీడీపీ పాలనలో వీళ్లకి సాయం చేయాలన్న ఆలోచన రాలేదు
- నష్టపరిహారం డబ్బులు పడకపోతే ఎలా బతుకుతారన్న ఆలోచన వారికి లేదు
- ఆపదవేళ ఆదుకోవడంలో ఈ ప్రభుత్వం ఎప్పుడూ ముందుంటుంది
- ఇందుకు విశాఖ హార్బర్ ఘటనలో ప్రభుత్వ స్పందనే నిదర్శనం
- ఓఎన్జీసీ పైప్‌లైన్ వల్ల నష్టపోయిన 23,458 మత్స్యకార కుటుంబాలకు నాలుగో విడత ఆర్థిక సాయం పంపిణీ
- తాడేపల్లి క్యాంప్ కార్యాలయం నుంచి బటన్ నొక్కినేరుగా ఖాతాల్లో జమ చేసిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్

2లో


మత్స్యకార కుటుంబాల ఖాతాల్లో నాలుగో విడత ఆర్థిక సాయం జమ చేసిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్. చిత్రంలో మంత్రి సీదిరి అప్పలరాజు

"మనకన్నా ముందు చంద్రబాబు ప్రభుత్వం ఐదేళ్లు పాలన చేసినా కూడా కనీసం జీఎస్పీసీ పరిహారం ఇప్పించాలి, మత్స్యకార కుటుంబాలకు తోడుగా ఉండాలనే ఆలోచన కూడా చేయలేక పోయింది. ఈ డబ్బులు పడకపోతే ఆ మత్స్యకార కుటుంబాలు ఏ రకంగా బతకగలుగుతాయి? వాళ్లకు ఇవ్వాల్సిన డబ్బులు ఇప్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్న ఆలోచన కూడా గతంలో జరగలేదు."
- ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

హైకోర్టు తీర్పును
రద్దు చేయండి
చంద్రబాబుకు బెయిల్ విషయంలో పరిధి దాటింది
సుప్రీంకోర్టులో ఎస్సెల్పీ దాఖలు చేసిన రాష్ట్ర ప్రభుత్వం

- సుప్రీంకోర్టు నిర్దేశించిన కొలమానాలను హైకోర్టు అతిక్రమించింది
- కేసు లోతుల్లోకి వెళ్లి క్లీన్ చిట్ ఇచ్చే ప్రయత్నం చేసింది
- ట్రయల్ కోర్టును ప్రభావితం చేసేలా ఆ తీర్పు ఉంది
- మినీ ట్రయల్ నిర్వహణ.. 39 పేజీల తీర్పే ఇందుకు నిదర్శనం
- దుర్వినియోగం చేసిన నిధులు టీడీపీ ఖాతాల్లోకి వెళ్లాయి
- అందుకు పూర్తి ఆధారాలున్నా ఏ మాత్రం పట్టించుకోలేదు
- చంద్రబాబుకు రాజకీయ పలుకుబడి ఉంది.. సాక్షులను బెదిరించడం ద్వారా దర్యాప్తును ప్రభావితం చేస్తారు
- హైకోర్టు తేల్చిన అంశాలు వాస్తవ విరుద్ధం



సాక్షి, అమరావతి: స్కిల్ డెవలప్‌మెంట్ కుంభకోణంలో నిందితుడైన మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు పూర్తి స్థాయి బెయిల్ మంజూరు చేస్తూ హైకోర్టు ఇచ్చిన తీర్పును సవాలు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం సుప్రీంకోర్టును ఆశ్రయించింది. హైకోర్టు తీర్పును రద్దు చేయాలని కోరుతూ మంగళవారం స్పెషల్ లీవ్ పిటిషన్ (ఎస్ఎల్‌పీ) దాఖలు చేసింది. ఇందులో నారా చంద్రబాబు నాయుడిని ప్రతివాదిగా చేర్చింది. ఈ ఎస్ఎల్‌పీ తేలేంత వరకు హైకోర్టు తీర్పుపై స్టే ఇవ్వాలని కోరింది. హైకోర్టు స్కిల్ కుంభకోణంలో
మిగతా 2వ పేజీలో ▸

ఫ్యాక్ట్‌చెక్



రామోజీ శోకం రుషి'కొండంత'!
- రుషికొండ ప్రాజెక్టుపై మరోసారి కడుపుమంట బయటపెట్టుకున్న 'ఈనాడు'
- విశాఖను రాజధానిగా చేస్తుంటే తట్టుకోలేని రామోజీ
- సీఎంను విశాఖకు రాకుండా అడ్డుకునే కుట్ర
- అందుకే దుబారా అంటూ కొండంత విషం

10లో



లేని బ్రాండ్లకు ధరల పెంపా!?
- మద్యం బ్రాండ్ల ధరలపై ఎల్లో మీడియా గగ్గోలు
- మార్కెట్‌లో అందుబాటులో లేని కంపెనీల బ్రాండ్ల ధరలే స్వల్పంగా పెరిగాయి
- మార్కెట్‌లో ఉన్న రకాల ధరలు పెరగలేదు
- నిజానికి పన్నుల విధానంలో ప్రభుత్వం ఏకరూపత తీసుకొచ్చింది

10లో



బోట్ల వెలికితీతకు వీపీఏ సన్నద్ధం
విశాఖ ఫిషింగ్ హార్బర్‌లో జరిగిన అగ్ని ప్రమాదంలో కాలి, మునిగిపోయిన మెకనైజ్డ్ బోట్లను వెలికితీసేందుకు విశాఖ పోర్టు అథారిటీ అధికారులు సన్నద్ధమవుతున్నారు. ఈ ప్రమాదంలో మొత్తం 45 బోట్లు దహనమవ్వగా.. వాటిలో 36 పూర్తిగా కాలిపోయి నీట మునిగిపోయాయి. మరో తొమ్మిది పాక్షికంగా దెబ్బతిన్నాయి.
14లో



మెట్ట రైతుకు మంచి రోజులు
వ్యవసాయానికి నాణ్యమైన విద్యుత్ 9 గంటలు నిరంతరాయంగా సరఫరా

- ఒకే విడత.. అందులో పగటిపూట కరెంట్‌తో పంటభూములు కళకళ
- సాగు కోసం రాష్ట్రవ్యాప్తంగా 2.12 లక్షల ట్రాన్స్‌ఫార్మర్లు
- రూ.1,700 కోట్లతో వ్యవసాయ ఫీడర్ల ఆధునికీకరణ.. గతంలో 4 సర్వీసులకు ఒకటే ట్రాన్స్‌ఫార్మర్.. ఇప్పుడు ప్రతి బోరుకీ ఒకటి
- ట్రాన్స్‌ఫార్మర్ పాడైతే తక్షణమే మరమ్మతులు.. లేదంటే కొత్తవి సిద్ధం
- నిర్ణీత వ్యవధిలోగా వ్యవసాయ సర్వీసులు మంజూరు.. మెరుగుపడ్డ విద్యుత్ సరఫరాతో పెరిగిన ఫలసాయం
- అడుగడుగునా అంతరాయాలు.. రాత్రిళ్లు పొలాల్లో జాగారాల దుస్థితి నుంచి ధీమాగా సాగుకు కరెంట్

2లో



నాడు తరచూ కాలిపోయేవి

మాకు గతంలో 63 కేవీ ట్రాన్స్‌ఫార్మర్ ఉండేది. మూడు సర్వీసులు ఉండటంతో లోడ్ ఎక్కువై తరచూ కాలిపోయేది. ట్రాన్స్‌ఫార్మర్ పాడైతే మరమ్మతులకు నెలల తరబడి పట్టేది. ఇప్పుడు ఆ సమస్యే లేదు. పదెకరాలకు పగటిపూట 9 గంటలు నిరంతరాయంగా కరెంట్ అందుతోంది. కాలిపోవడం లాంటి ఇబ్బందులు లేవు. దీంతో మూడు పంటలు పండిస్తున్నాం.
-యు. సత్యనారాయణ, కౌలు రైతు, కొమ్ముగూడెం

అందుబాటులోకి ఆధునిక వైద్యం



- బోధనాస్పత్రుల్లో గుండె చికిత్సలకు అత్యాధునిక సదుపాయాలు కల్పిస్తున్న రాష్ట్ర ప్రభుత్వం
- ప్రభుత్వ రంగంలో గుండె సంబంధిత చికిత్సల బలోపేతానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ చర్యలు
- కాకినాడ, కర్నూలు జీజీహెచ్‌లలో అందుబాటులోకి క్యాథ్ ల్యాబ్స్
- ఒక్కోచోట రూ.6 కోట్లతో ఏర్పాటు.. కొద్దిరోజుల్లోనే సేవలు ప్రారంభం
- అన్ని పాత బోధనాస్పత్రుల్లో కార్డియాలజీ, కార్డియాక్ సర్జరీ సేవల్ని విస్తరిస్తున్న ప్రభుత్వం
- మరో ఐదు బోధనాస్పత్రుల్లో త్వరలో క్యాథ్ ల్యాబ్‌ల ఏర్పాటుకు సన్నాహాలు

14లో

చంద్రబాబు ముఠాకు ఎదురుదెబ్బ



ఫైబర్‌నెట్ కేసులో నిందితుల ఆస్తుల అటాచ్‌మెంట్

ఏడు స్థిరాస్తుల అటాచ్‌మెంట్‌కు న్యాయస్థానం అనుమతి

- వివరాలు 3లో

ఇళ్లపైకి 'పచ్చ'దొంగలు.. జాగ్రత్త!



చంద్రబాబు కంటే అంతర్జాతీయ దొంగల ముఠానే నయం: సజ్జల

ఒకేసారి ఐదు కోట్ల మంది ప్రజలను మోసం చేసేందుకు టీడీపీ కుట్ర

లేని మేనిఫెస్టో పేరుతో ఇళ్లల్లోకి జొరబడుతున్న పచ్చ దొంగలు

3లో


అల్లు పడుతున్న మహిళ

చీరకు సింగారం..
నైపుణ్యం బంగారం

వారు పెద్దపెద్ద చదువులు చదవలేదు. శాస్త్ర సాంకేతిక రంగాల్లో రాణించలేదు. అత్యాధునిక యంత్రాలపై శిక్షణ తీసుకోలేదు. పురాతన కాలం నాటి మగ్గాలనే నమ్ముకున్నారు. దేవుడిచ్చిన నైపుణ్యాన్ని రంగరించి అద్భుతమైన కాటన్ పట్టు చీరలను తయారు చేస్తున్నారు. మగువలకు మరింత అందం తెస్తూ అబ్బుర పరుస్తున్నారు. భర్తకు చేదోడు వాదోడుగా ఉంటూ కుటుంబాలను ఒంటి చేత్తో నెట్టుకొస్తున్నారు.. వెంకటగిరి పట్టణంలోని బంగారుపేట మహిళలు. వీరు నేసే కాటన్ పట్టుచీరలకు దేశవిదేశాల్లోనూ మంచి డిమాండ్ ఉందంటే అతిశయోక్తి కాదు. కాటన్ పట్టుచీరలు ఎలా తయారు చేస్తారు.. ఎలా కష్టపడతారో మీరే చదవండి!

- కాటన్ పట్టు చీరలకు పుట్టినిల్లు 'బంగారుపేట'
- ఇక్కడ తయారుచేసే కాటన్ చీరలకు భలే డిమాండ్
- చీరలు నేసే వారంతా మహిళలే
- 2వేల కుటుంబాలకు జీవనోపాధి

సైదాపురం: వెంకటగిరి పట్టణానికి రెండు కిలోమీటర్ల దూరంలో బంగారుపేట గ్రామం ఉంది. ఈ గ్రామంలో 680 చేనేత కుటుంబాలున్నాయి. వారంతా మగ్గాల ద్వారానే చీరలను నేస్తున్నారు. కాటన్ చీరల తయారీలో ప్రత్యక్షంగా 1000 మందికి, పరోక్షంగా మరో 2 వేల మందికి ఉపాధి దొరుకుతోంది. ఇక్కడ పనిచేసే కూలీలంతా మహిళలే. అఆలు కూడా రాని ఆ మహిళలు నైపుణ్యం గల కాటన్ చీరలు తయారు చేస్తున్నారు. ఆధునిక ప్రపంచంలో అత్యాధునిక పరికరాలు వస్తున్న ఈ రోజుల్లో కూడా మగ్గాలనే ఉపయోగిస్తూ అద్భుతమైన కాటన్‌చీరలు తయారు చేస్తూ మగువుల మనసు దోచుకుంటున్నారు.

ఎలా తయారు చేస్తారంటే?
కాటన్ చీరకు అవసరమైన ముడిసరుకును వివిధ రకాల పరిమాణంలో వేరుచేస్తారు. చేనేత యాజమానుల నుంచి నూలు తెచ్చుకుంటారు. చీరలు తయారు చేసే ముందు సాగళ్లు తెచ్చుకుని అచ్చు ఎత్తుకుని అల్లు పట్టుకుంటారు. అనంతరం దోనేకు చుట్టుకుని మగ్గంపై చీరను తయారుచేసేందుకు సిద్ధంచేస్తారు. రాట్నం ద్వారా కండెలను ఒడికి బంకలో నానబెట్టి అల్లికచేస్తారు. తర్వాత వివిధ రకాల డిజైన్లలో కాటన్ పట్టు చీరలను తయారు చేస్తారు. వారమంతా ఇంటిల్లిపాదీ కష్టపడితే 5 కాటన్ పట్టు చీరలను నేస్తారు.

లేటెస్ట్‌కు నాలుగైదు రోజులు
లేటెస్ట్ డిజైన్ తయారు చేయాలంటే నాలుగైదు రోజులు పడుతుంది. దీనికి రూ.4 వేలు ఇస్తారు. మామూలు సాధారణ డిజైన్ చీరను ఒక్క రోజులో నేస్తారు. తెల్లవారుజాము నుంచి చేనేత పనుల్లో మహిళలు నిమగ్నమవుతుంటారు. ఆధునిక యంత్రాలు రావడంతో కాటన్‌పట్టు చీరలు తయారు చేసేందుకు ఆర్థిక ఇబ్బందులు ఎదురవుతున్నాయి. అయినా ఈ ప్రాంతంలో తయారు చేసే కాటన్ పట్టు చీరలకు మంచి డిమాండ్ ఉండడంతో స్థానికులు దీనిపైనే ఆధారపడ్డారు. ఈ ప్రాంతంలో తయారుచేసే కాటన్‌పట్టు చీరలకు దేశ, విదేశాల్లో మంచి డిమాండ్ ఉంది.


చీరను మడతపెడుతున్న చేనేత కార్మికులు

అంతా మహిళలే

ఇక్కడ పనిచేసేవారంతా మహిళలే. చేనేత మహిళా కార్మికులు తమ ఇళ్లల్లోనే మగ్గాలను ఏర్పాటు చేసుకుని ఇంటిల్లిపాదీ కాటన్ పట్టు చీరలు నేస్తుంటారు. నాణ్యత గల చీరలను తయారుచేసే వారంతా మహిళలే ఉండడం విశేషం. ఈ ప్రాంతంలో ఉన్న మహిళలు మాత్రమే ఈ కాటన్ చీరలను నేయగలరు. అందుకే ఈ ప్రాంతంలో ఉన్న మహిళలకు మాత్రమే ఇక్కడ ఉపాధి కల్పిస్తుంటారు.

డిజైన్‌ను బట్టి రేటు
చీరలకు కావాల్సిన ముడిసరుకును షావుకారి(ఏజెన్సీ) వద్ద తెచ్చుకుంటున్నారు. ఒక షాపునకు అంటే నాలుగు చీరలకు సరిపడా ముడిసరుకుకు రూ.20 వేల వరకు అవుతుంది. ఆయా సరుకును కొందరు ఏజెన్సీలు తెచ్చి ఇస్తుంటారు. మరికొందరు సొంతంగా కొనుగోలు చేసి చీరలు నేసి ఏజెన్సీలకు విక్రయిస్తున్నారు. ఇలా భార్యాభర్త డిజైన్‌ను బట్టి వారం పది రోజులు మగ్గం నేస్తే నాలుగు చీరలు పూర్తవుతాయి. దీనికి ఒక్కో చీరకు ఖర్చు పోను రూ.3 వేల నుంచి రూ.4 వేల వరకు గిట్టుబాటు అవుతుంది. ఏజెన్సీల ద్వారా అమెరికా, తమిళనాడు, తెలంగాణతోపాటు దేశంలోని వివిధ ప్రాంతాలకు ఎగుమతి చేస్తుంటారు. ఇటీవల సినిమా పరిశ్రమకు చెందిన వాళ్లు ఎక్కువగా నేత చీరలను కొనుగోలు చేస్తున్నట్టు నేత కార్మికులు చెబుతున్నారు.

క్లుప్తంగా...

పుట్టపర్తిలో నేడు రాష్ట్రపతి పర్యటన



పుట్టపర్తి అర్బన్: భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము బుధవారం శ్రీసత్యసాయి జిల్లా పుట్టపర్తికి రానున్నారు. దీనికి సంబంధించిన వివరాలను కలెక్టర్ అరుణ్‌బాబు మంగళవారం వెల్లడించారు. రాష్ట్రపతి మధ్యాహ్నం 3.05 గంటలకు ఒడిశాలో బయలుదేరి 2.35 గంటలకు పుట్టపర్తి సత్యసాయి విమానాశ్రయానికి, అక్కడి నుంచి రోడ్డు మార్గాన 2.45 గంటలకు ప్రశాంతి నిలయం చేరుకుంటారు. మధ్యాహ్నం 3.05 గంటలకు సాయికుల్వంత్ మందిరంలోని సత్యసాయి మహాసమాధిని దర్శించుకుంటారు. అనంతరం సత్యసాయి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హయ్యర్ లెర్నింగ్ 42వ స్నాతకోత్సవంలో పాల్గొంటారు. 3.35 గంటలకు స్నాతకోత్సవంలో భాగంగా 21 మంది విద్యార్థులకు బంగారు పతకాలు అందజేస్తారు. అనంతరం ప్రసంగిస్తారు. 4.20 గంటలకు రోడ్డు మార్గాన సత్యసాయి విమానాశ్రయం చేరుకుని, అక్కడి నుంచి ప్రత్యేక విమానంలో ఢిల్లీ బయలుదేరి వెళతారు.

భూ సమస్యల పరిష్కారంపై వేగంగా పనిచేయాలి

ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి అజేయ కల్లం

సాక్షి, అమరావతి: సుదీర్ఘంగా ఉన్న భూ సమస్యలకు ప్రభుత్వం పరిష్కార మార్గం చూపిందని అందుకనుగుణంగా వేగంగా పనిచేసి ప్రజలకు వాటి ఫలాలు అందించాలని ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి అజేయ కల్లం రెవెన్యూ అధికారులకు సూచించారు. గుంటూరు జిల్లా మంగళగిరిలోని సీసీఎల్ఏ కార్యాలయంలో కలెక్టర్లు, జేసీలు, ఆర్డీవోలు, తహశీల్దార్లతో మంగళవారం జరిగిన వర్క్‌షాప్‌లో ఆయన మాట్లాడారు. అసైన్డ్ భూములకు యాజమాన్య హక్కుల కల్పన, సర్వీస్ ఈనాం భూములు, చుక్కల భూములను నిషేధిత జాబితా నుంచి తొలగింపు అంశాలపై దృష్టి సారించాలని ఆదేశించారు. ఈ అంశాలపై ఇప్పటికే చాలా వరకు పని పూర్తయిందని, మిగిలిన పనిని కూడా త్వరగా పూర్తి చేయాలని సూచించారు. నిషేధిత జాబితా నుంచి చుక్కల భూముల తొలగింపు ప్రక్రియ ఎక్కువ జిల్లాల్లో పూర్తయినా కొన్నిచోట్ల కొంత పెండింగ్ ఉందని, ఆ పనిని సాధ్యమైనంత త్వరగా కొలిక్కి తీసుకురావాలని ఆదేశించారు. ప్రకాశం, సత్యసాయి, కర్నూలు జిల్లాల్లో అసైన్డ్ భూములకు యాజమాన్య హక్కుల కల్పన పెండింగ్ శాతం ఎక్కువగా ఉండడంతో ఆ జిల్లాల్లో స్పెషల్ ఫోకస్ పెట్టాలని ఆదేశించారు. సాంకేతికంగా ఉన్న అడ్డంకులను క్లియర్ చేస్తామని భూపరిపాలన ప్రధాన కమిషనర్, రెవెన్యూ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సాయిప్రసాద్ చెప్పారు.

మారుమూల గ్రామాల అభివృద్ధే లక్ష్యం

ప్రధాన మంత్రి అదనపు కార్యదర్శి అతీష్ చంద్ర



వంట్లమామిడి గ్రామ సచివాలయంలో ప్రభుత్వ పథకాలు, పౌరసేవల బోర్డును పరిశీలిస్తున్న అతీష్ చంద్ర

సాక్షి, పాడేరు (అల్లూరి సీతారామరాజు జిల్లా): దేశవ్యాప్తంగా మారుమూల గ్రామాల అభివృద్ధే కేంద్ర ప్రభుత్వం లక్ష్యమని ప్రధాన మంత్రి అదనపు కార్యదర్శి, సీనియర్ ఐఏఎస్ అధికారి అతీష్ చంద్ర అన్నారు. మంగళవారం ఆయన పాడేరు మండలంలోని వంట్లమామిడి గ్రామాన్ని సందర్శించారు. వికసిత్ భారత్ సంకల్ప యాత్ర బహిరంగ సభలో మాట్లాడారు. 2047 నాటికి దేశాన్ని సంపూర్ణంగా అభివృద్ధి చేసే లక్ష్యంతో కేంద్రం కృషి చేస్తుందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అందని అర్హులైన వారంతా వికసిత్ ప్రజా సంకల్ప యాత్రలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

గ్రామ సచివాలయ వ్యవస్థ అద్భుతం: రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన గ్రామ సచివాలయాల వ్యవస్థ సేవలు అద్భుతంగా ఉన్నాయని అతీష్‌చంద్ర కితాబు ఇచ్చారు. మంగళవారం ఆయన వంట్లమామిడి గ్రామంలోని సచివాలయాన్ని సందర్శించారు. ఈ వ్యవస్థ ద్వారా అందుతున్న పౌర సేవల వివరాలను తెలుసుకున్నారు. గ్రామ, వార్డు సచివాలయ విభాగం అదనపు సంచాలకులు భావన సచివాలయ వ్యవస్థ ద్వారా ప్రజలకు అందుతున్న సేవలను సమగ్రంగా వివరించారు.

శ్రీసిటీకి జపాన్ బృందం

వరదయ్యపాలెం: జపాన్‌లోని ప్రముఖ కార్పొరేషన్లు, వివిధ రంగాల్లోని వ్యాపార సంస్థలకు చెందిన 25 మంది వ్యాపార ప్రతినిధుల బృందం తిరుపతి జిల్లాలోని శ్రీసిటీని మంగళవారం సందర్శించింది. జపాన్‌కు చెందిన ప్రముఖ ప్రచురణ సంస్థ నిక్కన్ కోగ్యో షింబున్ ఆధ్వర్యంలో రెండు రోజులపాటు వీరి పర్యటన శ్రీసిటీలో సాగనుంది. ప్రతినిధి బృందానికి జమైకాలోని జపాన్ మాజీ రాయబారి మసనోరి నకనో, నిక్కన్ కోగ్యో షింబున్ అధ్యక్షుడు ఇమిజు హరుహిరో నాయకత్వం వహించారు. శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి మాట్లాడుతూ.. శ్రీసిటీలో వ్యాపార అనుకూల వాతావరణం, ఇతర వనరుల కారణంగా ప్రపంచంలోని పెట్టుబడిదారులు శ్రీసిటీని తమ గమ్యస్థానంగా ఎంచుకుంటున్నారన్నారు.

మత్స్యకారులను ఆదుకుంటున్నాం
అండగా ఉన్నాం

మంచి చేయాలనే తపనతో వారి సంక్షేమానికి కృషి చేస్తున్నాం



సమావేశంలో మాట్లాడుతున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

సాక్షి, అమరావతి: 'ఎక్కడ మనసు ఉంటుందో అక్కడ మార్గం ఉంటుంది. ఎక్కడైతే మంచి చేయాలనే తపన ఉంటుందో అక్కడ దేవుడి సహకారం ఉంటుంది. మత్స్యకారులను అన్ని విధాలుగా ఆదుకునేందుకు కృషి చేస్తున్నాం. అడుగడుగునా వారికి అండగా నిలిచాం. ఈ నాలుగున్నర ఏళ్లలో వారి జీవన ప్రమాణాలు పెంచడమే లక్ష్యంగా ఎన్నో చేశాం.. మరెన్నో చేస్తున్నాం' అని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. ఓఎన్జీసీ సంస్థ పైప్‌లైన్ పనుల కారణంగా జీవనోపాధి కోల్పోయిన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ, కాకినాడ జిల్లాలకు చెందిన 23,458 మంది మత్స్యకార కుటుంబాలకు రాష్ట్ర ప్రభుత్వ చొరవతో ఓఎన్జీసీ ద్వారా నాలుగో విడతగా ఒక్కొక్కరికి నెలకు రూ. 11,500 వంతున 6 నెలలకుగానూ రూ. 69 వేల చొప్పున రూ. 161.86 కోట్ల ఆర్థిక సాయాన్ని తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయం నుంచి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి బటన్ నొక్కి నేరుగా లబ్ధిదారులకు విడుదల చేశారు. వీడియో కాన్ఫరెన్స్ ద్వారా వర్చువల్‌గా జరిగిన ఈ కార్యక్రమంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఏమన్నారో ఆయన మాటల్లోనే..

ఆర్థిక సాయం పంపిణీ ఆగకూడదనే..

ఇవాళ ప్రపంచ మత్స్యకార దినోత్సవం సందర్భంగా ఒక మంచి కార్యక్రమాన్ని సూళ్లూరుపేటలో జరుపుకోవాలని అనుకున్నాం. వర్షాల వల్ల అక్కడికి చేరుకొనే పరిస్థితి లేక ఆ కార్యక్రమాన్ని వాయిదా వేసుకున్నాం. అయితే మనం ఇవ్వాలనుకున్న, చేయాలనుకున్న ఆర్థిక సాయం ఆగిపోకూడదనే ఉద్దేశంతో ఓఎన్జీసీ పైపులైన్ ద్వారా నష్టపోతున్న మత్స్యకారులందరికీ సాయం చేసేందుకు ఇవాళ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఈ కార్యక్రమానికి శ్రీకారం చుడుతున్నాం. తిరుపతి జిల్లా వాకాడు మండలం రాయదరువు వద్ద పులికాట్ సరస్సు ముఖద్వారంలో పూడిక తీసి పునరుద్ధరించే కార్యక్రమానికి శ్రీకారం చుట్టాలనుకున్నాం. వీలును బట్టి ఈ కార్యక్రమాన్ని నెలాఖరులోనో లేదా వచ్చే నెలలోనో చేసేందుకు చర్యలు తీసుకుంటాం.

ఇప్పించాలన్న మనసు ఉండాలి కదా

కోనసీమ జిల్లా ముమ్మడివరంలో 2012లో జీఎస్‌పీసీ ఇదే రకమైన కార్యక్రమం చేయడం వలన 16,554 మంది మత్స్యకార కుటుంబాలకు నష్టం జరిగింది. రూ. 78 కోట్లు ఇవ్వాల్సి ఉంటే.. మన ప్రభుత్వం అధికారంలోకి వచ్చే వరకు కూడా ఇవ్వని పరిస్థితి నెలకొంది. మనం అధికారంలోకి వచ్చిన తర్వాత మనసు పెట్టి వారికి ఇవ్వాల్సిన డబ్బులు తొలుత ప్రభుత్వం నుంచి మనమే ఇచ్చేశాం. ఆ తర్వాత కేంద్రంపై ఒత్తిడి తెచ్చి ఈ డబ్బును వెనక్కి రప్పించుకోగలిగాం. ఎక్కడ మనసు ఉంటుందో అక్కడ మార్గం ఉంటుంది. ఎక్కడైతే మంచి చేయాలనే తపన ఉంటుందో అక్కడ దేవుడి సహకారం ఉంటుందనడానికి జీఎస్‌పీసీ పరిహారం చెల్లింపు ఉదంతమే నిదర్శనం. ఇవాళ కూడా ఉభయగోదావరి జిల్లాల్లో ఓఎన్జీసీ పైప్‌లైన్ పనుల కారణంగా ఉపాధి కోల్పోయిన మత్స్యకార కుటుంబాలకు మంచి చేసే కార్యక్రమాన్ని కూడా చేస్తున్నాం. క్రమం తప్పకుండా ఏటా నష్టపరిహారం వచ్చేటట్టుగా అడుగులు వేస్తున్నాం.

వేగంగా స్పందించడంలో విశాఖ హార్బర్ ఘటనే ఉదాహరణ

ఇవాళ మత్స్యకారుల సంక్షేమం పట్ల ఈ ప్రభుత్వం ఎంత చిత్తశుద్ధితో వ్యవహరిస్తోందో? ఎంత వేగంగా స్పందిస్తూ అడుగులు ముందుకు వేస్తోందో చెప్పడానికి నిన్న విశాఖపట్నం హార్బర్ ప్రమాద ఘటనే ఉదాహరణ. 40 బోట్లు కాలిపోయాయని మన దృష్టికి వచ్చిన మరుక్షణమే వాళ్లను ఆదుకోవాలని తపన, తాపత్రయం పడ్డాం. వాటికి ఇన్సూరెన్స్ ఉందా? లేదా? అని విచారణ చేశాం. ఇన్సూరెన్స్ లేదని తెలిసిన వెంటనే ఎట్టిపరిస్థితుల్లోనూ ఆ మత్స్యకార కుటుంబాలకు నష్టం జరగకూడదని.. వాళ్లకు మేలు చేయాలని సంకల్పించాం. ప్రతి బోటు విలువ లెక్కగట్టమని చెప్పాం. ఆ బోటుకు సంబంధించి 80 శాతం ప్రభుత్వమే ఇచ్చేట్టుగా వెంటనే ఆదేశాలు జారీ చేశాం. ఆ చెక్కులు ఈరోజే (మంగళవారం) పంపిణీ చేయాలని మంత్రులు, అధికారులను ఆదేశించాం. ప్రతి విషయంలో మనసుపెట్టి అన్ని రకాలుగా మత్స్యకారులకు తోడుగా ఉండే ప్రభుత్వం మనది. ఓఎన్జీసీ పైప్‌లైన్ బాధిత మత్స్యకారులకు నాలుగో విడత పరిహారం పంపిణీలో సహకరించిన, తోడుగా ఉన్న ఓఎన్జీసీ అధికారులకు మన స్ఫూర్తిగా నా తరఫున, ప్రభుత్వం తరఫున కృతజ్ఞతలు తెలియజేస్తున్నా' అని సీఎం వైఎస్ జగన్ చెప్పారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మత్స్యశాఖ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

నాలుగు విడతల్లో రూ. 485.58 కోట్ల పరిహారం

ఓఎన్జీసీ పైపులైన్ నిర్మాణం కోసం జరుగుతున్న తవ్వకాల వల్ల ఉభయగోదావరి, అంబేడ్కర్ కోనసీమ జిల్లాల్లో 16,408 మంది మత్స్యకారుల కుటుంబాలకు, కాకినాడ జిల్లాలో మరో 7,050 మంది కలిపి ఉపాధి కోల్పోయిన 23,458 మత్స్యకారుల కుటుంబాలకు కలిగిన నష్టాన్ని భర్తీ చేస్తున్నాం. నెలకు రూ. 11,500 చొప్పున చెల్లించే ఈ కార్యక్రమంలో ఓఎన్జీసీతో మాట్లాడి, వారితో ఒప్పందం కుదుర్చుకోవడం జరిగింది. మత్స్యకారుల తరఫున ఓఎన్జీసీతో మాట్లాడి 3 విడతల్లో ఇప్పటికే రూ. 323.72 కోట్ల నష్టపరిహారం ఇప్పించాం. ఈ రోజు 4వ విడతగా ఈ ఏడాది జనవరి నుంచి జూన్ వరకు 6 నెలలకు సంబంధించి రూ. 161.86 కోట్లు పరిహారం ఈరోజు ఇక్కడి నుంచి నేరుగా వారి ఖాతాల్లోకి జమ చేసే కార్యక్రమం జరుగుతోంది. నాలుగో విడతలో ఇవాళ మనం ఇస్తున్న రూ. 161.86 కోట్లు కలుపుకొంటే మొత్తంగా రూ. 485.58 కోట్లు పరిహారంగా 23,458 కుటుంబాలకు మనం ఇవ్వగలిగాం.

దశాబ్దాల కల కార్యరూపం దాల్చుతోంది



పులికాట్ సరస్సు సముద్ర ముఖద్వారం పునరుద్ధరణ అనేది ఈ ప్రాంత మత్స్యకారుల దశాబ్దాల కల. ఇప్పటివరకూ కార్యరూపం దాల్చలేదు. మీ దయతో అది జరుగుతోంది. లోకేశ్ ఈ ప్రాంతానికి వచ్చినప్పటి నుంచి వర్షాలు లేవు. కానీ మీరు వస్తున్నారనడంతో వర్షాలు కురుస్తున్నాయి. రైతులు సంతోషంగా ఉన్నారు. సీఎం గారు మీకు ధన్యవాదాలు.

– కిలివేటి సంజీవయ్య, సూళ్లూరుపేట ఎమ్మెల్యే

మా జీవితాల్లో వెలుగులొచ్చాయి



ఈరోజు మాకు పండుగ రోజు. నష్టపరిహారం డబ్బులు వస్తాయా? రావా? అనుకున్నాం కానీ, ఈ ప్రభుత్వం వచ్చాక వరుస గా నాలుగో విడత అందుకుంటున్నాం. పరిహారం నేరుగా మా అకౌంట్లో వేస్తున్నారు. మీరు దేవుడిలా మా కుటుంబాల్లో వెలుగులు నింపారు. ఇప్పుడు డీజిల్ సబ్సిడీ రూ.9 వస్తోంది. ప్రమాదవశాత్తూ మరణించిన మత్స్యకారులకు బీమా కింద గతంలో మృతదేహం కనిపిస్తేనే రూ.5 లక్షలు ఇచ్చేవారు. ఇప్పుడు చనిపోయిన వారి కుటుంబాలకు మృతదేహంతో సంబంధం లేకుండా రూ. 10 లక్షలు ఖాతాలో జమచేస్తున్నారు. మాకు ఇళ్ల పట్టాలు ఇచ్చారు. మేం గతంలో ఇలా లబ్ధిపొందలేదు.

– చినబోతు భైరవస్వామి, లబ్ధిదారుడు, మట్లపాలెం, తాళ్లరేవు మండలం, కాకినాడ జిల్లా

మమ్మల్ని గుర్తించింది మీరే..



మమ్మల్ని గుర్తించింది మీరే అన్నా. గతంలో మత్స్యకారులు ఎక్కడున్నారో తెలిసేది కాదు. వైఎస్సార్ హయాంలో మాకు ఎంతో లబ్ధి జరిగింది. తర్వాత మమ్మల్ని ఆదుకున్న వాళ్లు లేరు. మీరు పాదయాత్రలో మాట ఇచ్చారు. సీఎం అవగానే ఆ మాట నిలబెట్టుకున్నారు. మీరు మాకు పరిహారం ఇప్పిస్తున్నారు. వేట నిషేధ సమయంలో ఆర్థిక సాయం చేస్తున్నారు. డీజిల్ మీద సబ్సిడీ, ఎక్స్‌గ్రేషియా ఇలా చాలా సాయం చేస్తున్నారు. మాకు తెలియని పథకాలు కూడా పెట్టి మమ్మల్ని ఆదుకుంటున్నారు. చాలా సంతోషంగా ఉంది. మీకు రుణపడి ఉంటామన్నా.

– పల్లెపు రాంబాబు, ముమ్మిడివరం మండలం, బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా

మత్స్య రంగంలో ఏపీ అద్భుత ప్రగతి

- కేంద్ర మత్స్య శాఖ మంత్రి పురుషోత్తం రూపాల
- ఏపీకి 'బెస్ట్ మెరైన్ స్టేట్–2023' అవార్డు ప్రదానం

సాక్షి, అమరావతి/తాడేపల్లిగూడెం: మత్స్య రంగంలో ఆంధ్రప్రదేశ్ అద్భుత ప్రగతి సాధించిందని కేంద్ర మత్స్య, పశు సంవర్ధక శాఖ మంత్రి పురుషోత్తమ్ రూపాల కితాబిచ్చారు. ఏపీ ప్రభుత్వం తీసుకొచ్చిన విప్లవాత్మక మార్పులు, సంస్కరణలు దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నాయన్నారు. 2023లో బెస్ట్ మెరైన్ స్టేట్‌గా ఎంపికైన ఆంధ్రప్రదేశ్‌ను ఆయన ప్రత్యేకంగా అభినందించారు. ప్రపంచ మత్స్యకార దినోత్సవం సందర్భంగా మంగళవారం అహ్మదాబాద్‌లో జరిగిన గ్లోబల్ ఫిషరీస్ కాన్ఫరెన్స్ ఇండియా–2023లో కేంద్రమంత్రి రూపాల చేతుల మీదుగా ప్రతిష్టాత్మక బెస్ట్ మెరైన్ స్టేట్ అవార్డును రాష్ట్ర ప్రభుత్వం తరఫున ఏపీ స్టేట్ ఆక్వా కల్చర్ డెవలప్‌మెంట్ అథారిటీ (అప్సడా) కో–వైస్ చైర్మన్ వడ్డి రఘురామ్, మత్స్యశాఖ అడిషనల్ కమిషనర్ అంజలి అందుకున్నారు. ఈ సందర్భంగా కేంద్రమంత్రి రూపాల మాట్లాడుతూ.. మత్స్య ఉత్పత్తుల దిగుబడులు, ఎగుమతుల్లో ఏపీ అగ్రస్థానంలో ఉందన్నారు. ఈ రంగంలో వైఎస్ జగన్ ప్రభుత్వం తీసుకొచ్చిన సంస్కరణలు దేశానికే ఆదర్శంగా ఉన్నాయన్నారు. ఆక్వా ఆధారిత రాష్ట్రాలు ఆంధ్రలో తీసుకొచ్చిన చట్టాలు, మార్పులపై అధ్యయనం చేయాల్సిన అవసరం ఉందన్నారు. కేంద్రం ఇస్తున్న చేయూతతో నాణ్యమైన ఉత్పత్తుల సాధనకు మార్కెటింగ్ సౌకర్యాలు మరింత మెరుగు పర్చాలని సూచించారు.



కేంద్రమంత్రి రూపాల నుంచి అవార్డు అందుకుంటున్న రఘురామ్, అంజలి

సీఎం వైఎస్ జగన్ కృషి ఫలితమే

ఈ సందర్భంగా అప్సడా కో–వైస్ చైర్మన్ రఘురామ్ మాట్లాడుతూ.. నాలుగేళ్లలో రెండోసారి బెస్ట్ మెరైన్ స్టేట్‌గా ఏపీ నిలవడం ఆనందంగా ఉందన్నారు. రాష్ట్రంలో మత్స్యరంగ సుస్థిరాభివృద్ధికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీసుకొచ్చిన సంస్కరణలు, విప్లవాత్మక మార్పులే కారణమన్నారు. ఆక్వా కార్యకలాపాలన్నీ ఒకే గొడుగు కిందకు తీసుకురావడంతో పాటు ఆక్వా రైతులకు భరోసా, భద్రత కల్పించేందుకు అప్సడా చట్టంతో పాటు నాణ్యమైన సీడ్, ఫీడ్ సరఫరా కోసం ఏపీ స్టేట్ సీడ్, ఫీడ్ యాక్టులను తీసుకొచ్చిందన్నారు. అడిషనల్ కమిషనర్ అంజలి మాట్లాడుతూ.. ప్రభుత్వం తీసుకున్న చర్యల ఫలితంగా 2018–19లో 39 లక్షల టన్నులున్న దిగుబడులు 2022–23లో ఏకంగా 52 లక్షల టన్నులకు పెరిగిందన్నారు.

హైకోర్టు తీర్పును రద్దు చేయండి

▶ మొదటి పేజీ తరువాయి

సీఐడీ చేసిన ఆరోపణల పూర్వాపరాల్లోకి వెళ్లి చంద్రబాబుకు క్లీన్‌చీట్ ఇచ్చిందని సుప్రీంకోర్టు దృష్టికి తీసుకొచ్చింది. ఒకవైపు కేసు లోతుల్లోకి వెళ్లడం లేదని చెబుతూ, మరో వైపు సీఐడీ ఆరోపణలు, అందుకు సమర్పించిన ఆధారాలు, ఇతర అంశాల పూర్వాపరాల్లోకి వెళ్లి హైకోర్టు తీర్పు వెలువరించిందని వివరించింది. బెయిల్ పిటిషన్ విచారణ సందర్భంగా కేసు లోతుల్లోకి వెళ్లకూడదన్న సుప్రీంకోర్టు ఆదేశాలకు విరుద్ధంగా హైకోర్టు వ్యవహరించిందని స్పష్టం చేసింది. హైకోర్టు చంద్రబాబు బెయిల్ పిటిషన్‌ను డిశ్చార్జ్ పిటిషన్‌ను విచారించినట్లు విచారించిందని రాష్ట్ర ప్రభుత్వం ఆక్షేపించింది. 'హైకోర్టు స్కిల్ కుంభకోణం కేసు లోతుల్లోకి వెళ్లి మరీ చంద్రబాబుకు బెయిల్ మంజూరు చేసింది. ఈ సందర్భంగా పలు వ్యాఖ్యలు చేసింది. బెయిల్ మంజూరు సందర్భంగా హైకోర్టు తేల్చిన పలు అంశాలు వాస్తవ విరుద్ధం. ట్రయల్ సందర్భంగా కింది కోర్టును ప్రభావితం చేసేలా హైకోర్టు తీర్పు ఉంది. బెయిల్ పిటిషన్‌పై హైకోర్టు 39 పేజీల తీర్పు వెలువరించింది. బెయిల్ మంజూరు సందర్భంగా హైకోర్టు మినీ ట్రయల్ నిర్వహించింది. రికార్డుల్లో ఉన్న అంశాలకు విరుద్ధంగా హైకోర్టు తన నిర్ణయాన్ని వెలువరించింది. ఈ కేసులో హైకోర్టు తన పరిధిని అతిక్రమించింది' అని రాష్ట్ర ప్రభుత్వం తన పిటిషన్‌లో పేర్కొంది.

సుప్రీంకోర్టు నిర్దేశించిన పరిధుల అతిక్రమణ

'ప్రాథమిక ఆధారాలను బట్టి చూస్తే హైకోర్టు తీర్పు చెల్లుబాటు కాదు. దానిని రద్దు చేయాలి. బెయిల్ పిటిషన్ విచారణ సందర్భంగా ఎలా వ్యవహరించాలన్న దానిపై ఇప్పటికే స్పష్టంగా తేల్చిన న్యాయపరమైన కొలమానాలన్నింటినీ హైకోర్టు తన తీర్పు ద్వారా అతిక్రమించింది. బెయిల్ పిటిషన్ల విచారణ సందర్భంగా సాక్ష్యాలను పూర్తి స్థాయిలో పరిశీలించడం, కేసు లోతుల్లోకి వెళ్లడాన్ని సుప్రీంకోర్టు పలు సందర్భాల్లో తప్పుపట్టింది. మినీ ట్రయల్ కూడా నిర్వహించకూడదని చెప్పింది. హైకోర్టు ఏకంగా ట్రయల్ నిర్వహించింది. బెయిల్ మంజూరు సందర్భంగా సీఐడీ ఆరోపణలను, వారి తీవ్రతను, డాక్యుమెంట్ల విశ్వసనీయతను, సాక్ష్యాల విలువను హైకోర్టు తన తీర్పులో తేల్చేసింది. హైకోర్టు బెయిల్ మంజూరు సమయంలో అనుసరించాల్సిన ప్రాథమిక కొలమానాలన్నింటికి విరుద్ధంగా వ్యవహరించింది. చంద్రబాబుకు వ్యతిరేకంగా ప్రాసిక్యూషన్ నమోదు చేసిన కేసు ప్రభావితం అయ్యేలా హైకోర్టు వ్యవహరించింది. దుర్వినియోగం చేసిన నిధులు తెలుగుదేశం పార్టీ ఖాతాలకు మళ్లించారని తేల్చేందుకు నిర్దిష్ట ఆధారాలు లేవని హైకోర్టు తేల్చింది. బెయిల్ పిటిషన్ విచారణ సందర్భంగా ఈ అంశాల జోలికి వెళ్లరాదు. హైకోర్టులో పెండింగ్‌లో ఉన్న బెయిల్ పిటిషన్‌ను అడ్డంపెట్టుకుని తెలుగుదేశం పార్టీ వర్గాలు సీఐడీ దర్యాప్తునకు అడ్డుగోడలా నిలబడ్డాయి. సీఐడీ సమన్లకు ఏ మాత్రం సహకరించలేదు. సీఐడీ సమన్లకు టీడీపీ వర్గాలు స్పందించలేదన్న వాస్తవాన్ని హైకోర్టు పరిగణనలోకి తీసుకోలేదు. మనీ లాండరింగ్ అంశంపై ఈడీ దర్యాప్తు చేస్తోంది. నిధులు ఎక్కడకు వెళ్లాయన్న దానిపై నిర్దిష్ట ఆధారాలున్నాయి. వాటిని హైకోర్టు ముందు ఉంచాం. అన్నీ అంశాలపై ఏపీ సీఐడీ, ఈడీ దర్యాప్తు చేస్తున్నాయి. ఇందులో నిధుల మళ్లింపు జరగలేదని తేల్చడం ద్వారా హైకోర్టు తప్పిదానికి పాల్పడింది. స్కిల్ కుంభకోణానికి సంబంధించి సీమెన్స్ కంపెనీ అంతర్గతంగా నిర్వహించిన విచారణను, దాని నివేదికను కోర్టు పరిగణనలోకి తీసుకోలేదు. ఆ నివేదికలో ఏమీ లేదని తేల్చేసింది' అని వివరించింది.

స్పష్టంగా నగదు జాడలు

'ప్రాజెక్టు విలువ రూ.36 కోట్లు అని చంద్రబాబు తదితరులు చెబుతున్నారు. అలా అయితే గత ప్రభుత్వం రూ.370 కోట్లు ఎందుకు విడుదల చేసినట్లు? మిగిలిన రూ.280 కోట్లు దారి మళ్లినట్లే. ఎంవోయూ, జీవో ప్రకారం అందచేయాల్సిన సాంకేతికతను సీమెన్స్, డిజైన్ టెక్‌లు అందించలేదన్నది వాస్తవం. అయితే సీఐడీ ఈ అంశాన్ని లేవనెత్తలేదని హైకోర్టు తన తీర్పులో చెప్పింది. వాస్తవానికి రిమాండ్‌లోనూ, హైకోర్టు వాదనల్లోనూ ఈ అంశాన్ని లేవనెత్తాం. ఫోరెన్సిక్ ఆడిట్‌ను ప్రతికూల కోణంలో చూడటం ద్వారా హైకోర్టు తన పరిధి దాటి వ్యవహరించినట్లయింది. స్కిల్ డెవలప్‌మెంట్ ప్రాజెక్టు విజయమైందని, దీని ద్వారా 2.13 లక్షల మంది విద్యార్థులు శిక్షణ పొందినట్లు తేల్చింది. ఇలా చెప్పడం ద్వారా హైకోర్టు తప్పు చేసింది. హైకోర్టు చెప్పింది వాస్తవం కాదు. అధికారుల అభ్యంతరాలను తోసిపుచ్చే అధికారం బాబుకు ఉందని హైకోర్టు తేల్చింది. ఒకవేళ అలాంటిది ఉందని అనుకున్నా, చంద్రబాబు తన, షెల్ కంపెనీల స్వీయ లబ్ధి కోసం దురుద్దేశపూర్వకంగా ఆ అధికారాన్ని ఉపయోగించారు. ఈ విషయాన్ని హైకోర్టు తన తీర్పులో విస్మరించింది. ఈ కుంభకోణానికి సంబంధించి సీమెన్స్, డిజైన్‌టెక్ ఉద్యోగులు ఇచ్చిన వాంగ్మూలాలను కోర్టు పరిగణనలోకి తీసుకోలేదు. ఈ ప్రాజెక్టులో రాజకీయ జోక్యం ఉందని, ప్రాజెక్టు అమలుకు అడ్డువచ్చిన వారిని 24 గంటల్లో బదిలీ చేశారన్న వాంగ్మూలాలను పట్టించుకోలేద'ని రాష్ట్ర ప్రభుత్వం తెలిపింది.

క్లీన్ చిట్ ఇచ్చే ప్రయత్నం!

'సీమెన్స్, డిజైన్‌టెక్ నుంచి రావాల్సిన 90% నిధులు రాలేదని, అందువల్ల ప్రభుత్వం చెల్లించాల్సిన 10% నిధులను చెల్లించడం సరికాదన్న అప్పటి ఆర్థిక శాఖ కార్యదర్శి అభ్యంతరాలను చంద్రబాబు పట్టించుకోని విషయాన్ని హైకోర్టు విస్మరించింది. అవినీతి నిరోధక చట్టం మౌలిక సూత్రాల నుంచి, పబ్లిక్ సర్వెంట్ అధికారం దుర్వినియోగం వంటి వాటి నుంచి హైకోర్టు దూరంగా వెళ్లింది. చంద్రబాబు సాక్షులను ప్రభావితం చేసే విషయంపై హైకోర్టు వ్యక్తం చేసిన అభిప్రాయాలు హేతుబద్ధమైనవి కావు. తన పీఏ శ్రీనివాస్ విదేశాలకు పారిపోవడం, కీలక నిందితులు సీఐడీ ముందుకు రాకపోవడం వంటి వాటి విషయంలో బాబు పాత్ర ఉన్న విషయాన్ని కోర్టు పట్టించుకోలేదు. బాబు రాజకీయంగా చాలా పలుకుబడి కలిగిన వ్యక్తి. దర్యాప్తును ప్రభావితం చేయడం, సాక్షులను భయభ్రాంతులకు గురి చేసేందుకు ప్రయత్నిస్తున్నారు. దర్యాప్తుకు విఘాతం కలిగేలా కొందరు నిందితులు మీడియా స్టేట్‌మెంట్లు ఇస్తున్నారు. టీడీపీ వర్గాలు దర్యాప్తునకు సహకరించడం లేదు. బాబుకు బెయిల్ కోసం కాకుండా క్లీన్ చిట్ ఇచ్చే అంశంగా పరిగణించి ఆదేశాలిచ్చినట్లు ఉంది. వీటన్నింటిరీత్యా బాబు జుడీషియల్ రిమాండ్‌లో ఉండాల్సిన అవసరం ఎంతైనా ఉంది' అని రాష్ట్ర ప్రభుత్వం వివరించింది.

క్వశ్చన్ ఆఫ్ లా..

హైకోర్టు తీర్పులో పలు అంశాలపై అనుమానాలున్నాయని రాష్ట్ర ప్రభుత్వం పిటిషన్‌లో పేర్కొంది. 'క్వశ్చన్ ఆఫ్ లా'కి సంబంధించి పలు ప్రశ్నలను సుప్రీంకోర్టు ఎదుట ఉంచింది. హైకోర్టు కసరత్తులో న్యాయపరమైన విధానం లోపించిందా? దర్యాప్తులో సేకరించిన సాక్ష్యాధారాలు, నిందితుడి నేరానికి సంబంధించిన అంశాలపై హైకోర్టు వ్యాఖ్యలు న్యాయపరమైన అంశాలకు విరుద్ధంగా ఉన్నాయా? బెయిల్‌పై పిటిషనర్ల వాదనలు లేనప్పుడు హైకోర్టు విస్తృతమైన తీర్పు ఇవ్వగలదా? పీసీ చట్టం 1988 ప్రకారం అధికారిక నిర్ణయాల విషయంలో ఆరోపణలు ఎదుర్కొంటున్న వ్యక్తిని నిర్దోషిగా భావించొచ్చా? అధికారం, అధికార వినియోగం, అధికారిక పరిధి లేకపోవడం, అధికార సామర్థ్యాన్ని దుర్వినియోగం చేయడం, ఇతరులకు సొమ్ము రూపంలో లబ్ధి చేకూర్చడం తదితరాలపై హైకోర్టు నిర్ణయం సరైనదేనా?' అనే ప్రశ్నలను సుప్రీంకోర్టు ముందుంచింది. నిరంజన్‌సింగ్ వర్సెస్ ప్రభాకర్ రాజారామ్, సుమిత్ శుభాచంద్ర గంగ్వాల్ వర్సెస్ మహారాష్ట్ర కేసుల్లో తీర్పులతోపాటు స్కిల్ స్కామ్ కేసులో సాక్ష్యాధారాలను వివరించే అంశాన్ని హైకోర్టు పదేపదే తిరస్కరించిందని పేర్కొంది. సంగీతబెన్ వర్సెస్ గుజరాత్ కేసులో సుప్రీంకోర్టు ఇచ్చిన ఆదేశాలు ప్రస్తావిస్తూ ప్రస్తుత కేసులో హైకోర్టు ఆయా అంశాలను పరిశీలించకుండా బెయిల్ కేసును మినీ ట్రయల్‌గా మార్చిందని, ట్రయల్ కోర్టు వనితీరును విస్మరించిందని రాష్ట్ర ప్రభుత్వం పేర్కొంది. ఈ ఒక్క కేసు పరిశీలనతోనే హైకోర్టు ఇచ్చిన ఆదేశాలను పక్కన పెట్టవచ్చని నివేదించింది.

మెట్ట రైతుకు మంచి రోజులు

వ్యవసాయానికి నాణ్యమైన విద్యుత్ తొమ్మిది గంటలు నిరంతరాయంగా సరఫరా


కొమ్ముగూడెం, కృష్ణాపురం, బంగారుగూడెం గ్రామాల నుంచి సాక్షి ప్రతినిధి బోణం గణేష్ :

'వ్యవసాయానికి ఉచిత విద్యుత్‌లో ఏమాత్రం లోటు రాకూడదు. రైతన్నలకు ఇచ్చే కరెంట్‌కు ఎంత ఖర్చయినా ప్రభుత్వమే భరిస్తుంది. వ్యవసాయ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ దెబ్బతింటే 48 గంటల్లోనే బాగు చేయడం లేదా కొత్తది ఇవ్వడం జరగాలి. ఇందులో ఎలాంటి జాప్యం ఉండకూడదు. సర్వీసు కూడా అడిగిన వెంటనే మంజూరు చేయాలి. అన్నదాతలకు ఎలాంటి ఇబ్బంది కలగకూడదు' అని అధికారంలోకి రాగానే సీఎం వైఎస్ జగన్ ఇచ్చిన ఆదేశాలు సత్ఫలితాలిస్తున్నాయి. ప్రత్యేకంగా పూర్తిగా బోరు నీటిపైనే ఆధారపడి సాగు చేసే మెట్ట ప్రాంత రైతుల జీవితాల్లో వెలుగులు నింపుతున్నాయి. పశ్చిమ గోదావరి జిల్లా కొమ్ముగూడెం, కృష్ణాపురం, బంగారుగూడెం గ్రామాల్లో రైతుల వ్యవసాయ క్షేత్రాలు కళకళలాడుతున్నాయి. ఒకప్పుడు వ్యవసాయానికి ఏడు గంటలు విద్యుత్ సరఫరా 2 విడతల్లో ఇచ్చేవారు. అది కూడా వేళకాని వేళల్లో వచ్చేది. గతంలో కరెంట్ కోసం రైతన్నలు రాత్రిపూట పొలాల్లో జాగారం చేయాల్సిన దుస్థితి. ఫీడర్లు సరిపడా లేకపోవడం వల్ల వ్యవసాయ మోటార్లు తరచూ కాలిపోయేవి. ఏపీలో ఉన్న 6,663 ఫీడర్లలో కేవలం 3,854 మాత్రమే వ్యవసాయ విద్యుత్ సరఫరాకు అందుబాటులో ఉండేవి. ఒక్కో ట్రాన్స్‌ఫార్మర్‌పై నాలుగైదు సర్వీసులు ఉండటం వల్ల ఏ సమస్య వచ్చినా అన్నిటికీ విద్యుత్ సరఫరా నిలిచిపోయేది. మరమ్మతులకు నెలల తరబడి సమయం పట్టడంతో కళ్లెదుటే పంటలు ఎండిపోయేవి. పెట్టుబడులు కూడా వెనక్కి రాక అన్నదాతలు అఘాయిత్యాలకు పాల్పడ్డ దుస్థితి గతంలో నెలకొంది. సీఎం వైఎస్ జగన్ అధికారంలోకి రాగానే ఫీడర్ల సామర్థ్యాన్ని పెంచడం, మౌలిక సదుపాయాలను మెరుగుపరిచేందుకు రూ.1,700 కోట్లను ఖర్చు చేశారు. ప్రస్తుతం రాష్ట్రంలో ఉన్న 19.92 లక్షల వ్యవసాయ పంపుసెట్లకు 6,605 ఫీడర్లు పగటిపూటే 9 గంటల పాటు నాణ్యమైన విద్యుత్ సరఫరా చేసే సామర్థ్యం ఉంది. విద్యుత్ ప్రమాదాలు, సరఫరా నష్టాలకు ప్రధానంగా ఫీడర్లు, డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్లు, లైన్లు బలంగా లేకపోవడం, ఓవర్ లోడ్ కారణం. కొత్త సబ్‌స్టేషన్ల నిర్మాణంతోపాటు ట్రాన్స్ ఫార్మర్ల సామర్థ్యం పెంపు, పవర్ కెపాసిటర్ల ఏర్పాటు, పాత లైన్ల మరమ్మతులతో సమస్యలు తొలగిపోయాయి. రైతులకు ఇబ్బంది లేకుండా ప్రతి వ్యవసాయ సర్వీసుకీ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేసి కరెంట్ అందిస్తున్నారు.

ప్రభుత్వానిదే భారమంతా..

తూర్పు, మధ్య, దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థల (డిస్కమ్‌లు) పరిధిలో వ్యవసాయ ఫీడర్లు ఏటా 15,700 మిలియన్ యూనిట్ల విద్యుత్‌ను వినియోగిస్తున్నాయి. ఇది ఏపీలో ఏటా వినియోగించే 64 నుంచి 66 వేల మిలియన్ యూనిట్ల వినియోగంలో నాలుగింట ఒక వంతు. విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు, బ్రేకర్ల జీవిత కాలం 25 ఏళ్లుగా సెంట్రల్ ఎలక్ట్రిసిటీ అథారిటీ (సీఈఏ) నిర్ధారించింది. కాల పరిమితి తీరిన వాటి స్థానంలో కొత్తవి ఏర్పాటు చేయాలి. లేదంటే యూనిట్‌కు రూ.8 చొప్పున నష్టాలు పెరుగుతాయి. ఒక ట్రాన్స్‌ఫార్మర్ నుంచి నాలుగైదు సర్వీసులకు విద్యుత్ సరఫరా చేయడం వల్ల ట్రాన్స్‌ఫార్మర్లు త్వరగా పాడవుతున్నాయి. ఏటా సగటున 45,098 వ్యవసాయ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోతున్నాయి. వీటి మరమ్మతులకు రూ.102 కోట్లు ఖర్చవుతోంది. దీన్ని అధిగమించేందుకు హై వోల్టేజ్ డిస్ట్రిబ్యూషన్ సిస్టం (హెచ్‌వీడీఎస్), రీవాంప్ డిస్ట్రిబ్యూషన్ సెక్టార్ స్కీమ్ (ఆర్‌డీఎస్ఎస్) ద్వారా ట్రాన్స్‌ఫార్మర్ల పంపిణీ, ఫీడర్లను వేరు చేయడం లాంటి చర్యలు చేపట్టారు. బోరు దగ్గరకు 180 మీటర్ల వరకు ఉచితంగా విద్యుత్ లైన్లను సమకూరుస్తున్నారు. సబ్ స్టేషన్లు, ట్రాన్స్ ఫార్మర్లు, లైన్ల సామర్థ్యం పెంచుతున్నారు. ఈ ప్రక్రియకు ఒక్కో వ్యవసాయ సర్వీసుకు అయ్యే దాదాపు రూ.1.20 లక్షల ఖర్చును రాష్ట్ర ప్రభుత్వమే భరిస్తోంది.


రైతులకు ఏ కష్టం రాకుండా..



వ్యవసాయ రంగం అభివృద్ధికి సీఎం జగన్ పెద్దపీట వేస్తున్నారు. నాణ్యమైన విద్యుత్ ఇచ్చేందుకు పంపిణీ వ్యవస్థను పటిష్టం చేశారు. ఏపీలో మొత్తం 2,12,517 ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేశాం. వేలాది కి.మీ. పొడవున కొత్త లైన్లు నిర్మించాం.

– కె.విజయానంద్, ఇంధన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి

తడిచిన పొలమే తడిచి..



మా ప్రాంతంలో అంతా కరెంట్‌పై ఆధారపడే వ్యవసాయం జరుగుతుంది. గతంలో హెచ్‌టీ, ఎల్‌టీ లైన్లు ఒకే స్తంభం మీద ఉండటంతో చిన్న గాలికే కలిసిపోయి ట్రాన్స్‌ఫార్మర్, మోటార్ కాలిపోయేవి. రోజుకి 7 గంటలు అది కూడా 2,3 మూడు సార్లు కరెంట్ ఇవ్వడంతో తడిచిన పొలాలే తడిచి అవస్థలు ఎదుర్కొన్నాం. ఈ ప్రభుత్వం పగటిపూట 9 గంటలు కరెంటిస్తుంది.

– రామకృష్ణ, ఉద్యాన రైతు, కొమ్ముగూడెం

క్లుప్తంగా...

ఏపీ విజ్ఞప్తిపై విచారణ చేస్తాం

స్పష్టం చేసిన సుప్రీం కోర్టు ధర్మాసనం

సాక్షి, న్యూఢిల్లీ: కృష్ణా నదిపై ఉన్న జల విద్యుత్ కేంద్రాలను కూడా కేఆర్ఎంబీ పరిధిలోకి తేవాలంటూ మధ్యంతర ఉపశమనం కోరిన ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం విజ్ఞప్తిపై విచారణ చేపడతామని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. 2021లో తెలంగాణ ప్రభుత్వం జారీ చేసిన జీవో-34, కృష్ణా నదిపై జల విద్యుత్ కేంద్రాలను కేఆర్ఎంబీ పరిధిలోకి తీసుకురావాలంటూ ఏపీ ప్రభుత్వం దాఖలు చేసిన ఇంటర్ లోకేటరీ అప్లికేషన్‌ను మంగళవారం జస్టిస్ అభయ్ ఎస్ఓకా, జస్టిస్ పంకజ్ మిత్తల్‌తో కూడిన ధర్మాసనం విచారించింది. తెలంగాణ తరఫున సీనియర్ న్యాయవాది సీఎస్ వైద్యనాథన్ వాదనలు వినిపిస్తూ.. కృష్ణా ట్రిబ్యునల్‌కు సంబంధించి సుప్రీంకోర్టులో ఉన్న ఇతర పిటిషన్‌కు ఈ పిటిషన్‌ను జత చేయాలని కోరారు. వేరే ధర్మాసనం వద్ద ఉన్న కేసు ఈ పిటిషన్‌లో ఉన్న అంశం వేర్వేరని ఏపీ ప్రభుత్వం తరఫు సీనియర్ న్యాయవాది జయదీప్ గుప్తా దీనిపై అభ్యంతరం వ్యక్తం చేశారు. రెండింటినీ జత చేయాలని లేకపోతే ఒకేసారి వినాలని సీఎస్ వైద్యనాథన్ అభ్యర్థించారు. ఇతర కోర్టులో కేసు వివరాలు తమకు తెలియని కారణంగా ఆయా వివరాలు ఏపీ, తెలంగాణ, కేంద్రం ధర్మాసనానికి అందజేయాలని జస్టిస్ అభయ్ ఎస్ ఓకా ఆదేశించారు. అయితే, ఏపీ ప్రభుత్వం కోరిన మధ్యంతర ఉపశమనానికి సంబంధించి విచారణ చేపడతామని స్పష్టం చేశారు. తదుపరి విచారణ డిసెంబరు 12కు వాయిదా వేశారు.

ఆ ఉద్యోగులను వెనక్కి తీసుకోండి

ఏపీ ట్రాన్స్‌కోకు సుప్రీంకోర్టు ఆదేశం

సాక్షి, న్యూఢిల్లీ: జస్టిస్ ధర్మాధికారి సిఫార్సులకు అనుగుణంగా ఏపీకి చెందిన 14 మంది ఉద్యోగులను జనవరి 16లోగా వెనక్కి తీసుకోవాలని ఏపీ ట్రాన్స్‌కోకు సుప్రీంకోర్టు ఆదేశించింది. జస్టిస్ ధర్మాధికారి సిఫార్సులకు విరుద్ధంగా తమను తెలంగాణకు పంపారంటూ ఆ ఉద్యోగులు దాఖలు చేసిన పిటిషన్‌ను మంగళవారం జస్టిస్ అహ్సానుద్దీన్ అమానుల్లా, జస్టిస్ ప్రశాంత్‌కుమార్ మిశ్రాలతో కూడిన ధర్మాసనం విచారించింది. ఉద్యోగులను వెనక్కి తీసుకోవడానికి జనవరి 16 వరకు గడువు ఇస్తున్నామన్న ధర్మాసనం తదుపరి విచారణ అదే రోజుకు వాయిదా వేసింది.

బాబుకు శిక్ష తప్పదు

రాజ్యసభ సభ్యుడు మోపిదేవి



తాళ్లరేవు: అధికారంలో ఉండగా రాష్ట్రాన్ని నిలువు దోపిడీ చేసి.. పలు అవినీతి కేసుల్లో అడ్డంగా దొరికిపోయి.. బెయిల్‌పై బయటకొచ్చిన టీడీపీ అధినేత నారా చంద్రబాబు నాయుడుకు జైలుశిక్ష పడడం తథ్యమని రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకటరమణారావు స్పష్టం చేశారు. స్కిల్ స్కామ్‌లాంటి కేసులో రిమాండ్ ఖైదీగా ఉండి, లేని వ్యాధులు తెచ్చుకుని చంద్రబాబు బెయిల్ తెచ్చుకున్న విషయం రాష్ట్ర ప్రజలందరికీ తెలుసన్నారు. ప్రపంచ మత్స్యకార దినోత్సవ కార్యక్రమంలో పాల్గొనేందుకు మంగళవారం కోరంగి వచ్చిన ఆయన విలేకరులతో మాట్లాడారు. వ్యవస్థలను మేనేజ్ చేయడం, ఉన్నదాన్ని లేనట్టుగా, లేనిది ఉన్నట్టుగా చెప్పడం చంద్రబాబుకు వెన్నతో పెట్టిన విద్య అన్నారు. కుంటి సాకులతో బెయిల్ తెచ్చుకుని.. అదేదో ఘనకార్యంగా భావిస్తూ టీడీపీ నాయకులు క్షీరాభిషేకాలు, టపాసులు కాల్చడం వంటి హడావుడి చేయడాన్ని ప్రజలు అసహ్యించుకుంటున్నారని చెప్పారు. రాష్ట్రంలో సామాజిక సాధికారత సీఎం వైఎస్ జగన్ వల్లే సాధ్యమని మోపిదేవి స్పష్టంచేశారు. సీఎం జగన్ చేపట్టిన సంక్షేమ పథకాల వల్ల ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వర్గాలను వారి కాళ్లపై వారు నిలదొక్కుకుంటున్నారని తెలిపారు.

ఎప్పుడూ లేనంతగా ఆలయాల అభివృద్ధి

డిప్యూటీ సీఎం కొట్టు సత్యనారాయణ



సాక్షి, అమరావతి: చరిత్రలోనే ఎప్పుడూ లేనంత పెద్ద స్థాయిలో రాష్ట్రంలో ఆలయాలను అభివృద్ధి చేస్తున్నట్లు ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ చెప్పారు. దేవదాయ ధర్మాదాయ శాఖపై సమీక్ష అనంతరం మంగళవారం ఆయన రాష్ట్ర సచివాలయంలో విలేకరులతో మాట్లాడారు. సీఎం జగన్ ఆదేశాల మేరకు దేవదాయ శాఖ ఆధ్వర్యంలో కామన్ గుడ్ ఫండ్ (సీజీఎఫ్) ద్వారా రూ.539 కోట్లతో 815 పురాతన ఆలయాల పునరుద్ధరణ, నూతన ఆలయాల నిర్మాణం కొనసాగుతుందన్నారు. టీటీడీ శ్రీవాణి ట్రస్ట్ ఆధ్వర్యంలో 2,872 ఆలయాల నిర్మాణం కొనసాగుతుందన్నారు. ఏపీపీఎస్సీ ద్వారా కొత్తగా గ్రేడ్-3 లో ఎంపికైన 59 మందిలో 54 మందికి జిల్లాల వారీగా పోస్టింగ్‌లిచ్చినట్లు చెప్పారు.

బాబు బెయిల్‌పై 'ఎల్లో' అత్యుత్సాహం

హైకోర్టు చంద్రబాబుకు బెయిల్ ఇస్తే పచ్చ పార్టీ, పచ్చమీడియా ఎక్కడలేని అత్యుత్సాహం ప్రదర్శిస్తున్నాయని కొట్టు సత్యనారాయణ అన్నారు. ప్రజల్లో చంద్రబాబును సచ్ఛీలుడుగా ముద్ర వేయాలని ఎల్లో మీడియా తాపత్రయపడుతుందన్నారు.

బెయిల్‌కే వేడుకలు విడ్డూరం

వడిత్యా శంకర్ నాయక్

సాక్షి, అమరావతి: స్కిల్ స్కామ్ కేసులో చంద్రబాబుకు చట్ట ప్రకారం శిక్ష తప్పదని, ఆయనకు వచ్చింది బెయిల్ మాత్రమేనని ఏపీ ఎస్టీ కమిషన్ సభ్యుడు వడిత్యా శంకర్‌నాయక్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. బాబుకు బెయిల్ వస్తే టీడీపీ నేతలు వేడుకలు చేసుకోవడం విడ్డూరంగా ఉందన్నారు.

చంద్రబాబు ముఠాకు ఎదురుదెబ్బ

ఫైబర్‌నెట్ కేసులో నిందితుల ఆస్తుల అటాచ్‌మెంట్ • ఏడు స్థిరాస్తుల అటాచ్‌మెంట్‌కు న్యాయస్థానం అనుమతి

సాక్షి, అమరావతి: టీడీపీ ప్రభుత్వ హయాంలో జరిగిన ఫైబర్‌నెట్ కుంభకోణం కేసులో చంద్రబాబు ముఠాకు ఎదురుదెబ్బ తగిలింది. ఈ కేసులో నిందితులుగా ఉన్నచంద్రబాబు సన్నిహితుల ఆస్తుల అటాచ్‌మెంట్‌కు విజయవాడ ఏసీబీ న్యాయస్థానం అనుమతి ఇచ్చింది. సీఐడీ దాఖలు చేసిన అటాచ్‌మెంట్ పిటిషన్‌ను ఆమోదిస్తూ న్యాయస్థానం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఫైబర్‌నెట్ కేసులో చంద్రబాబు సహా పలువురిపై సీఐడీ కేసు నమోదు చేసింది. ఇందులో చంద్రబాబును ఏ-25గా, ఏ-1 గా వేమూరి హరికృష్ణకు చెందిన టెరాసాఫ్ట్ కంపెనీ, ఏ-13గా టెరాసాఫ్ట్ కంపెనీ ఎండీ తుమ్మల గోపీచంద్ ఉన్నారు. కుంభకోణంలో నిందితుల పాత్రపై స్పష్టమైన ఆధారాలు లభించడంతో వారి ఆస్తులను అటాచ్ చేయాలని సీఐడీ నిర్ణయించింది. ఏపీ, తెలంగాణలో టెరాసాఫ్ట్ కంపెనీ, తుమ్మల గోపీచంద్ తదితరుల పేరిట ఉన్న రూ.114 కోట్ల విలువైన ఏడు స్థిరాస్తులను అటాచ్ చేయాలన్న సీఐడీ ప్రతిపాదనను హోం శాఖ ఆమోదించింది. దాంతో ఆస్తుల అటాచ్‌మెంట్‌కు అనుమతి కోరుతూ సీఐడీ న్యాయస్థానంలో పిటిషన్ దాఖలు చేసింది. ఇందుకు న్యాయస్థానం అనుమతినివ్వడంతో ఆస్తుల అటాచ్‌మెంట్‌కు సీఐడీ సిద్ధమవుతోంది.



చంద్రబాబు పన్నాగమే..

టీడీపీ ప్రభుత్వ హయాంలో నిబంధనలకు విరుద్ధంగా అప్పటి సీఎం చంద్రబాబు తన సన్నిహితుడు వేమూరి హరికృష్ణకు చెందిన టెరాసాఫ్ట్ కంపెనీకి ఫైబర్‌నెట్ టెండర్లను కట్టబెట్టారు. మొత్తం రూ.3,300 కోట్ల కేంద్ర ప్రభుత్వ నిధులతో రాష్ట్ర ప్రభుత్వం దశలవారీగా ఈ ప్రాజెక్ట్‌ను చేపట్టింది. మొదటి దశ కింద రూ.330 కోట్ల ప్రాజెక్టును టెండర్లలో ఎల్-1గా వచ్చిన బిడ్డర్‌ను కాదని మరీ టెరాసాఫ్ట్‌కు కట్టబెట్టారు. అందుకోసం బ్లాక్ లిస్టులో ఉన్న టెరాసాఫ్ట్ కంపెనీని ఆ జాబితా నుంచి తొలగించి, టెండర్లలో పాల్గొనేందుకు అనుమతించారు. ఏపీ గవర్నింగ్ కౌన్సిల్‌లో సభ్యుడిగా ఉన్న వేమూరి హరికృష్ణను ఫైబర్‌నెట్ టెండర్ల మదింపు కమిటీలో సభ్యుడిగా నియమించారు. ఆయనకు చెందిన టెరాసాఫ్ట్ కంపెనీయే టెండర్లలో పాల్గొని, పనులు దక్కించుకుంది. ఇది పరస్పర ప్రయోజనాల నిరోధక చట్టానికి విరుద్ధం. టెరాసాఫ్ట్ కంపెనీ పనులు కూడా నాసిరకంగా చేసి, రూ.144.53 కోట్లను దారి మళ్లించినట్టు సీఐడీ దర్యాప్తులో వెల్లడైంది.

అటాచ్ చేయాలని నిర్ణయించిన ఆస్తులు

- ఈ కేసులో నిందితుడు కనుమూరి కోటేశ్వరరావు పేరిట గుంటూరులో ఉన్న 797 చదరపు అడుగుల ఇంటి స్థలం.
- కోటేశ్వరరావు డైరెక్టర్‌గా ఉన్న నెప్‌టాప్స్ ఫైబర్ సొల్యూషన్స్‌కు చెందిన విశాఖపట్నం కిర్లంపూడి లేఅవుట్‌లోని ఓ ఫ్లాట్.
- టెరాసాఫ్ట్ కంపెనీ ఎండీ తుమ్మల గోపీచంద్ పేరిట హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లో ఉన్న ఫ్లాట్, శ్రీనగర్ కాలనీలో ఉన్న రెండు ఫ్లాట్లు, ఆయన పేరిటే యూసఫ్‌గూడలో ఉన్న మరో ఫ్లాట్.
- తుమ్మల గోపీచంద్ భార్య పవన దేవి పేరిట తెలంగాణలోని రంగారెడ్డి జిల్లా మొయినాబాద్‌లో ఉన్న వ్యవసాయ భూమి.

'మద్యం' కేసులో బాబు ముందస్తు బెయిల్ పిటిషన్‌పై

విచారణ నేటికి వాయిదా

- వాదనలు వినిపించిన చంద్రబాబు, కొల్లు రవీంద్ర న్యాయవాదులు
- శాసన సభ ఆమోదంతోనే ప్రివిలేజ్ ఫీజు తొలగించినట్లు తెలిపిన బాబు
- గవర్నర్ సైతం ఆమోదముద్ర వేశారని వెల్లడి
- సీఐడీ వాదనల నిమిత్తం విచారణ నేటికి వాయిదా




సాక్షి, అమరావతి: 'మద్యం' కేసులో మాజీ సీఎం నారా చంద్రబాబునాయుడు దాఖలు చేసిన ముందస్తు బెయిల్ పిటిషన్‌పై విచారణను హైకోర్టు బుధవారానికి వాయిదా వేసింది. చంద్రబాబు సీఎంగా ఉండగా వారి పార్టీ నేతల డిస్టిలరీలు, బార్లకు లబ్ధి చేకూర్చేలా నిర్ణయాలు తీసుకున్నారు. వీటి వల్ల ఖజానాకు రూ.1,500 కోట్ల మేర నష్టం వాటిల్లింది. దీనిపై సీఐడీకి ఏపీ బెవరేజెస్ కార్పొరేషన్ ఎండీ ఫిర్యాదు చేశారు. ప్రాథమిక విచారణ జరిపిన సీఐడీ.. అప్పటి ఎక్సైజ్ కమిషనర్ శ్రీనరేష్, ఎక్సైజ్ మంత్రి కొల్లు రవీంద్ర, సీఎం చంద్రబాబుపై కేసు నమోదు చేసింది. ఈ కేసులో ముందస్తు బెయిల్ కోరుతూ చంద్రబాబు, కొల్లు రవీంద్ర, శ్రీనరేష్ హైకోర్టులో వేర్వేరుగా పిటిషన్లు దాఖలు చేశారు. చంద్రబాబు, రవీంద్రల వ్యాజ్యాలపై న్యాయమూర్తి జస్టిస్ తల్లాప్రగడ మల్లికార్జునరావు మంగళవారం విచారణ జరిపారు. చంద్రబాబు తరఫున సీనియర్ న్యాయవాది వాదనలు వినిపిస్తూ.. మద్యం దుకాణాలు, బార్లకు శాసన సభ ఆమోదంతోనే ప్రివిలేజ్ ఫీజు తొలగించినట్లు చెప్పారు. ఇందుకు గవర్నర్ సైతం ఆమోదముద్ర వేశారన్నారు. ప్రివిలేజ్ ఫీజు తొలగిస్తూ ఎక్సైజ్ చట్టానికి చేసిన సవరణకు అప్పటి మంత్రి మండలి ఆమోదం కూడా ఉందన్నారు. రాజ్యాంగంలోని అధికరణ 163 (3) ప్రకారం గవర్నర్‌కు మంత్రులు చేసిన సూచనలపై న్యాయ సమీక్ష కుదరదని అన్నారు. రాజకీయ కక్ష సాధింపులో భాగంగానే ఈ కేసు నమోదు చేశారన్నారు. కొల్లు రవీంద్ర తరఫున సీనియర్ న్యాయవాది పోసాని వెంకటేశ్వర్లు వాదనలు వినిపించారు. సీఐడీ వాదనల నిమిత్తం విచారణను న్యాయమూర్తి బుధవారానికి వాయిదా వేశారు. కాగా, ముందస్తు బెయిల్ కోసం శ్రీనగేష్ దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణను జస్టిస్ మల్లికార్జునరావు ఈ నెల 28కి వాయిదా వేశారు.


ఇళ్లపైకి 'పచ్చ'దొంగలు.. జాగ్రత్త!

ఒకేసారి ఐదు కోట్ల మంది ప్రజలను మోసం చేసేందుకు టీడీపీ కుట్ర.. లేని మేనిఫెస్టో పేరుతో ఇళ్లల్లోకి జొరబడుతున్న పచ్చ దొంగలు

- బాబు ష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారెంటీ పేరుతో బురిడీ
- వచ్చే ఐదేళ్లలో లక్షల్లో లబ్ధి అంటూ ప్రజలకు ప్రలోభాలు
- ఇది సైబర్ క్రైం కిందకు వస్తుంది.. ప్రజాప్రాతినిధ్య చట్టం ఉల్లంఘన కూడా..
- ఓటరు కార్డు తీసుకుని ఈసీ నిబంధనల ఉల్లంఘన.. ప్రజల ప్రాథమిక హక్కులకూ భంగం
- మాయల పకీరు చేతిలో ప్రజల డేటా.. అందరూ అప్రమత్తంగా ఉండాలి
- ప్రజలకు వైఎస్సార్‌సీపీ ప్రధాన కార్యదర్శి సజ్జల విజ్ఞప్తి



సర్వే పేరుతో టీడీపీ బూత్ కన్వీనర్లు, సేవా మిత్రలకు కేటాయించిన ఓటర్ల వివరాలు



ఓటర్ల సెల్‌ఫోన్ నంబర్‌ను టీడీపీ యాప్‌లో నమోదు చేయగా, వచ్చిన ఓటీపీ, సందేశం



చంద్రబాబు అధికారంలోకి వస్తే మీ కుటుంబం రూ.2.4లక్షలు లబ్ధి పొందేందుకు అర్హత సాధించింది.. అంటూ రాజంపేట నియోజకవర్గానికి చెందిన మౌనిక మర్రి అనే ఓటరుకు పంపిన సందేశం

సాక్షి, అమరావతి

టీడీపీకి చెందిన పచ్చ దొంగల ముఠా ఊళ్ల మీదకొచ్చి పడుతోందని.. పట్టపగలే ఇళ్లలోకి చొరబడుతోందని.. ఆ ముఠా చేసే తప్పుడు ప్రచారాలపట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వైఎస్సార్‌సీపీ ప్రధాన కార్యదర్శి, ప్రభుత్వ సలహాదారు (ప్రజా వ్యవహారాలు) సజ్జల రామకృష్ణారెడ్డి విజ్ఞప్తిచేశారు. నరనరాన వికృత ఆలోచనల మనస్తత్వం ఉన్న చంద్రబాబు నేతృత్వంలోని టీడీపీ కంటే అంతర్జాతీయ దొంగల ముఠానే నయమంటూ ఆయన ఎద్దేవా చేశారు. మోసం చేయడంలోనూ.. కొత్తకొత్త కిటుకులను వినియోగించి మళ్లీ ఐదు కోట్ల మంది ప్రజలను భ్రమల్లో పెట్టి.. రాష్ట్రాన్ని నిలువుదోపిడీ చేసేందుకు టీడీపీ తెగబడుతున్న తీరు ఈ మధ్య రాజంపేటలో బయటపడిందని ఆయన గుర్తుచేశారు. తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. బాబు ష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారెంటీ పేరుతో టీడీపీ చేస్తున్న మోసాలను సాక్ష్యాధారాలతో సహా బయటపెట్టారు. ఆయన ఇంకా ఏమన్నారంటే..

లేని మేనిఫెస్టోతో ప్రలోభాలు..

ఇటీవల రాజంపేటలో రెండు సంఘటనలు జరిగాయి. అసలు టీడీపీ మేనిఫెస్టో ఏంటో కూడా ఇంకా పూర్తిగా తెలీదు. చంద్రబాబు ఏదో సూపర్ సిక్స్ అన్నారు.. దత్తపుత్రుడు చెప్పినవి కలిపి 11 హామీలు అంటున్నారు. ఉమ్మడి మేనిఫెస్టో పేరుతో వాటిని ఖరారు చేసేందుకు నాటకాలు ఆడుతున్నారు. నిజానికి.. మేనిఫెస్టోపై స్పష్టత లేకున్నా.. 'బాబు ష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారెంటీ' పేరుతో టీడీపీ కార్యకర్తలు ఇప్పుడు ఇళ్లల్లోకి చొరబడుతున్నారు. ప్రజల వ్యక్తిగత సమాచారం తీసుకుని ఒక యాప్‌లో నమోదు చేస్తున్నారు. ఓటీపీ వస్తే క్లిక్ చేయమంటున్నారు. దాన్ని క్లిక్‌చేస్తే 'భవిష్యత్తుకు గ్యారెంటీ' అంటూ కార్డు వస్తోంది. ఆ కార్డులో.. 'ఐదేళ్లలో రూ.2.40 లక్షలు పొందేందుకు మీరు అర్హత సాధించారు.. మీకు అభినందనలు.. 2024 జూన్ నుంచి ఈ మొత్తం మీ అకౌంట్లో జమచేయడం ప్రారంభమవుతుంది' అంటూ ఇటీవల రాజంపేటకు చెందిన మర్రి మౌనికకు చెప్పారు. చంద్రబాబే అధికారంలోకి వచ్చేసినట్లు ప్రతిజ్ఞ చేస్తూ సంతకంచేసి మరీ ఒక గ్యారెంటీ పత్రం ఇస్తున్నారు. ఈ కార్యక్రమంలో ఓటరు కార్డు నంబరు, మొబైల్ నంబర్‌తో సహా అన్ని వివరాలు సేకరిస్తున్నారు. మరో ఇంటికెళ్లి రూ.6.90 లక్షలు వస్తుందని చెప్పుకొచ్చారు. ఈ కార్యక్రమాన్ని చాపకింద నీరులా టీడీపీ వాళ్లు నిర్వహిస్తున్నారు.

ప్రజల వ్యక్తిగత డేటా చోరీ..

నిజానికి.. హామీలను రాతపూర్వకంగా ఇచ్చేదే మేనిఫెస్టో. అధికారంలోకి వస్తే దాన్ని అమలుచేయాలి. కానీ, 2014లో టీడీపీ తన హామీలను అమలు చేయలేక మోసం చేసింది. అప్పట్లో మోదీ, పవన్‌కళ్యాణ్ ఫొటోలతో 650 హామీలను అమలు చేస్తానంటూ ప్రజలకు సంతకం చేసి మరీ చంద్రబాబు లేఖలు రాశారు. అధికారంలోకి వచ్చాక ఎన్నికల మేనిఫెస్టోను అమలుచేయకుండా.. దానిపై ప్రజలు ఎక్కడ నిలదీస్తారోనన్న భయంతో టీడీపీ వెబ్‌సైట్ నుంచే దాన్ని మాయంచేశారు. ఇప్పుడు లేని మేనిఫెస్టోతో మళ్లీ ప్రజల వద్దకు చంద్రబాబు వెళ్తున్నాడు. ఇంటింటికీ వెళ్లి మీకు పథకాలు వచ్చేశాయి.. అభినందనలు.. అంటూ చెప్పడం విడ్డూరంగా ఉంది. వారెంటీ లేని గ్యారెంటీలతో ప్రజలను మోసం చేస్తున్న ఇతన్ని ఏ చట్టం ప్రకారం శిక్షించవచ్చో ప్రజలే ఆలోచించాలి. ఇక ఇది సైబర్ క్రైం కిందకు వస్తుంది. ఓటరు కార్డు కూడా తీసుకుని పౌరుల వ్యక్తిగత గోప్యతలోకి కూడా వచ్చేస్తున్నారు. ముఖ్యంగా ఇది ప్రజాప్రాతినిధ్య చట్టం ఉల్లంఘన కిందకు కూడా వస్తుంది. ఓటరు కార్డు తీసుకుంటూ ఎన్నికల కమిషన్ నిబంధనలను ఉల్లంఘిస్తున్నారు. ప్రజలకున్న ప్రాథమిక హక్కుల్లోకి కూడా వెళ్లిపోతున్నాడు. పచ్చి అబద్ధాలతో ఇళ్లలోకి వచ్చి ప్రజల రహస్యాలను టీడీపీ కార్యకర్తలు తస్కరిస్తున్నారు. ఈ డేటాను వారు ఎందుకైనా వాడుకోవచ్చు.. బ్లాక్‌మెయిల్ చేయవచ్చు.. ఇంకేదైనా చేయవచ్చు. ఇంత చేస్తున్న చంద్రబాబు గత చరిత్ర చూస్తే ఒళ్లు జలదరిస్తుంది.

'సేవామిత్ర'తో 50 లక్షల ఓట్లు తొలగించిన బాబు..

తన హయాంలో చంద్రబాబు వ్యవస్థల్లోకి వైరస్‌లా దూరి వైఎస్సార్‌సీపీ ఓట్లు తొలగించేందుకు తెగించాడు. అప్పట్లో సేవామిత్ర అనే ఒక యాప్‌ను తయారుచేసి ప్రత్యర్థి పార్టీ ఓట్లపై దెబ్బకొట్టే ప్రయత్నం చేశాడు. బ్లూఫ్రాగ్ అనే కంపెనీకి పబ్లిక్ డేటా యాక్సెస్ ఇచ్చి, దాని ద్వారా ఐటీ గ్రిడ్స్‌కి పంపి చోరీ చేశారు. ఓటరు డేటానూ ఇదే రీతిలో చోరీచేశారు. వాటిని సేవామిత్ర యాప్‌లో పొందుపరిచి.. కుటుంబ ఆర్థిక వివరాల నుంచి మొబైల్ నంబర్, కుల వివరాలు, వృత్తి, విద్యార్హత వివరాలు సేకరించారు.

- ఆ తర్వాత ఏ పేపరు చదవుతారని ప్రశ్నించి.. 'సాక్షి' పత్రిక చదువుతున్నట్లు చెప్పిన ఓటర్లు, వైఎస్సార్‌సీపీకి మద్దతుగా ఉంటామని చెప్పిన ఓటర్లను జాబితాను తొలగించేలా ఫారం-7లను సేవామిత్ర యాప్ ద్వారా ఎన్నికల సంఘానికి పంపారు. అలా 50 లక్షల ఓట్లను 2017లో తొలగించారు.
- ఇదే అంశంపై అప్పట్లో ప్రతిపక్ష నేతగా ఉన్న వైఎస్ జగన్ గవర్నర్, కేంద్ర ఎన్నికల సంఘాన్ని కలిసి సాక్ష్యాధారాలతో సహా ఫిర్యాదు చేశారు. దాంతో.. ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియలో 30 లక్షల ఓట్లను మళ్లీ సీఈసీ చేర్పించింది. ఒకవేళ చంద్రబాబు కోరుకున్నట్లు 50 లక్షల ఓట్లు తొలగించి ఉంటే ఏం జరిగి ఉండేది?
- అధికారంలో ఉన్నప్పుడు ప్రత్యర్థి పార్టీ మద్దతుదారులైన ఓటర్లను తొలగించిన చంద్రబాబు.. ప్రతిపక్షంలోకి రావడంతో తిరిగి ఓటర్ల వద్దకు వెళ్లి అబద్ధపు హామీలతో ప్రలోభాలకు గురిచేస్తున్నాడు. ఇది ప్రజల్ని మోసం చేసి వాళ్లకు భవిష్యత్తు లేకుండా, మళ్లీ చీకట్లలోకి తీసుకెళ్లే ప్రయత్నం చేస్తున్నాడు. ఇది మామూలు దొంగతనం, దోపిడీ కంటే మరింత భయంకరమైనది.

గజదొంగే దొంగా దొంగా అని అరుస్తున్నాడు..

అధికారంలో ఉన్నప్పుడు ప్రజల వ్యక్తిగత వివరాలను చోరీచేసిన డేటా చంద్రబాబు వద్ద ఉంది. ఇప్పుడు మళ్లీ వారి వ్యక్తిగత సమాచారాన్ని తన చేతిలో పెట్టుకుంటున్నాడు. మాయలపకీరు చేతులోకి డేటా అంతా వెళ్లే డేంజర్ పరిస్థితి ఇది. దీన్ని కేంద్ర ఎన్నికల సంఘం దృష్టికి తీసుకెళ్తాం.

- టీడీపీ చెప్పే మాటలు నమ్మితే 2014-19 మధ్యలో ఏం జరిగిందో ప్రజలు గుర్తుతెచ్చుకోవాలి. నిలువుదోపిడీ చేయగల గజదొంగే.. ఎదుటి వాళ్లను చూసి దొంగ దొంగ అని అరుస్తున్నాడు.
- చంద్రబాబు సేవలో తరిస్తూ ఎల్లో మీడియా చేస్తున్న అఘాయిత్యంపట్ల కూడా ప్రజలు జాగ్రత్తగా ఉండాలి. టీడీపీ డ్రామాలను గమనించాలి. ప్రజలు, ప్రజాస్వామ్య వాదులు అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉంది.
- ఇక మోసం చేస్తున్నది వాళ్లు.. కానీ, ఉల్టా మా మీద ఆరోపణలు చేస్తున్నారు. లక్షల ఓట్ల తొలగింపు అంటూ ఈనాడు బ్యానర్ వార్తలు రాస్తుంది. 5.78 లక్షల మంది వలస వెళ్లిపోయిన ఓటర్లను జాబితా నుంచి తొలగించారంటూ తప్పుడు కథనం రాశారు. అదే సమయంలో వలస వెళ్లిన వారిలో 5.47 లక్షల ఓటర్లను వాళ్లు నివాసం ఉన్నచోట చేర్చినట్లు ఎన్నికల సంఘం ప్రకటించింది. ఎవడైనా నిష్పక్షపాతంగా రాసేవాడైతే ఆ విషయాన్ని కూడా రాయాలి కదా? రామోజీరావు ఒళ్లంతా పసుపే. ఈనాడు చంద్రబాబు కరపత్రం. దానికి మించి చంద్రబాబుకు రామోజీరావు రాజగురువు.
- కుప్పం ఓటర్ల జాబితాలో కనికట్టు అంటూ మరో వార్త రాశారు. సత్యనారాయణరెడ్డి, షఫీయుల్లా అనే వ్యక్తులు చనిపోయినా ఓటర్ల జాబితాలో వారి ఓట్లు ఉన్నాయని రాశారు. వాటిపై చెక్ చేయిస్తే.. చంద్రబాబు అధికారంలో ఉన్నప్పుడు అంటే 2019, జనవరిలో వారి పేర్లు ఓటర్ల జాబితాలో ఉండగా అవి ఇప్పుడూ కొనసాగుతున్నాయి. మేం అడుగుతోంది కూడా ఇలాంటి ఓట్లు తొలగించాలనే.
- ఓటర్ల జాబితా రూపకల్పనలో సీఎం జగన్‌కు గానీ, ప్రభుత్వానికిగానీ ఏం పాత్ర ఉంటుంది? కానీ, చంద్రబాబుకు మాత్రం సంబంధం ఉంటుంది. ఎందుకంటే అడ్డదారుల్లో ఎలా అధికారంలోకి రావాలనే లక్షణం ఉంది కాబట్టి. గత రెండున్నర నెలలుగా రోజూ 'ఈనాడు'లో ఇలా ఓటర్ల మీదే రాస్తున్నారు.
- అడ్డంగా హత్యలు చేసే హంతకుడే తాను బాధితుడైనట్లుగా చంద్రబాబు వ్యవహరిస్తున్నారు. ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగాన్ని కూడా ఆయన హత్య చేస్తున్నారు.
- మరోవైపు.. 50 లక్షలు ఓట్లు తీసేయాలంటూ యాగీ చేస్తున్నారు. బతికి ఉన్న వాళ్లని కూడా చనిపోయారని ఫిర్యాదు చేసి ఓట్లు తొలగించే కార్యక్రమం చేస్తూనే ఉన్నారు. రోజూ మెమొరాండం తీసుకుని ఎన్నికల కమిషన్‌కు ఇస్తూ పోతున్నారు. తప్పుదోవ పట్టించడానికి విశ్వప్రయత్నం చేస్తున్నారు.
- 2014-19 మధ్యలో జరిగిన దానికంటే ఇప్పుడు మరిన్ని దారుణాలకు తెగబడుతున్నారు.

ప్రపంచంలో చంద్రబాబే డీప్‌ఫేక్

చంద్రబాబు అధికారంలో ఉన్నప్పుడు సేవా మిత్రల ద్వారా, నేడు జనం తిరస్కరించాక ఇలాంటి బ్యూరోక్రాట్స్ ద్వారా అడ్డదారులు తొక్కుతున్నాడు. పొద్దున లేచినప్పటి నుంచీ ఆ ఎల్లో పేపర్లలో, ఎల్లో టీవీల్లో చర్చలు పెట్టుకుంటూ వెళ్తారు. నీకు ఈ దౌర్భాగ్యం అవసరమా చంద్రబాబూ? దీనికంటే చేయగలిగింది రాయల్‌గా చెప్పొచ్చుగా? జగన్‌లా చేయగలిగిందే చెప్పాలి. రుణమాఫీ చేయలేమని ఆనాడు జగన్ స్పష్టంగా చెప్పారు. ఎన్నికల ముందు కొంచెమన్నా చేస్తామని చెప్పాలని మాలాంటి వారు చెప్పినా ఆయన ససేమిరా అన్నారు. దానివల్ల నేను ప్రతిపక్షంలో కూర్చున్నా పర్లేదన్నారు. అదీ జగన్ నిబద్ధత. కానీ, చంద్రబాబు మాత్రం అడ్డదారులే వెతుక్కుంటున్నాడు. గోడ దూకడం ఎలా అని ఆలోచిస్తాడు. నిజానికి.. చంద్రబాబుకు 2014-19 మధ్య ప్రజలు మళ్లీ ఆయనకు అవకాశమిచ్చారు. అప్పుడైనా ప్రజలకు సేవ చేయాల్సింది. కానీ ఆయనకు ఆ లక్షణం లేదు. ప్రపంచంలోనే డీప్‌ఫేక్ చంద్రబాబు. ఇంతకంటే డీప్‌ఫేక్ ఏదీ ఉండదు. బ్యాంకుల్లో కుదవ పెట్టిన మీ బంగారాన్ని విడిపిస్తానని చెప్పిన చంద్రబాబు ఆ తర్వాత ఏం చేశాడో అందరూ చూశారు. చంద్రబాబుకు ఉన్న విశ్వసనీయత అక్రమాల్లోనే. ఇక స్కిల్ స్కాంలో అరెస్టుకాకముందు ఏ రోగమూ లేని చంద్రబాబు.. అరెస్టయిన తర్వాత ప్రపంచంలోని అన్ని రోగాలున్నాయని కోర్టులకు చెప్పారు. మెడికల్ బెయిల్ వచ్చినా.. రెగ్యులర్ బెయిల్ వచ్చినా సత్యం గెలిచింది అంటారు. స్కాంస్టర్ బాబులో స్కాం మాత్రమే సత్యం.. చివరికి అదే బయటపడుతుంది.

సిటిజన్స్ ఫర్ డెమోక్రసీ పేరుతో తప్పుడు కేసులు..

ఇప్పుడు నిమ్మగడ్డ రమేష్ వంటి వారితో సిటిజన్స్ ఫర్ డెమోక్రసీ వంటి సంస్థలను సృష్టించి, సుప్రీంకోర్టులో తప్పుడు కేసులు వేయిస్తున్నారు. చంద్రబాబు నాయుడు అధికారంలో ఉన్నప్పుడు 50 లక్షల ఓట్లు తొలగించారు కదా.. దానికి మీరేం సమాధానం చెబుతారని నిమ్మగడ్డ రమేష్ నేతృత్వంలోని సిటిజన్స్ ఫర్ డెమోక్రసీ సంస్థలో భాగస్వాములైన వారిని మేం ప్రశ్నిస్తున్నాం. అప్పట్లో ఇదే సుబ్రహ్మణ్యం చీఫ్ సెక్రటరీగా కూడా ఉన్నారు. ఆనాడు జరిగింది ఆయనకు తెలీదా? మరోవైపు.. గ్రామ, వార్డు వలంటీర్లపై ఈ సంస్థ సుప్రీంకోర్టుకు వెళ్లింది. వైఎస్సార్‌సీపీ పాలనలో ప్రభుత్వ పథకాలు, సేవలను ఇంటి వద్దకే ప్రజలకు అందించడానికి వలంటీర్లు పనిచేస్తున్నారు. వారు ఉద్యోగులు కాదన్న విషయం వారికీ తెలుసు. రాజకీయంగా వలంటీర్ ఎవరికైనా మద్దతు పలకవచ్చు... అది వారి స్వేచ్ఛ. గత టీడీపీ ప్రభుత్వంలో జన్మభూమి కమిటీలకు ఉన్న అధికారాలు వలంటీర్లకు లేవు కదా? వాటిలా దోపిడీ ముఠాలను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం సృష్టించలేదు కదా? ఇక ఈ కేసులో సిటిజన్స్ ఫర్ డెమోక్రసీ సంస్థకు లాయర్ కపిల్ సిబాల్. ఆయన ఫీజు కోట్ల రూపాయలు తీసుకుంటారు. అంత సొమ్ము ఈ సంస్థకు ఎక్కడి నుంచి వచ్చింది? చంద్రబాబు నాయుడు ఇస్తున్నాడు.. సిటిజన్స్ ఫర్ డెమోక్రసీ సంస్థను ఆడిస్తున్నాడు. ఇంతకంటే ఇంకేముంది.



అనుబంధం పెంచుకోవడమే బాధలకు దారి తీస్తుంది.
– బౌద్ధ ధర్మం

సాక్షి
బుధవారం, 22 నవంబర్ 2023

కోరి తెచ్చుకున్న కొరివి?

ఎన్నికలు, ఫలితాలనేవి ఉద్వేగాలను రేపడం సహజం. అయితే, కొన్ని ఎన్నికలు, కొందరి ఎంపికలు ఒక్కసారిగా ఉలిక్కిపడేలా చేస్తాయి. అనుమానాలతో పాటు ఆందోళనలూ రేపుతాయి. అర్జెంటీనా కొత్త అధ్యక్షుడిగా ఛాందసవాద జేవియర్ మిలీ తాజా ఎన్నిక అలాంటిదే. ఓట్ల లెక్కింపులో మిలీ 56 శాతం ఓట్లు సాధిస్తే, అధికార పక్షమైన పెరోనిస్ట్ ప్రభుత్వ ఆర్థిక మంత్రి సెర్జియో మస్సాకు 44 శాతం ఓట్లే వచ్చాయి. వర్తమాన అర్జెంటీనా రాజకీయ వ్యవస్థపై నెలకొన్న ప్రజాగ్రహానికి, 'సరికొత్త రాజకీయ శకం' తీసుకువస్తానన్న వాగ్దానం తోడై సృష్టించిన ప్రభంజనంలో మిలీ విజయ తీరాలకు చేరారు. అయితే, ఆయన విజయం అర్జెంటీనాలోని ప్రతిపక్షాల్లోనే కాదు... అంతర్జాతీయం గానూ ఆందోళన రేపుతోంది. కష్టపడి సాధించుకున్న ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడిందని భావిస్తున్నారు. నలభై ఏళ్ళుగా ప్రజాస్వామ్యాన్ని పాటిస్తున్న దక్షిణ అమెరికా దేశాన్ని కొత్త అధ్యక్షుడు మళ్ళీ వెనక్కి నడిపిస్తారనే భయం నెలకొంది. అదెలా ఉన్నా... అర్జెంటీనా దౌత్య సంబంధాలు, ఆర్థిక భవితవ్యం, ఆ ప్రాంత రాజకీయ సమీకరణాలు మారిపోనున్నాయి.

నాలుగున్నర కోట్ల జనాభా గల అర్జెంటీనాలో నవంబర్ 19న జరిగిన ఎన్నికలు, ఫలితాలు ఇంతగా చర్చనీయాంశమైంది అందుకే. ఎన్నికల్లో మిలీకి పట్టం కట్టినమాట నిజమే అయినా, అంత మాత్రాన అర్జెంటీనా ప్రజలందరూ ఆయన భావజాలంతో ఏకీభవిస్తున్నట్టు అనుకోలేం. దశాబ్దాల నిర్వహణ లోపాలు, అవినీతితో ఆ దేశం దీర్ఘకాలంగా ఆర్థిక కష్టాల ఊబిలో కూరుకుపోయింది. ప్రభుత్వ ఖజానా ఖాళీ అయింది. ప్రపంచస్థాయిలోనే ఎక్కువగా ద్రవ్యోల్బణం 150 శాతానికి దగ్గరలో ఉంది. దారిద్ర్యం పెరుగుతోంది. దేశంలో నూటికి 40 మందికి పైగా దారిద్ర్యంలో మగ్గుతున్నారు. అధికార కరెన్సీ పెసో విలువ ఎన్నడూ లేనంతగా పడిపోయింది. మూడేళ్ళ క్రితం కరోనా రావడానికి ముందు దాకా 80 పెసోలు ఒక డాలరైతే, ఇవాళ వెయ్యి పెసోలైతే కానీ ఒక డాలర్‌కు సమానం కాని దుఃస్థితి. ఈ ఆర్థిక కష్టాలకు రాజకీయ వ్యవస్థ, ముఖ్యంగా వామపక్షాలు కారణమని మిలీ ఆరోపణ. ఆ ఆరోపణల్ని అధికారపక్ష అభ్యర్థి సమర్థంగా తిప్పికొట్టలేకపోయారు. ఎలాగైనా సరే జీవన పరిస్థితుల్లో మార్పు రావాలని తహతహలాడుతున్న జనం మిలీతో ఏకీభావం లేకున్నా ఆయనకే ఓటేశారు. అందుకే, ఈ ఎన్నిక ''నిరసన ఓటు'' ఫలితమని నిపుణుల మాట.

ఆర్థిక నిపుణుడు, మాజీ టీవీ ప్రముఖుడు, తాంత్రిక సెక్స్ కోచ్ 53 ఏళ్ళ జేవియర్ మిలీకి నిజానికి రాజకీయ అనుభవం లేదు. కానీ, ప్రజలకు ఆయన బాసలు కోటలు దాటాయి. పన్నులు తగ్గిస్తాననీ, అర్జెంటీనా కేంద్ర బ్యాంకును రద్దు చేస్తాననీ, దేశ కరెన్సీ పెసో స్థానంలో అమెరికా డాలర్‌ను తెస్తాననీ అన్నారు. గర్భస్రావంపై నిషేధం ఎత్తేస్తానన్నారు. కారుణ్య మరణాల్ని వ్యతిరేకించారు. తుపాకులపై నియంత్రణల్ని సడలిస్తానన్నారు. ఇంకా ఒక అడుగు ముందుకు వేసి 'సామ్యవాదంపై పోరాటం' చేయదలచిన దేశాలే అర్జెంటీనాకు మిత్రపక్షాలంటూ తన భావజాలాన్ని కుండబద్దలు కొట్టారు. అసలే కష్టాల్లో ఉన్న దేశాన్ని ఆయన అధ్యక్షత మరింత ఆర్థిక సంక్షోభంలోకి నెడుతుందని వందమందికి పైగా ప్రముఖ ఆర్థికవేత్తలు ఇప్పటికే హెచ్చరించారు. పైగా, అతి పెద్ద వాణిజ్య భాగస్వామ్యదేశాలైన బ్రెజిల్, చైనా, అమెరికా, చిలీ నేతల్ని మిలీ దుమ్మెత్తిపోశారు. ఇక, సర్కారు వద్దే డాలర్లు లేని వేళ దేశ కరెన్సీ స్థానంలో డాలర్లను ప్రవేశపెడతాననడం ఆచరణ సాధ్యం కాని పని. ఏ కొద్దిగా ప్రయత్నించినా అది మరో సంక్షోభానికి తెర తీస్తుంది.

అర్జెంటీనా సంగతి అటుంచితే, మిలీ విజయవార్త మిగతా ప్రపంచానికీ శుభవార్తేమీ కాదు. అందుకు అనేక కారణాలు. టీవీ ప్రముఖుడిగా తెచ్చుకున్న పేరును ఆయన రాజకీయాల్లో మదుపు పెట్టారు. రెచ్చగొట్టే మాటలు, మితిమీరిన హావభావ విన్యాసాలతో ముందుకు సాగుతున్నారు. సుమారు అయిదేళ్ళ క్రితం రాజకీయాల్లోకి వచ్చిన ఈ స్వేచ్ఛావాది ప్రపంచ వాతావరణ మార్పు ఓ పెద్ద సామ్యవాద అబద్ధం అంటారు. ప్రపంచవ్యాప్తంగా అతివాదులకు నచ్చే ఆ మాటల్ని ఐరోపా లాంటివి స్వాగతిస్తున్నాయి. విజేత మిలీని తక్షణం అభినందించిన వారి జాబితాలో అమెరికా మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, బ్రెజిల్ మాజీ అధ్యక్షుడు జెయిర్ బొల్సొనారో తదితరులు ఉండడం గమనార్హం. అమెరికాలో ట్రంప్ హయాంలో, బ్రెజిల్‌లో బొల్సొనారో ఏలుబడిలో జరిగిందేమిటో అందరికీ తెలిసిందే, చూసినదే. మరి, స్నేహితుల్ని బట్టి స్వభావం తెలుస్తుందన్న దాన్ని బట్టి రానున్న రోజుల్లో మిలీ ఎలాంటి పోకడలు పోగలరో ఇట్టే అర్థం చేసుకోవచ్చు. వ్యవస్థలతో నిత్యం పోరాడే అధ్యక్షుడి వల్ల అర్జెంటీనా ప్రజాస్వామ్యం మరింత బలహీనపడే ముప్పుంది.

ఎన్నికల ప్రచార సమయంలో రంపం చేతబట్టి, ఖర్చునూ, కష్టాల్నీ కోసేస్తానని మిలీ చెబుతూ వచ్చారు. విజయోత్సవ ప్రసంగంలోనూ దేశంలో 'అంచెలంచెలుగా కాక సమూలంగా మార్పు తెస్తా'నని వాగ్దానం చేశారు. అనుభవమే కాదు... భావోద్వేగాలపై అదుపు కానీ, పార్లమెంట్‌లో మెజారిటీ కానీ లేని మిలీ ఏం చేయగలుగు తారు, ఎంతకాలం నిలబడగలుగుతారన్నది సందేహమే! కొద్దికాలమే పదవిలో ఉన్నా దేశానికి నష్టం భారీగా ఉండవచ్చని పలువురి భయం. అసలు అర్జెంటీనాలో ప్రజాస్వామ్యం బీటలు వారుతోందని ఇప్పటికి మూడేళ్ళుగా అమెరికా, బ్రెజిల్ హెచ్చరిస్తూనే ఉన్నాయి. మిలీ హయాంలో ఆ భయాలన్నీ నిజమైతే, ఆ దేశానికి అంతకన్నా విషాదం మరొకటి ఉండదు. మాటల్లో, చేష్టల్లో ట్రంప్‌కు తీసిపోని మిలీని అంతా 'ఎల్‌లోకో' (పిచ్చివాడు) అంటుంటారు. ప్రజాస్వామ్య దేశంలో ప్రజాస్వామ్యం పక్కకుపోయి, అధికారం పిచ్చోడి చేతిలో రాయిగా మారితే కష్టమే! కారణాలేమైనా ఇది మెజారిటీ అర్జెంటీనా పౌరులు కోరి తెచ్చుకున్న కొరివి!!

రేపటి నగరాలను నిర్మించేదెలా?

అభిప్రాయం



సోలమన్ ఆరోక్యరాజ్

ప్రపంచవ్యాప్తంగా జీడీపీలో దాదాపు 80 శాతం వాటా సమకూరుస్తూ నగరాలు ప్రధాన ఆదాయ సముపార్జన కేంద్రాలుగా మారుతున్నాయి. భారతదేశంలో కూడా ఇందుకు భిన్నమైన పరిస్థితులు లేవు. దేశంలోని ముంబై, ఢిల్లీ వంటి నగరాలు ప్రపంచంలోని కొన్ని దేశాల కంటే అధికంగా జీడీపీని సమకూరుస్తున్నాయి. మన నగరాలను అభివృద్ధి పథంలో నిలపడానికి కొత్తగా మౌలిక సదుపాయాలను ఏర్పాటు చేయడంతోపాటు ఇప్పటికే ఉన్న సదుపాయాలను మరింత మెరుగుపరచాల్సిన అవసరం ఉంది. పట్టణ మౌలిక సదుపాయాలకు నిధులు సమకూర్చడంలో ప్రభుత్వాలకున్న పరిమితుల దృష్ట్యా ప్రైవేటు పెట్టుబడులను సమీకరించడం నేడు అనివార్యంగా మారింది. విశాఖపట్నం లాంటి నగరాలు మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేసుకోవడానికి వినూత్న ఆదాయ నమూనాలను విజయవంతంగా వినియోగించుకుంటున్నాయి.

2036 నాటికి భారతదేశంలోని నగరాల్లో నివసించే జనాభా 60 కోట్లకు చేరుకుంటుందని ఒక అంచనా. ఈ స్థాయిలో జనాభా పెరుగుదల మంచి అవకాశాలను సృష్టించడంతో పాటు లక్షలాది మంది జనాభాకు అనుగుణంగా పౌర సేవలు విస్తరించడం, పౌరులకు మెరుగైన జీవనానికి అనువైన పరిస్థితులను కల్పించడం ప్రభుత్వానికి ఒక సవాలు కానుంది. అందువల్ల భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా పట్టణ మౌలిక సదుపాయాలను సిద్ధం చేయడానికి మనం గణనీయంగా వనరులను కేటాయించాల్సిన అవసరం ఉంది.

ఈ అవసరాన్ని గుర్తించిన భారత జీ20 అధ్యక్షత 'ఫైనాన్సింగ్ సిటీస్ టుమారో: సస్టెయినబుల్, ఇంక్లూజివ్ అండ్ రజిలెంట్' అనే థీమ్‌ను ఎంపిక చేసుకుంది. అందుకనుగుణంగా నగరాల్లో స్థిరమైన మౌలిక సదుపాయాల పెట్టుబడులకు అనువైన వాతావరణాన్ని ఏర్పాటు చేయడంలో అభివృద్ధి చెందిన, అభివృద్ధి చెందుతున్న దేశాల మధ్య పరస్పర అవగాహనను పెంపొందించడానికి న్యూఢిల్లీ లీడర్స్ డిక్లరేషన్ పేరుతో 'ఫైనాన్సింగ్ సిటీస్ ఆఫ్ టుమారో' ఆవిర్భావానికి కొన్ని సూత్రాలను ఆమోదించారు.

పట్టణ మౌలిక సదుపాయాలకు నిధులు సమకూర్చడంలో ప్రభుత్వాలకున్న పరిమితుల దృష్ట్యా ప్రైవేటు పెట్టుబడులను సమీకరించడం నేడు అనివార్యంగా మారింది. ఇందుకనుగుణంగా స్థిరమైన, సమ్మిళిత మౌలిక సదుపాయాలకు నిధులు సమకూర్చుకోవడానికి నగరాలకు మార్గనిర్దేశం చేసే విధంగా భారత్ అధ్యక్షతన జరిగిన జీ20 కొన్ని నివేదికలను ప్రకటించింది. ఈ వ్యూహంలో పట్టణ ప్రణాళిక సంస్కరణలు, సొంత ఆదాయ వనరులను పెంచుకోవడం, పెట్టుబడి సామర్థ్యాన్ని పెంపొందించుకోవడం, నగరాల రుణ సామర్థ్యాన్ని మెరుగుపరచుకోవడం, గ్రీన్, సోషల్ మరియు సస్టెయినబుల్ బాండ్లు వంటి వినూత్న ఫైనాన్సింగ్ సాధనాలను ఉపయోగించుకుని స్థిరమైన పెట్టుబడి ప్రాజెక్టులను నిర్విరామంగా సాధించడం, నియంత్రణ వాతావరణాన్ని అందుబాటులో ఉంచడం, ఏఐ, సామర్థ్యాల పెంపు, సంస్థాగత సంసిద్ధత వంటి సాధనాలను ఉపయోగించుకోవడం వంటివి ప్రధానాంశాలుగా ఉన్నాయి.

భారతదేశంలోని అనేక నగరాలు వినూత్న ఆదాయ వనరుల సృష్టి, పెట్టుబడి అవకాశాలు సుసాధ్యమని నిరూపించాయి. మధ్యప్రదేశ్‌లోని రేవా మునిసిపల్ కార్పొరేషన్ (ఆర్‌ఎంసీ) మౌలిక సదుపాయాల కోసం సగటున ఏటా రూ. 350 కోట్లు ఖర్చు చేస్తోంది. ఇందులో కేవలం 34 శాతం మాత్రమే మున్సిపాలిటీ సొంత ఆదాయ వనరుల నుండి వస్తుంటే, మిగిలినది కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుండి వివిధ పథకాలు మరియు గ్రాంట్ల ద్వారా సమకూరుతోంది. మౌలిక వసతులకు సొంత ఆదాయం నుండి ఇంత తక్కువ మొత్తంలో



ఖర్చు చేస్తున్నప్పటికీ, పట్టణ భూభాగపు రీ–డెన్సిఫికేషన్ ఆధారంగా వ్యూహాత్మక పట్టణ ప్రణాళికతో న్యూ రేవా బస్ స్టాండ్ వంటి మౌలిక సదుపాయాల ప్రాజెక్టులను పీపీపీ(ప్రభుత్వ ప్రైవేటు భాగస్వామ్యం) విధానం ద్వారా విజయవంతంగా అమలు చేసింది. న్యూ రేవా బస్ స్టాండ్ ప్రాజెక్టులో 3.5 ఎకరాల ఖాళీ ప్రదేశాన్ని వాణిజ్య సముదాయంతో కూడిన బస్ స్టాండ్‌గా తీర్చిదిద్దడం ద్వారా, మున్సిపాలిటీకి రూ. 10.5 కోట్ల ప్రీమియంతో పాటు, ఏడాదికి రూ. 35 లక్షల అద్దె లభిస్తోంది.

భారతదేశంలోని ఇతర నగరాలు కూడా పట్టణ మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేసుకోవడానికి వినూత్న ఆదాయ నమూనాలను విజయవంతంగా వినియోగించుకుంటున్నాయి. గ్రేటర్ విశాఖపట్నం మున్సిపల్ కార్పొరేషన్ (జీవీఎంసీ) వ్యర్థ జలాలను శుద్ధి చేసి ప్రైవేట్ రంగ భాగస్వామ్యంతో పరిశ్రమల వినియోగానికి నీటిని సరఫరా చేయడం ద్వారా ఏటా సుమారు రూ. 30 కోట్ల అదనపు ఆదాయాన్ని ఆర్జిస్తోంది. ప్రాజెక్టు నిధుల కోసం జీవీఎంసీ పన్నుల వసూళ్లు, సేవా పంపిణీ ప్రమాణాలను స్థిరంగా ప్రదర్శించడం ద్వారా రుణ అర్హతలను మెరుగుపరుచుకుని 'ఏఏ' క్రెడిట్ రేటింగ్‌ను సాధించింది. అదే విధంగా సూరత్ నగరం కూడా పారిశ్రామిక పునర్వినియోగం కోసం శుద్ధి చేసిన వ్యర్థ నీటిని విక్రయించడం ద్వారా 2022 ఆర్థిక సంవత్సరంలో రూ.140 కోట్ల కొత్త ఆదాయ వనరులను సృష్టించుకుంది.

స్థిరమైన ఆర్థిక వనరుల సేకరణలో పేరుగాంచిన ఘజియాబాద్ భారతదేశంలో రూ. 150 కోట్ల మున్సిపల్ గ్రీన్ బాండ్లను విడుదల చేసిన మొదటి యూఎల్‌బీ (అర్బన్ లోకల్ బాడీ)గా నిలిచింది. మెరుగైన పట్టణ ప్రణాళిక, వినూత్న ఆర్థిక నమూనాల ద్వారా మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేసుకుని తమ పౌరుల జీవితాలను మెరుగుపరచడానికి చిన్న నగరాలు కూడా ప్రైవేటు పెట్టుబడిదారులను ఆకర్షించగలవని పైన పేర్కొన్నవి ఉదాహరణగా నిలుస్తున్నాయి.

జీ20 వెలువరించిన పత్రాలు నాణ్యమైన మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేసుకోవడానికి మన నగరాలకు మార్గదర్శకంగా ఉపయోగపడుతుంటే, భారతదేశ అనుభవాలు ప్రపంచ మౌలిక సదుపాయాల ఎజెండాను నిర్దేశించడానికి ఇతోధికంగా దోహదపడుతున్నాయి. అటల్ మిషన్ ఫర్ రీజువనేషన్ అండ్ అర్బన్ ట్రాన్స్‌ఫార్మేషన్ (అమృత్), స్మార్ట్ సిటీస్ మిషన్, హౌసింగ్ ఫర్ ఆల్ (పీఎంఏవై), మెట్రో రైల్ ప్రాజెక్టులు, ట్రాన్సిట్ ఓరియెంటెడ్ డెవలప్‌మెంట్, స్మార్ట్ సిటీ మిషన్‌లో ఇంటిగ్రేటెడ్ కంట్రోల్ అండ్ కమాండ్ సెంటర్లు, వివిధ నగరాలు జారీ చేసిన మునిసిపల్ బాండ్లు, 2018లో రూపొందించిన భారతదేశ నేషనల్ అర్బన్ పాలసీ ఫ్రేమ్‌వర్క్ (ఎన్‌యూపీఎఫ్) అమలు నుండి నేర్చుకున్న పాఠాలు... గ్రూపు ఆలోచనలను సుసంపన్నం చేశాయి. అలాగే వాటిని పరస్పరం పంచుకోవడం వివిధ దశలలో అభివృద్ధిలో ఉన్న నగరాల ఆకాంక్షలకు అనుగుణంగా సుస్థిర ఆర్థిక వనరుల సమీకరణకు ఇతర మార్గాలను ఉపయోగించుకునేందుకు మార్గదర్శకంగా నిలిచాయి.

సుస్థిర ఆర్థిక వనరుల సమీకరణకు ఇతర మార్గాలను ఉపయోగించుకునే దిశగా ముందుకు వెళ్లడానికి భారతీయ నగరాలు తమ సంస్థాగత సామర్థ్యాన్ని పెంపొందించుకోవడం, డిజిటైజ్డ్ అకౌంటింగ్ వ్యవస్థను అవలంబించడం, పెట్టుబడి పెట్టదగిన ప్రాజెక్టుల పైప్ లైన్‌ను కలిగి ఉండటం, వాటి విశ్వసనీయత, ఆదాయ సేకరణ సామర్థ్యాన్ని మెరుగుపరుచుకోవడం అత్యవసరం. పట్టణ మౌలిక సదుపాయాల ప్రాజెక్టుల వైపు ప్రైవేట్ మూలధనాన్ని ఆకర్షించడానికి అనుకూలమైన వాతావరణాన్ని సృష్టించడం, పట్టణ మౌలిక సదుపాయాల అభివృద్ధిని వేగవంతం చేయడంలో ఈ పరివర్తన కీలకం.

వ్యాసకర్త జాయింట్ సెక్రటరీ, కేంద్ర ఆర్థిక శాఖ, భారత ప్రభుత్వం
(వ్యాసంలోని అభిప్రాయాలు రచయిత వ్యక్తిగతం)

సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

దేనికి వేసిందో?



తెలంగాణలో మొదటి ఓటు పడిన విషయం మీకు తెలుసా? ఎన్నికల సంఘం కల్పించిన సౌకర్యం అయిన పోస్టల్ బ్యాలెట్లను సీనియర్ సిటిజన్ల నుంచి సేకరిస్తున్నారు. హైదరాబాద్‌లో 91 ఏళ్ల వృద్ధురాలు ఓటేసింది.

– శ్రీరామ్ కర్రి, సంపాదకుడు

సాధారణ మనిషా?



నవంబర్ 21న వెళ్లి పోయిన డా॥ ఎస్.ఎస్.బద్రీనాథ్‌కు మనం నివాళులు అర్పించాలి. చెన్నైలోని గొప్ప వైద్యసంస్థ శంకర నేత్రాలయ వ్యవస్థాపకుడిగా ఆయన భారత్‌లో నేత్ర సంరక్షణ రూపురేఖలు మార్చేశారు. చివరి వరకూ తనను తాను 'సాధారణ మనిషి'గా పరిగణించుకున్న ఆయన, మరణానంతరం తన కోసం దీర్ఘ కర్మకాండలు జరపొద్దనీ, ఆసుపత్రి జనం ఒక్క సెకను కూడా పని ఆపొద్దనీ కోరారు.

– ఎన్. రామ్, సంపాదకుడు

సమానం



'రంగు మనుషులు' (పీపుల్ ఆఫ్ కలర్ – అన్నిరకాల శ్వేతేతర మనుషులు) అనే పదం వాడడం ఆపాల్సిన సమయం ఇదే. చర్మం రంగును బట్టి మనుషులను వర్గీకరించడం అర్థం లేనిది. దీనివల్ల తెల్లవాళ్లను, తెల్లవాళ్లు కానివాళ్లతో అనవసరంగా వ్యతిరేకంగా ఉంచుతుంది. యూఎస్‌లో మనం అందరం అమెరికన్లమే. అంతే!

– వివేక్ రామస్వామి, అమెరికా నాయకుడు

తగిన కూతురు



కాలేజీలో ఒకసారి, నా స్నేహితురాలిని ఇబ్బంది పెట్టడానికి ప్రయత్నిస్తున్న కొందరు అబ్బాయిల మీదికి దాదాపుగా చితక్కొట్టేంత కోపంతో వెళ్లాను. ఈ కథను మా అమ్మ, స్నేహితుల నుంచి పదేపదే విన్నదేమో... నా కూతురి మనసులో నాటుకు పోయింది. చరిత్రను పునరావృతం చేయడానికి తైక్వాండో నేర్చుకుంటోంది.

– అనుపమ దాల్మియా, కంటెంట్ క్రియేటర్

చదువే ముందు...



భారత్‌లోని మొత్తం ముస్లింలలో కేవలం 2.75 శాతం మంది మాత్రమే పట్టభద్రులు. అంతకన్నా ఎక్కువ చదువుకున్న వాళ్లు. 43 శాతంతో భారత ముస్లింలలో అత్యధిక నిరక్షరాస్యత ఉంది. మనకు కావాల్సిన తక్షణ విప్లవం... విద్య.

– శెహలా రషీద్, యాక్టివిస్ట్

రంగస్థల ప్రతిభా యశస్వి!

నాటక రంగంలో మూడు దశాబ్దాల పాటు ఒక సంచలన చరిత్ర సృష్టించిన గొప్ప నటుడు, దర్శకులు, వక్త నటరాజు కుప్పిలి వెంకటేశ్వరరావు. 1923 నవంబరు 20వ తేదిన పశ్చిమ గోదావరి జిల్లా చాగల్లులో ఆయన జన్మించారు. కళాశాల విద్యార్థిగానే నట ప్రవేశం చేశారు. 'ఆంధ్ర ప్రజానాట్య మండలి' విధా నాలన ఆపోశన పట్టిన కె. వెంకటేశ్వరరావు ఆ ఒరవడినే కొనసాగారు. ఆయన నటించే సన్నివేశంలో ఉన్న తోటి నటులు ఆయన నటనలో లీనమైపోయిన విధానానికి అబ్బురపడుతూ తమ డైలాగులు మరచిపోయి తడబడిన సందర్భాలెన్నో ఉన్నాయని శిష్యులంటారు. ఆయన మూడు దశాబ్దాల నాటక రంగ చరిత్రను పెద్ద కాన్వాస్‌పై చిత్రించాల్సి వుంది. చాట్ల శ్రీరాములు, దేవదాస్ కనకాల, గొల్లపూడి, కొత్తుర్తి భాస్కరరావు, రుద్రరాజ్ కుమార్ రాజా, గణేష్‌పాత్రో, ఎస్.కె. మిశ్రో, సి.ఎ. శివ రామిరెడ్డి వంటి ఎందరో ఆయన శిష్యులు ఆయన వారసత్వాన్ని పుణికిపుచ్చుకొన్నారు.



నటరాజు కుప్పిలి వెంకటేశ్వరరావు

మచిలీపట్నంలో 1955లో 'ఆంధ్రనాటక కళాపరిషత్' ఆధ్వర్యంలో నాటిక పోటీలు జరిగాయి. ఆత్రేయ రచించిన 'నా బాబు' నాటికలో నటనకు గాను 'ఉత్తమ నటుడు' బహుమతి గెలుచుకోవడంతో, ఆయన విజయపరంపర మొదలైంది. 1958లో ఆత్రేయ సాన్నిహిత్యం వలన, ఆయన నిర్మించిన 'వాగ్దానం' చిత్రానికి సహాయ దర్శకునిగా పనిచేయడమే కాక, ఒక పాత్రలో నటించారు. మళ్ళీ 1961లో 'ఇద్దరు మిత్రులు' చిత్రంలో నటించారు. కానీ, విషాదం ఏమిటంటే, వెంకటేశ్వరరావు 'స్వరపేటికకు' అసూయ, ఆందోళన చెందిన ఒక నటుడి ఒత్తిడి మేరకు వెంకటేశ్వరరావు పాత్రను 'మూగవాణ్ణి' చేసేశారు. ఆనాటి ఆ దుర్మార్గం నేపథ్యం బాగా తెలిసినవారు ఆ సంఘటన గురించి చెబుతారు. ఆ తర్వాత 1972లో 'కన్నెవయసు' చిత్రంలో అద్భుతంగా నటించారు. విజయవాడలో 'ర.స.న. సమాఖ్య' స్థాపించడం ద్వారా ఎందరినో గొప్ప నటులుగా తీర్చిదిద్దారు. అలాగే, న్యూఢిల్లీలో నటశిక్షణ కోసం వెళ్ళిన ఆయన అక్కడ 'దక్షిణ భారత నటీనట సమాఖ్య' స్థాపించారు.

వెంకటేశ్వరరావు నట, దర్శక వైదుష్యానికి ఒక 'అకడమిక్ స్టేటస్' కల్పించినవారు డా॥ కె.వి. గోపాలస్వామి. ఆంధ్రవిశ్వ విద్యాలయం 'థియేటర్ ఆర్ట్స్' విభాగంలో స్టేజి డైరెక్టరుగా ఆయన్ని నియమించింది వారే. దాంతో, ఎందరో ఔత్సాహికులను, నటన, దర్శకత్వంలో తీర్చిదిద్దిన అధ్యాపకునిగా ఆయన నాటక రంగ చరిత్రలో నిలిచిపోయారు. ఎన్నో నాటక సంస్థలు ప్రారంభించి, ఉన్నతంగా తీర్చిదిద్దారు. వాటిలో చివరిది 'బహురూప నటసమాఖ్య' (1971). ప్రముఖ నాటక రచయిత మాజీ మంత్రివర్యులు దాడి వీరభద్రరావు, 'నటరాజ కె.వెంకటేశ్వరరావు నటీ, నటసమాఖ్య' పేరుతో నాటక సంస్థను నెలకొల్పారు. ఆ సమాజం ద్వారా తాను రచించిన సంచలన నాటక, నాటికలు, రాష్ట్ర రాష్ట్రేతర ప్రాంతాలలో ప్రదర్శించి, కేవీ ఆశీస్సులందుకున్నారు.

1979లో విశాఖవాసి, స్వర్గీయ బి.ఎస్. చలం (నటుడు, నాటక పోషకులు) 'నటరాజ కె.వెంకటేశ్వరరావు స్మారక నాటక కళా పరిషత్' స్థాపించారు. నటుడు, దర్శకులు పి. శివప్రసాద్ 'కె.వి. మెమోరియల్ ఆర్ట్స్' సంస్థను నెలకొల్పారు. ఇంతటి ఘనత వహించిన ఆ నటరాజ మూర్తికి తెలుగు నాటకరంగం నిండు నివాళులర్పిస్తోంది.

– బి.వి. అప్పారావు । 93470 39294
(రంగస్థల దిగ్గజం కుప్పిలి వెంకటేశ్వరరావు శతజయంతి ఉత్సవాల సందర్భంగా)

సమాఖ్య వ్యవస్థకు ఎంతటి దుర్గతి!

అభిప్రాయం



సి. రామచంద్రయ్య

గవర్నర్ల వ్యవహార శైలి కారణంగా దేశానికి సమాఖ్య వ్యవస్థను ఇచ్చిన రాజ్యాంగం స్ఫూర్తి దెబ్బతింటోంది. భారత రాజ్యాంగం ఆర్టికల్ 153 ప్రకారం ప్రతి రాష్ట్రానికి ఒక గవర్నర్ ఉండాలి. ఆర్టికల్ 155 ప్రకారం గవర్నర్ నియామకాన్ని భారత రాష్ట్రపతి చేస్తారు. ఆర్టికల్ 156 ప్రకారం రాష్ట్రపతి అనుగ్రహం ఉన్నంత వరకు గవర్నర్ పదవిలో ఐదేళ్లపాటు కొనసాగుతారు. దీనినిబట్టి ఎవరికైనా ఏమి అర్థమవుతుంది? గవర్నర్ పదవిలో ఉండే వారెవరూ కేంద్ర ప్రభుత్వానికి దాసులుగా ఉండాల్సిన అవసరం లేదనేకదా? ఇందుకు సంబంధించి 1979 మే 4న సుప్రీం కోర్టు ఓ కీలకమైన తీర్పు ఇచ్చింది. ఒక యజమాని (ఎంప్లాయర్)కీ, ఒక ఉద్యోగి (ఎంప్లాయీ)కీ ఉండే సంబంధం కేంద్ర ప్రభుత్వానికీ, గవర్నర్‌కూ మధ్య ఉండదనీ, కేంద్ర ప్రభుత్వ అధీనంలో గవర్నర్ ఉండరనీ సుప్రీం కోర్టు 'డాక్టర్ రఘుకుల్ కేసు'లో స్పష్టంగా చెప్పింది. అంటే, 'గవర్నర్' అన్నది ఓ రాజ్యాంగబద్ధమైన పదవి. ఆ స్థానంలో ఉండే వారు రాజ్యాంగబద్ధమైన విధులను మాత్రమే నిర్వహించాలి. కానీ, ఆచరణలో అలా జరుగుతోందా?

గవర్నర్ల వ్యవస్థను కేంద్రంలో ఏ పార్టీ అధికారంలో ఉంటే, వారు దుర్వినియోగం చేసిన దృష్టాంతాలు అనేకం ఉన్నాయి. గవర్నర్ల నియామకంలోనూ పాటించవలసిన మార్గదర్శకాలనూ, విధివిధానాలనూ తుంగలో తొక్కి ఇష్టానుసారంగా వ్యవహరించడం గత ఏడున్నర దశాబ్దాలుగా కనిపిస్తోంది. గవర్నర్‌ను కీలుబొమ్మగా చేసుకొని ఆయా రాష్ట్రాలలో ఆర్టికల్ 356ను దుర్వినియోగ పరిచి ప్రజా ప్రభుత్వాలను కూలగొట్టిన సంఘటనలు అనేకం. కేరళ కమ్యూనిస్టు యోధుడు ఇఎంఎస్ నంబూద్రిపాద్ మొదలుకొని ఆంధ్రప్రదేశ్‌లో ఎన్.టి. రామారావు వరకు గవర్నర్ బాధితులు ఎందరో ఉన్నారు.

గవర్నర్ వ్యవస్థను కేంద్ర ప్రభుత్వం దుర్వినియోగపర్చడం శ్రీమతి ఇందిరా గాంధీ దేశ ప్రధానిగా ఉన్నప్పుడు ఎక్కువగా జరిగింది. కేంద్రం– రాష్ట్రాల మధ్య ఉండే సంబంధాల సమతుల్యతపై అధ్యయనం చేసి నివేదిక అందించేందుకు 1983లో ఏర్పాటయిన జస్టిస్ రాజేందర్ సింగ్ సర్కారియా ఐదేళ్ల తర్వాత సమర్పించిన నివేదికలో గవర్నర్ల నియామకం, వారి పనితీరుపై స్పష్టమైన సూచనల్ని చేసింది. నిజానికి సర్కారియా కమిషన్ కంటే ముందు... 1969లో అప్పటి తమిళనాడు రాష్ట్ర ప్రభుత్వం కేంద్ర–రాష్ట్ర సంబంధాల మెరుగుదలపై నివేదిక ఇవ్వాలని రాజమన్నార్ కమిటీని ఏర్పాటుచేసింది. ఆ కమిటీ చాలా స్పష్టంగా 'గవర్నర్ నియామకంలో తప్పనిసరిగా రాష్ట్ర క్యాబినెట్‌తో సంప్రదింపులు జరపాలి' అని చెప్పింది. కానీ, ఈ కమిటీ రికమండేషన్లను కేంద్రం పరిగణనలోకి తీసుకోలేదు. ఆ తర్వాత దాదాపు 2 దశాబ్దాల అనంతరం, సర్కారియా కమిషన్ కూడా ఇదే సిఫార్సు చేసింది. కానీ, కేంద్రంలో ఎవరున్నా గవర్నర్లను ఏకపక్షంగా నియమించే సంప్రదాయమే కొనసాగుతోంది.

ఇటీవలి కాలంలో పంజాబ్, తమిళనాడు, కేరళ, మహారాష్ట్ర, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాల గవర్నర్ల వ్యవహారశైలి దుమారం రేపుతోంది. కొన్ని నెలల క్రితం తమిళనాడు గవర్నర్ ఆర్.ఎన్. రవి ఆ రాష్ట్ర ప్రభుత్వం రూపొందించిన గవర్నర్ ప్రసంగ పాఠానికి సొంతంగా మార్పులు చేర్పులు చేసి అసెంబ్లీలో ప్రసంగించడం కలవరం రేపింది.



అలాగే, కొన్ని బిల్లుల్ని ఆమోదించకుండా తిప్పిపంపారు. ఇక పంజాబ్ గవర్నర్ అయితే, రాష్ట్ర అసెంబ్లీని సమావేశపర్చాలని ఆ రాష్ట్ర క్యాబినెట్ తీర్మానించినా అందుకు ఆయన అనుమతి ఇవ్వలేదు. దీనిపై పంజాబ్ ప్రభుత్వం విధిలేని పరిస్థితులలో సర్వోన్నత న్యాయస్థానం గడప తొక్కింది. 'శాసనసభ నిర్వహణకు సంబంధించిన అధికారాలు అసెంబ్లీ స్పీకర్‌కు ఉండగా, వాటి నిర్వహణలో మీకు అభ్యంతరం ఏమిటి' అని పంజాబ్ గవర్నర్ భన్వర్‌లాల్ పురోహిత్ తీసుకున్న చర్యను సుప్రీం కోర్టు తప్పు పట్టింది. అంతేకాదు... 'మీరు నిప్పుతో చెలగాటమాడుతున్నారు' అని తీవ్రస్వరంతో సుప్రీం కోర్టు గవర్నర్ పట్ల తన అసంతృప్తిని వ్యక్తం చేసింది.

రాష్ట్ర ప్రభుత్వానికి, గవర్నర్‌కు మధ్య ఉండాల్సిన సుహృద్భావ వాతావరణం స్థానంలో రాజకీయ వైరం నెలకొని వారు ఎడమొఖం పెడమొఖంగా మారిన ఉదంతాలు గతంలో కోకొల్లలు. గవర్నర్ల రాజ్యాంగ అతిక్రమణలపై పార్లమెంట్ ఉభయ సభలలో ఎన్నో సందర్భాలలో వాడీ వేడీగా చర్చోపచర్చలు జరిగాయి. గవర్నర్ వ్యవస్థ ఆరోవేలు లాంటిదని, దానిని రద్దు చేయాలనే డిమాండ్ సైతం వినిపించింది. ఆశ్చర్యం ఏమంటే, గవర్నర్ వ్యవస్థ వల్ల లోగడ ఇబ్బందులు ఎదుర్కొన్న భారతీయ జనతా పార్టీ... కేంద్రంలో అధికారంలోకి వచ్చాక 'మేము సైతం' అంటూ కాంగ్రెస్ పార్టీ తరహాలోనే గవర్నర్ వ్యవస్థను దుర్వినియోగపర్చడమే చర్చనీయాంశం. అటల్ బిహారీ వాజ్‌పేయి ప్రధానిగా ఉండగా ఇటువంటి వివాదాలు చేటు చేసుకొన్న దాఖలాలు లేవుగానీ, 2014లో నరేంద్రమోదీ నేతృత్వంలో అధికారం చేపట్టిన ఎన్డీఏ ఈ తొమ్మిదిన్నరేళ్ల పాలనలో గవర్నర్లను తమ ఇష్టానుసారం బీజేపీయేతర ప్రభుత్వాలపై సవారీ చేయిస్తున్న తీరు ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తోంది. ముఖ్యంగా బిల్లుల విషయంలో తమకులేని అధికారాలను ఆపాదించుకొని గవర్నర్ వాటిని ఆమోదించకుండా తొక్కిపెట్టడంతోనే ఆ యా రాష్ట్ర ప్రభుత్వాలు సర్వోన్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించాయి. కొందరు గవర్నర్లు పోషిస్తున్న రాజ్యాంగ వ్యతిరేక చర్యల్ని సర్వోన్నత న్యాయస్థానంలో ప్రశ్నించేందుకు రాష్ట్ర ప్రభుత్వాలు పూనుకోవడం దేశంలో సమాఖ్య వ్యవస్థకు పట్టిన దుర్గతిగా రాజ్యాంగ నిపుణులు అభివర్ణించడంలో అతిశయోక్తి ఏమీ లేదు.

ఈశాన్య రాష్ట్రాలకు సంబంధించి కొన్ని అంశాలలో గవర్నర్లకు రాజ్యాంగం కొన్ని ప్రత్యేక అధికారాలు కట్టబెట్టిన మాట నిజం. గవర్నర్ తన విచక్షణాధికారాలు ఉపయోగించి నిర్ణయాలు తీసుకొనే స్వేచ్ఛ రాజ్యాంగంలోని 6వ షెడ్యూల్ ప్రకారం దఖలు పడింది. కానీ, రాష్ట్ర క్యాబినెట్ ఆమోదించిన బిల్లులను సుదీర్ఘకాలం ఆమోదించకుండా లేదా తిప్పిపంపకుండా తొక్కి పెట్టడానికి గవర్నర్‌కు హక్కు లేదు. కాగా, తమ ప్రభుత్వానికి సహకరించని గవర్నర్ పట్ల రాష్ట్ర ప్రభుత్వాలు అనుచితంగా ప్రవర్తిస్తూ కక్ష తీర్చుకొంటున్న ఉదంతాలు కూడా చోటుచేసుకొంటున్నాయి. గవర్నర్‌కు ఇవ్వాల్సిన ప్రోటోకాల్ పాటించకపోవడం మొదలుకొని, అసలు గవర్నర్ లేకుండానే శాసన సభ సమావేశాలు నిర్వహించుకొనేందుకు కొన్ని రాష్ట్ర ప్రభుత్వాలు సిద్ధపడుతున్నాయి.

ఈ మొత్తం వ్యవహారం భారతదేశ ప్రజాస్వామ్యానికి తలవంపులు తెస్తున్నది. ప్రజాస్వామ్య విలువల పతనంలో దేశం పాతాళంలోకి శీఘ్రగతిన ప్రయాణిస్తున్న వేళ... దేశం శాస్త్ర సాంకేతిక రంగాలలో అద్భుతంగా ముందుకు సాగిపోతోందనీ; చంద్రయాన్, సూర్యయాన్‌లతో ప్రపంచంలోనే భారతదేశ ప్రతిష్ఠ ఆకాశాన్నంటుతోందనీ కేంద్రం జబ్బలు చరుచుకొంటే ఉపయోగం ఏమిటి?

వ్యాసకర్త ఆంధ్రప్రదేశ్ శాసన మండలి సభ్యులు

గ్రహం అనుగ్రహం

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, దక్షిణాయనం, శరదృతువు, కార్తీక మాసం, **తిథి:** శు.దశమి రా.10.31 వరకు, తదుపరి ఏకాదశి, **నక్షత్రం:** పూర్వాభాద్ర సా.6.55 వరకు, తదుపరి ఉత్తరాభాద్ర, **వర్జ్యం:** రా.3.56 నుండి 5.25 వరకు (తెల్లవారితే గురువారం), **దుర్ముహూర్తం:** ప.11.21 నుండి 12.07 వరకు, **అమృత ఘడియలు:** ఉ.11.31 నుండి 12.56 వరకు ; **రాహుకాలం:** ప.12.00 నుండి 1.30 వరకు, **యమగండం:** ఉ.7.30 నుండి 9.00 వరకు, **సూర్యోదయం:** 6.11, **సూర్యాస్తమయం:** 5.21.

క్లుప్తంగా...

దుర్గమ్మ ఆదాయం రూ.3.34 కోట్లు



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): విజయవాడ ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న కనకదుర్గమ్మకు భక్తులు కానుకల రూపంలో రూ.3.34 కోట్ల నగదును సమర్పించుకున్నారు. అమ్మవారికి భక్తులు సమర్పించిన కానుకలను మంగళవారం మహా మండపం ఆరో అంతస్తులో లెక్కించారు. మొత్తం 20 రోజులకు రూ.3,34,32,887 నగదు, 935 గ్రాముల బంగారం, 7.328 కిలోల వెండి వచ్చినట్లు ఆలయ ఈవో కేఎస్ రామారావు తెలిపారు. ఈ–హుండీ ద్వారా రూ.89,817 విరాళాలను దేశ, విదేశాల నుంచి భక్తులు అమ్మవారికి సమర్పించారని చెప్పారు.

23 నుంచి కార్తీకమాస విష్ణు పూజలు

తిరుమల:లోక క్షేమాన్ని కాంక్షిస్తూ కార్తీక మాసంలో తిరుమల వసంత మండపంలో శ్రీమహావిష్ణువుకు సంబంధించిన పూజలు వైఖానస ఆగమబద్ధంగా నిర్వహించాలని టీటీడీ నిర్ణయించింది. 23న మధ్యాహ్నం 3 గంటల నుంచి 4.30 గంటల వరకు విష్ణుసాలగ్రామ పూజ, 24న మధ్యాహ్నం 3 గంటల నుంచి 4.30 గంటల వరకు కైశికద్వాదశి– శ్రీతులసీ దామోదర పూజ, 29న ఉదయం 8.30 గంటల నుంచి 10 గంటల వరకు గోపూజ, డిసెంబర్ 10న మధ్యాహ్నం 3 గంటల నుంచి 4.30 గంటల వరకు ధన్వంతరి జయంతి నిర్వహిస్తారు. శ్రీవేంకటేశ్వర భక్తి చానల్‌లో ఈ పూజా కార్యక్రమాలను ప్రత్యక్ష ప్రసారం చేస్తారు.

ఆఫ్‌లైన్‌లో శ్రీనివాస దివ్యానుగ్రహ హోమం టికెట్లు

తిరుమల: హిందూ సనాతన ధర్మ ప్రచారంలో భాగంగా అలిపిరిలోని సప్త గోప్రదక్షిణ మందిరంలో ఈ నెల 23 నుంచి శ్రీ శ్రీనివాస దివ్యానుగ్రహ విశేష హోమం ప్రారంభించాలని టీటీడీ బోర్డు నిర్ణయించింది. ఇందుకోసం టికెట్ ధర రూ.1000గా ప్రకటించారు. ఒక టికెట్‌పై ఇద్దరిని అనుమతిస్తారు. రోజుకు ఆన్‌లైన్‌లో 50 టికెట్లు, ఆఫ్‌లైన్‌లో 50 టికెట్లు కేటాయిస్తారు. ఆన్‌లైన్ టికెట్లను ఈ నెల 16న టీటీడీ విడుదల చేసింది. మొదటి రోజు హోమం ఆఫ్‌లైన్ టికెట్లను బుధవారం మధ్యాహ్నం వరకు సప్తగోప్రదక్షిణ మందిరం ప్రాంగణంలో జారీ చేస్తారు. ఈ నెల 24వ తేదీ నుంచి ఏరోజుకారోజు టికెట్లు మంజూరు చేస్తారు.

ఏఎన్‌యూ దూరవిద్య పరీక్షా ఫలితాలు విడుదల



ఫలితాలు విడుదల చేస్తున్న వీసీ రాజశేఖర్ తదితరులు

ఏఎన్‌యూ:ఈ ఏడాది ఆగస్టులో నిర్వహించిన బీఏ, బీకాం, బీబీఏ కోర్సుల మొదటి, రెండు, మూడుత సెమిస్టర్ల పరీక్ష ఫలితాలను మంగళవారం నాగార్జున యూనివర్సిటీ వీసీ ఆచార్య పీ రాజశేఖర్ విడుదల చేశారు. ఫలితాలను ఏఎన్‌యూ దూర విద్యాకేంద్రం వెబ్‌సైట్ ద్వారా పొందవచ్చు. రీవాల్యుయేషన్ ఫీజు చెల్లించడానికి డిసెంబరు 2వ తేదీ ఆఖరుగా నిర్ణయించారు. రీవాల్యుయేషన్ ఫీజు ఒక్కో స్క్రిప్టుకు రూ. 770 చెల్లించాలి. ఫలితాల విడుదల కార్యక్రమంలో రెక్టార్ ఆచార్య పి. వరప్రసాద మూర్తి, రిజిస్ట్రార్ ఆచార్య బి. కరుణ, దూరవిద్య కేంద్రం డైరెక్టర్ డాక్టర్ బి. నాగరాజు పాల్గొన్నారు.

శంకర నేత్రాలయ వ్యవస్థాపకుడు బద్రీనాథ్ కన్నుమూత

- వయోభారంతో చెన్నైలో తుదిశ్వాస
- పేదలకు ఉచితంగా వైద్య సేవలు
- సేవలకు గుర్తింపుగా 1996లో పద్మభూషణ్ పురస్కారం
- బద్రీనాథ్ మృతి పట్ల సీఎం స్టాలిన్ సంతాపం

సాక్షి, చెన్నై: కంటి చికిత్సలతో ఎందరో పేదల జీవితాల్లో వెలుగులు నింపిన శంకర నేత్రాలయ వ్యవస్థాపకుడు డాక్టర్ ఎస్.ఎస్.బద్రీనాథ్(83) వయోభారంతో చెన్నైలో మంగళవారం కన్నుమూశారు. 1978లో శంకర నేత్రాలయ పేరిట స్వచ్ఛంద సంస్థను ఆయన ఏర్పాటు చేశారు. చెన్నై నుంగంబాక్కం కేంద్రంగా శంకర నేత్రాలయ ద్వారా అనేక బ్రాంచీలతో ఉచితంగా పేదలకు సేవలు అందించారు. రోజుకు కనీసం తన బృందం ద్వారా 1,200 మందికి చికిత్సలు, వంద మందికి ఆపరేషన్లు చేసేవారు. ఆయన సేవలకు గుర్తింపుగా 1996లో పద్మభూషణ్‌తో కేంద్ర ప్రభుత్వం సత్కరించింది. అలాగే బీసీ రాయ్ అవార్డుతో పాటు అనేక పురస్కారాలు ఆయనను వరించాయి. చెన్నై ట్రిప్లికేన్‌లో 1940 ఫిబ్రవరి 24న బద్రీనాథ్ జన్మించారు. 1962లో మద్రాసు మెడికల్ కళాశాలలో వైద్య కోర్సును పూర్తి చేశారు. అనంతరం అమెరికాలో ఉన్నత విద్యను అభ్యసించారు. 1970లో చెన్నై అడయార్‌లో వాలంటరీ హెల్త్ సర్వీస్ పేరిట సేవాకార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. ఆయన మృతి నేత్ర వైద్య వర్గాల్ని దిగ్భ్రాంతికి గురిచేసింది. తమిళనాడు సీఎం స్టాలిన్‌తో పాటు పలువురు ప్రముఖులు సంతాపం తెలియజేశారు.

విభజన చట్టంలోని అంశాలను త్వరగా అమలు చేయండి


కేంద్ర శాఖలకు కేంద్ర హోంశాఖ కార్యదర్శి సూచన

- పోర్టులు లాంటి ప్రాజెక్టులు రాష్ట్రానికే కాదు దేశానికీ మేలు
- 13వ షెడ్యూల్‌లో ప్రాజెక్టులపై కేంద్ర హోంశాఖ కార్యదర్శి సమీక్ష
- త్వరగా పరిష్కరించాలని కోరిన సీఎస్, రాష్ట్ర ఉన్నతాధికారులు



సాక్షి, అమరావతి: రాష్ట్ర విభజన చట్టంలోని అంశాలను త్వరగా అమలు చేయాలని పలు కేంద్ర ప్రభుత్వ శాఖలకు కేంద్ర హోం శాఖ కార్యదర్శి అజయ్ బల్లా చెప్పారు. విభజన చట్టం 13వ షెడ్యూల్‌లో పేర్కొన్న అంశాల అమలు పురోగతిపై అజయ్ భల్లా అధ్యక్షతన ఢిల్లీలో మంగళవారం ఉన్నతస్థాయి సమావేశం జరిగింది. ఈ సమావేశంలో సంబంధిత కేంద్ర శాఖల అధికారులు, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (సీఎస్) డా.కె.ఎస్.జవహర్ రెడ్డి, వివిధ రాష్ట్ర ప్రభుత్వ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు. రెండు గంటలపాటు జరిగిన ఈ సమావేశంలో అజయ్ భల్లా మాట్లాడుతూ.. 13వ షెడ్యూల్‌లోని అంశాల అమలులో ఏమైనా మినహాయింపులు అవసరమైతే కేంద్ర ఆర్థిక శాఖ, కేంద్ర కేబినెట్ ముందుకు తీసుకురావాలని చెప్పారు. పోర్టులు లాంటి ప్రాజెక్టుల వల్ల రాష్ట్రానికే కాకుండా దేశానికి కూడా మేలు జరుగుతుందని అన్నారు. సోమవారం రాష్ట్ర ప్రభుత్వ అధికారులతో జరిగిన సమావేశంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దిశా నిర్దేశం చేసిన అంశాలను ఈ సమావేశంలో సీఎస్ జవహర్‌రెడ్డి వివరించారు. వాటిని త్వరగా అమలు చేయాలని కోరారు.

రాష్ట్ర ప్రభుత్వం కోరినవివీ..



విశాఖపట్నం మెట్రో రైలు ప్రాజెక్టు పీపీపీ విధానంలో చేపడతామని, ప్రైవేట్ డెవలపర్ 60 శాతం భరిస్తున్నందున వయబులిటీ గ్యాప్ ఫండ్ కింద కేంద్ర ప్రభుత్వం 40 శాతం గ్రాంట్‌గా మంజూరు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం కోరింది. ఈ ప్రతిపాదనను కేంద్ర పట్టణ వ్యవహారాల మంత్రిత్వ శాఖకు సిఫార్సు చేయాలని కేంద్ర హోం శాఖను కోరింది. సెంట్రల్ అగ్రికల్చర్ యూనివర్సిటీ మంజూరు చేయాలని, దుగరాజపట్నం పోర్టు, కడప స్టీల్ ప్లాంట్ నిర్మాణంపై త్వరగా నిర్ణయం తీసుకుని అమలు చేయాలని చెప్పింది. విశాఖపట్నం నుంచి రాయలసీమ ప్రాంతానికి అత్యంత వేగంగా నడిచే హై స్పీడ్ రైల్ కారిడార్ ఏర్పాటు చేయాలని కోరింది. పోలవరం ప్రాజెక్టు సవరించిన అంచనాలకు ఆమోదం, తెలంగాణ నుంచి ఏపీకి రావాల్సిన విద్యుత్ బకాయిలు, మూడు ప్రాంతాల అభివృద్ధికి కేంద్ర సాయం తదితర అంశాలను రాష్ట్ర ప్రభుత్వం సమావేశంలో ప్రస్తావించింది. ఈ అంశాలపై కేంద్ర హోంశాఖ కార్యదర్శి అజయ్ భల్లా సానుకూలంగా స్పందించారు.

ఐదుగురు మావోయిస్టుల లొంగుబాటు



వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ తుహిన్ సిన్హా

పాడేరు రూరల్ (అల్లూరి సీతారామరాజు జిల్లా) : సీపీఐ మావోయిస్టు పార్టీకి చెందిన ఇద్దరు దళ సభ్యులతో పాటు ముగ్గురు మిలీషియా సభ్యులు స్వచ్ఛందంగా లొంగిపోయినట్లు ఎస్పీ తుహిన్ సిన్హా తెలిపారు. మంగళవారం జిల్లా పోలీసు కార్యాలయంలో వివరాలు వెల్లడించారు. ఒడిశా రాష్ట్రం పప్పులూరు దళానికి చెందిన సీపీఐ మావోయిస్టులు కిల్లో త్రినాథ్ అలియాస్ రాజేష్, కిల్లో బాబూరావు అలియాస్ సుత్తి, మిలీషియా సభ్యులు కిల్లో రాజు, వంతాల భగత్ రామ్, పాంగి సాధునో స్వచ్ఛందంగా లొంగిపోయారని ఎస్పీ చెప్పారు. వీరంతా ఎదురు కాల్పులు, హత్యా ఘటనల్లో, పలు అసాంఘిక కార్యక్రమాల్లో ప్రత్యక్షంగా, పరోక్షంగా పాల్గొన్నారని వివరించారు. కాగా, వీరంతా మావోయిస్టు పార్టీ సిద్ధాంతాలకు విసిగిపోవడమే కాకుండా పార్టీకి ప్రజల్లో ఆదరణ తగ్గి పోవడం.. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పలు అభివృద్ధి, సంక్షేమ పథకాలకు ఆకర్షితులై లొంగిపోయినట్లు తెలిపారని ఎస్పీ చెప్పారు. లొంగిపోయిన మావోయిస్టులకు ప్రభుత్వం నుంచి రావాల్సిన పునరావాస సదుపాయాలు సకాలంలో అందేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. చింతపల్లి ఏఎస్పీ ప్రతాప్‌శివ కిషోర్, జీకే వీధి సీఐ జి.అశోక్‌కుమార్, 42వ బెటాలియన్ అసిస్టెంట్ కమాండెంట్ పి.సురేష్, సీలేరు ఎస్ఐ జె.రామకృష్ణ పాల్గొన్నారు.

తూర్పు తీర లాజిస్టిక్స్ క్యాపిటల్‌గా విశాఖ

- కార్గోకు ప్రత్యేక కారిడార్లు అవసరం
- సీఐఐ సదస్సులో లాజిస్టిక్స్ రంగ ప్రతినిధులు



బిల్డింగ్ ఈస్ట్ కోస్ట్ లాజిస్టిక్స్ క్యాపిటల్ బ్రోచర్ ఆవిష్కరిస్తున్న సీఐఐ ప్రతినిధులు, లాజిస్టిక్స్ రంగ ప్రముఖులు

సాక్షి, విశాఖపట్నం: తూర్పు తీర లాజిస్టిక్స్ క్యాపిటల్‌కు అవసరమైన అన్ని అర్హతలు విశాఖ నగరానికి ఉన్నాయని, ఆ దిశగా అవసరమైన చర్యలు తీసుకోవాలని లాజిస్టిక్స్ రంగ ప్రముఖులు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఓడరేవు ఆధారిత ఆర్థిక వ్యవస్థగా ఆంధ్రప్రదేశ్ ఉండేలా ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. కాన్ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఇండస్ట్రీ (సీఐఐ) ఆధ్వర్యాన మంగళవారం విశాఖపట్నంలో 'పోర్ట్స్ అండ్ మల్టీమోడల్ ట్రాన్స్‌పోర్టేషన్' అనే అంశంపై సదస్సు నిర్వహించారు. కాకినాడ సీ పోర్టు లిమిటెడ్ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ ఎం.మురళీధర్ మాట్లాడుతూ అంతర్జాతీయ ఖ్యాతిని ఆర్జించిన విశాఖపట్నానికి ఒక జాతీయ రహదారి, ఒక రైల్వే లైను మాత్రమే ఉన్నాయని, ప్రస్తుత లాజిస్టిక్ అవసరాలకు ఇవి సరిపోవడం లేదని, వీటిని రెట్టింపు చేయాల్సిన అవసరం ఉందన్నారు. అదానీ గంగవరం పోర్టు సీఈవో బీజీ గాంధీ మాట్లాడుతూ శరవేగంగా అభివృద్ధి చెందుతున్న విశాఖలో కనెక్టివిటీని పెంచాలని, ఎలివేటెడ్ కారిడార్లు ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు. సీఐఐ ఏపీ చాప్టర్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, లాజిస్టిక్స్ ప్యానెల్ అధ్యక్షుడు జి.సాంబశివరావు మాట్లాడుతూ నగరంలో రహదారులు విస్తరించాలని, పెరుగుతున్న జనాభా, రవాణా వాహనాల సంఖ్యకు అనుగుణంగా సరకు రవాణా వ్యవస్థ విస్తృతం చేయాలన్నారు. సీఐఐ ఇనిస్టిట్యూట్ ఆఫ్ లాజిస్టిక్స్ ఈడీ కేవీ మహీధర్ మాట్లాడుతూ జీడీపీ వృద్ధిలో దేశంలోనే తొమ్మిదో స్థానంలో ఉన్న విశాఖలో పట్టణీకరణ, ఉపాధి అవకాశాలు పెరుగుతున్నాయని చెప్పారు. ఏపీ ఇన్‌ల్యాండ్ వాటర్‌వేస్ అథారిటీ సీఈవో ఎస్‌వీకే రెడ్డి మాట్లాడుతూ రోడ్డు, రైలు, వాయుమార్గాల కంటే జల రవాణా చాలా చౌక అని, కాలుష్య రహితమని తెలిపారు. అందువల్ల జల రవాణా వినియోగం పెరగాలన్నారు. సీఐఐ విశాఖ చైర్మన్ పీపీ లాల్‌కృష్ణ, వైస్ చైర్మన్ రాజేష్ గ్రంధి తదితరులు పాల్గొన్నారు. బిల్డింగ్ ఈస్ట్ కోస్ట్ లాజిస్టిక్స్ క్యాపిటల్ బ్రోచర్‌ను సీఐఐ ప్రతినిధులు ఆవిష్కరించారు.

నేడు విశాఖ సౌత్, బనగానపల్లి, ఒంగోలులో సామాజిక సాధికార యాత్ర

సాక్షి, అమరావతి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలనలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు జరిగిన మేలును, సామాజికన్యాయం, రాజ్యాధికారం పొందిన వైనాన్ని ప్రజలకు వివరించేందుకు వైఎస్సార్‌సీపీ చేపట్టిన సామాజిక సాధికార యాత్ర బుధవారం విశాఖపట్నం జిల్లా విశాఖ సౌత్, నంద్యాల జిల్లా బనగానపల్లి, ప్రకాశం జిల్లా ఒంగోలులో నిర్వహిస్తారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ నాయకులు, ప్రజా ప్రతినిధులు పాల్గొంటారు. నాలుగున్నర సంవత్సరాలుగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల కోసం సీఎం వైఎస్ జగన్ అమలు చేసిన పలు కార్యక్రమాలను పేదలకు వివరిస్తారు.

చేపల వేటకు వెళ్లిన ఇద్దరు మత్స్యకారులు మృతి



గరికిన సత్తిబాబు (ఫైల్)



మైలపల్లి కృపాదాసు (ఫైల్)

కాకినాడ రూరల్: సముద్రంలో చేపల వేటకు వెళ్లిన ఇద్దరు మత్స్యకారులు మృతి చెందిన ఘటన కాకినాడలో చోటు చేసుకుంది. కాకినాడ జిల్లా, కాకినాడ ఫిషింగ్ హార్బర్ నుంచి సోమవారం సాయంత్రం చేపల వేట నిమిత్తం రూరల్ మండలంలోని సూర్యారావుపేట మైనర్‌పేట నుంచి నలుగురు, కాకినాడ దుమ్ములపేట నుంచి ఒకరు కలిసి ఫైబర్ తెప్పపై చేపల వేటకు వెళ్లారు. తిరిగి వస్తుండగా సముద్రపు అలలు, గాలుల తీవ్రతకు తెప్ప తిరగబడింది.అందులోని సూర్యారావుపేట మైనర్ పేటకు చెందిన గరికిన సత్తిరాజు(63), కాకినాడ దుమ్ములపేటకు చెందిన మైలపల్లి కృపాదాసు(38) గల్లంతయ్యారు. ముగ్గురు క్షేమంగా ఒడ్డుకు చేరుకున్నారు. గల్లంతైన వారికి కోసం కుటుంబ సభ్యులు, పోలీసులు గాలించగా, మంగళవారం మృతదేహాలు లభ్యమయ్యాయి. పోర్టు పోలీసులు కేసు నమోదు చేయగా మృతదేహాలకు ప్రభుత్వాస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించారు. మత్స్యకారుల మృతిపై కాకినాడ రూరల్ ఎమ్మెల్యే కురసాల కన్నబాబు విచారం వ్యక్తం చేశారు. ప్రమాదం విషయం సీఎం దృష్టికి తీసుకువెళ్లామన్నారు. ప్రభుత్వం నుంచి రూ.5లక్షల ఎక్స్‌గ్రేషియా, మత్స్యకార భరోసా బీమా నుంచి మరో రూ.5లక్షలు కలిపి రూ.10లక్షలు చొప్పున ఒక్కో కుటుంబానికి అందిస్తామని ఆయన తెలిపారు.

రోడ్ల అభివృద్ధి వేగవంతం

- జంగారెడ్డిగూడెం డివిజన్లో రూ.107 కోట్లతో పనులు
- ఆర్‌అండ్‌ఆర్ కాలనీకి అప్రోచ్ రోడ్లు
- జగనన్నకు చెబుదాం కింద రోడ్లు పనులు చేపట్టిన ఆర్ అండ్ బి శాఖ
- వరదల్లో దెబ్బతిన్న రోడ్లకు మరమ్మతులు



నిర్మాణం పూర్తయిన మేడేపల్లి - వేలేరుపాడు రోడ్డు

జంగారెడ్డిగూడెం: జిల్లాలోని ప్రధాన మార్గాలతో పాటు, ఆయా గ్రామాలను కలిపే లింకు రోడ్ల అభివృద్ధి పనులు వేగవంతమయ్యాయి. వరదలకు దెబ్బతిన్న రోడ్లకు మరమ్మతులు, పూర్తిగా దెబ్బతిన్న రోడ్ల పునర్నిర్మించనున్నారు. ఐటీడీఏ పరిధిలో ఏజెన్సీ రోడ్లను కూడా అభివృద్ధి చేస్తున్నారు. ఆర్‌అండ్‌ఆర్ కాలనీలకు అప్రోచ్ రోడ్లు, లింక్ రోడ్లు ఏర్పాటు చేస్తున్నారు. జంగారెడ్డిగూడెం ఆర్‌అండ్‌బీ డివిజన్ పరిధిలో పలు రోడ్ల అభివృద్ధి చేపట్టారు. కొన్ని రోడ్ల నిర్మాణం ఇప్పటికే పూర్తి కాగా మరికొన్ని నిర్మాణాలు వివిధ దశల్లో ఉన్నాయి. కొన్ని రోడ్లకు ప్రతిపాదనలు చేశారు.

రూ.59.30 కోట్లతో రోడ్ల నిర్మాణం

జంగారెడ్డిగూడెం ఆర్‌అండ్‌బీ డివిజన్ పరిధిలో ఎస్‌టీసీ నిధులు రూ.59.30 కోట్లతో పలు రోడ్ల నిర్మిస్తున్నారు. వినాయకపురం – రెడ్డిగూడెం క్రాస్‌రోడ్డు రూ.2 కోట్లతో చేపట్టారు. ఈ నిర్మాణం కొంత వరకు పూర్తయింది. శ్రీధర వేలేరు నుంచి లంకాలపల్లి రోడ్డు నిర్మాణానికి రూ.34 కోట్లు వెచ్చించనున్నారు. బుట్టాయగూడెం – దొరమామిడి – పూచికపాడు రోడ్డు నిర్మాణం రూ.7.54 కోట్లతో చేపట్టారు. రేపల్లెవాడ – కొత్తదేవరగొంది రోడ్డు నిర్మాణానికి రూ.4.15 కోట్లు కేటాయించారు. బర్రింకలపాడు – రాచన్నగూడెం – పూచికపాడు నిర్మాణానికి రూ.5.20 కోట్లు కేటాయించారు. బయ్యనగూడెం – రేగులకుంట రోడ్డు నిర్మాణానికి రూ.6 కోట్లు వెచ్చించనున్నారు.

దెబ్బతిన్న రోడ్ల నిధులు

ఇటీవల వర్షాకాలంలో దెబ్బతిన్న రోడ్ల నిర్మాణానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. వీటిలో బూర్గుంపాడు నుంచి అశ్వారావుపేట రోడ్డును లింక్ చేస్తూ నిర్మించే రోడ్డుకు రూ.40 లక్షలు కేటాయించారు. కుక్కునూరు – దాచారం రోడ్డుకు రూ.15 లక్షలు, కుకునూరు – అశ్వారావుపేట రోడ్డు – రెడ్డిగూడెం క్రాస్ రోడ్డు నిర్మాణానికి రూ.10 లక్షలు, వసంతవాడ – రుద్రమ్మకోట వరకు మరమ్మతులకు రూ.15 లక్షలు, రెడ్డిగూడెం క్రాస్‌రోడ్డు – కొయిదా రోడ్డు మరమ్మతులకు రూ.30 లక్షలు వెచ్చించనున్నారు.

ప్రభుత్వానికి ప్రతిపాదనలు

వరదల్లో దెబ్బతిన్న రోడ్ల మరమ్మతులకు ప్రభుత్వానికి అధికారులు ప్రతిపాదనలు చేశారు. చింతలపూడి, పోలవరం నియోజకవర్గాల్లో దెబ్బతిన్న రోడ్లకు మరమ్మతులు చేయనున్నారు. వీటిలో చింతలపూడి – కామవరపుకోట – మక్కినవారిగూడెం రోడ్ల మరమ్మతులకు రూ.50 లక్షలు, పాంగుటూరు – లక్కవరం రోడ్డు మరమ్మతులకు రూ.25 లక్షలు, శ్రీనివాసపురం – పందిరిమామిడిగూడెం రూ.24.60 లక్షలు, బర్రింకలపాడు – పూచికపాడు రోడ్డు మరమ్మతులకు రూ.20 లక్షలు, శ్రీనివాసపురం – పందిరిమామిడిగూడెం రోడ్డు మరమ్మతులకు రూ.15 లక్షలు, బుట్టాయగూడెం – కంగాలవారిగూడెం రోడ్డు మరమ్మతులకు రూ.7.70 లక్షలు, బర్రింకలపాడు – పూచికపాడు రోడ్డులో ఉన్న కల్వర్టు నిర్మాణానికి రూ.25.50 లక్షలు వెచ్చించనున్నారు. పోలవరం – కొయ్యలగూడెం రోడ్డు మరమ్మతులకు రూ.48.40 లక్షలు, యర్రగుంటపల్లి – లక్ష్మీపురం రోడ్డు మరమ్మతులు రూ.52 లక్షలు, చింతలపూడి – రావికంపాడు రోడ్డు మరమ్మతులకు రూ.36 లక్షలు, ఏలూరు – జంగారెడ్డిగూడెం రోడ్డు, టి.నరసాపురం – అశ్వారావుపేట రోడ్డు మరమ్మతులకు రూ.23 లక్షలు, చేబ్రోలు దేవులపల్లి రోడ్డు మరమ్మతులకు రూ.12 లక్షలు అంచనాతో ప్రతిపాదనలు చేశారు.

ఐటీడీఏ పరిధిలో..

పోలవరం – కొయ్యలగూడెం రోడ్డు, ఏజీఆర్‌బీ రోడ్డు, శ్రీనివాసపురం – పందిరిమామిడిగూడెం రోడ్డు, కుక్కునూరు – దాచవరం రోడ్డు, బర్రింకలపాడు – పూచికపాడు రోడ్డు, రెడ్డిగూడెం క్రాస్ రోడ్డు – కొయిదా రోడ్డు, బుట్టాయగూడెం – కంగాలవారిగూడెం రోడ్డు నిర్మాణానికి రూ.12.31 కోట్లతో ప్రతిపాదనలు చేశారు.

ఆర్‌అండ్‌ఆర్ కాలనీలకు లింక్ రోడ్లు

ఆర్‌అండ్‌ఆర్ కాలనీలకు లింక్ రోడ్ల నిర్మాణానికి జిల్లా కలెక్టర్ నిధులు మంజూరు చేశారు. ఈ పనులను ఆర్‌అండ్‌బీ శాఖ ఆధ్వర్యంలో చేపట్టనున్నారు. ఇందుకోసం రూ.10.57 కోట్లు కేటాయించారు. ఈ పనులకు టెండర్లు ఖరారు కాగా, త్వరలో పనులు చేపట్టనున్నారు. ఉప్పేరు, రెడ్డిగణపవరం (తూటికుంట), పి.నారాయణపురం (కొరుటూరు), ములగలంపల్లి, సాగిపాడు, స్వర్ణవారిగూడెం, వంకా వారిగూడెం, సరిపల్లి, గర్భగూడెం ఆర్‌అండ్‌ఆర్ కాలనీలకు లింక్ రోడ్లు వేయనున్నారు.

'జగనన్నకు చెబుదాం'లో..

జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వం పలు రోడ్ల నిర్మాణం చేపట్టనుంది. చేబ్రోలు – దేవులపల్లి రూ.4 కోట్లు, చింతలపూడి – రావికంపాడు రోడ్డు రూ.4.50 కోట్లు, శ్రీనివాసపురం – పందిరిమామిడిగూడెం రోడ్డు రూ.3.85 కోట్లు, యర్రగుంటపల్లి లక్ష్మీపురం రోడ్డుకు రూ.4.15 కోట్లు, పోలవరం కొయ్యలగూడెం రోడ్డు రూ.3.89 కోట్లు వెచ్చించనున్నారు.

అనుమతులు రాగానే పనులు

ఆర్‌అండ్‌బీ శాఖ ఆధ్వర్యంలో రోడ్ల అభివృద్ధి పనులు వేగవంతం చేశాం. ఇప్పటికే కొన్ని రోడ్ల నిర్మాణం పూర్తి కాగా, మరికొన్ని వివిధ దశల్లో ఉన్నాయి. మరికొన్ని రోడ్ల నిర్మాణానికి టెండర్లు పూర్తయ్యాయి. వాటి పనులు త్వరలో ప్రారంభిస్తాం. అలాగే ఆర్‌అండ్ ఆర్ కాలనీకి లింకు రోడ్ల నిర్మాణం కూడా చేపడుతున్నాం. వరదలకు దెబ్బతిన్న రోడ్ల నిర్మాణానికి ఉన్నతాధికారులు జిల్లా కలెక్టర్‌కు ప్రతిపాదనలు చేశారు. ప్రభుత్వం నుంచి అనుమతులు రాగానే వాటి పనులు ప్రారంభిస్తారు.

– సీహెచ్ హరికృష్ణ, ఆర్‌అండ్‌బీ డీఈ

ఈ–చలానా కేసులో ప్రధాన నిందితుడు

కొమ్మారెడ్డి అవినాష్ అరెస్టు

గుంటూరు రేంజ్ ఐజీ పాలరాజు వెల్లడి

- పోలీస్ డిపార్టుమెంట్‌లో ఈ కుంభకోణం 2018–19లో జరిగింది
- దారిమళ్లిన సొమ్ము ప్రభుత్వ ఖాతాకు జమయ్యేలా చర్యలు
- 16 ఆస్తులు జప్తు.. డైరెక్టర్ల పాత్రపైనా విచారణ
- కుంభకోణంలో సిబ్బంది పాత్రపై అంతర్గత విచారణ



వివరాలు వెల్లడిస్తున్న గుంటూరు రేంజ్ ఐజీ పాలరాజు

సాక్షి ప్రతినిధి, గుంటూరు: పోలీసు డిపార్టుమెంట్‌లో జరిగిన ఈ–చలానా కుంభకోణంలో ప్రధాన నిందితుడు కొమ్మారెడ్డి అవినాష్‌ను అరెస్టు చేసినట్లు గుంటూరు రేంజ్ ఐజీ జి.పాలరాజు తెలిపారు. మంగళవారం గుంటూరు ఎస్పీ కార్యాలయంలో విలేకరులతో ఆయన మాట్లాడారు. ఈ వ్యవహారం మొత్తం 2018–19లో జరిగిందని తమ విచారణలో స్పష్టమైందన్నారు. 2018లో అప్పటి డీజీపీ సాంబశివరావు ఎటువంటి టెండర్లు లేకుండానే తొమ్మిది జిల్లాల్లో మోటారు వాహనాల చలానాల వసూళ్లను డేటా ఎవాన్ సొల్యూషన్స్‌కు అప్పగించారని, ఆ తర్వాత 2019లో కేవలం ఒక్క రూపాయికే టెండర్ వేసిన ఆ సంస్థకు కట్టబెట్టారన్నారు. ఆడిటింగ్ జరగకుండానే టెండర్ కట్టబెట్టడంతో రూ. 36.53 కోట్లు దారి మళ్లినట్లు తమ విచారణలో తేలిందన్నారు. డేటా ఎవాన్ సొల్యూషన్స్‌తో పాటు రోజర్ పీఈ అనే సంస్థ ద్వారా అవకతవకలకు తెరలేపారన్నారు. చలానాల ద్వారా కలెక్ట్ అయిన మొత్తం డైరెక్ట్‌గా డీజీ అకౌంట్‌కు వెళ్లకుండా రేజర్‌పే ద్వారా రోజర్ పీఈకు మళ్లినట్లు గుర్తించామన్నారు. ఈ విధంగా దారిమళ్లిన సొమ్ముతో అమెజాన్ క్లౌడ్ సర్వీస్‌ను కొనుగోలు చేసి దాని ద్వారా 50 నుంచి 60 సంస్థలకు సర్వీసులు ఇస్తున్నారని చెప్పారు. ఈ సర్వీసుల ద్వారా సుమారు రూ. 25 కోట్లు డేటా ఎవాన్ సొల్యూషన్ సంస్థకు రావాల్సి ఉందని, ఆ మొత్తాన్ని ప్రభుత్వ ఖాతాకు జమ చేసేలా కోర్టు ద్వారా చర్యలు చేపట్టామన్నారు. 2019 తర్వాత సుమారు 16 ఆస్తులను కొనుగోలు చేసినట్లు గుర్తించామని, వాటిని సీజ్ చేసి ఎటువంటి లావాదేవీలు జరగకుండా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలకు ఆదేశాలు జారీ చేశామన్నారు.


సీరియస్‌గా ప్రభుత్వం..

ప్రజల సొమ్ము ఈ విధంగా దారి మళ్లడంపై ప్రభుత్వం చాలా సీరియస్‌గా ఉందని పాలరాజు చెప్పారు. 2018 నుంచి ఇప్పటివరకూ ఎంత సొమ్ము, ఏ ఖాతాలకు మళ్లింది అనే అంశాలపై ఆడిటింగ్ నిర్వహిస్తున్నామని తెలిపారు. కొంత డబ్బు పలు ప్రైవేటు ఖాతాలకు మళ్లించారని, ఆ ఖాతాలను కూడా సీజ్ చేశామని చెప్పారు. మరోవైపు ఈ వ్యవహారంపై ప్రస్తుత డీజీపీ అంతర్గత విచారణకు ఆదేశించారన్నారు. టెండర్ కట్టబెట్టడంలో ఎవరు బాధ్యులనే అంశంపై విచారణ జరుపుతున్నట్లు చెప్పారు. భవిష్యత్‌లో ప్రైవేటు సంస్థల ద్వారా ఈ–చలానా వసూలు చేయకుండా, ప్రభుత్వరంగ సంస్థ అయిన ఎస్‌బీసీ ద్వారా వసూలు చేసేందుకు చర్యలు చేపడుతున్నామన్నారు. ఈ కేసు విషయంలో కంపెనీలోని మిగిలిన డైరెక్టర్ల పాత్రపై కూడా విచారణ జరిపి వారి తప్పు ఉంటే అరెస్టు చేస్తామని ఐజీ పాలరాజు తెలిపారు. ఈ విలేకరుల సమావేశంలో గుంటూరు ఎస్పీ ఆరిఫ్ హాఫీజ్ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి వైద్యుల జాతీయ క్రీడా ఉత్సవాలు

ఐఎంఏ ఏపీ శాఖ ఆధ్వర్యంలో నిర్వహణ

లబ్బీపేట(విజయవాడతూర్పు): దేశంలోనే తొలిసారిగా ఇండియన్ మెడికల్ అసోసియేషన్(ఐఎంఏ) ఆంధ్రప్రదేశ్ శాఖ ఆధ్వర్యాన ఈ నెల 22 నుంచి 26వ తేదీ వరకు జాతీయ స్థాయి వైద్యుల క్రీడా ఉత్సవాలు నిర్వహించనున్నట్లు ఐఎంఏ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ జి.రవికృష్ణ, డాక్టర్ పి.ఫణిధర్, ఫైనాన్స్ సెక్రటరీ డాక్టర్ ఎం.రవీంద్రనాథ్ తెలిపారు. విజయవాడలో మంగళవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ ఆచార్య నాగార్జున విశ్వ విద్యాలయం సమీపంలోని డాక్టర్స్ స్పోర్ట్స్ మైదానంలో ఈ నెల 22వ తేదీన క్రీడా ఉత్సవాలు ప్రారంభమవుతాయని చెప్పారు. క్రికెట్, బాడ్మింటన్, వాలీబాల్, రోయింగ్, బాస్కెట్‌బాల్, టేబుల్ టెన్నిస్, లాన్ టెన్నిస్, కబడ్డీ, చెస్, క్యారమ్స్, టెన్నికాయిట్, సైక్లింగ్, వాక్‌థాన్, స్విమ్మింగ్, ఆర్చరీ, షూటింగ్, ఖోఖో, అథ్లెటిక్స్ విభాగాల్లో పురుషులు, మహిళలకు వేర్వేరుగా పోటీలు ఉంటాయని వివరించారు. దేశంలోని అన్ని రాష్ట్రాల నుంచి వెయ్యి మందికి పైగా వైద్య క్రీడాకారులు పాల్గొంటారని తెలిపారు. పోటీల నిర్వహణ కమిటీ చైర్మన్ డాక్టర్ పట్టాభిరామయ్య, కార్యదర్శి డాక్టర్ తుమ్మల కార్తీక్ మాట్లాడుతూ ఈ క్రీడా ఉత్సవాలను విజయవాడ డాక్టర్స్ స్పోర్ట్స్ అకాడమీ సహకారంతో నిర్వహిస్తున్నామని తెలిపారు.



వైద్యుల జాతీయ పోటీల బ్రోచర్ ఆవిష్కరిస్తున్న ఐఎంఏ ప్రతినిధులు రవికృష్ణ, ఎం.రవీంద్రనాథ్, కార్తీక్ తదితరులు

బండారు, గాలి భానుప్రకాష్‌లపై

మంత్రి రోజా పరువునష్టం దావా

- స్టేట్‌మెంట్ రికార్డు చేసిన మేజిస్ట్రేట్
- వారికి గుణపాఠం చెప్పేందుకే కేసు: రోజా



నగరి కోర్టువద్ద మంత్రి ఆర్కేరోజా

నగరి(చిత్తూరు జిల్లా): తన వ్యక్తిత్వంపై నీచ వ్యాఖ్యలు చేసిన టీడీపీ నాయకుడు బండారు సత్యనారాయణ, టీవీ5 అసోసియేట్ ఎడిటర్ రాజేంద్రప్రసాద్, టీడీపీ నగరి ఇన్‌చార్జి గాలి భానుప్రకాష్‌లపై కోర్టులో మంత్రి రోజా పరువునష్టం దావా వేశారు. దీనికి సంబంధించి మూడు సెక్షన్ల కింద వారికి కోర్టు నోటీసులు జారీ చేసింది. ఈ కేసుల నమోదు నిమిత్తం మంగళవారం జూనియర్ సివిల్ మేజిస్ట్రేట్ కోర్టుకు మంత్రి రోజా హాజరుకాగా, మేజిస్ట్రేట్ విష్ణువర్మ ఆమె స్టేట్‌మెంట్‌ను రికార్డు చేశారు. అనంతరం రోజా మాట్లాడుతూ మహిళంటే ఏదైనా అనొచ్చు అనుకునే మగవాళ్లకు బుద్ధి చెప్పాలన్నదే తన ప్రయత్నమన్నారు.ఓ పథకం ప్రకారం తన వ్యక్తిత్వాన్ని కించపరుస్తూ ప్రెస్‌మీట్‌లలో మాట్లాడారని, తొలుత అయ్యన్నపాత్రుడి నుంచి మొదలుపెట్టి బండారు సత్యనారాయణ, టీవీ5 అసోసియేట్ ఎడిటర్ రాజేంద్రప్రసాద్, నగరి టీడీపీ ఇన్‌చార్జి గాలి భానుప్రకాష్ వరకూ తనను కించపరిచారని ఆవేదన వ్యక్తంచేశారు. ఓ సెలబ్రిటీగా తనకే ఈ పరిస్థితి ఉంటే సాధారణ మహిళ ఇలాంటివి ఎలా తట్టుకుని రాణిస్తుందని ఆమె ప్రశ్నించారు.

మూడు సెక్షన్ల కింద కోర్టు నోటీసులు

బండారు సత్యనారాయణ, టీవీ5 అసోసియేట్ ఎడిటర్ రాజేంద్రప్రసాద్, నగరి టీడీపీ ఇన్‌చార్జి గాలి భానుప్రకాష్‌లపై విడివిడిగా కోర్టు నోటీసులు అందజేసినట్టు మంత్రి రోజా తరఫు న్యాయవాది రవీంద్ర తెలిపారు. పరువునష్టం కలిగించినందుకు ఐపీసీ 499, 500 సెక్షన్ల కింద, మహిళపై నిందమోపి భయభ్రాంతులకు గురిచేసినందుకు ఐపీసీ 354, 506 సెక్షన్ల కింద, ఇరువర్గాలను రెచ్చగొట్టేలా వ్యాఖ్యలు ఉన్నందున సెక్షన్ 153ఎ కింద కేసులు నమోదు చేసి నోటీసులు అందజేశామన్నారు.

కులవాదుల సంబరాలు సిగ్గుచేటు

రిలే దీక్షల్లో ధ్వజమెత్తిన బహుజన నేతలు

తాడికొండ: అధికారాన్ని అడ్డుపెట్టుకుని నిలువునా రాష్ట్రాన్ని దోచేసి.. అవినీతి కేసుల్లో జైలు పాలయిన చంద్రబాబు.. బెయిల్‌పై బయటకు వస్తే కులవాదులు సంబరాలు చేసుకోవడం సిగ్గుచేటని బహుజన పరిరక్షణ సమితి నాయకులు మండిపడ్డారు. గుంటూరు జిల్లా తుళ్ళూరు మండలం తాళ్ళాయపాలెం సీడ్ యాక్సిస్ రోడ్డు జంక్షన్‌లో మూడు రాజధానులకు మద్దతుగా బహుజన పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో 1,150వ రోజు కొనసాగుతున్న రిలే నిరాహార దీక్షలో మంగళవారం పలువురు మాట్లాడారు. రాజధానిలో పేదలకు ఇళ్ల పట్టాలిస్తే కళ్లలో నిప్పులు పోసుకుని తప్పుడు కేసులు వేసిన వీరంతా సంబరాలు చేసుకోవడం దుర్మార్గం కాదా అని ప్రశ్నించారు. ఏపీలో బీజేపీ అధ్యక్షురాలుగా ఉన్న పురందేశ్వరి తన పార్టీ వదిలి పక్క పార్టీకి అధ్యక్షురాలుగా వ్యవహరిస్తుందన్నారు. నాయకులు ఈపూరి ఆదాం, మాదిగాని గురునాథం, నూతక్కి జోషి పాల్గొన్నారు.



విజయానికి ఏడు హామీలు

రాజస్థాన్‌లో గహ్లోత్‌కు చావో రేవో ● ప్రజాకర్షక పథకాలపైనే ఆశలు

సర్వశక్తులూ ఒడ్డుతున్న సీఎం ● చరిత్రను తిరగరాసే ప్రయత్నం

రాజస్థాన్‌లో గత 30 ఏళ్లలో అధికార పార్టీ నెగ్గిన దాఖలా లేదు. ప్రతి అసెంబ్లీ ఎన్నికల్లోనూ ప్రభుత్వం మారుతూ వస్తోంది. ఈసారి మాత్రం వరుసగా రెండో విజయంతో చరిత్రను తిరగరాసేందుకు సీఎం అశోక్ గహ్లోత్ సర్వశక్తులూ ఒడ్డుతున్నారు. ఈ విషయంలో 'ఏడు హామీ'లపై బాగా ఆశలు పెట్టుకున్నారు. ఆ పథకాలు తనను కచ్చితంగా గట్టెక్కిస్తాయని నమ్ముతున్నారు...!

రాజస్థాన్ అసెంబ్లీ ఎన్నికల పర్వం క్లైమాక్స్‌కు చేరుతోంది. అధికార కాంగ్రెస్, బీజేపీ హోరాహోరీగా తలపడుతున్నాయి. పోలింగ్‌కు మరో మూడు రోజులే ఉంది. గురువారం సాయంత్రంతో ప్రచారానికి కూడా తెర పడనుంది. ఈ నేపథ్యంలో ప్రచారాన్ని సీఎం గహ్లోత్ టాప్ గేర్‌లోకి తీసుకెళ్లారు. కాంగ్రెస్ తరఫున అంతా తానై వ్యవహరిస్తున్నారు. రాష్ట్రమంతటా సుడిగాలి పర్యటనలతో హోరెత్తిస్తున్నారు. ఈ రెండు రోజుల్లో వీలైనన్ని అసెంబ్లీ స్థానాలను కవర్ చేయనున్నారు. ముఖ్యంగా మహిళలకు రూ.10 వేల భృతి మొదలుకుని రూ.25 లక్షల వైద్య సాయం దాకా కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు అందిస్తున్న, అందించబోయే పథకాలను ముమ్మరంగా ప్రచారం చేస్తున్నారు. ప్రతి ప్రచార సభలోనూ అవి ప్రధానంగా ప్రస్తావనకు వచ్చేలా జాగ్రత్త పడుతున్నారు.

జీవన్మరణ సమస్య!

72 ఏళ్ల గహ్లోత్‌కు ఒకరకంగా ఈ అసెంబ్లీ ఎన్నికలు జీవన్మరణ సమస్యగా మారాయి. గత అసెంబ్లీ ఎన్నికల విజయంలో కీలక పాత్ర పోషించిన కాంగ్రెస్ యువ నేత సచిన్ పైలట్‌ను ఈసారి ఆయన పూర్తిగా పక్కన పెట్టారు. కనుక ఫలితాలు ఏ మాత్రం వికటించినా గహ్లోత్ రాజకీయ జీవితానికి తెర పడవచ్చన్న అభిప్రాయముంది. అందుకే కొద్ది రోజులుగా ఆయన దూకుడు పెంచారు. రోజుకు కనీసం నాలుగైదు సభల్లో పాల్గొంటున్నారు. ఈ క్రమంలో ఒక్క రోజు ఏకంగా 800 కిలోమీటర్లు పర్యటిస్తున్నారు! తన ఓబీసీ సామాజిక వర్గ మూలాలను కూడా సమయానుకూలంగా ప్రస్తావిస్తూ ఓటర్లను ఆకట్టుకునే ప్రయత్నం చేస్తున్నారు. ముఖ్యంగా ప్రతి ప్రచార సభలోనూ ప్రధాని మోదీపై విమర్శలతో విరుచుకుపడుతున్నారు. ఆయన ప్రసంగాల్లో కాంగ్రెస్ పథకాలనే యథాతథంగా కాపీ కొడుతున్నారంటూ ఎద్దేవా చేస్తున్నారు. తమ ఏడు హామీలకు పోటీగా బీజేపీ తెరపైకి తెచ్చిన 'మోదీ హామీ'లను ఒక్కొక్కటిగా ప్రస్తావిస్తూ, అవన్నీ కాంగ్రెస్ హామీలకు నకళ్లేనని పదేపదే చెబుతున్నారు. ''ఇది బీజేపీకి బాగా మైనస్‌గా మారుతోంది. ఈసారి కచ్చితంగా గెలుపు కాంగ్రెస్‌దే. ఓటర్లు ఈ మేరకు నిర్ణయించుకున్నారు కూడా'' అని ధీమా వ్యక్తం చేస్తున్నారు. రోజూ క్రమం తప్పకుండా స్వీయ ప్రచార వీడియోలను కూడా విడుదల చేస్తూ, అవి వీలైనంత మందికి చేరేలా జాగ్రత్తలు తీసుకుంటున్నారు గహ్లోత్.

అధిష్టానం అనుగ్రహం కోసం...

రాష్ట్రస్థాయిలో గెలుపు కోసం శాయశక్తులా ప్రయత్నాలు చేస్తూనే, అధిష్టానంతో సంబంధాలను కూడా సరిదిద్దుకునే పనిలో పడ్డారు గహ్లోత్. గతేడాది కాంగ్రెస్ అధ్యక్ష ఎన్నికల బరిలో దిగాల్సిందిగా సోనియా ఆదేశించినా ఆయన బేఖాతరు చేయడం తెలిసిందే. దీనిపై గాంధీ కుటుంబం గుర్రుగా ఉన్న నేపథ్యంలో, వీలు దొరికినప్పుడల్లా సోనియా, రాహుల్, ప్రియాంకలను ఆయన ఆకాశానికెత్తుతూ వస్తున్నారు. రాష్ట్ర ప్రచార పర్వమంతా రాహుల్, ప్రియాంక కనుసన్నల్లోనే జరుగుతోందని పదేపదే చెప్పుకొస్తున్నారు.

- సాక్షి, నేషనల్ డెస్క్

రాజస్థాన్లో కాంగ్రెస్ ఏడు హామీలు...

1. కుటుంబ పెద్ద అయిన మహిళలకు ఏటా రూ.10,000 భృతి
2. ప్రభుత్వ కాలేజీలో చేరే ప్రతి విద్యార్థికి ల్యాప్‌టాప్ లేదా ట్యాబ్
3. చిరంజీవి ఆరోగ్య బీమా పథకం ద్వారా రూ.25 లక్షల దాకా వైద్య సాయం. ఇందులో భాగంగా రూ.15 లక్షల ప్రమాద బీమా
4. అందరికీ ఉచితంగా ఇంగ్లిష్ మీడియం విద్య
5. రాష్ట్రంలో కోటి కుటుంబాలకు రూ.500కే వంట గ్యాస్ సిలిండర్
6. పాత పెన్షన్ పథకానికి చట్టబద్ధత
7. రైతుల నుంచి రూ.2కు కిలో చొప్పున పేడ కొనుగోలు



కార్మికులు కనిపించారు

- ఎండోస్కోపీ కెమెరాతో ప్రయత్నాలు సఫలం
- బయటికొచ్చిన మొట్టమొదటి విజువల్స్
- పైప్‌లైన్ ద్వారా మరింత స్పష్టంగా మాట్లాడే అవకాశం

ఉత్తరకాశీ/న్యూఢిల్లీ: ఉత్తరాఖండ్‌లోని సిల్క్యారా సొరంగం కూలిన 10వ రోజైన మంగళవారం సానుకూల పరిణామం సంభవించింది. లోపల చిక్కుకున్న 41 మంది కార్మికులతో వారి కోసం బయట వేచి ఉన్న కుటుంబసభ్యులు మరింత సులువుగా, స్పష్టంగా మాట్లాడారు. అంతేకాకుండా, లోపలున్న వారికి సంబంధించిన విజువల్స్ మొట్టమొదటిసారిగా బయటకు వచ్చాయి. దీంతో, కూలిన సొరంగం శిథిలాల్లోంచి తవ్విన ఆరంగుళాల పైప్‌లైన్ ద్వారా ఎండోస్కోపిక్ కెమెరాను పంపించి, లోపలున్న వారి యోగ క్షేమాలను తెలుసుకునేందుకు అధికారులు చేసిన ప్రయత్నాలు విజయవంతమైనట్లయింది. ఈ పైపును 53 మీటర్ల మేర అడ్డుపడిన శిథిలాల గుండా సోమవారం లోపలికి ప్రవేశపెట్టారు. కెమెరాను సోమవారం రాత్రి ఢిల్లీ నుంచి అక్కడికి పంపించారు. పసుపు, తెలుపు రంగుల హెల్మెట్లను ధరించిన కార్మికులు, పైపులైన్‌ద్వారా లోపలికి పంపించిన ఆహార పదార్థాలను ఒకరికొకరు అందించుకుంటూ, మాట్లాడుకుంటూ ఆ విజువల్స్‌లో కనిపించారు. బయటున్న అధికారులు పెద్ద స్క్రీన్‌పై వారిని చూస్తూ తగు సూచనలు ఇచ్చారు. కెమెరా లెన్స్ శుభ్రంగా ఉంచుతూ, తమను తాము పరిచయం చేసుకోవాలని కోరారు. పైప్‌లైన్ దగ్గరకు చేరుకుని లోపలికి పంపించిన వాకీటాకీలతో మాట్లాడాలని చెప్పారు. అనంతరం ఆ కెమెరాను వెనక్కి తీశారు. ఇప్పటికే కొందరి కుటుంబసభ్యులు నాలుగంగుళాల కంప్రెషర్ ట్యూబ్ ద్వారా లోపలున్న తమ వారితో మాట్లాడారు. ఆ ట్యూబ్ ద్వారానే డ్రైఫ్రూట్స్ వంటివి కూడా లోపలికి పంపించారు. అయితే, తాజాగా అందుబాటులోకి వచ్చిన పైప్‌లైన్ కార్మికుల పాలిటి లైఫ్‌లైన్‌గా మారింది. ఇంతకుముందు కంటే ఎక్కువ ఆహారాన్ని పంపొచ్చు. కుటుంబసభ్యులతో మరింత సులువుగా, స్పష్టంగా మాట్లాడుకోవచ్చు. కొత్త పైపు ద్వారా లోపలున్న వారికి నారింజ, అరటి, యాపిల్ పండ్లు, బాటిళ్లలో కిచిడీ, సెల్‌ఫోన్లు, చార్జర్లను సైతం పంపించారు. ఒక డాక్టర్ కూడా లోపలున్న కార్మికులతో మాట్లాడారు. వారి ఆరోగ్య సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కడుపులో మంట, మూత్ర విసర్జనలో సమస్య..తదితరాలను తెలపగా వారికి మల్టీవిటమిన్ ట్యాబెట్లు, ఎలక్ట్రోలైట్ పౌడర్, యాంటీ డిప్రెస్సెంట్‌లను పంపినట్లు డాక్టర్ పీఎస్ పొఖ్రియాల్ చెప్పారు. సొరంగంలో చిక్కుకుపోయిన ప్రదీప్ కిక్కు క్షేమంగానే ఉన్నట్లు ఆయన మరదలు తెలిపారు.

సొరంగం లోపల చిక్కుకున్న కార్మికులు, వారు ఆహారం తీసుకుంటున్నప్పటి దృశ్యాలు



మరో పక్క నుంచి టన్నెల్ పనులు

కార్మికులను సాధ్యమైనంత త్వరగా తీసుకువచ్చేందుకు ప్రయత్నాలు సాగుతున్నాయి. ఇందుకోసం సొరంగం రెండో వైపు బార్‌కోట్ నుంచి సొరంగాన్ని నిర్మించే పనులు మొదలుపెట్టారు. ఈ బ్యాకప్ టన్నెల్ వ్యాసం మూడు మీటర్లుంటుందని అధికారులు చెప్పారు. ఇది పూర్తయితే లోపలున్న వారందరినీ తేలిగ్గా బయటకు తీసుకువచ్చేందుకు వీలుపడుతుంది. సొరంగంలోని కూలిన భాగం, పూర్తయిన నిర్మాణం మధ్య దూరాన్ని అంచనా వేసేందుకు రెండు సార్లు డ్రోన్‌లతో చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. ఒక డ్రోన్ శిథిలాల మీదుగా 28 మీటర్లకు మించి దూరం వెళ్లలేకపోగా, మరో డ్రోన్ దెబ్బతిందని అధికారులు చెప్పారు. డీఆర్‌డీవో అభివృద్ధి చేసిన రోబో కూడా నిటారుగా ఉన్న శిథిలాల మీదుగా పైకెక్కలేకపోయింది. కొండప్రాంతం పైనుంచి సొరంగంలోకి నిటారుగా డ్రిల్లింగ్ చేసేందుకు 75 టన్నుల భారీ యంత్రానికి ప్లాట్‌ఫాంగా ఉపయోగించుకునేందుకు తలపెట్టిన అప్రోచ్ రోడ్డు నిర్మాణం దాదాపుగా పూర్తి కావచ్చింది.

రామాయణం, భారతం ఇక 'సాంఘికం'

ఎన్‌సీఈఆర్‌టీ ప్యానెల్ సిఫార్సులు

న్యూఢిల్లీ: రామాయణ, మహాభారతాలను పాఠశాల విద్యార్థులకు సాంఘికశాస్త్ర పుస్తకాల్లో పాఠ్యాంశాలుగా బోధించాలని జాతీయ విద్యా పరిశోధనా శిక్షణా మండలి(ఎన్‌సీఈఆర్‌టీ) ప్యానెల్ సిఫార్సు చేసింది. గత ఏడాది ఏర్పాటైన ప్యానెల్ తాజాగా చేసిన పలు సిఫార్సులపై మంగళవారం జాతీయ మీడియాలో పలు కథనాలు వెలువడ్డాయి. రాజ్యాంగ పీఠికను తరగతి గదుల గోడలపై ముద్రించాలని ప్యానెల్ సిఫార్సు చేసిందని ఎన్‌సీఈఆర్‌టీ చైర్మన్ సీఐ ఇసాక్ చెప్పారు. 'సిఫార్సులపై ఎన్‌సీఈఆర్‌టీ ఇంకా ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. ఏటా వేలాది మంది విద్యార్థులు ఉన్నత చదువుల కోసం విదేశాలకు వెళ్లి ఆ దేశ పౌరసత్వం కోసం పడిగాపులు పడుతున్నారు. ఈ తరం పిల్లల్లో దేశభక్తి లోపించింది. దేశభక్తి, భారతదేశ ఘన చరిత్ర చూసి మనం ఎంతగా గర్వపడాలో తెలిపేలా పాఠ్యాంశాలు ఉండాలి. కొన్ని బోర్డులు ఇప్పటికే రామాయణ, మహాభారతాలను బోధిస్తున్నాయి. అయితే ఇప్పుడు అది విస్తృతస్థాయిలో జరగాలి' అని ఇసాక్ వ్యాఖ్యానించారు.

కరోనా టీకాతో తప్పిన ఆకస్మిక మరణాల ముప్పు

న్యూఢిల్లీ: రెండేళ్ల క్రితం కోవిడ్–19 మహమ్మారి ప్రపంచాన్ని వణికించింది. భారత్‌లోనూ కోట్లాది మంది ఈ వైరస్ బారినపడ్డారు. లక్షల మంది ప్రాణాలు కోల్పోయారు. కరోనా వ్యాప్తిని నియంత్రించడానికి టీకాలు అందుబాటులోకి వచ్చాయి. ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం ప్రజలు టీకా రెండు డోసులు తీసుకున్నారు. ఒక డోసు తీసుకున్నవారు కూడా ఉన్నారు. అయితే, ఈ వ్యాక్సిన్ యువతకు చాలా మేలు చేసినట్లు భారత వైద్య పరిశోధన మండలి(ఐసీఎంఆర్) అధ్యయనంలో వెల్లడయ్యింది. కరోనా వ్యాక్సిన్‌తో దేశంలో యువతీ యువకుల్లో ఆకస్మిక మరణాల ముప్పు చాలావరకు తగ్గినట్లు తేలింది. కనీసం ఒక డోసు తీసుకున్న వారిలోనూ ఆకస్మిక మరణాలు తగ్గాయని అధ్యయనం వెల్లడించింది. 2021 అక్టోబర్ 1 నుంచి 2023 మార్చి 31వ తేదీ వరకూ దేశవ్యాప్తంగా 47 ఆస్పత్రుల్లో ఈ అధ్యయనం నిర్వహించారు. ఎలాంటి వ్యాధులు లేకుండా ఆకస్మికంగా మరణించిన 18–45 ఏళ్ల వయసున్న యువత కేసులను విశ్లేషించారు. 729 కేసులను అధ్యయనం చేశారు. కరోనా టీకా రెండు డోసులు తీసుకున్న వారిలో ఆకస్మిక మరణానికి గురయ్యే అవకాశాలు చాలా తక్కువగా ఉన్నట్లు గుర్తించారు. ఈ మేరకు ఒక నివేదిక విడుదల చేసింది.

'ఆ 3 చట్టాలకు హిందీ పేర్లు పెట్టొచ్చు'

న్యూఢిల్లీ: భారతీయ శిక్షా స్మృతి, నేర శిక్షాస్మృతి, భారతీయ సాక్ష్యాధారాల చట్టాలకు హిందీ పేర్లు పెట్టడాన్ని పార్లమెంటరీ స్థాయీ సంఘం సమర్థించింది. ఇందుకు సంబంధించిన బీజేపీ ఎంపీ బ్రిజ్‌లాల్ నేతృత్వంలోని పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ(హోం శాఖ) తాజాగా తన నివేదికను రాజ్యసభకు సమర్పించింది. ' నేర చట్టాలకు ప్రతిపాదిత మూడు హిందీ పేర్లు రాజ్యాంగవిరుద్ధమైనవి కావు. రాజ్యాంగంలోని 348 అధికరణం ప్రకారం సుప్రీంకోర్టు, హైకోర్టులు, చట్టాలు, బిల్లులు, ఇతర అధికార పత్రాలు ఇంగ్లిష్ భాషలోనే ఉండాలనే నిబంధన ఉంది. ఆ చట్టాల పేర్లు హిందీలో ఉండకూడదు అనే నిబంధన లేదు. చట్టాలకు మాత్రమే హిందీ పేర్లు పెట్టారు. చట్టాల్లోని వాక్యాలు మొత్తం ఇంగ్లిష్‌లోనే ఉన్నాయి. ఇక్కడ రాజ్యాంగ ఉల్లంఘన జరగలేదు'' అని స్టాండింగ్ కమిటీ నివేదించింది. భారతీయశిక్షా స్మృతి–1860 చట్టం పేరును భారతీయ న్యాయ సంహిత(బీఎన్ఎస్–2023)గా, నేర శిక్షా స్మృతి–1898 చట్టం పేరును భారతీయ నాగరిక్ సురక్షా సంహిత(బీఎన్ఎస్ఎస్–2023)గా, ఇండియన్ ఎవిడెన్స్ యాక్ట్–1872 చట్టం పేరును భారతీయ సాక్ష్య అధినియం (బీఎస్ఏ–2023)గా ప్రతిపాదిస్తూ సంబంధిత మూడు బిల్లులను మోదీ సర్కార్ ఆగస్టు 11వ తేదీన లోక్‌సభలో ప్రవేశపెట్టిన విషయం తెల్సిందే.

యాడ్స్ ఆపకుంటే రూ.కోటి జరిమానా

న్యూఢిల్లీ: కొన్ని రకాల వ్యాధులను అల్లోపతి కంటే పతంజలి ఉత్పత్తులే నయం చేయగలవంటూ తప్పుడు వాణిజ్య ప్రకటనలు వెలువడుతున్నాయంటూ దాఖలైన పిటిషన్‌పై మంగళవారం సర్వోన్నత న్యాయస్థానం స్పందించింది. ఆ యాడ్స్ ఇస్తున్న పతంజలి ఆయుర్వేదను గట్టిగా మందలించింది. ' అల్లోపతి ఔషధాలను లక్ష్యంగా చేసుకుంటూ యాడ్స్ ఇవ్వడం మానుకోండి. లేదంటే కోటి రూపాయల జరిమానా విధిస్తాం. తప్పుడు ప్రకటనలను భవిష్యత్తులోనూ ఇవ్వబోమని హామీ ఇవ్వండి' అని పతంజలి ఆయుర్వేదను జస్టిస్ అహసనుద్దీన్ అమానుల్లా, జస్టిస్ ప్రశాంత్ కుమార్ మిశ్రాల సుప్రీంకోర్టు ధర్మాసనం ఆదేశించింది. మీడియా ముందు అసంబద్ధ ప్రకటనలు చేయకూడదని సూచించింది. పతంజలి యాడ్స్‌ను తప్పుబడుతూ ఇండియన్ మెడికల్ అసోసియేషన్(ఐఎంఏ) దాఖలుచేసిన పిటిషన్ విచారణ సందర్భంగా కోర్టు పై విధంగా ఆదేశాలిచ్చింది. 'పతంజలి చేస్తున్న ప్రచారానికి శాస్త్రీయ ఆధారాలు లేవు. డ్రగ్స్, ఇతర మేజిక్ రెమిడీస్ యాక్ట్–1954, వినియోగదారుల పరిరక్షణ చట్టం –2019లను ఉల్లంఘించేలా పతంజలి యాడ్స్ ఉన్నాయి' అని ఐఎంఏ తన పిటిషన్‌లో పేర్కొంది. ఈ అంశంలో సరైన మార్గదర్శకాలు జారీచేయాలని కేంద్రప్రభుత్వాన్ని ఆదేశిస్తూ విచారణను వాయిదా వేసింది.

రన్‌వే దాటి సముద్రంలోకి దూసుకెళ్లి...

అమెరికాలో నావికాదళ విమానానికి స్వల్ప ప్రమాదం



హోనలూలు: అమెరికా నావికాదళానికి చెందిన భారీ విమానమొకటి రన్‌వేను దాటేసి అకస్మాత్తుగా సముద్రంలోకి దూసుకెళ్లింది. బోయింగ్ తయారీ పోసిడాన్–8ఏ రకం భారీ విమానం హవాయిలోని మెరైన్ కోర్ సైనికస్థావరం రన్‌వేను దాటి కనోహే బే సముద్రజలాల్లోకి దూసుకెళ్లింది. అయితే ఇందులోని తొమ్మిది మంది సిబ్బంది సురక్షితంగా బయటపడటం విశేషం. మంగళవారం మధ్యాహ్నం రెండు గంటల ప్రాంతంలో ఈ ప్రమాదం జరిగింది. ఘటన తాలూకు వివరాలను అమెరికా తీర గస్తీ దళ విభాగ అధికార ప్రతినిధి ఓర్లాండో పెరిజ్ వెల్లడించారు. వాతావరణంలో పొగమంచు దట్టంగా కమ్ముకోవడంతో ఘటనాస్థలి వద్ద విమానానికి ఒక మైలు దూరం మించి కనిపించే పరిస్థితి లేదని హోనలూలులోని జాతీయ వాతావరణ శాఖ వెల్లడించింది. ప్రమాదానికి పొగమంచే అసలు కారణమని తెలుస్తోంది. అధికారికంగా కారణాలను అధికారులు వెల్లడించలేదు.

బందీలకు ఇక విముక్తి!

- హమాస్‌తో కొలిక్కివచ్చిన సంప్రదింపులు
- ఇజ్రాయెల్ జైళ్లలోని పాలస్తీనా ఖైదీలను విడుదల చేయాలన్న హమాస్
- కాల్పుల విరమణ పాటించాలని, మానవతా సాయాన్ని అనుమతించాలని స్పష్టీకరణ
- మిలిటెంట్ల షరతులకు ప్రభుత్వం అంగీకారం
- ఇజ్రాయెల్–హమాస్ మధ్య అతి త్వరలో ఒప్పందం

ఖాన్ యూనిస్/టెల్ అవీవ్: గాజాస్ట్రిప్‌లో హమాస్ మిలిటెంట్ల చెరలో ఉన్న దాదాపు 240 మంది బందీలకు త్వరలోనే విముక్తి లభించే సూచనలు కనిపిస్తున్నాయి. బందీల్లో ఇజ్రాయెల్ పౌరులతోపాటు విదేశీయులూ ఉన్నారు. వారందరినీ క్షేమంగా విడిపించడానికి ఇజ్రాయెల్, అమెరికా, ఖతార్ దేశాలు ప్రయత్నాలు వేగవంతం చేశాయి. ఆయా దేశాల ప్రతినిధులు హమాస్‌తో కొన్ని రోజులుగా జరుపుతున్న సంప్రదింపులు ఒక కొలిక్కి వచ్చినట్లు తెలుస్తోంది. బందీలను విడుదల చేయాలంటే ఇజ్రాయెల్ సైన్యం తాత్కాలికంగా కాల్పుల విరమణ పాటించాలని, గాజాలోకి పెద్ద ఎత్తున మానవతా సాయాన్ని అనుమతించాలని, ఇజ్రాయెల్ జైళ్లలో మగ్గుతున్న పాలస్తీనా ఫైటర్లను విడుదల చేయాలని హమాస్ షరతు విధించింది. దీనికి ఇజ్రాయెల్ అంగీకరించినట్లు సమాచారం. బందీలకు స్వేచ్ఛ ప్రసాదించే విషయంలో అతి త్వరలో ఒప్పందం కుదిరే అవకాశం ఉందని హమాస్ సీనియర్ నాయకుడు ఇజ్జత్ రిష్క్ మంగళవారం వెల్లడించారు. ఇజ్రాయెల్ జైళ్లలో ఉన్న పాలస్తీనియన్లను విడుదల చేస్తే బందీలను వదిలిపెట్టడానికి తాము సిద్ధమేనని ఆయన స్పష్టం చేశారు. ఇజ్రాయెల్‌తో ఒప్పందానికి చాలా సమీపంలోకి వచ్చామని ప్రవాసంలో ఉన్న హమాస్ నేత ఇస్మాయిల్ హనియేహ్ చెప్పారు. ఒప్పందం చివరి దశలో ఉందని ఖతార్ తెలియజేసింది. అంతా అనుకున్నట్లు జరిగితే గాజా నుంచి బందీలు వారి స్వదేశాలకు చేరడం ఖాయమే. అయితే, హమాస్‌పై ఒప్పందంపై ఇజ్రాయెల్ ప్రభుత్వం నోరువిప్పడం లేదు. హమాస్ చెరలో ఉన్న తమ ఆప్తులను విడిపించాలని బందీల కుటుంబ సభ్యులు ఇజ్రాయెల్ ప్రభుత్వంపై ఒత్తిడి పెంచుతున్నారు. నిత్యం ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఈ అంశం రాజకీయంగా తనకు చాలా నష్టం కలిగించే ప్రమాదం ఉండడంతో ఇజ్రాయెల్ ప్రధానమంత్రి బెంజమిన్ నెతన్యాహూ నాలుగు మెట్లు కిందికి దిగొచ్చినట్లు స్థానిక మీడియా అంచనా వేస్తోంది.

హమాస్ షరతులేమిటి?

గాజాపై ఐదు రోజులపాటు భూతల, వైమానిక దాడులను ఇజ్రాయెల్ నిలిపివేస్తే బందీల్లో 50 మంది మహిళలు, చిన్నారులను వదిలేస్తామని హమాస్ షరతు విధించినట్లు తెలిసింది. ఆ తర్వాత ముగ్గురు పాలస్తీనియన్ ఖైదీలకు చొప్పున బదులుగా ఒక్కో బందీని విడిచిపెడతామని చెబుతున్నట్లు సమాచారం. ఇజ్రాయెల్ జైళ్లలో 8 వేల మందికిపైగా పాలస్తీనా ఫైటర్లు శిక్ష అనుభవిస్తున్నారు. వారిని విడిపించుకోవడానికి బందీలను ఎరగా వాడుకోవాలని హమాస్ నిర్ణయించుకుంది.

జబాలియాపై వైమానిక దాడులు

ఒకవైపు బందీల విషయంలో సంప్రదింపులు జరుగుతుండగానే మరోవైపు ఇజ్రాయెల్–హమాస్ మధ్య యుద్ధం యథాతథంగా కొనసాగుతోంది. ఉత్తర గాజాలోని జబాలియా సిటీని పూర్తిగా చుట్టుముట్టామని ఇజ్రాయెల్ మంగళవారం ప్రకటించింది. హమాస్ శిబిరాలపై వైమానిక దాడులు చేశామని, చాలామంది మిలిటెంట్లు హతమయ్యారని వెల్లడించింది. గాజాలో ఇజ్రాయెల్ దాడుల్లో ఇప్పటివరకు మృతి చెందినవారి సంఖ్య 13,300కు చేరుకుంది. అల్–షిఫా ఆసుపత్రి నుంచి 31 మంది శిశువులను బయటకు తరలించిన సంగతి తెలిసిందే. నెలలు నిండక ముందే జన్మించిన వీరిని మెరుగైన చికిత్స కోసం ఈజిప్టుకు తరలిస్తుండగా, ఇద్దరు శిశువులు అల్–షిఫా ఆసుపత్రిలోనే చనిపోయారని వైద్యులు చెప్పారు. ఈజిప్టుకు చేర్చిన 28 మంది శిశువులకు చికిత్స కొనసాగుతోంది. మరో శిశువుకు గాజాలోనే చికిత్స అందిస్తున్నారు.

లెబనాన్‌పై ఇజ్రాయెల్ దాడుల్లో ఇద్దరు జర్నలిస్టులు మృతి

లెబనాన్‌కు చెందిన హెజ్బొల్లా మిలిటెంట్ గ్రూప్‌పై ఇజ్రాయెల్ సైన్యం విరుచుకుపడింది. దక్షిణ లెబనాన్‌లో మంగళవారం హెజ్బొల్లా స్థావరాలే లక్ష్యంగా వైమానిక దాడులు నిర్వహించింది. క్షిపణులు ప్రయోగించింది. ఈ దాడుల్లో ఫరా ఒమర్, రబీహ్ మామరీ అనే ఇద్దరు జర్నలిస్టులు, మరో ఇద్దరు పౌరులు బలయ్యారు. మృతిచెందిన ఇద్దరు జర్నలిస్టులు లెబనాన్‌కు చెందిన అల్–మయాదీన్ టీవీ చానల్‌లో పని చేస్తున్నారు.

అవినీతి, బంధుప్రీతి, బుజ్జగింపు రాజకీయాలు..

మూడు శత్రువులు

- రాజస్తాన్ ప్రచారంలో మోదీ



జైపూర్: అవినీతి, బంధుప్రీతి, బుజ్జగింపు రాజకీయాలకు కాంగ్రెస్ పార్టీ మారుపేరు అని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ విమర్శించారు. భారత్ అభివృద్ధి చెందిన దేశంగా మారకుండా ఈ మూడు భూతాలు అడ్డుపడ్డాయని అన్నారు. ఇవి మన మధ్య ఉన్నంత కాలం అనుకున్న లక్ష్యాలను సాధించలేమని వెల్లడించారు. దేశానికి ఈ మూడు ప్రధాన శత్రువులని తేల్చిచెప్పారు. మంగళవారం రాజస్తాన్‌లోని బరన్, కోటా, కరౌలీ జిల్లాల్లో అసెంబ్లీ ఎన్నికల ప్రచార సభల్లో ప్రజలను ఉద్దేశించి మోదీ మాట్లాడారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో ప్రజలు ఎన్నో బాధలు ఎదుర్కొన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్ర ప్రజలను దొంగలు, నేరగాళ్ల చేతికి అప్పగించిందని మండిపడ్డారు. ఈ ఎన్నికల్లో ముఖ్యమంత్రి అశోక్ గహ్లోత్ ఓటమి ఖాయమని చిన్నపిల్లలు సైతం చెబుతున్నారని గుర్తుచేశారు. గహ్లోత్ పాలనలో రాష్ట్రం నేరగాళ్లకు అడ్డాగా మారిపోయిందని, సంఘ విద్రోహ శక్తులు చెలరేగిపోయాయని, శాంతి భద్రతలు పూర్తిగా క్షీణించాయని దుయ్యబట్టారు. బీజేపీ అధికారంలోకి రాగానే వ్యవస్థలను ప్రక్షాళన చేస్తామన్నారు. మహిళలకు రక్షణ కల్పిస్తామని, వారి సాధికారతే ధ్యేయంగా పని చేస్తామని మోదీ హామీ ఇచ్చారు. యువత కలలను కాంగ్రెస్ ప్రభుత్వం భగ్నం చేసిందన్నారు. అరాచక ప్రభుత్వానికి కౌంట్‌డౌన్ మొదలైందన్నారు. డిసెంబర్ 3న రాజస్తాన్‌లో ప్రభుత్వం మారడం తథ్యమని ప్రధాని మోదీ స్పష్టం చేశారు.

పీఎం అంటే 'అపశకున మోదీ'

- దురదృష్టాన్ని మోసుకొచ్చే వ్యక్తి నరేంద్ర మోదీ: రాహుల్ గాంధీ



జైపూర్: ప్రధానమంత్రి(పీఎం) అంటే అపశకున మోదీ (పనౌతీ మోదీ) అని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు రాహుల్ గాంధీ అభివర్ణించారు. ఆయన దురదృష్టాన్ని మోసుకొచ్చే వ్యక్తి అని విమర్శించారు. మంగళవారం రాజస్తాన్‌లో అసెంబ్లీ ఎన్నికల ప్రచార సభల్లో రాహుల్ ప్రసంగించారు. వన్డే క్రికెట్ ప్రపంచకప్ ఫైనల్ మ్యాచ్‌లో మోదీ పేరిట ఉన్న స్టేడియంలో ఆస్ట్రేలియా చేతిలో భారత జట్టు ఓడిపోయిందని, ప్రధాని మోదీ ఈ మ్యాచ్‌కు హాజరయ్యారని గుర్తుచేశారు. ప్రధానిపై రాహుల్ వ్యాఖ్యలు చేయడం సిగ్గుచేటంటూ బీజేపీ సీనియర్ నేత రవిశంకర్ ప్రసాద్ మండిపడ్డారు. తక్షణం క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

లష్కరే తోయిబా ఉగ్రవాద సంస్థే

జెరూసలేం: పాకిస్తాన్ కేంద్రంగా కార్యకలాపాలు సాగిస్తున్న లష్కరే తోయిబా ఉగ్ర సంస్థేనని ఇజ్రాయెల్ మరోసారి స్పష్టం చేసింది. ముంబై ఉగ్రదాడులకు 15 ఏళ్లు పూర్తి కావొస్తున్న సందర్భంగా ఇజ్రాయెల్ ఈ మేరకు ప్రకటించింది. 'లష్కరే తోయిబా ఉగ్ర సంస్థే. 2013 నుంచీ ఆ సంస్థ ఉగ్ర కార్యకలాపాలు సాగిస్తోంది. పరిపాలనా పరమైన పొరపాటు కారణంగానే ఇటీవల ఆ విషయాన్ని స్పష్టం చేశాం. అంతే తప్ప ఇదేమీ కొత్త విషయం కాదు' అని ఇజ్రాయెల్ విదేశాంగ శాఖ ప్రతినిధి చెప్పారు. అంతకుముందు ఇదే విషయాన్ని భారత్‌లోని ఇజ్రాయెల్ దౌత్య కార్యాలయం ప్రకటించింది.

'నేషనల్ హెరాల్డ్' ఉదంతంలో రూ.752 కోట్ల ఆస్తుల అటాచ్

న్యూఢిల్లీ: నేషనల్ హెరాల్డ్ వార్తాపత్రిక యాజమాన్య హక్కులున్న యంగ్ ఇండియా సంస్థ లావాదేవీల్లో మనీ లాండరింగ్ జరిగిందంటూ దాఖలైన కేసులో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ తాజాగా రూ.751.9 కోట్ల విలువైన ఆస్తులను జప్తుచేసింది. మంగళవారం ఒక ప్రకటనలో సంస్థ ఈ మేరకు పేర్కొంది. 'ముంబై, ఢిల్లీ, లక్నోల్లో స్థిరాస్తులకు సంబంధించి అసోసియేటెడ్ జర్నల్స్ లిమిటెడ్(ఏజేఎల్) రూ.661.69 కోట్ల విలువైన నేరాలకు పాల్పడింది. ఏజేఎల్‌లో ఈక్విటీ షేర్ల రూపంలో యంగ్ ఇండియా(వైఐ) రూ.90.21 కోట్ల విలువైన నేరాలకు పాల్పడినట్లు తమ దర్యాప్తులో తేలింది'' అని ఈడీ వివరించింది.

దేశ ప్రయోజనం కోసమే జమిలి ఎన్నికలు

మాజీ రాష్ట్రపతి, 'వన్ నేషన్‌– వన్ ఎలక్షన్'కమిటీ చైర్మన్ కోవింద్ వెల్లడి

రాయ్‌బరేలీ(యూపీ): జమిలి ఎన్నికల విధానం దేశ హితం కోసమేతప్ప, ఏ ఒక్క రాజకీయ పార్టీకీ సంబంధించింది కాదని మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ చెప్పారు. దేశంలో లోక్‌సభకు, రాష్ట్ర అసెంబ్లీలకు ఒకే విడతలో ఎన్నికలు జరపాలన్న ప్రతిపాదన సాధ్యాసాధ్యాలపై కేంద్రం నియమించిన 8 మంది నిపుణుల కమిటీకి కోవింద్ చైర్మన్ అన్న విషయం తెలిసిందే. ఉత్తరప్రదేశ్‌లోని రాయ్‌బరేలీలో సోమవారం రాత్రి కోవింద్ మీడియాతో మాట్లాడారు. 'ఒకే విడతలో ఎన్నికలు జరిపితే డబ్బు ఆదా అయి, ప్రజలకు మంచి జరుగుతుంది. ఆ నిధులతో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టవచ్చు. అందుకే, ఈ అంశాన్ని దేశానికి ప్రయోజనం కలిగించేది భావించి, సహకరించాల్సిందిగా అన్ని రాజకీయ పార్టీలకు విజ్ఞప్తి చేస్తున్నా. జమిలి ఎన్నికలతో ఏ రాజకీయ పార్టీకీ సంబంధం లేదు'అని ఆయన స్పష్టం చేశారు. 'పార్లమెంటరీ కమిటీ, నీతీ ఆయోగ్, భారత ఎన్నికల సంఘం వంటివి ఇప్పటికే జమిలి ఎన్నికలు ప్రయోజనకరమని చెప్పాయి. జమిలి ఆనవాయితీని దేశంలో మళ్లీ తీసుకురావాలని సూచించాయి. ప్రభుత్వం అందుకే కమిటీ ఏర్పాటు చేసింది. మేం ప్రజలతో సంప్రదింపులు జరిపి, ప్రభుత్వానికి సూచనలిస్తున్నాం. ఇప్పటికే రిజిస్టర్డ్ జాతీయ పార్టీలతో మాట్లాడి, వారి సలహాలు తీసుకున్నాం. వారంతా దాదాపుగా మద్దతు ప్రకటించారు. ఈ అంశాన్ని జాతికి ప్రయోజనకరమైందిగా భావించి సహకరించాల్సిందిగా అన్ని పార్టీలను కోరుతున్నా'అని కోవింద్ అన్నారు. జమిలి ఎన్నికలతో ప్రత్యేకంగా ఏ ఒక్క పార్టీకి లబ్ది కలగదన్నారు. 'ఈ విధానం అమలైతే, ఆ సమయంలో కేంద్రంలో అధికారంలో ఉన్న పార్టీకి లాభం చేకూరుతుంది. అది బీజేపీ, కాంగ్రెస్ లేదా మరే ఇతర పార్టీ అయినా కావచ్చు. ఇందులో వివక్షకు తావులేదు'అని వెల్లడించారు. జమిలిపై పార్టీలతో పాటు లా కమిషన్ అభిప్రాయాలను కూడా తెలుసుకోవాలని కమిటీ నిర్ణయించింది.

బైజూస్ సహ వ్యవస్థాపకుడికి

ఈడీ నోటీసులు

న్యూఢిల్లీ: రూ.9,300 కోట్ల మేర విదేశీ మారకద్రవ్య నిబంధనలను ఉల్లంఘించారన్న ఆరోపణలపై ఎడ్‌టెక్‌లో అగ్రగామిగా ఉన్న బైజూస్‌కు, ఆ సంస్థ సీఈవో, సహవ్యవస్థాపకుడు కూడా అయిన రవీంద్రన్ బైజూకు నోటీసులిచ్చినట్లు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) తెలిపింది. రవీంద్రన్‌తోపాటు సంస్థ చీఫ్ ఫైనాన్షియల్ అధికారికి చెందిన బెంగళూరులోని మూడు ప్రాంతాల్లో ఏప్రిల్‌లో సోదాలు జరిపిన విషయం గుర్తు చేసింది. దేశం వెలుపల చేసిన ముందస్తు చెల్లింపులకు తగిన దిగుమతుల పత్రాలను సమర్పించడంలో సంస్థ విఫలమైందని ఈడీ తెలిపింది.

మురుగునీటిలో కుబేరుడు

బ్రస్సెల్స్: వేల కోట్లకు పడగలెత్తిన సంపన్నులు ఆకాశహర్మ్యాల్లో బిజినెస్‌లో బిజీగా ఉంటారని తెలిసిందే. అందుకు భిన్నంగా ప్రపంచ కుబేరుడు బిల్‌గేట్స్ బెల్జియంలో భూగర్భ మురుగునీటి పారుదల వ్యవస్థలో దిగారు. ముక్కు మూసుకుని అక్కడి కంపును భరిస్తూనే బ్రస్సెల్స్ నగరంలో అమలవుతోన్న సీవేజ్ సిస్టమ్‌ను స్వయంగా పరిశీలించారు. అక్కడి మురుగువ్యవస్థ మ్యూజియంను సందర్శించారు. మ్యూజియం తాలూకు మ్యాన్‌హోల్‌లో బిల్‌గేట్స్ దిగుతున్న ఫొటోలు ప్రస్తుతం సామాజిక మాధ్యమాల్లో విస్తృతంగా షేర్ అవుతున్నాయి. సంబంధిత వీడియోను బిల్‌గేట్స్ స్వయంగా ఇన్‌స్టాగామ్‌లో షేర్ చేశారు. 'నవంబర్ 19వ తేదీన వరల్డ్ టాయిలెట్ డేను పురస్కరించుకుని ప్రపంచ ఆరోగ్యంలో మురుగునీటి పాత్రను తెలియజేప్పేందుకు బ్రస్సెల్స్ సిటీ అండర్‌గ్రౌండ్ మురుగు ప్రపంచంలో విహరించా' అని బిల్‌గేట్స్ వ్యాఖ్యానించారు. ''1800 కాలంలో సెన్నీ నదిలో బ్రస్సెల్స్ నగర చెత్తనంతా పారబోసేవారు. దాంతో ఆకాలంలో భయంకర కలరా వ్యాధి ప్రబలడంతో నగర ప్రజలు కష్టాలుపడ్డారు. ఆ తర్వాత 322 కిలోమీటర్ల మేర విస్తృత స్థాయిలో మురుగునీటి పారుదల వ్యవస్థ, నీటి శుద్ధి కర్మాగారాలను ఏర్పాటుచేసుకుని నగరాన్ని కడిగిన అద్దంలా మార్చుకున్నారు'' అని బిల్‌గేట్స్ తన వీడియోలో వ్యాఖ్యానించారు.

సాక్షి 24|7
కర్ణాటక
KARNATAKA
బుధవారం, 22, నవంబర్, 2023



చిట్టి మయూరాలు
బెంగళూరు జేపీ నగర ఆర్వే ఆడిటోరియంలో చిన్నారుల ఒడిస్సీ నృత్య ప్రదర్శన

పీజీ హాస్టళ్లపై నియంత్రణ

- నగర పోలీస్ కమిషనర్ వెల్లడి
- పీజీల్లోని ప్రతి ఒక్కరి వివరాల నమోదుకు వెబ్‌సైట్
- సౌకర్యాలను మెరుగుపరచాలి
- కొత్త మార్గదర్శకాలకు కసరత్తు



పీజీల్లో చేరేవారి వివరాలు ఆన్‌లైన్ చేయాలి



బెంగళూరులో సుమారు 5 వేలకు పైగా పేయింగ్ గెస్టు హాస్టళ్లు ఉన్నాయి

బనశంకరి: సిలికాన్ సిటీలో బ్యాచిలర్లు, విద్యార్థులు, టెక్కీలు తదితరులు బస చేయాలంటే పీజీ హాస్టళ్లే గుర్తుకొస్తాయి. డబ్బు చెల్లిస్తే ఆహారం, బస వసతులు లభిస్తాయి. నగరంలో ఇది ఒక ప్రముఖ సేవా వ్యాపారంగా మారింది. అయితే.. పేయింగ్ గెస్ట్ హాస్టళ్లపై చుట్టుపక్కల ప్రజలు బీబీఎంపీకి ఫిర్యాదులు చేస్తున్నారు, ఈ నేపథ్యంలో పీజీలకు కొత్త మార్గదర్శకాలను ఏర్పాటు చేసి, ఒక వెబ్‌సైట్‌ను రూపొందిస్తామని నగర పోలీస్ కమిషనర్ బి.దయానంద తెలిపారు. మంగళవారం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. నగరంలో 5 వేల పీజీ హాస్టల్స్ ఉన్నాయని తెలిపారు. పీజీలో చేరే ప్రతి ఒక్కరి వివరాలను ఈ వెబ్‌పోర్టల్‌లో పీజీ యజమానులు అప్‌లోడ్ చేయవచ్చునన్నారు. మారతహళ్లిలో 167 పీజీల్లో దీనిని ప్రయోగాత్మకంగా నిర్వహించామని, ఈ పథకం దేశంలోని పలు రాష్ట్రాల్లో ఉందని తెలిపారు. ఎవరు పీజీల్లోకి వస్తున్నారు, ఎవరు ఉంటున్నారు అనే సమాచారం తమకు లభిస్తుందన్నారు.

ఫిర్యాదులు వస్తున్నాయి: పాలికె కమిషనర్

పాలికె కమిషనర తుషార్ గిరినాథ్ మాట్లాడుతూ పాలికె లైసెన్సు నిబంధనలను ఉల్లంఘించి పలు పీజీలు నిర్వహిస్తున్నారు. పన్నుల సేకరణ దృష్టితో పీజీలను అధికారులు తనిఖీ చేయాలన్నారు. డబ్బుపై ఆశతో నిబంధనలు ఉల్లంఘించి ఒకే గదిలో ఎక్కువ మందిని ఉంచుతున్నారని, మౌలిక వసతులు కూడా సక్రమంగా అందించడంలేదన్నారు. సౌకర్యాలు కల్పించలేదని, ఎక్కువ ఫీజులు వసూలు చేస్తున్నారని ఫిర్యాదులు వస్తున్నాయన్నారు. దీంతోపాటు పీజీలకు ఇరుగుపొరుగు ఉన్న ప్రజలు అనేక ఫిర్యాదులు చేశారని, ఈ నేపథ్యంలో పీజీలకు బీబీఎంపీ కొత్త మార్గదర్శకాలను విడుదల చేయనుందని చెప్పారు.

దొంగల ముఠా అరెస్టు



చోరీ సొత్తును పరిశీలిస్తున్న పోలీస్ కమిషనర్ దయానంద తదితరులు

బనశంకరి: ఉద్యాన నగరిలో వరుస చోరీలకు పాల్పడుతున్న బడా గజదొంగ ఖాకీలకు చిక్కాడు. 83 నేరాలతో సంబంధమున్న ఘరానా దొంగ కార్తీక్‌తో పాటు ముగ్గురు చోరులను మంగళవారం పశ్చిమ విభాగం పోలీసులు అరెస్ట్‌చేశారు. వీరి వద్ద నుంచి రూ.70 లక్షల విలువ చేసే బంగారు, వెండి ఆభరణాలను స్వాధీనం చేసుకున్నట్లు నగర పోలీస్ కమిషనర్ బీ దయానంద్ తెలిపారు. వివరాలు... గోవిందరాజనగర పోలీస్‌స్టేషన్ పరిధిలో జరుగుతున్న ఇళ్ల చోరీలపై విచారణజరిపి కార్తీక్, దిలీప్, అర్జున్ అనే ముగ్గురు దొంగలను అరెస్ట్‌చేశారు. వీరి వద్ద నుంచి 1.2 కేజీల బంగారు ఆభరణాలు, 3.5 కేజీల వెండి సొత్తును సీజ్ చేశారు. 2005 నుంచి ఈ ముఠా నగరంలో చోరీలు, దోపిడీలకు పాల్పడుతూ ఇప్పటివరకు 83 కు పైగా కేసుల్లో ప్రమేయం ఉంది. వీరి అరెస్టుతో ఇటీవల జరిగిన 13 చోరీలు పరిష్కారమైనట్లు కమిషనర్ తెలిపారు.

పెన్షన్లు మింగేస్తున్న పోస్టుమ్యాన్



పోస్టాఫీసు ముందు ధర్నా చేస్తున్న గ్రామస్తులు

దొడ్డబళ్లాపురం: ప్రభుత్వం నుంచి వస్తున్న వృద్ధాప్య పెన్షన్లు, ఇతర పథకాల ద్వారా లబ్ధిదారులకు వచ్చే డబ్బులను పోస్టుమ్యాన్ స్వాహా చేస్తున్నాడని ఆగ్రహించిన బాధితులు పోస్టాఫీసును ముట్టడించి ధర్నా చేశారు. ఈ సంఘటన కనకపుర తాలూకా వెంకటరాయనదొడ్డి గ్రామంలో చోటుచేసుకుంది. గ్రామస్తులు మాట్లాడుతూ పోస్టుమ్యాన్ రమేశ్ వృద్ధాప్య పెన్షన్లు, ఇతర పథకాల ద్వారా వస్తున్న డబ్బులను లబ్ధిదారులకు ఇవ్వకుండా జేబులో వేసుకుంటున్నాడని వాపోయారు. డబ్బులు అడిగితే అప్పుడు, ఇప్పుడు అని చుట్టూ తిప్పుకుంటున్నాడని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఒకవేళ ఇచ్చినా కొంత నగదు పట్టుకుని ఇస్తున్నాడన్నారు. పోస్టుమాస్టర్ విజయ్‌కుమార్ స్పందిస్తూ పై అధికారులతో చర్చించి సమస్య పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు.

పోస్టల్ ఉద్యోగి రూ.35 లక్షలు స్వాహా

మైసూరు: స్థానిక ప్రజల నుంచి పొదుపు ఖాతాల్లో కట్టేందుకు సేకరించిన సుమారు రూ.35 లక్షలకు పైగా సొమ్మును టి.నరిసిపురలోని టి బెట్టళ్ళి పోస్టాఫీసు బీపీఓ వాసుకి స్వాహా చేశాడు. చుట్టుపక్కల గ్రామాలకు చెందిన వృద్ధులు, రైతు కూలీలు ఈ పోస్టాఫీసులో సేవింగ్స్ ఖాతాల్లో నగదు కట్టేవారు. వారి నుంచి వాసుకి డిపాజిట్లు వసూలు చేసేవాడు. ఇలా 60 మంది నుంచి సేకరించిన రూ. 35 లక్షలకు పైగా సొమ్మును జల్సాలు చేశాడు. కొన్ని సంవత్సరాలుగా ఈ కుంభకోణం జరుగుతోంది. కొందరు ఖాతాదారులు తమ అకౌంట్లను చెక్ చేయగా ఖాళీగా ఉండడంతో షాక్ తిన్నారు. దీంతో వారు తలకాడు పోలీసులకు ఫిర్యాదు చేయగా, నిందితుడు వాసుకిని అరెస్టు చేశారు.

కరెంటు కొనైనా రైతులకు ఇస్తాం: మంత్రి

బనశంకరి: కరువు మధ్య పెరుగుతున్న విద్యుత్ డిమాండ్‌ను తీర్చడానికి చర్యలు తీసుకుంటామని ఇంధన శాఖ మంత్రి కేజే జార్జ్ తెలిపారు. మంగళవారం బెస్కాం కేంద్ర కార్యాలయంలో అధికారులతో ఆయన భేటీ అయ్యారు. ప్రస్తుతం గృహ, పరిశ్రమలకు రోజుకు 14,000 మెగావాట్లు, నీరావరి పంపుసెట్లకు 4,500 మెగావాట్ల విద్యుత్ అవసరం ఉందన్నారు. ఇతర రాష్ట్రాల నుంచి కొనుగోలు చేసైనా పంపుసెట్లకు రోజుకు 7 గంటలు విద్యుత్ సరఫరా చేస్తామన్నారు. వర్షాల కొరతతో విద్యుత్‌కు డిమాండ్ ఎక్కువగా ఉందని, దీనికి అనుగుణంగా విద్యుత్ ఉత్పత్తి చేస్తున్నామన్నారు. రాబోయే ఫిబ్రవరి, మార్చి, ఏప్రిల్‌లో సరాసరి విద్యుత్ డిమాండ్ 15,500 మెగావాట్ల నుంచి 16,500 మెగావాట్లకు చేరుకోవచ్చని చెప్పారు. రాష్ట్రంలో 2500 మెగావాట్ల పంప్డ్ స్టోరేజ్, జల, సౌర విద్యుత్ కేంద్రాల ఏర్పాటుకు తెహ్రీ హైడ్రో సంస్థతో ఒప్పందాలు చేసుకున్నట్లు తెలిపారు.

రాజధానిలో ఐటీ దాడులు

బనశంకరి: ఆదాయ పన్ను ఎగవేత ఆరోపణలతో పారిశ్రామికవేత్తలు, బంగారు షాపుల యజమానుల ఇళ్లు, ఆఫీసుల్లో మంగళవారం ఐటీ అధికారులు దాడులు చేశారు. బెంగళూరులో మాగడిరోడ్డు, ఆడుగోడి అపార్టుమెంట్‌లోని నివాసాలతో పాటు పలువురు వ్యాపారవేత్తల ఇళ్లలో సోదాలు కొనసాగుతున్నాయి. ఉదయం 7 గంటల నుంచి రెండు ఇన్నోవా కార్లలో వచ్చిన అధికారులు మాగడిరోడ్డులోని పారిశ్రామికవేత్త పునీత్ బోరా ఫ్లాటులో సోదాలు చేసి పత్రాలను స్వాధీనం చేసుకున్నారు.

అర్థవంతంగా అసెంబ్లీ సాగాలి : సభాపతి

శివాజీనగర: బెళగావి సువర్ణ విధానసౌధలో డిసెంబర్ 4 నుంచి 10 రోజుల పాటు జరిగే శీతాకాల శాసనసభా సమావేశాలను అర్థవంతంగా జరపాలని సీఎం సిద్దరామయ్య, మంత్రులకు విధానపరిషత్తు సభాపతి బసవరాజ ఎస్.హొరట్టి కోరారు. ఈ మేరకు సీఎం సహా పలువురు మంత్రులకు ఆయన లేఖలు రాశారు. సమావేశాల అమూల్యమైన సమయం ధర్నా, దీక్షల వల్ల వ్యర్థమవుతోందని ఆరోపణలున్నాయి. సువర్ణ విధానసౌధలో జరిగే సమావేశాలను సక్రమంగా, అర్థవంతంగా నిర్వహించాలి అని సూచించారు. అసెంబ్లీ బయట ప్రజాసంఘాల ధర్నాలను తగ్గించి, అసెంబ్లీ లోపల ప్రజల సమస్యలపై మరింత బాగా చర్చ జరిగేలా చూడాలన్నారు.

శివమొగ్గ నుంచి గోవా, తిరుపతికి విమానాలు

శివమొగ్గ: శివమొగ్గలోని విమానాశ్రయం నుంచి గోవా, హైదరాబాద్, తిరుపతికి స్టార్ ఎయిర్ సంస్థ విమాన సర్వీసులను ప్రారంభించింది. గోవా, తిరుపతి మధ్య ప్రతి మంగళవారం, బుధ, గురు, శనివారాల్లో విమానం ప్రయాణిస్తుంది. మంగళ, గురు, శనివారాల్లో శివమొగ్గ నుంచి మధ్యాహ్నం 1.55 గంటలకు విమానం బయలుదేరి మధ్యాహ్నం 2.40కు గోవాలో దిగుతుంది. మళ్లీ గోవా నుంచి మధ్యాహ్నం 3.10 గంటలకు బయలుదేరి సాయంత్రం 4.05 గంటలకు శివమొగ్గకు వస్తుంది.

బిరియాని తిని అస్వస్థత

యశవంతపుర: బిరియాని తిని 17 మంది అస్వస్థతకు గురైన ఘటన చిక్కమగళూరు జిల్లా కడూరులో జరిగింది. ఓ వేడుకలో శుభకార్యం అనంతరం బిరియాని చేశారు. తిన్న తరువాత అందరూ వాంతి, విరేచనాలు చేసుకున్నారు. దీంతో 17 మందిని హుటాహుటిన కడూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. వైద్యులు చికిత్సలు చేసి ప్రమాదం లేదని తెలిపారు. 9 మంది మహిళలు, 8 మంది పురుషులు ఉన్నారు.

వర్సిటీలో పురుగుల ఉప్మా

శివాజీనగర: బెంగళూరు విశ్వవిద్యాలయం ఆహారంలో పురుగులు వచ్చాయని వందలాది మంది విద్యార్థులు ధర్నా నిర్వహించారు. హాస్టల్ వార్డెన్ నిర్లక్ష్యం ఉందని, నాసిరకం తిండి పెడుతున్నారని, ప్రశ్నిస్తే తమపై దౌర్జనం చేస్తారని ఆరోపించారు. హాస్టల్లో మంగళవారం ఉదయం ఉప్మా పెట్టగా, అందులో పురుగులు ఉండడంతో విద్యార్థులు మూకుమ్మడిగా ఆందోళన చేశారు. ఈ ఉప్మా తిని రోగాలు వస్తే ఎవరు బాధ్యులని మండిపడ్డారు. హాస్టళ్లలో భోజనం, నీరు, వసతులు సరిగా లేవని, వార్డెన్‌ను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు.

పోలీసుల జీప్‌తో వ్యక్తి పరారీ

తుమకూరు: అన్నదమ్ముల మధ్య గొడవ జరిగితే పరిష్కారం కోసం వచ్చిన పోలీసుల జీప్ తీసుకుని ఒకరు పరారయ్యారు. ఈ విచిత్ర సంఘటన గుబ్బి తాలూకాలో జరిగింది. వివరాలు.. ఉన్ననారనహళ్ళి గ్రామానికి చెందిన మునియ, సోమవారం రాత్రి సోదరులతో గొడవపడ్డాడు. మునియ 112 నంబర్‌కు ఫోన్ చేసి తనను కొడుతున్నారని పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీంతో దగ్గరిలోని హెబ్బూరు పోలీసులు జీపు వేసుకుని వచ్చారు. మునియను కారులో వెనుకాల కుర్చోబెట్టి, బయట గొడవ గురించి తెలుసుకుంటున్న సమయంలో మునియ జీప్‌ను స్టార్ట్ చేసి నడుపుకుంటూ వెళ్లిపోవడంతో పోలీసులు కంగుతిన్నారు. పోలీసులు మునియను మూడుగంటల పాటు వెంబడించి జీప్‌ను అడ్డుకున్నారు. అతనిపై కేసు నమోదు చేసి అరెస్టు చేశారు.

న్యూస్‌రీల్

సౌధ దగ్గర గంధం చెట్టు చోరీ



చెట్టును కొట్టివేసిన దృశ్యం

శివాజీనగర: రాత్రికి రాత్రి దొంగలు పడి శ్రీగంధం చెట్టును నరికి ఎత్తుకెళ్లారు, ఇదెక్కడో అడవిలో జరిగిన ఘటన కాదు, శక్తి కేంద్రం విధానసౌధకు కూతవేటు దూరంలో జరిగిన దొంగతనం ఇది. కేఆర్ సర్కిల్‌లో రాత్రి, పగలు అనే తేడా లేకుండా ట్రాఫిక్ రద్దీ ఉంటుంది. ఇక్కడే ఉన్న ఎస్‌జే ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీ ఆవరణలో 15 సంవత్సరాల నుంచి మూడు శ్రీగంధం చెట్లు ఉన్నాయి. వీటిలో ఒక చెట్టును సోమవారం రాత్రి నరికి ఎత్తుకెళ్లారు. చోరీ గురించి ప్రిన్సిపాల్ సదాశివ మూర్తి విధానసౌధ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఘటనాస్థలికి దగ్గరిలోనే విధానసౌధ, మరోవైపు డీజీపీ కార్యాలయం ఉంటాయి. అయితే దొంగలు ఎలాంటి జంకు గొంకు లేకుండా గంధం చెట్టును కొట్టుకెళ్లడం గమనార్హం. పోలీసులు గంధం చోరుల కోసం గాలింపు చేపట్టారు.

పెళ్లికి ఓకే.. పోక్సో కేసు మాఫీ

యశవంతపుర: బాధితురాలు, పోక్సో కేసులో అరెస్టయిన నిందితుడు రాజీ పడి, పెళ్లికి సిద్ధం కావడంతో ఆ కేసును హైకోర్టు రద్దు చేసింది. కోలారు జిల్లా చింతామణి పోలీసుస్టేషన్‌లో దాఖలైన పోక్సో కేసును హైకోర్టు ధర్మాసనం మంగళవారం కొట్టివేసింది. బాధిత బాలిక మేజర్ కావటంతో నిందితునితోనే పెళ్లి చేయడానికి ఇరువైపు కుటుంబాలు అంగీకారానికి వచ్చాయి. దీంతో కేసును రద్దు చేయాలని బాధితురాలు హైకోర్టును ఆశ్రయించింది. జైల్లో ఉన్న నిందితున్ని పోలీసులు హైకోర్టులో న్యాయమూర్తి ముందు హాజరు పరిచారు. తాము పెళ్లి చేసుకుంటామని, కేసులు వద్దని ఇద్దరూ చెప్పడంతో న్యాయమూర్తి కేసును మాఫీ చేశారు. నెల రోజులలోపు పెళ్లి జరగాలని హైకోర్టు షరతు విధించింది.

రూ. కోటి పరిహారమివ్వాలి

యశవంతపుర: కలబురగి జిల్లా అఫ్జలపుర తాలూకా చినమగేరి ప్రభుత్వ పాఠశాలలో మధ్యాహ్న భోజనం సాంబారు పాత్రలో పడి మరణించిన 2వ తరగతి బాలిక మహంతమ్మ (8) కుటుంబీకులు న్యాయం కోసం ధర్నా చేశారు. అఫ్జలపుర ఎమ్మెల్యే ఎంవై పాటిల్ పరామర్శకు రాగా, కోటి రూపాయల పరిహారంతో పాటు బాలిక తల్లికి ఉద్యోగం ఇవ్వాలని, మృతురాలి తమ్ముని చదువు ఖర్చును ప్రభుత్వమే భరించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి న్యాయం చేస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. బాలిక మృతికి పాఠశాల సిబ్బంది కారణమని ఉపాధ్యాయులు, వంట మనుషులను సస్పెండ్ చేయాలని దేవల గాణగాపుర పోలీసులకు ఫిర్యాదు చేశారు.

కావేరి జలదీక్ష



మండ్య: తమిళనాడుకు కావేరి నీటిని వదలరాదని కోరుతూ రైతు సంఘాల ఆధ్వర్యంలో మండ్య నగరంలో నిరసన కొనసాగుతోంది. సర్ ఎం.వీ విగ్రహం ఎదుట ధర్నా దీక్షలో మంగళవారం పాల ఉత్పత్తిదారులు, సహకార సంఘాల ఉద్యోగులు పాల్గొని మద్దతు తెలిపారు. జాతీయ రహదారిపై కూడా బైఠాయించారు. కావేరి నిరసనలు ఇప్పటికి 78వ రోజుకు చేరాయి.

దోసకాయల అవ్వ కన్నుమూత



రాహుల్‌గాంధీతో శారదమ్మ (ఫైల్)

తుమకూరు: భారత్ జోడో యాత్రలో తుమకూరులో కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీకి తినడానికి దోసకాయలు ఇచ్చిన వీధి వ్యాపారి శారదమ్మ (78) మంగళవారం కన్నుమూసింది. రాహుల్‌కు దోసకాయలు ఇవ్వడం ద్వారా ఆమె ప్రచారాంశమైంది. గతేడాది అక్టోబర్ 9న రాహుల్ గాంధీ చిక్కనాయకనహళ్ళి పట్టణంలో నడక సాగిస్తుండగా, ఫుట్‌పాత్‌పై శారదమ్మ దోసకాయలు అమ్ముతూ ఉంది. రాహుల్‌ను పిలిచి ఆమె రెండు దోసకాయలను ఇచ్చారు. తన పొలంలో పండించిన దోసకాయలను మీకోసం తెచ్చానని చెప్పడంతో రాహుల్ ఆమెను అక్కున చేర్చుకున్నారు. వయసు మీద పడడంతో ఆమె కుమారుని ఇంట్లో కన్నుమూసింది.



మంగళవారం బెంగళూరులో మేఘావృతమైన ఆకాశం. అంతటా చలి వాతావరణం ఆవరించింది



చలికాలం వచ్చేయడంతో బెంగళూరు గాంధీనగరలో జోరుగా ఉన్నిదుస్తుల అమ్మకాలు



బెళగావి రైల్వేస్టేషన్‌లో వందేభారత్ రైలు. బెంగళూరు- బెళగావి మధ్య ట్రయల్ రన్ ఆరంభమైంది

ఒక్కడినే ప్రశ్నిస్తున్నా

దొడ్డబళ్లాపురం: కాంగ్రెస్ ప్రభుత్వం తప్పులను, వైఫల్యాలను ఎవ్వరూ ప్రశ్నించడం లేదు, తానొక్కడినే ప్రశ్నిస్తున్నానని జేడీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు కుమారస్వామి అన్నారు. మంగళవారం రామనగర తాలూకా దాసేగౌడనదొడ్డి గ్రామంలో మీడియాతో మాట్లాడిన ఆయన తనకు వ్యతిరేకంగా ఎన్ని పోస్టర్లయినా వేసుకోని, లెక్కచేయనన్నారు. కరువు పీడిస్తుంటే రైతులకు ఎందుకు పరిహారం ఇవ్వడం లేదో చెప్పాలన్నారు.

కుమార మాటలు సిగ్గుచేటు: డీకే

శివాజీనగర: తాను థియేటర్లలో బ్లూఫిలింలు ఆడించానని జేడీఎస్ నేత హెచ్.డీ.కుమారస్వామి చేస్తున్న ఆరోపణలు రుజువుపరిస్తే రాజకీయాల నుండి తప్పుకొంటానని డిప్యూటీ సీఎం డీ.కే.శివకుమార్ అన్నారు. మంగళవారం నగరంలో విలేకరులతో మాట్లాడిన ఆయన, కుమారస్వామి నోటికి వచ్చినట్లు మాట్లాడి ప్రజల మధ్య నవ్వుల పాలు అవుతున్నారన్నారు. ఆయన మాటలు ఆయనకే సిగ్గుచేటుగా ఉన్నాయన్నారు. ఆయన కనకపురకు వెళ్లి తన గురించి గురించి తెలుసుకోవాలన్నారు. బీజేపీ నేత అశోక్ ఢిల్లీ యాత్ర చేసి కరువు నిధులు తెప్పించాలన్నారు.

సౌదీ జైలు నుంచి విడుదల



తల్లితో చంద్రశేఖర్

యశవంతపుర: సౌదీ అరేబియాలో పని చేస్తూ అనుకోని పరిస్థితుల్లో 11 నెలలపాటు జైల్లో ఉన్న దక్షిణ కన్నడ జిల్లా కడబ తాలూకా ఐతూరికి చెందిన చంద్రశేఖర్‌కు స్వేచ్ఛ లభించింది. ఒక మహిళ ఖాతా నుంచి తన ఖాతాకు కొంతడబ్బు బదిలీ అయినందుకు అనుమానంతో అక్కడి పోలీసులు తనను అరెస్ట్ చేసి జైలులో ఉంచారని ఆయన తెలిపారు. కొన్నినెలలుగా జైల్లోనే మగ్గిపోయారు. ఈ విషయమై మంగళూరులో కుటుంబసభ్యులు మీడియా ముందు గోడు వెళ్లబోసుకోవడంతో బయటి ప్రపంచానికి తెలిసింది. చివరికి విడుదల చేయడంతో సోమవారం రాత్రి మంగళూరుకు చేరుకున్నాడు. తల్లి హేమావతి, సోదరులు ఆయనకు స్వాగతం పలికారు. మీడియాలో వార్తలు రావడం, అరేబియాలోని మంగళూరువాసులు కూడా తన విడుదలకు సహకరించినట్లు తెలిపారు. జైల్లో ఉన్న సమయంలో చాలా కష్టాలు పడ్డానని చెప్పారు.

దొంగ అల్లుడు

- అత్త ఇంట్లో భారీగా నగదు చోరీ



బనశంకరి: అత్త ఇంట్లో చోరీకి పాల్పడిన అల్లునికి సంకెళ్లు పడ్డాయి. వివరాలు.. బెంగళూరు హలసూరు పరిధిలో ఏడాదిన్నర క్రితం రెజీనా అనే మహిళ చిన్న కుమార్తె లావణ్యను ప్రేమించి ప్రదీప్ కుమార్ పెళ్లి చేసుకున్నాడు. అత్త ఇటీవల కన్యాకుమారి విహారయాత్రకు వెళ్లిన సమయంలో అతడు ఇంటి తాళం బద్దలు కొట్టి లాకర్‌లో ఉన్న విలువైన బంగారు నగలు, సొత్తును ఎత్తుకెళ్లాడు. ఇతడు రావడం, పోవడం చుట్టుపక్కల నివాసులు గమనించారు. వారు మొబైల్‌లో ఫోటో తీసి రెజీనాకు పంపగా, నాట్ రీచబుల్ అని వచ్చింది. ఆమె కన్యాకుమారి యాత్ర ముగించుకుని ఇంటికి వచ్చి గమనించగా నగదుతో పాటు రూ.40 లక్షలు చోరీకి గురైనట్లు తేలింది. పొరుగువారిని విచారించగా ప్రదీప్‌కుమార్ అనే వ్యక్తి వచ్చాడని ఫోటో చూపించారు. అతడు తన అల్లుడేనని తెలుసుకుంది. అల్లుడైనా దొంగ దొంగే కాబట్టి అతనిపై హలసూరు పోలీసులకు ఫిర్యాదు చేయగా నిందితున్ని అరెస్టు చేశారు.

టెక్కీ నుంచి రూ. 1.52 కోట్ల వసూలు

- డ్రగ్స్ పేరుతో బెదిరించి సైబర్ నేరగాళ్ల దందా



యశవంతపుర: ముంబై పోలీసులమని నమ్మించి వ్యక్తి నుంచి రూ. 1.52 కోట్లను వసూలు చేసిన ఘటన బెంగళూరు మైకో లేఔట్ పోలీసుస్టేషన్ పరిధిలో జరిగింది. వివరాలు... మైకో లేఔట్‌కు చెందిన ఒక టెక్కీకి నవంబర్ 10న కార్తికేయన్ పేరుతో ఓ వ్యక్తి ఫోన్ చేశాడు. నీ పేరుతో డ్రగ్స్ కొరియర్ అవుతున్నాయి. విమానాశ్రయం కస్టమ్స్ అధికారులు ఆ డ్రగ్స్‌ను సీజ్ చేశారు, నీపై కేసు నమోదైందని బెదిరించాడు. బాధితుడు భయపడి కొరియర్‌కు- తనకు ఎలాంటి సంబంధం లేదంటూ చెప్పడంతో ఫోన్ కట్ చేశాడు.



ముంబై పోలీసులమని..

మళ్లీ కొంతసేపటి తరువాత మరో వ్యక్తి ముంబై సైబర్ క్రైం పోలీసుల పేరుతో కాల్ చేశాడు. ఆ కొరియర్ మీది కాకుంటే మీ ఆధార్, పాన్, బ్యాంకు వివరాలను ఇవ్వు, లేదంటే డ్రగ్స్ కేసు పెట్టి జైలుకు పంపుతామని బెదిరించాడు. కేసు పెట్టరాదంటే డబ్బు పంపాలని చెప్పాడు, భయాందోళనకు గురైన బాధితుడు పలు విడతలుగా రూ.1.52 కోట్లను అపరిచిత వ్యక్తి ఖాతాలోకి జమ చేశాడు. మళ్లీ డబ్బులు కావాలని డిమాండ్ చేయడంతో బాధిత వ్యక్తి బెంగళూరు సైబర్ క్రైం పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

విద్యుత్ బాధిత కుటుంబానికి పరామర్శ



మృతురాలి తల్లిని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే మంజుల

కృష్ణరాజపురం: నగరంలోని మహాదేవపుర నియోజకవర్గంలోని హోప్ ఫారం వద్ద తెగి పడి ఉన్న కరెంటు తీగను తొక్కి తల్లీ బిడ్డ సౌందర్య, సుభిక్ష మృతి చెందగా, వారి కుటుంబ సభ్యులను మహాదేవపుర ఎమ్మెల్యే మంజుల లింబావలి పరామర్శించారు. మృతురాలి తల్లి, సోదరి తదితరులతో మాట్లాడారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజలు తిరిగే ప్రాంతాల్లో బెస్కాం అధికారులు ఇలాంటి ప్రమాదకరమైన సంఘటనలు జరగకుండా చూసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. బెస్కాం అధికారుల నిర్లక్ష్యం వల్లనే రెండు ప్రాణాలు బలైనట్లు ఆమె ఆరోపించారు. ప్రమాదానికి కారణమైన అధికారుల పైన కఠిన చర్యలను తీసుకోవాలని కోరారు.

సర్కారుకు హక్కుల కమిషన్ నోటీసు

యశవంతపుర: విద్యుత్ తీగ తగిలి తల్లీ కూతురు దుర్మరణం చెందిన ఘటనపై జాతీయ మానవ హక్కుల కమిషన్ స్పందించి రాష్ట్ర ప్రభుత్వానికి నోటీసులు జారీ చేసింది. ప్రమాదం గురించి తెలిసి కమిషన్ సుమోటోగా కేసు నమోదు చేసుకొంది. ప్రమాదంపై పూర్తి వివరాలతో నివేదిక సమర్పించాలని ఆదేశించింది. ఈ దుర్ఘటన ప్రభుత్వానికి ఇబ్బందిగా మారింది.

క్లుప్తంగా

తాగునీటి ఎద్దడి రానివ్వం



చెరువును పరిశీలిస్తున్న అధికారులు

రాయచూరు రూరల్: జిల్లాలోని మాన్వి తాలూకా కల్లూరులో తాగునీటి ఎద్దడి నివారిస్తామని జెడ్పీ అభివృద్ధి అధికారి ప్రకాష్ పేర్కొన్నారు. మంగళవారం కల్లూరులోని చెరువును పరిశీలించి ఆయన జీపీ సభ్యులతో కలిసి పరిశీలించి మాట్లాడారు. తుంగభద్ర ఎడమ కాలువకు నీటిని విడిచినందున పోలీస్ బందోబస్తు మధ్య చెరువులోకి నీరు నింపాలని జిల్లాధికారి ఆదేశించారన్నారు. మరో చెరువు నిర్మాణానికి గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో పనులు చేపడతామన్నారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు సంగప్పగౌడ, సభ్యులు శివకుమార్, వెంకటేష్, అధికారులు శరణప్ప, రవి, మల్లప్పలున్నారు.

నియామక పత్రాల కోసం ఎదురుచూపులు

రాయచూరు రూరల్: జిల్లాలో 250 మంది ఉపాధ్యాయ నియామకాలకు జిల్లా విద్యాశాఖాధికారులు ఇంటర్వ్యూలు నిర్వహించారు. అయితే ఇంతవరకు నియామక పత్రాలను అందించక పోవడంతో పోస్టింగ్ ఆదేశ పత్రాల కోసం భావి ఉపాధ్యాయులకు ఎదురుచూపులు తప్పడం లేదు. మంగళవారం డీడీపీఐ కార్యాలయం వద్ద నాలుగు రోజుల పాటు కౌన్సిలింగ్ చేసిన అధికారులు ఆదేశపత్రాలు ఇవ్వడానికి అభ్యర్థుల రికార్డుల పరిశీలనకు కొంత సమయం పడుతుందని చెప్పడంతో ఉపాధ్యాయులు వేచి చూస్తున్నారు.

ఉపకార వేతనాలు చెల్లించరూ..



వినతిపత్రం సమర్పిస్తున్న కార్యకర్తలు

రాయచూరు రూరల్: రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థులకు ఉపకార వేతనాలు చెల్లించడానికి వెనుకడుగు వేస్తోందని ఏఐడీఎస్ఓ ఆరోపించింది. మంగళవారం టిప్పుసుల్తాన్ ఉద్యానవనంలో చేపట్టిన ఆందోళనానుద్దేశించి అధ్యక్షుడు అయ్యాళప్ప మాట్లాడారు. కట్టడ కార్మికుల, ఇతర వర్గాల విద్యార్థులకు రూ.5 వేల నుంచి రూ.60 వేల వరకు వచ్చే ఉపకారవేతనాన్ని కేవలం రూ.1100 నుంచి రూ.11 వేలకు కుదించారన్నారు. కళాశాలల్లో చదవడానికి ఫీజుల భారంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. తగ్గించిన శిష్య వేతనాన్ని పెంచాలని, బకాయి వేతనాలను చెల్లించాలని కోరుతూ స్థానికాధికారికి వినతిపత్రం సమర్పించారు.

మురుఘస్వామికి ఊరట

శివాజీనగర: రెండు పోక్సో కేసుల్లో అరెస్టులు, రిమాండులు ఎదుర్కొంటున్న చిత్రదుర్గ మురుఘ స్వామికి ఊరట దక్కింది. కేసుల విచారణపై హైకోర్టు స్టే జారీ చేయడంతో ఆయనకు బెయిలు దక్కింది. సోమవారం సాయంత్రం దావణగెరెలో ఆయనను అరెస్టు చేసిన చిత్రదుర్గం పోలీసులు స్టే జారీ కావడంతో విడుదల చేశారు.

కారు, లారీ ఢీ



ఘటనాస్థలంలో దృశ్యం

కంప్లి: విజయనగర జిల్లా మరియమ్మనహల్లి గ్రామ సమీపాన ఉన్న ఎస్ఎల్ఆర్ కర్మాగారానికి వెళ్లే మార్గం వద్ద సోమవారం రాత్రి లారీ, కారు నడుమ రోడ్డు ప్రమాదం సంభవించింది. అయితే ఎవరికీ ఎలాంటి ప్రాణహాని జరగలేదు. కర్మాగార మార్గం మీదుగా వెళుతున్న లారీ ప్రధాన మార్గం మీదుగా వస్తున్న కారు పరస్పరం ఢీకొన్నాయి. విషయం తెలిసిన వెంటనే మరియమ్మనహల్లి పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించి కేసు దర్యాప్తు ప్రారంభించారు.

పండరీపురానికి పాదయాత్ర



పాదయాత్రలో పాల్గొన్న భక్తులు

గంగావతి: పాండురంగ రుక్మిణి సేవా సంఘం ఆధ్వర్యంలో ప్రప్రథమంగా మంగళవారం కారటగి పట్టణం నుంచి పండరీపురానికి పాదయాత్రను చేపట్టారు. ముందుగా పట్టణంలోని వెంకటేశ్వర స్వామి దేవస్థానంలో విశేష పూజ, ధార్మిక కార్యక్రమాలను నెరవేర్చి పాదయాత్రను ప్రారంభించారు. భక్తులు మాట్లాడుతూ మంచి వర్షాలు కురిసి సమృద్ధిగా పంటలతో వర్ధిల్లాలనే సంకల్పంతో పాదయాత్రను చేపట్టామన్నారు. 30 మందికి పైగా మహిళలు, 40 మందికి పైగా పురుషులు పాదయాత్రలో పాల్గొనగా, పట్టణ ప్రముఖులు వీడ్కోలు పలికారు.

ఎండిన పంటలు..రైతన్న దిగాలు



వర్షాలు లేక నీరందక వాడుముఖం పట్టిన జొన్న పైరు



పంటనష్టం పరిశీలించిన అధికారులు, నాయకులు(ఫైల్)

- వానలు కురవక మెట్ట పంటలు వెలవెల
- విద్యుత్ కోతలతో రైతులు ఉక్కిరిబిక్కిరి

రాయచూరు రూరల్: ఆకాశంలో మబ్బులు కమ్ముకుంటున్నా వరుణుడి జాడ కానరాక గ్రామీణ ప్రాంతాల్లో మెట్ట పంటలు ఎండిపోయి రైతుల ముఖాల్లో కళ కరువైంది. ఈసారి ఖరీఫ్ సీజన్‌లో కళ్యాణ కర్ణాటక ప్రాంతంలోని రాయచూరు, యాదగిరి, కొప్పళ, బీదర్, కలబుర్గి జిల్లాలు కరువు ప్రాంతాలుగా మారాయి. రాయచూరు, కొప్పళ, యాదగిరి, కలబుర్గి జిల్లాల్లోని నదుల్లో నీరు అంతంత మాత్రంగానే ఉన్నాయి. దీంతో రైతులు తమ పొలాల్లో వేసుకున్న జొన్న పంట నీరందక వాడుముఖం పట్టింది. పొలంలో బోరుబావుల ద్వారా పంటలు పండించాలంటే భూగర్భ జలాల స్థాయి కుదించుకుపోయింది. మరో వైపు రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసిన 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ పథకంతో అన్నదాతలకు సరఫరా చేసే విద్యుత్‌లో కోతలు అధికమయ్యాయి.

కూలీకార్మికులకు తప్పని వలస బాట

జిల్లాలో తుంగభద్ర, కృష్ణా నదులున్నా వ్యవసాయ పనులు లభించక కూలికార్మికులకు ఉపాధి కోసం వలస బాట పట్టక తప్పలేదు. రైతులు జిల్లాలో 3 లక్షల ఎకరాల్లో జొన్న, లక్షా 50 వేల ఎకరాల్లో పత్తి, 1.86 లక్షల ఎకరాల్లో మిరప పంటలు వేశారు. పంట నష్టంపై అధికారులు, పాలకులు తూతూమంత్రంగా పరిశీలనలు చేస్తున్నారే తప్ప కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నష్టపరిహారం అందించడం లేదు. ఈ ప్రాంతం నుంచి ఎన్నికైన ప్రజా ప్రతినిధుల్లో సాగునీటి ప్రాధాన్యతను పెంపొందించే ఎలాంటి కొత్త పథకాలను ప్రారంభించాలనే తపన ఏ ఒక్కరి మదిలో లేకపోవడం విడ్డూరంగా ఉందని చెప్పవచ్చు. అధికారం కోసం తహతహలాడే నేతలు వాతావరణ మార్పులతో రైతన్నలు పడుతున్న ఇబ్బందులను నివారించడంలో మాత్రం మౌనం వహిస్తున్నారు.

లోక్‌సభ ఎన్నికల్లో గెలిచితీరాలి

మైసూరు: విధానసభ ఎన్నికల్లో ఓటమిని సవాలుగా తీసుకుని వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో 28 నియోజకవర్గాల్లో విజయం సాధించి తీరాలని మాజీ మంత్రి బి.శ్రీరాములు పిలుపునిచ్చారు. మంగళవారం మైసూరులోని చామరాజపురంలో ఉన్న బీజేపీ కార్యాలయంలో పార్టీ కార్యకర్తలతో మాట్లాడారు. లోక్‌సభ ఎన్నికల్లో అఖండ మెజారిటీతో గెలుపొంది మరోసారి ప్రధాని మోదీని అధికారంలో నిలబెట్టాలని కోరారు. పార్టీ నూతన అధ్యక్షుడు బీవై విజయేంద్ర, ప్రతిపక్ష నాయకులు ఆర్.అశోక్‌లు జోడెద్దుల మాదిరి పార్టీ బలోపేతానికి కృషి చేస్తారని, వారికి మన సహాయ సహకారాలు అందించాలని సూచించారు.

త్వరలో సహకార చట్టానికి సవరణ

సహకార రంగంలో రాజకీయ జోక్యాన్ని నివారించేందుకు సహకార చట్టానికి త్వరలో సవరణ చేస్తామని పశుసంవర్ధక మంత్రి కె.వెంకటేశ్ తెలిపారు. పిరియాపట్టణ తాలూకా చిట్టినహళ్లి పత్తి సహకార సంఘం ఆవరణలో ఏర్పాటు చేసిన 70వ అఖిల భారత సహకార వారోత్సవాల్లో మంత్రి పాల్గొని మాట్లాడారు. రైతుల సాధికారత, ఆర్థిక స్వతంత్రత కోసం తీసుకొచ్చిన సహకార సంఘాల్లో రాజకీయ జోక్యం తగదన్నారు. సహకార సంఘాల్లో రూ. 5 లక్షల్లోపు జీరో వడ్డీకి, రూ. 15 లక్షల వరకు 3 శాతం వడ్డీకి రుణాలు ఇస్తున్నట్లు గుర్తు చేశారు.

పఠన సంస్కృతి కనుమరుగవుతోంది



ప్రారంభిస్తున్న ఎమ్మెల్సీ నారాయణస్వామి

బాగేపల్లి: మొబైల్ వచ్చిన తర్వాత పుస్తకాలు చదివే వారి సంఖ్య బాగా తగ్గిపోయిందని, పఠన సంస్కృతి ఏకంగా మాయమయ్యే పరిస్థితులు దాపురించాయని ఎమ్మెల్సీ డాక్టర్ వైఏ నారాయణ స్వామి ఆవేదన వ్యక్తం చేశారు. పట్టణంలోని ప్రభుత్వ బాలిక పాఠశాలలో జాతీయ గ్రంథాలయ వారోత్సవాల కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఈ సమాజాన్ని గెలిచే శక్తిని ఇచ్చే ఏకైక ఆయుధం పుస్తకమని పేర్కొన్నారు. పుస్తకం లేకుంటే సమాజ నిర్మాణం సాధ్యం కాదన్నారు. ప్రతి ఏటా కోట్లాది రూపాయల మేర ఖర్చు చేసి పుస్తకాలను కొనుగోలు చేసి గ్రంథాలయాలకు ప్రభుత్వం పంపుతోందని, వాటిని ప్రజలు సద్వినియోగం చేకోవాలని సూచించారు.

సీఐని నియమించండి

యశవంతపుర: బెంగళూరు నగరంలోని రాజాజీనగర పోలీసుస్టేషన్‌కు నెల రోజులుగా ఇన్‌స్పెక్టర్ లేరు. ఇక్కడ వెంటనే సీఐని నియమించాలని కోరుతూ రాజాజీనగర ఎమ్మెల్యే ఎస్ సురేశ్‌కుమార్ సోమవారం రాష్ట్ర ప్రభుత్వానికి లేఖ రాసి దాన్ని సామాజిక మాధ్యమాల్లో పోస్టు చేశారు. అక్టోబర్ 20న రాజాజీనగర స్టేషన్‌పై లోకాయుక్త పోలీసులు దాడి చేశారు. స్టేషన్‌లో ఉన్న సీఐ పరారీ కాగా అయన్ను ఈనెల 2న సస్పెండ్ చేశారు. అప్పటి నుంచి నెల రోజులుగా స్టేషన్‌లో సీఐ లేకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. వెంటనే నిజాయితీగల అధికారిని నియమించాలని ఆయన డిమాండ్ చేశారు.

తల్లీ కొడుకు మృతి

సరకు రవాణా వాహనం ఢీకొని తల్లి, కొడుకు మృతి చెందిన ఘటన హాసన సమీపంలో బీ కాటిహళ్లి ఇండస్ట్రియల్ ఏరియాలో జరిగింది. కమలమ్మ (70), కొడుకు సతీశ్ (40) ఘటన స్థలంలోని మృతి చెందారు. సరుకు వాహనం వేగంగా వెళ్తూ అదుపు తప్పడంతో బైక్‌ను ఢీకొంది. ఈ మార్గంలో నిత్య ప్రమాదాలు జరుగుతున్నా అధికారులు చర్యలు తీసుకోవడం లేదని కాటిహళ్లి గ్రామస్తులు ఆరోపిస్తున్నారు.

బందోబస్తుతో ఆక్రమణలను తొలగిస్తాం



మాట్లాడుతున్న కాంతారావ్

కేజీఎఫ్: బీజీఎంఎల్ ఫ్యాక్టరీ పరిధిలో ఆక్రమణలను కేంద్ర, రాష్ట్ర బలగాల భద్రత మధ్య తొలగిస్తామని, ఎట్టి పరిస్థితిలోను ఫ్యాక్టరీ ఆస్తిని వదిలే ప్రసక్తి లేదని కేంద్ర గనుల శాఖ కార్యదర్శి కాంతారావ్ తెలిపారు. మంగళవారం బీజీఎంఎల్ స్వర్ణభవన్ పాలనాధికారుల కార్యాలయ సందర్శన కోసం వచ్చిన ఆయన ఫ్యాక్టరీ అధికారులు, కలెక్టర్‌తో కలిసి సుదీర్ఘంగా చర్చించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ 2001లో ఫ్యాక్టరీని మూసివేశారన్నారు. అనంతరం కార్మికుల వివిధ డిమాండ్లు కోర్టులో ఉన్నాయన్నారు. త్వరలో కోర్టులో కేసులు పరిష్కారమవుతాయన్నారు. ఎస్‌టీబీపీ పథకం కింద నివృత్తి అయిన ఫ్యాక్టరీ కార్మికులకు స్వంత ఇళ్లను అప్పగించే ప్రక్రియ కూడా ప్రగతిలో ఉందన్నారు. ఆక్రమణకు గురైన ఫ్యాక్టరీ భూములను ఎట్టి పరిస్థితిలోను తిరిగి వాపసు తీసుకుంటామన్నారు. ఎలాంటి ఒత్తిళ్లకు లొంగేది లేదన్నారు. ఆక్రమిత స్థలంలో మందిరం, మసీదు, చర్చి ఎలాంటిది ఉన్నా తొలగిస్తామన్నారు. ఫ్యాక్టరీ వ్యాప్తిలోని సైనేడ్ దిబ్బల్లో ఉన్న బంగారు నిక్షిప్త మట్టి దిబ్బలను బహిరంగ వేలం వేస్తామన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ అక్రంపాషా తదితరులు ఉన్నారు.

రౌడీషీటర్ హత్యకు కుట్ర

బనశంకరి: రౌడీషీటర్ హత్యకు కుట్రపన్నిన ఐదుగురి గ్యాంగ్‌ను మంగళవారం సీసీబీ పోలీసులు అరెస్ట్ చేశారు. ఫైనాన్స్ విషయంలో కొద్ది రోజులు క్రితం రెండు గ్యాంగ్‌లు మధ్య గొడవ చోటుచేసుకుంది. ఇదే విషయంపై ఈ గ్యాంగ్ పీణ్యా వద్ద ట్యాంగో రవి అనే రౌడీషీటర్‌ను హత్య చేయడానికి పథకం పన్నినట్లు సీసీబీ పోలీసులకు పక్కా సమాచారం అందింది. దీని ఆధారంగా పోలీసులు మంగళవారం దాడి చేసి సంతోష్ అలియాస్ సంతు గ్యాంగ్‌కు చెందిన ఐదుగురిని అరెస్ట్ చేసి విచారణ చేస్తున్నారు.

బస్సు ఢీకొని పాదచారి మృతి

హుబ్లీ: రోడ్డును దాటుతున్న వ్యక్తి ఆర్టీసీ బస్సు ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందిన ఘటన మంగళవారం తాలూకాలోని శిరగుప్పి గ్రామం వద్ద హైవేపై చోటు చేసుకుంది. మృతుడిని ఆ గ్రామ నివాసి సునీల్ నాయకర్(49)గా గుర్తించారు. హుబ్లీ నుంచి గదగ్‌కు వెళుతున్న సదరు బస్సు రోడ్డు దాటుతున్న సునీల్‌ను అదుపు తప్పి ఢీకొంది. ఫలితంగా తీవ్రంగా గాయపడిన ఆయన అక్కడికక్కడే మృతి చెందాడు. ఘటనపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టినట్లు హుబ్లీ రూరల్ పోలీసులు తెలిపారు.

పంట నష్టపరిహారం అందించండి



వినతిపత్రం సమర్పిస్తున్న దృశ్యం

శ్రీనివాసపురం: బంగాళాదుంప(ఆలుగడ్డ), టమాటా, చేమంతి పూల పంటలు పూర్తిగా నష్టపోయి తీవ్ర కష్టాల్లో ఉన్న రైతులను ఆదుకోడానికి ప్రభుత్వం ముందుకు రావాలని, ప్రతి ఎకరాకు రూ.25 వేల పరిహారం అందించాలని కోరుతూ రైతు సంఘం పదాధికారులు మంగళవారం ఉద్యాన శాఖ ఏడీకి వినతిపత్రం సమర్పించారు. రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కె నారాయణగౌడ మాట్లాడుతూ ముంగారు వానలు సరిగా కురవరక పోవడం వల్ల, దుకాణాల్లో నకిలీ విత్తనాలు, మందులు విక్రయించడం వల్ల రైతులు తీవ్రంగా నష్టపోయారన్నారు. పంట నష్టపోయి కష్టాల్లో ఉన్న రైతులను ప్రభుత్వం ఆదుకోవాలన్నారు. ప్రభుత్వం ఇప్పటికే జిల్లాలోని అన్ని తాలూకాలను కరువు ప్రాంతాలుగా ప్రకటించిందన్నారు. వెంటనే జిల్లాలో కరువు నివారణ చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. జిల్లా వ్యాప్తంగా వేలాది హెక్టార్లలో ఆలుగడ్డ పంట పండించారు. ప్రకృతి వైపరీత్యాల వల్ల ఆలుగడ్డ పంట పూర్తిగా నష్టమైంది. రైతులకు పెట్టుబడి కూడా తిరిగి రాలేదు. రైతుల కష్టాన్ని గుర్తించి వెంటనే పంట నష్టపరిహారం అందించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఫారూక్ పాషా, తాలూకా అధ్యక్షుడు యలువళ్లి ప్రభాకర్, బంగారి మంజు పాల్గొన్నారు.

నేడు బసవేశ్వర విగ్రహావిష్కరణ



మాట్లాడుతున్న కొట్టూరు బసవలింగ స్వామీజీ



ప్రారంభానికి సిద్ధంగా ఉన్న బసవేశ్వర విగ్రహం

హొసపేటి: కొట్టూరుస్వామి సంస్థానమఠం సంగనబసవ స్వామీజీ స్వర్ణ మహోత్సవం సందర్భంగా బుధవారం నగరంలోని సిద్ధిప్రియ కళ్యాణ మంటపం వద్ద విశ్వగురు బసవేశ్వరుడి అశ్వారూఢ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్నట్లు కొట్టూరు స్వామి సంస్థాన మఠం కొట్టూరు బసవలింగ స్వామీజీ తెలిపారు. మంగళవారం నగరంలోని మఠం ఆవరణలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఉదయం 10 గంటలకు నగరంలో బసవేశ్వర విగ్రహాన్ని అటవీ శాఖా మంత్రి ఈశ్వర్ ఖండ్రే చేతుల మీదుగా ప్రారంభిస్తామన్నారు. ఈ కాంస్య విగ్రహావిష్కరణలో విజయనగర జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి బీజే జమీర్ అహ్మద్‌ఖాన్, ఎమ్మెల్యే హెచ్ఆర్.గవియప్ప, ఎమ్మెల్యే వినయ్ కులకర్ణితో పాటు వివిధ జిల్లాలకు చెందిన ఎమ్మెల్సీలు, ప్రజాసంఘాల నాయకులు పాల్గొంటారన్నారు. సుమారు 12 అడుగుల ఎత్తైన ఈ విగ్రహాన్ని బెంగళూరుకు చెందిన శివకుమార్ అనే శిల్పి తయారు చేశారన్నారు. నగరంలోని మఠం ఆవరణలో నిర్మించిన నూతన శిలామాత, ఇతర అభివృద్ధి పనులను కూడా ఈనెల 23న ప్రారంభిస్తున్నట్లు తెలిపారు.

వేర్వేరు ఘటనల్లో నగదు వంచన

హుబ్లీ: అమెజాన్ కంపెనీ పేరిట ఫోన్ చేసిన గుర్తు తెలియని వ్యక్తి ఓ మహిళను నమ్మించి రూ.లక్ష వంచించిన ఘటన నగరంలో చోటు చేసుకుంది. ఇక్కడి జేపీ నగర్ నివాసి అనురాధ హెగ్డే బాధితురాలు. ఆమెకు ఫోన్ చేసిన సదరు వ్యక్తి అమెజాన్ కంపెనీ కస్టమర్ కేర్ నుంచి ఫోన్ చేస్తున్నట్లుగా ముందుగా నమ్మించాడు. ఈ క్రమంలో లింక్ పంపించి దీని ద్వారా ఇచ్చిన వస్తువు ఆర్డర్ గురించి సమాచారం తెలుసుకోవచ్చని నమ్మించి లింక్ డౌన్‌లోడ్ చేయించాడు. అనంతరం దశల వారీగా ఆమె బ్యాంక్ ఖాతా నుంచి రూ.లక్ష మేరకు నగదు బదలాయించుకున్నట్లు బాధితురాలు హుబ్లీ సైబర్ క్రైం పోలీసులుకు ఫిర్యాదు చేసింది. మరో ఘటనలో ఆన్‌లైన్‌లో పర్ఫ్యూమ్ ఆర్డర్ చేసిన వ్యక్తికి పిన్‌కోడ్ సరిగ్గా లేదు అంటూ ఫోన్ చేసిన గుర్తు తెలియని వ్యక్తి ఆ మేరకు లింక్ పంపించి దశల వారీగా రూ.99,500 బదలాయించుకొని వంచించిన ఘటన చోటు చేసుకుంది. స్థానిక ఇంతియాజ్ అనే వ్యక్తి బాధితుడు. ఆన్‌లైన్‌లో ఈయన పర్ఫ్యూమ్ ఆర్డర్ చేసిన వెంటనే అవతల నుంచి ఫోన్ చేసిన వ్యక్తి పిన్‌కోడ్ సరిగ్గా వేయలేదని నమ్మించాడు. దీన్ని సరిచేయడానికి లింక్ పంపించానని, దాన్ని డౌన్‌లోడ్ చేసుకోమంటూ మభ్యపెట్టి ఆ సదరు లింక్ ద్వారా పైమొత్తం నగదును బదలాయించుకున్నట్లు బాధితుడు సైబర్ క్రైం పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

బావిలో పడ్డ చిరుత



తుమకూరు: ఆహారం కోసం అటవీ ప్రాంతం నుంచి వచ్చిన చిరుత బావిలో పడిన ఘటన తిపటూరు నగరం మారనగెరెలో చోటుచేసుకుంది. ఈ ప్రాంతంలో చిరుత సంచరిస్తుండటంతో అటవీ అధికారులు బోను ఏర్పాటు చేశారు. సోమవారం రాత్రి చిరుత ఆహారం కోసం వెతుక్కుంటూ వచ్చి మారనగెరె సంగమేశ్ అనే వ్యక్తి పొలంలోని బావిలో పడిపోయింది. చిరుత బావిలో పడిన విషయం తెలుసుకున్న ప్రజలు పెద్ద ఎత్తున అక్కడికి చేరుకున్నారు. ఈ ప్రాంతంలో రెండు మూడు చిరుతలు తిరుగుతున్నాయని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు.

కారు, లారీ ఢీ.. ఇద్దరికి గాయాలు

మండ్య: కారును టిప్పర్ లారీ వెనుక నుంచి ఢీకొనడంతో ఇద్దరు గాయపడిన ఘటన బెంగళూరు–మైసూరు రహదారిపై ఎల్ఐసీ కార్యాలయం వద్ద మంగళవారం జరిగింది. ఈ ప్రమాదంలో ఏసీ కారు డ్రైవర్ శివకుమార్, రెవెన్యూ పరిశీలకుడు మోహన్ స్వల్పంగా గాయపడ్డారు. మద్దూరు తాలూకా ఆతగూరు హోబలి కరువు అధ్యయనం కోసం మంత్రి చెలువరాయస్వామి కారును అనుసరిస్తూ వెళ్తుండగా వెనుక నుంచి టిప్పర్ లారీ వీరి కారును ఢీకొంది.

ఉప కాలువకు అదనపు నీరు విడుదల



కాలువకు నీరు వదులుతున్న దృశ్యం

బళ్లారి అర్బన్: హెచ్ఎల్‌సీ కాలువ కింద పంటలు ఎండిపోకుండా మంగళవారం 14వ ఉప కాలువ రైతుల పొలాలకు నీరు విడుదల చేయించినట్లు తుంగభద్ర రైతు సంఘం అధ్యక్షుడు దరూరు పురుషోత్తం గౌడ తెలిపారు. కాలువకు అదనంగా నీరు విడుదల చేసిన సందర్భంగా ఆయన మాట్లాడారు. ఆయా గ్రామాలకు చెందిన వందలాది మంది రైతులతో కలిసి వెళ్లి జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి నాగేంద్ర, అధికారులతో మాట్లాడి కాలువ కింద పంటలు ఎండిపోకుండా శ్రీధరగడ్డ, మోకా, కప్పగల్లు తదితర గ్రామాలకు అనుకూలం చేశామన్నారు. కాలువకు అదనంగా నీరు విడుదల చేయడంతో రైతులు హర్షం వ్యక్తం చేశారు. ఈసందర్భంగా రైతు సంఘం నేతలు రంజాన్‌సాబ్, వీరభద్రరావు, వీరణ్ణగౌడ తదితరులు పాల్గొన్నారు.

కోలారు వార్తలు...

డిమాండ్లు తీర్చాలని వినతి

కోలారు: సవితా సమాజానికి తగిన సౌకర్యాలను అందించడంతో పాటు సమాజ ప్రజల డిమాండ్లను నెరవేర్చాలని కోరుతూ తాలూకా సవితా సమాజ ప్రముఖులు మంగళవారం జిల్లా డిప్యూటీ కలెక్టర్ శంకర్ వణిక్యాల్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సమాజ ప్రముఖులు మాట్లాడుతూ దేశానికి స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి విద్యా, ఉద్యోగ రాజకీయ రంగాల్లో సమాజం ఎంతో వెనుకబడి ఉందన్నారు. సమాజానికి విద్యా, ఉద్యోగ, రాజకీయ రంగాల్లో రిజర్వేషన్ సౌకర్యం కల్పించాలన్నారు. సమాజ జిల్లా నాయకుడు ఎస్ మంజునాథ్, తాలూకా అధ్యక్షుడు దీపు ప్రదీప్, సుగటూరు చంద్రప్ప, శ్రీనివాస్‌లున్నారు.

పడకేసిన పారిశుధ్యం



రోడ్డు పక్కన పడి ఉన్న చెత్తకుప్ప

కేజీఎఫ్: నగరంలో చెత్తను సేకరించడంలో నగర సభ సిబ్బంది పూర్తిగా నిర్లక్ష్యం వహిస్తుండడంతో స్వచ్ఛత కరువైంది. నగరంలో ఎక్కడ చూసినా చెత్త కుప్పలుగా పడి దుర్వాసన వెదజల్లడమే కాకుండా దోమలు ప్రబలుతున్నాయి. ఇక పారాండహళ్లిలో పరిస్థితి మరీ దారుణంగా ఉంది. రోడ్డు పక్కనే చెత్త రాశులుగా పడి ఉన్నా చెత్తను తొలగించడానికి పౌర కార్మికులు ముందుకు రావడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. చెత్త వల్ల దోమలు మరింత అధికమై అంటువ్యాధులు ప్రబలుతాయేమోనని ఆందోళన వ్యక్తం చేస్తున్న ప్రజలు వెంటనే చెత్తను తొలగించి శుభ్రతను కాపాడాలని కోరుతున్నారు.

మహిళ ఆత్మహత్య

శ్రీనివాసపురం: ఉరివేసుకుని ఓ మహిళ ఆత్మహత్య చేసుకున్న ఘటన ముళబాగిలు తాలూకా చిన్నహళ్లిలో జరిగింది. గ్రామానికి చెందిన సుజాతమ్మ(45) అనే మహిళ భర్త వెంకటరామప్పకు ఇద్దరు భార్యలు. సుజాతమ్మ వెంకటరామప్పకు రెండో భార్య. సుజాతమ్మ బెంగళూరులో కాపురం ఉందామని భర్తను తరుచుగా అడుగుతుండేది. కిందటి రోజు కూడా భార్యాభర్తల మధ్య ఈ విషయంపై చర్చ జరిగింది. అయితే అందుకు భర్త నిరాకరించడంతో జీవితంపై విరక్తి చెంది సోమవారం రాత్రి గ్రామ సమీపంలోని చెట్టుకు ఉరి వేసుకుందని పోలీసు వర్గాలు తెలిపాయి. కాగా మృతురాలికి ఓ కుమార్తె ఉంది. నంగలి పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

గొప్ప దేశభక్తుడు టిప్పుసుల్తాన్



మాట్లాడుతున్న శ్రీనివాస్

కోలారు: దేశంలోని గొప్ప దేశభక్తుల్లో టిప్పుసుల్తాన్ కూడా ఒకరని సమాజ సేవకుడు ఏ.శ్రీనివాస్ కొనియాడారు. మంగళవారం బాంబూ బజార్‌లో ఏర్పాటు చేసిన టిప్పుసుల్తాన్ జయంతిలో ఆయన మాట్లాడారు. గాంధీ, అంబేడ్కర్ జయంతుల్లానే టిప్పు జయంతిని నిర్వహించడంలో తప్పేముందన్నారు. పేద ముస్లింలకు ఎలాంటి సహకారం కావాలన్నా తనను సంప్రదించవచ్చన్నారు. టిప్పుసుల్తాన్ సేన అధ్యక్షుడు ఎజాజ్ ఖాన్ తన వద్ద నుంచి డబ్బులు తీసుకుని కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు కొందరు చేస్తున్న దుష్ప్రచారాన్ని ఆయన ఖండించారు. తాను ఎవరికీ డబ్బులు ఇవ్వలేదన్నారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న నజ్మా నజీర్ మాట్లాడుతూ అన్ని మతాలు, కులాలను ప్రేమించే దేశంలోని అప్రతిమ పోరాట యోధుల్లో ఒకరైన టిప్పుసుల్తాన్ బ్రిటిష్ వారికి ఎదురొడ్డి పోరాడారన్నారు. కార్యక్రమంలో మెథోడిస్టు ఆలయ పాస్టర్ శాంతకుమార్ తదితరులు పాల్గొన్నారు.

దైవ కార్యాలతో సమాజంలో శాంతి



గౌరీ పూజను ప్రారంభిస్తున్న మహాదేవస్వామి

కోలారు: దైవ కార్యాలను తరచుగా నిర్వహిస్తే సమాజంలో శాంతి నెలకొంటుందని విజయనగర బసవకళ్యాణ మఠం నిరంజన స్వరూప డాక్టర్ మహాదేవ స్వామి తెలిపారు. మంగళవారం ధర్మస్థల గ్రామీణాభివృద్ధి సంస్థ పథకం కింద తాలూకాలోని మద్దేరిలో నిర్వహించిన సామూహిక సుమంగళ గౌరి పూజలో ఆయన పాల్గొని మాట్లాడారు. సంస్థ గ్రామాల్లో ఆలయాలు, పాఠశాలల అభివృద్ధితో పాటు మహిళల స్వావలంబనకూ సహకారం అందిస్తోందన్నారు. సంస్థ ధర్మాధికారి దూరదృష్టి శ్లాఘనీయమన్నారు. రైతుల ఆర్థిక స్థితిని మెరుగు పరచడం, అంతర్జల వృద్ధికి చెరువులను అభివృద్ధి చేయడం, రక్షిత తాగునీటి యూనిట్లను ఏర్పాటు చేయడం, అనాథలకు పెన్షన్లు ఇవ్వడం వంటి మహత్తర కార్యక్రమాలను సంస్థ నిర్వహిస్తుండడం హర్షణీయమన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు నిస్వార్థంగా సేవలను చేస్తున్న సంస్థ పనితీరును ప్రశంసించారు. సంస్థ బెంగళూరు విభాగం రీజినల్ డైరెక్టర్ ఎం.శీనప్ప, కళాకారుడు మునిరెడ్డి, వేమగల్ ప్రణాళికాధికారి అనిల్ తదితరులు పాల్గొన్నారు.

ఫుట్‌పాత్ ఆక్రమణల తొలగింపు



ఫుట్‌పాత్‌పై ఆక్రమణలను తొలగిస్తున్న దృశ్యం

కోలారు: వాహన సంచారం పెరుగుతున్న నేపథ్యంలో నరసాపురం గ్రామంలో డబల్ రోడ్డు నిర్మాణం చేపడుతున్నందున అధికారుల సమక్షంలో మంగళవారం ఫుట్‌పాత్‌లపై ఆక్రమణల తొలగింపును చేపట్టారు. గ్రామ పంచాయతీ అధ్యక్షుడు కృష్ణప్ప సమక్షంలో ఫుట్‌పాత్‌లపై ఆక్రమణల తొలగింపు జరిగింది. రోడ్డు పక్కన అనేకమంది పూలు, పండ్లు, హోటళ్లు తదితర వ్యాపారాలు చేసుకుని ఫుట్‌పాత్‌లను ఆక్రమించుకున్నారు. ద్విపథ రహదారి నిర్మాణానికి ఫుట్‌పాత్‌లపై ఆక్రమణలు అడ్డుగా ఉండడంతో ఈ ఆక్రమణలను తొలగించాల్సి వచ్చింది. ఉదయం 6 గంటల నుంచే పోలీసు బందోబస్తు మధ్య జేసీబీ సాయంతో తొలగింపును చేపట్టారు.

క్లుప్తంగా

ఘనంగా మారియమ్మ దేవి జాతర



ఎమ్మెల్యేను సన్మానించిన దృశ్యం

బొమ్మనహళ్లి: నగరంలోని బొమ్మనహళ్లి పరిధి ఆరెకెరె వార్డులో వెలసిన గ్రామ దేవత మారియమ్మ దేవి జాతర మంగళవారం ఘనంగా ప్రారంభమైంది. ఈ వేడుకల్లో బొమ్మనహళ్లి ఎమ్మెల్యే సతీష్ రెడ్డి, స్థానిక బీజేపీ నాయకుడు మురళీధర్ పాల్గొని అమ్మవారికి పూజలు చేశారు. పెద్ద సంఖ్యలో ప్రజలు జాతరలో పాల్గొన్నారు.

రైలు ఢీకొని కార్మికుడు మృతి



మృతుడు శ్రీనివాస్ (ఫైల్)

దొడ్డబళ్లాపురం: రైలుబండి ఢీకొని కార్మికుడు మృతిచెందిన సంఘటన రామనగర తాలూకా చన్నమానహళ్లి వద్ద జరిగింది. చన్నమానహళ్లికి చెందిన శ్రీనివాస్ (45) మృతుడు. గ్రామ సమీపంలోని ప్రైవేటు ఫ్యాక్టరీలో పట్టుగూళ్లు విడిపించే పని చేసేవాడు. నిత్యం రైలు పట్టాలు దాటి ఫ్యాక్టరీకి వచ్చేవాడు. ఈ క్రమంలో పట్టాలు దాటుతుండగా రైలు ఢీకొని ఉంటుందని స్థానికులు భావిస్తున్నారు. తలకు బలమైన గాయం తగిలింది. మంగళవారం ఉదయం రైలు పట్టాల పక్కన మృతదేహాన్ని గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. రామనగర రైల్వే పోలీసులు కేసు నమోదు చేశారు.

సెల్ టవర్ ఏర్పాటుపై ధర్నా



రోడ్డుపై బైఠాయించిన మహిళలు

దొడ్డబళ్లాపురం: జనావాస ప్రాంతంలో సెల్‌టవర్ టవర్ ఏర్పాటు చేయడాన్ని వ్యతిరేకిస్తూ స్థానికులు ధర్నా చేపట్టిన సంఘటన దొడ్డ పట్టణ శివారులోని చంద్రమౌళేశ్వర లేఔట్‌లో చోటుచేసుకుంది. గోపాల్ అనే వ్యక్తి తన తోటలో 5జి నెట్‌వర్క్ టవర్ ఏర్పాటుకు అనుమతిచ్చాడు. దీంతో స్థానికులకు సమాచారం ఇవ్వకుండా రాత్రికి రాత్రి టవర్ ఏర్పాటు చేశారు. ఇందుకు సంబంధించి స్థానికులు గోపాల్‌ను ప్రశ్నించగా తన స్థలాన్ని ఎవరికైనా అద్దెకు ఇచ్చుకుంటానని, అడగడానికి మీరెవరంటూ బెదిరించాడని స్థానికులు ఆరోపిస్తున్నారు. టవర్ నుండి వెలువడే హై బ్రాండ్ తరంగాల కారణంగా చుట్టుపక్కల ప్రజలు అనారోగ్యం పాలవుతారని, పిల్లలపై వీటి ప్రభావం మరింత ఎక్కువగా ఉంటుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తక్షణం టవర్‌ను అక్కడి నుండి తొలగించాలని డిమాండు చేసారు. సంబంధిత అధికారులు తక్షణం కలుగజేసుకోవాలని కోరారు.

రోడ్డు పనుల్లో నాణ్యతాలోపం

- గ్రామస్తుల ధర్నా



ధర్నా చేస్తున్న గ్రామస్తులు

దొడ్డబళ్లాపురం: దొడ్డ తాలూకాలోని హొన్నాదేవిపుర గ్రామానికి వేసిన తారు రోడ్డు 15 రోజుల్లోనే గంతలుపడిందని గామస్తులు ఆరోపిస్తున్నారు. ఈ మేరకు మంగళవారం రోడ్డుపై ధర్నా చేపట్టిన గ్రామస్తులు మాట్లాడుతూ ఒక టిన్నర కిలోమీటర్ రోడ్డుకు రూ. కోటి ఖర్చు చేయడం జరిగిందన్నారు. కేఆర్‌డీఎల్ సంస్థ వేసిన ఈ రోడ్డు 15 రోజుల్లోనే గంతలమయమై తారు తేలి వచ్చిందన్నారు. గుంతలను మూయడానికి అధికారులు డస్ట్ వేసారన్నారు. చేత్తో లాగితే తారు చేతికి వస్తోందని, ఈ రోడ్డులో వాహనాలు నడపడమే కష్టంగా మారిందన్నారు. కాంట్రాక్టర్‌పై సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని, మరోసారి రోడ్డు నాణ్యతతో వేయాలని డిమాండు చేసారు.


పిల్లల్లో ప్రతిభను వెలికితీయాలి



తుమకూరు: పోటీలు, కళలు, క్రీడలు వంటి కార్యకలాపాల్లో పిల్లలు పాల్గొనకపోతే వారిలో ఉన్న ప్రతిభను వెలికి తీయలేమని జిల్లాధికారి కె.శ్రీనివాస్ అన్నారు. నగరంలోని బాలభవన్‌లో ఏర్పాటు చేసిన జిల్లాస్థాయి బాలల దినోత్సవం కార్యక్రమన్ని ప్రారంభించి ఆయన మాట్లాడారు. పిల్లలు ఆయా క్రీడలు, కళల్లో పాల్గొంటేనే వారిలోని ప్రతిభను గుర్తించడం సాధ్యపడుతుందని, అప్పుడే వారిలో ఆత్మస్థైర్యం పెంపొందుతుందని తెలిపారు. ఇక జిల్లాలో 3.19 లక్షల మంది పాఠశాల విద్యార్థులు ఉన్నారని, 1.30 లక్షల మంది అంగన్‌వాడీ పిల్లలు, సుమారు 3 వేల మంది గర్భిణులు ఉన్నారని, వీరందరికి కేఎంఎఫ్ ఆధ్వర్యంలో పౌష్టికాహారాన్ని ఇస్తున్నామని చెప్పారు.

చారిత్రకం..శోభాయమానం శ్రావణ బెళగొళ

- జైనుల ప్రముఖ తీర్థయాత్రా స్థలం
- వింధ్యగిరి పర్వతంపై గోమతేశ్వరుడి భారీ ఏకశిలా విగ్రహం
- పుష్కరానికొకసారి మహామస్తకాభిషేకం



వింధ్యగిరి పర్వతం వద్ద కొలను



శ్రావణబెళగొళలో గోమతేశ్వరుడికి పసుపుతో అభిషేకం (ఫైల్)

బనశంకరి: కర్ణాటకలోని శ్రీ గోమతేశ్వర ఆలయం పురాతన జైన ఆలయం. ఇది బాహుబలి ఆలయం. హాసన జిల్లా శ్రావణబెళగోళలో కొలువుదీరిన బాహుబలికి పురాతన నేపథ్యం కలిగి ఉంది. ఇది గోమతేశ్వర అనే ఒకజైన సన్యాసి భారీ విగ్రహం. దీనిని బాహుబలి పేరుతో కూడా పిలుస్తారు. ఈ ఆలయంలో పుష్కర సమయం అనగా ప్రతి 12 ఏళ్లకు ఒకసారి మహామస్తకాభిషేకం అత్యంత వైభవంగా నిర్వహిస్తారు. దేశ విదేశాల నుంచి భక్తులు పెద్ద ఎత్తున తరలివస్తారు.


ఆలయ నేపథ్యం...

పూర్వం జైన తీర్థంకరుల్లో మొదటివాడు ఇక్ష్వాకు వంశస్థుడైన వృషభనాథుడు. ఆలయ అయోధ్యను రాజధానిగా చేసుకుని పరిపాలన చేసేవారు. ఆయన భార్యలైన సునందాదేవి, యశస్వతిదేవి అనే ఇద్దరికి భరతుడు, బాహుబలి అనే ఇద్దరు కుమారులు జన్మించారు. వీరు జన్మించిన కొద్ది సంవత్సరాల్లోనే కొన్ని కారణాలతో విరక్తి చెందిన తండ్రి వృషభనాథుడు రాజ్యాన్ని విభజించి అయోధ్యకు భరతుడిని, పోదనపురానికి బాహుబలిని రాజులుగా చేసి తాను అడవులకు వెళ్లిపోయాడు. తరువాత భరతుడు దండయాత్ర ప్రారంభించి బాహుబలితో యుద్ధం చేయాలనుకున్నారు. ఇద్దరు యుద్ధ విద్య బాగా తెలిసిన వారు. యుద్ధం వల్ల అపారనష్టం సంభవిస్తుందని భయపడ్డ ఇరుపక్షాల మంత్రులు ఆయుధాలు లేకుండా యుద్ధం చేస్తే బాగుంటుందని సూచించారు. దీనికి ఇద్దరూ సమ్మతించారు. మల్లయుద్ధంలో భరతుడిని పిడికిలితో గుద్ది చంపేయాలని బాహుబలి చేయి పైకెత్తాడు. అప్పుడు సోదరుడి కళ్లలో మరణభయాన్ని చూసి చలించిపోసి వెంటనే ఆ ప్రయత్నాన్ని విరమించుకున్నారు. రాజ్యం కోసం అన్నతో యుద్ధమా అని బాధపడి తన రాజ్యాన్ని కూడా భరతుడికి అప్పగించి సన్యాసం తీసుకుని తపస్సు చేశాడు. ఆ తరువాత మహత్తరజ్ఞాన సంపన్నుడయ్యారని చెబుతారు. కొండమీద ఉండే ఈ విగ్రహాన్ని చేరేందుకు 618 మెట్లు ఎక్కాల్సి ఉంటుంది. ఏకశిలకు సంబంధించిన తెల్లటిరాయి ద్వారా ఈ మహావిగ్రహం రూపొందించడంతో పాటు ఒక గొప్ప మత సంబంధమైన సంకేతంగాను ఈ విగ్రహం గుర్తింపు పొందింది. జైనమతంలో మొదటగా మోక్షం పొందింది. బాహుబలి అని జైనులు విశ్వసించడమే ఇందుకు కారణం. ఈ విగ్రహం ఒక తామరపుష్పంపై నిలబడి ఉంటుంది. తొడల ప్రాంతం వరకు ఈ విగ్రహానికి ఎలాంటి ఆధారం లేకపోవడంతో పాటే 60 అడుగులు ఎత్తులో ఉంటుంది. విగ్రహం యొక్క ముఖం మాత్రమే 6.5 అడుగులు ఎత్తు కలిగి ఉంది.

ప్రపంచంలోనే అతి ఎత్తైన ఏకశిలా విగ్రహం : విగ్రహం పూర్తిగా వివస్త్రంగా ఉంటుంది. ఈ విగ్రహం దాదాపు 15 కిలోమీటర్ల దూరం నుంచి కూడా చక్కగా కనిపిస్తుంది. కర్ణాటక శిల్పకళకు సంబంధించి ఈ విగ్రహం పేరు పొందడంతో ప్రపంచంలోనే అతిపెద్దదైన ఏకశిలా విగ్రహంగా పేరు పొందింది. గోమతేశ్వర విగ్రహం మాత్రమే కాకుండా శ్రావణబెళగోళకు సంబంధించిన మిగిలిన ప్రదేశమంతా జైనమతానికి సంబంధించిన విగ్రహాలతో జైన తీర్థంకరులకు చెందిన అనేక విగ్రహాలతో కూడుకుని ఉంది. వింధ్యగిరిపై క్రీ.శ.981లో దీనిని ప్రతిష్ఠించారు. 12 ఏళ్లకు ఒకసారి మహామస్తాభిషేకం జరపడం ఆనవాయితీగా వస్తోంది. ప్రతిరోజు ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు సాయంత్రం 3.30 నుంచి 7 గంటలవరకు ఆలయ దర్శనం ఉంటుంది. బెంగళూరు–మంగళూరును కలిపే 48వ జాతీయ రహదారికి 15 కిలోమీటర్లు దూరంలో ఆలయం ఉంది. హాసన చెన్నరాయ పట్టణానికి 11 కిలోమీటర్లు దూరంలో ఉంది.



గోమతేశ్వర వద్దకు మెట్లదారి



కొండపై చంద్రగిరి ఆలయం

మరో వివాదంలో ఇండిగో

దొడ్డబళ్లాపురం: ఇండిగో విమాన సంస్థ ఇటీవల ఏదో ఒక వివాదాన్ని తలమీద వేసుకుంటోంది. తాజాగా మరో వివాదాన్ని తెచ్చుకుంది. ఆదివారం రాత్రి ఆరుగురు ప్రయాణికులు ఉన్నారనే కారణంతో విమానాన్ని రద్దు చేసి ప్రయాణికులను దించేసింది. దీంతో ఆరుగురు రాత్రంగా ఎయిర్ పోర్టులోనే పడిగాపులు కాసారు. సోమవారం రాత్రి ఇండిగో విమానం అమృత్‌సర్ నుండి వచ్చి బెంగళూరు మీదుగా చెన్నై బయలుదేరాల్సి ఉంది. ప్రయాణికులు తక్కువగా ఉన్నారనే కారణం చెప్పకుండా ఏదో టెక్నికల్ సమస్య అని చెప్పి విమానాన్ని రద్దు చేశారు. ఇండిగో సంస్థ కనీసం హోటల్ వసతి కూడా ఏర్పాటు చేయలేదని ప్రయాణికులు అసహనం వ్యక్తం చేసారు.

లాయర్‌ల సంఘం అధ్యక్షుడిగా ఎన్నిక



రవిని అభినందిస్తున్న కరవే నేతలు

దొడ్డబళ్లాపురం: దొడ్డబళ్లాపురం లాయర్‌ల సంఘం నూతన అధ్యక్షుడిగా సీనియర్ లాయర్ రవి మావినకుంట ఎన్నికయ్యారు. ఆయన ఎన్నికపై ప్రముఖులు హర్షం వ్యక్తం చేసారు. పలువురు ఆయన నివాసానికి వెళ్లి పూలమాలలు వేసి అభినందించారు. ఈ పదవికి శాయశక్తులా కృషి చేసి న్యాయం చేస్తానని నూతన అధ్యక్షుడు రవి అన్నారు.

కళ్యాణ మండపం ప్రారంభం



మంటపాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

గౌరిబిదనూరు: గ్రామాలలో ధార్మిక కార్యక్రమాలు విరివిగా జరగాలని, అప్పుడే ప్రజల మధ్య శాంతి సౌహార్ధతలు నెలకొంటాయని ఎమ్మెల్యే పుట్టస్వామిగౌడ తెలిపారు. ముద్దలోడు గ్రామంలోని చన్నకేశవస్వామి దేవాలయంలో నూతనంగా నిర్మించిన కళ్యాణ మండపాన్ని ప్రారంభించారు. శుభ కార్యాలను జరుపుకోవడానికి ఈ భవనం చాలా సౌకర్యంగా వుంది. దీనిని గ్రామ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. జయప్ప, చంద్రశేఖర్, సిద్ధప్ప పాల్గొన్నారు.

ఏడీ కార్యాలయంలో లోకాయుక్త తనిఖీలు



భూముల పత్రాల నిర్వహణపై అసహనం వ్యక్తం చేస్తున్న లోకాయుక్త జడ్జి

దొడ్డబళ్లాపురం: దొడ్డ పట్టణంలోని ఏసీ కార్యాలయం భవనంలో ఉన్న భూమి పత్రాల అసిస్టెంట్ డైరెక్టర్ కార్యాయంలో లోకాయుక్త జడ్జి, డిప్యూటీ రిజిస్ట్రార్ అనిత ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. సోమవారం సాయంత్రం కార్యాలయానికి సిబ్బందితో కలిసి విచ్చేసిన జడ్జి అనిత భూముల పత్రాల అసంబద్ధ నిర్వహణపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసారు. ఏడీఎల్ఆర్ కార్యాలయంలోని బాత్రూంలో ఉన్న ఖాళీ స్థలంలో భూముల పత్రాలు మూటగట్టి ఉంచడం పట్ల జడ్జి అధికారులను నిలదీసారు. తక్షణం పత్రాలను సురక్షిత ప్రదేశంలో ఉంచాలని ఆదేశించారు. అనంతరం మహిళా సిబ్బందితో మరుగుదొడ్ల శుభ్రతపై అడిగి తెలుసుకున్నారు. పెండింగ్‌లో ఉన్న ఫైళ్లు తక్షణం క్లియర్ చేయాలని అధికారులను ఆదేశించారు. చిక్కబళ్లాపురం లోకాయుక్త ఎస్పీ డా.రామ్ అరసిద్ధి, డీవైఎస్పీ వీరేంద్ర, 15 మంది సిబ్బంది డాక్యుమెంట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా కార్యాలయానికి వచ్చిన పలువురు అధికారులపై ఫిర్యాదులు చేసారు.

పార్టీ బలోపేతానికి ఆర్థిక సాయం చేశా : శరవణ

శివాజీనగర: పార్టీ బలోపేతానికి మాజీ సీఎం కుమారస్వామి తన ద్వారా ఆర్థికసాయం అందుకున్నారని, వ్యక్తిగతానికి కాదని జేడీఎస్ నాయకుడు, విధాన పరిషత్ సభ్యుడు టీ.ఏ శరవణ స్పష్టం చేశారు. మంగళవారం విధానసౌధలో విలేకరులతో మాట్లాడిన ఆయన, పరిషత్ టికెట్ కోసం శరవణచే కుమారస్వామి నగదు పుచ్చుకొన్నారని సీఎం ఇబ్రహీం ఆరోపణకు స్పందిస్తూ, సీఎం ఇబ్రహీం కూడా ఆయన కుమారుడి ఎన్నికల ప్రచారానికి ఆర్థిక సహాయాన్ని అందుకొన్నారు. పార్టీకి తన సహాయం ఉంది. పార్టీ కష్టంలో ఉన్నపుడు తాను సహాయం చేశాను. పార్టీ బలోపేతానికి తనచే కుమారస్వామి ఆర్థిక సహాయం పొందారు. ఇల్లు నిర్మించుకునేందుకు సహాయం పొందలేదు. ఎన్నికల సమయంలో పార్టీ బలోపేతానికి సహాయం చేశామని తెలిపారు. తాను ఆయనలాగా వేర్వేరు పార్టీల నుండి వచ్చినవాడు కాదు. గత 25 సంవత్సరాల నుండి మాజీ ప్రధాని దేవెగౌడ, కుమారస్వామిలతో సామాన్య కార్యకర్తగా పని చేస్తున్నానని అన్నారు.

రుణమాఫీ చేసి రైతుల్లో ఆత్మవిశ్వాసం నింపాలి

శివాజీనగర: రాష్ట్ర ప్రభుత్వ ఖజానా పూర్తిగా ఖాళీ కావటంతో రైతులకు ఒక్క పైసా కూడా పరిహారం ఇవ్వటానికి కావటం లేదని రాష్ట్ర శాసనసభ ప్రతిపక్ష నాయకుడు ఆర్.అశోక్ ఆరోపించారు. విపక్ష నాయకుడిగా బాధ్యతలు చేపట్టిన తరువాత కల్యాణ కర్ణాటకలోని కల్బుర్గి నుంచి కరువు అధ్యయన ఆరంభించి, వాస్తవ స్థితిగతులను అవలోకించి విలేకరులతో మాట్లాడారు. తాము గతంలో బీ.ఎస్.యడ్యూరప్ప, బసవరాజ బొమ్మై పరిపాలనా అవధిలో కరువు, వరదలతో జరిగిన విపత్తుకు నెలలోపు రాష్ట్ర ప్రభుత్వం నుండి ముందుగా పరిహారం అందజేసి ఆ తరువాత కేంద్రాన్ని సహాయ పరిహారం కోరామని గుర్తు చేశారు. అవసరమైతే సీఎం, డీసీఎం ఆధారాలను చూడవచ్చని అశోక్ సవాల్ చేశారు. గతంలో యడ్యూరప్ప అధికార అవధిలో రైతుల రుణమాఫీ చేసేటపుడు కేంద్రం వైపు చూడలేదని, అతి కరువుతో ఇబ్బందుపడుతున్న రైతులకు రుణమాఫీ, తగిన పరిహారం ఇవ్వటం ద్వారా వారిలో ఆత్మవిశ్వాసం నింపాలన్నారు.

పార్లమెంటరీ కమిటీ కరువు పరిశీలన



పార్లమెంటరీ కమిటీకి స్వాగతం పలుకుతున్న దృశ్యం

విజయపుర: కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలోని పార్లమెంటరీ కమిటీ దేవనహళ్లి తాలూకా జాలిగె, కన్నమంగల, మండిబెలె గ్రామ పంచాయతీల పరిధిలో పర్యటించింది. 15 మంది సభ్యులున్న కమిటీ బృందంలో కరువు పరిస్థితులతో పాటు వివిధ అభివృద్ధి పనులను పరిశీలించింది. మండిబెలె గ్రామంలో అటవీ శాఖ సహకారంతో ఉపాధి హామీ కింద నాటిన శ్రీగంధం మొక్కలను కూడా పరిశీలించారు.

కరువు పీడిత గ్రామాల్లో మంత్రి పర్యటన



రైతులతో మాట్లాడుతున్న మంత్రి చెలువరాయ

మండ్య: మండ్య జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి చెలువరాయస్వామి మంగళవారం మండ్య జిల్లా మళవల్లి తాలూకాలోని పలు కరువు పీడిత గ్రామాల్లో పర్యటించారు. పంటనష్టం గురించి రైతులను అడిగి తెలుసుకున్నారు. వెంటనే పంట నష్టంపై నివేదిక తయారు చేయాలని అధికారులను మంత్రి ఆదేశించారు. రాష్ట్రంలో 224 తాలూకాల్లో కరువు నెలకొందని, కేంద్ర కరువు బృందం కూడా పర్యటించి నివేదికను కేంద్రానికి అందజేసిందన్నారు.

హత్య కేసులో నిందితుడు అరెస్టు

దొడ్డబళ్లాపురం: యువతి ప్రేమ వ్యవహారానికి సంబంధించి ఇద్దరు స్నేహితుల మధ్య చోటుచేసుకున్న ఘర్షణలో జరిగిన హత్య కేసులో బ్యాటరాయనపుర పోలీసులు నిందితుడిని అరెస్టు చేసారు. బ్యాటరాయనపుర పీఎస్ పరిధిలోని పంతరపాళ్యలో బీబీఎంపీలో పౌర కార్మికుడిగా పనిచేస్తున్న భరత్, ఆటో డ్రైవర్ ప్రభుల మధ్య యువతి ప్రేమ విషయానికి సంబంధించి గొడవ జరిగింది. ఈ క్రమంలో ప్రభు భరత్‌ను కత్తితో గొంతు కోసి హత్య చేసి పరారయ్యాడు. కేసు నమోదు చేసుకున్న బ్యాటరాయనపుర పోలీసులు నిందితుడిని అరెస్టు చేసారు.

యువకుడి బ్రెయిన్ డెడ్

- అవయవదానం చేసిన కుటుంబ సభ్యులు



మధుసూదన్

దొడ్డబళ్లాపురం: ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన యువకుడి బ్రెయిన్ డెడ్ కావడంతో కుటుంబ సభ్యులు అవయవదానం చేసి ఉదారత చాటుకున్నారు. దొడ్డ తాలూకా అంతరహళ్లికి చెందిన మధుసూదన్ ఈనెల 12న మైసూరుకు వెళ్లిన సమయంలో రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డాడు. బెంగళూరు మణిపాల్ ఆస్పత్రిలో చికిత్స పొందుతుండగా అతడి బ్రెయిన్ డెడ్ అయ్యింది. దీంతో వైద్యుల సలహా మేరకు కుటుంబ సభ్యులు అవయవ దానానికి అంగీకరించారు. కుటుంబ సభ్యుల ఔదార్యాన్ని పలువురు ప్రశంసించారు.

బైకిస్టు దుర్మరణం



దొడ్డబళ్లాపురం: క్యాంటర్, బైక్ ముఖాముఖి ఢీకొన్న ప్రమాదంలో బైకిస్టు అక్కడికక్కడే మృతి చెందిన సంఘటన దొడ్డ తాలూకా మేళ్లమనె క్రాస్‌లో చోటుచేసుకుంది. మంగళవారం మధ్యాహ్నం దొడ్డబళ్లాపురం–దాబస్‌పేట హైవేపై మేళ్లమనె క్రాస్ వద్ద క్యాంటర్, బైక్ ముఖాముఖి ఢీకొనగా బైకిస్టు ఘటనా స్థలంలోనే మృతి చెందాడు. మృతుడి వివరాలు తెలిసి రాలేదు. దొడ్డ గ్రామీణ పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

సతీశ్ జార్కిహొళి సీఎం కావడం ఖాయం

శివాజీనగర: మంత్రి సతీశ్ జార్కిహొళి ముఖ్యమంత్రి అవుతారన్నది వంద శాతం నిజమని ఎమ్మెల్యే విశ్వాస్ వైద్య కొత్తబాంబు పేల్చారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ... తూర్పున సూర్యుడు ఉదయించడం ఎంత నిజమో, సతీశ్ జారకిహొళి కూడా సీఎం కావడం అంతే నిజమని అన్నారు. "సతీశ్ జార్కిహొళి ప్రభావం కలిగిన నాయకుడని, ఆయనను సీఎంగా చూడాలని చెబుతున్నారని కాంగ్రెస్ ఎమ్మెల్యే విశ్వాస్ వైద్య తెలిపారు. ఇదిలా ఉంటే అధిష్టానాన్ని ధిక్కరిస్తూ ఎమ్మెల్యే విశ్వాస్ చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు ఆ పార్టీలో గందరగోళాన్ని సృష్టిస్తున్నాయి.

హోసూరు వార్తలు..

కావేరి నీటి కోసం ధర్నా



ఆందోళన నిర్వహిస్తున్న దృశ్యం

హోసూరు: కర్ణాటక నుంచి తమిళనాడుకు రావాల్సిన కావేరి నది నీటిని వెంటనే విడుదల చేయాలని రైతు సంఘ నాయకులు మంగళవారం తమిళనాడు– కర్ణాటక సరిహద్దు జూజువాడి వద్ద ఆందోళన చేశారు. తలపై ఖాళీ కుండలను ఉంచుకొని కర్ణాటక ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కేటాయించిన సాగు నీటిని విడుదల చేయకపోతే, తమిళనాడు నుంచి ఇచ్చే విద్యుత్ సరఫరాను అడ్డుకొంటామని హెచ్చరించారు. హోసూరు - బెంగళూరు జాతీయ రహదారిపై ఆందోళన చేయగా, హోసూరు డీఎస్పీ బాబుప్రశాంత్ నేతృత్వంలో పోలీసులు అరెస్ట్ చేశారు.

విద్యార్థులకు సైకిళ్ల పంపిణీ



సైకిళ్లతో విద్యార్థులు

కెలమంగలం: ప్రభుత్వ ఉచిత సైకిళ్ల పంపిణీ పథకంలో భాగంగా మంగళవారం డెంకణీకోట తాలూకా బాలతోటనపల్లి ప్రభుత్వ పాఠశాలలో ప్లస్‌వన్ చదువుతున్న విద్యార్థినీ విద్యార్థులకు సైకిళ్లను అందజేశారు. హెచ్‌ఎం హెలెన్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో పిటిఏ అధ్యక్షులు, స్థానిక ప్రజా ప్రతినిధులు ముఖ్య అతిథులుగా పాల్గొని 86 మందికి సైకిళ్లను పంపిణీ చేశారు.

సీసీబీ దాడి, కేజీ బంగారం స్వాధీనం

యశవంతపుర: వరల్డ్ కప్ క్రికెట్ మ్యాచ్‌లపై బెట్టింగ్ ఆడుతున్న ఆరోపణలకు సంబంధించి బెంగళూరు సీసీబీ పోలీసులు ఆర్ఆర్ నగరలోని ఒక ఫ్లాట్‌పై దాడి చేసి కేజీ బంగారంతో పాటు మొబైల్, లాప్‌టాప్‌లను స్వాధీనం చేసుకున్నారు. ఆన్‌లైన్ బెట్టింగ్ దందాను నిర్వహిస్తున్నట్లు సమాచారం అందుకున్న పోలీసులు దాడి చేసి కేజీ బంగారు బిస్కెట్లు స్వాధీనం చేసుకుని కేసు దర్యాప్తు చేపట్టారు.

కిందపడి వృద్ధుడు మృతి

హోసూరు: నడిచి వెళుతూ కిందపడి గాయపడిన నివృత తహసీల్దార్‌కు ఆస్పత్రిలో మృతి చెందాడు. వివరాలు.. హోసూరు పట్టణంలోని తళి రోడ్డు అమ్మన్‌నగర్‌లో నివృత తహసీల్దార్ చెందిన గణేషన్ (70) నివసించేవారు. సోమవారం సాయంత్రం ఇంటి ముందు నడిచి వెళ్తూ పట్టుతప్పి పడిపోయాడు. తీవ్ర గాయాలేర్పడిన ఇతన్ని స్థానికులు హోసూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఫలితంలేక చనిపోయాడు.

రోడ్డు దాటుతుండగా..

క్రిష్ణగిరి: హైవేని దాటుతుండగా గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో సూళగిరి వానియర్ వీధికి చెందిన కార్మికుడు శ్రీనివాసన్ (52) మృతి చెందాడు. మంగళవారం ఉదయం హోసూరు - క్రిష్ణగిరి జాతీయ రహదారి కుందారపల్లి వద్ద జాతీయ రహదారిని దాటుతుండగా వేగంగా వెళ్లిన వాహనం ఢీకొని వెళ్లిపోయింది. ఈ ప్రమాదంలో తీవ్ర గాయాలైన శ్రీనివాసన్ ఘటనా స్థలంలోనే మరణించాడు. సూళగిరి పోలీసులు శవాన్ని ఆస్పత్రికి తరలించి కేసు నమోదు చేశారు.

డిగ్రీ విద్యార్థిని ఆత్మహత్య

హోసూరు: సెమిస్టర్ పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించలేదని బికాం విద్యార్థిని పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకొన్న ఘటన పోచ్చంపల్లి వద్ద జరిగింది. ఇక్కడి కే. మోటూరు గ్రామానికి చెందిన లోకేశ్వరి (19) అదే ప్రాంతంలోని ప్రైవేట్ కళాశాలలో బికాం ద్వితీయ సంవత్సరం చదువుతోంది. ఇటీవల జరిగిన సెమిస్టర్ పరీక్షల్లో పాస్ కాలేకపోవడంతో ఆవేదనకు గురై సోమవారం పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకొంది.

పశువులను బంధించి జరిమానా

సాక్షి ఎఫెక్ట్..



పశువులను బంధిస్తున్న కార్పొరేషన్ సిబ్బంది

హోసూరు: హోసూరు కార్పొరేషన్ పరిధిలో రోడ్లపై తిరుగుతున్న పశువులను కార్పొరేషన్ సిబ్బంది పట్టుకుని బంధించారు. ఈనెల 21న 'రోడ్లపై పశువులు–ప్రజలకు అవస్థలు' పేరిట సాక్షి దినపత్రిలో వార్త ప్రచురితమైంది. వార్తపై స్పందించిన అధికారులు హుటాహుటిన కార్పొరేషన్ సిబ్బంది ద్వారా మంగళవారం రోడ్లపై తిరుగుతున్న పశువులను పట్టుకుని వాటి యజమానులకు తలా రూ. 1000 జరిమానా విధించారు. వరుసగా దాడులు చేపడతామని, రెండవసారి పట్టుబడితే రూ. 3 వేలు, మూడవ సారి పట్టుబడితే రూ. 5 వేలు జరిమానా విధిస్తామని, పశువుల యజమానులు వాటిని ఇళ్లల్లోనే ఉంచి పోషించుకోవాలని సూచించారు. పశువులు నాలుగుసార్లు పట్టుబడితే వాటిని ఇక యజమానులకు అప్పగించమని హెచ్చరించారు. 20కి పైగా ఆవులను పట్టుకున్నారు. వీటిలో పది ఆవులు ఆలయాలకు చెందినవి కావడంతో వాటిని వదిలివేశారు.

క్లుప్తంగా...

'ఈసారి కూడా నా మనవడే సీఎం'

'వై ఏపీ నీడ్స్ జగన్'లో బామ్మ



ఎమ్మెల్యే తలారి వెంకట్రావుతో సంతోషాన్ని పంచుకుంటున్న వృద్ధురాలు ముస్సెమ్మ

ద్వారకాతిరుమల: 'ఈ మనవడు నాకెందుకు తెలీదు. నా పెద్ద మనవడే. వయసులో చిన్నోడైనా నాలాంటి ముసలోళ్లతోపాటు ఎంతోమంది పేదల జీవితాల్లో భరోసా నింపుతున్నాడు. ఎన్నికలు ఎప్పుడొచ్చినా నేనే కాదు. రాష్ట్రంలోని అందరూ ఆయనకే ఓటేస్తారు. ఈసారి కూడా నా మనవడు జగనే సీఎం అవుతాడు' అంటోంది ఏలూరు జిల్లా ద్వారకాతిరుమల మండలం దొరసానిపాడుకు చెందిన ముద్దన ముస్సెమ్మ. గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావు 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమంలో భాగంగా మంగళవారం దొరసానిపాడులో ఇంటింటికీ వెళ్లి సీఎం జగన్ సంక్షేమ పాలనను వివరించారు. ఈ సందర్భంలో ముద్దన ముస్సెమ్మ అనే వృద్ధురాలు తారసపడగా.. ఎమ్మెల్యే ఆమెతో ముచ్చటించారు. 'మా నమ్మకం నువ్వే జగన్' కరపత్రంపై ఉన్న సీఎం జగన్ ఫొటోను బామ్మకు చూపి 'ఈయన ఎవరో గుర్తుపట్టావా' అని అడిగారు. అది చూసిన ముస్సెమ్మ విప్పారిన కళ్లతో 'నా మనవడు నాకెందుకు తెలీదు. జగన్ మనవడి వల్లే సంతోషంగా బతుకుతున్నా. జగన్‌బాబే లేకపోతే మాలాంటి వాళ్ల బతుకులు ఏమైపోయేవో. ఆయన దయవల్ల ఎందరో పేదల బతుకులు బాగుపడ్డాయ్. మా అందరి ఆశీస్సులతో మళ్లీ నా మనవడే సీఎం అవుతాడు' అంటూ అమితానందంతో జవాబిచ్చింది.


కౌంటరు దాఖలు చేయండి

కృష్ణా ట్రిబ్యునల్ టీవోఆర్‌పై కేంద్రం, తెలంగాణకు సుప్రీంకోర్టు ఆదేశం

సాక్షి, న్యూఢిల్లీ : కృష్ణా ట్రిబ్యునల్–2కు కేంద్రం నోటిఫై టర్మ్స్ ఆఫ్ రిఫరెన్స్‌పై స్టే ఇవ్వాలంటూ ఏపీ ప్రభుత్వం దాఖలు చేసిన అప్లికేషన్‌పై కౌంటరు దాఖలు చేయాలని కేంద్రం, తెలంగాణ ప్రభుత్వాలను సుప్రీంకోర్టు ఆదేశించింది. ఏపీ ప్రభుత్వం దాఖలు చేసిన అప్లికేషన్‌ను జస్టిస్ అభయ్ ఎస్ ఓకా, జస్టిస్ పంకజ్ మిత్తల్‌తో కూడిన ధర్మాసనం విచారించింది. ఇదే అంశానికి చెందిన ఇతరత్రా కేసుల వివరాలు ధర్మాసనం ఆరా తీసింది. స్టే కోరుతూ అప్లికేషన్ దాఖలు చేశామని ఏపీ తరఫు న్యాయవాది ధర్మాసనం దృష్టికి తీసుకొచ్చారు. అప్లికేషన్‌లో ఏపీ లేవనెత్తిన అంశాలపై కౌంటరు దాఖలు చేయాలని కేంద్రం, తెలంగాణ ప్రభుత్వాలను ఆదేశించిన ధర్మాసనం తదుపరి విచారణ డిసెంబర్ 12కు వాయిదా వేసింది.

28న తిరుపతిలో ప్రాంతీయ సమావేశం

బీసీ సంక్షేమ శాఖ మంత్రి చెల్లుబోయిన



సాక్షి, అమరావతి: ఆంధ్రప్రదేశ్ కులగణన–2023 అభిప్రాయ సేకరణ కోసం ఈనెల 28న తిరుపతిలో ప్రాంతీయ సమావేశాన్ని నిర్వహిస్తున్నట్టు రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ మంగళవారం తెలిపారు. రాష్ట్రంలోని అన్ని వర్గాల నుంచి సమాచారం, సూచనలు, అభిప్రాయాలు సేకరించి కులగణన సమర్థంగా నిర్వహించేందుకు జిల్లా స్థాయిలో రౌండ్ టేబుల్ సమావేశాలతోపాటు ఐదు ప్రాంతీయ సమావేశాలు నిర్వహిస్తున్నామన్నారు. దీన్లో భాగంగా ఈనెల 24న జరగాల్సిన తిరుపతి ప్రాంతీయ సమావేశాన్ని 28కి మార్పు చేసినట్టు తెలిపారు. ఈ సమావేశానికి నెల్లూరు, చిత్తూరు, వైఎస్సార్ కడప జిల్లాల ప్రతినిధులు హాజరై సూచనలు అందిస్తారని మంత్రి వేణు తెలిపారు.

లబ్ధిదారులకు త్వరలో 68 వేల టిడ్కో ఇళ్లు: సురేశ్



సాక్షి, అమరావతి: టిడ్కో ఇళ్లను త్వరగా పూర్తి చేయాలని రాష్ట్ర మున్సిపల్, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేశ్ అధికారులను ఆదేశించారు. త్వరలో 68 వేల టిడ్కో ఇళ్లను లబ్ధిదారులకు అందజేస్తామన్నారు. మంగళవారం విజయవాడలో ఆయన టిడ్కో ఇళ్ల పనుల ప్రగతిపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి సురేశ్ మాట్లాడుతూ.. డిసెంబర్ చివరి నాటికి 1.50 లక్షల ఇళ్లు అందించాలని లక్ష్యంగా పెట్టుకున్నామని, ఇందుకు అనుగుణంగా 68,526 ఇళ్లను వేగంగా పూర్తి చేసి లబ్ధిదారులకు అందించేందుకు అన్ని చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ప్రస్తుతం 24వేల ఇళ్లు ప్రారంభానికి సిద్ధంగా ఉన్నాయని అధికారులు చెప్పగా.. వెంటనే ప్రారంభోత్సవాలకు ఏర్పాట్లు చేయాలని సూచించారు. టిడ్కో ఇళ్లపై కొన్ని పత్రికల్లో వస్తున్న అసత్య కథనాలను అధికారులు ఖండించి ప్రజలకు వాస్తవాలను తెలపాలని మంత్రి సూచించారు.

శబరిమలకు మరో 24 ప్రత్యేక రైళ్లు

సాక్షి, హైదరాబాద్: అయ్యప్ప దర్శనానికి వెళ్లే భక్తుల రద్దీ దృష్ట్యా పలు ప్రాంతాల నుంచి శబరిమలకు మరో 24 ప్రత్యేక రైళ్లను నడిపేందుకు ఏర్పాట్లు చేసినట్లు దక్షిణ మధ్య రైల్వే సీపీఆర్వో సీహెచ్ రాకేశ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు సికింద్రాబాద్–కొల్లాం, నర్సాపూర్–కొట్టాయం మధ్య డిసెంబర్ 24 నుంచి జనవరి 15వ తేదీ వరకు ఈ రైళ్ల రాకపోకలు సాగించనున్నాయి.

ఏపీకి జగనే ఎందుకు కావాలంటే.. వివరించే కార్యక్రమంలో భాగంగా..



ప్రకాశం జిల్లా కలుజువ్వలపాడు సచివాలయంలో పథకాల బోర్డును ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి



అన్నమయ్య జిల్లా చీకలబైలు సచివాలయం వద్ద డిజిటల్ బోర్డును ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే నవాజ్‌బాషా తదితరులు



అనకాపల్లి జిల్లా అంతకాపల్లిలో సంక్షేమ, అభివృద్ధి పథకాల బోర్డును ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్



శ్రీకాకుళం జిల్లా టెక్కలిలో సంక్షేమ పథకాల బుక్‌లెట్ అందజేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు




శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా ఆర్‌వైపాళెంలో సంక్షేమ పథకాల బోర్డును ప్రారంభిస్తున్న మండల ఉపాధ్యక్షుడు వేణుంబాక చంద్రశేఖర్‌రెడ్డి



నంద్యాల జిల్లా పెద్దగుమ్మడాపురం సచివాలయం వద్ద వైఎస్సార్‌సీపీ జెండాను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే తొగురు ఆర్థర్



చిత్తూరు జిల్లా కుప్పం మండలం వెండుగం పల్లె సచివాలయంలో ప్రగతి బోర్డును ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్సీ భరత్



ఎన్టీఆర్ జిల్లా విజయవాడ 29వ డివిజన్‌లో సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే మల్లాది విష్ణు

రామోజీ శోకం రుషి'కొండంత'!

రుషికొండ ప్రాజెక్టుపై మరోసారి కడుపుమంట బయటపెట్టుకున్న ఈనాడు

- విశాఖను రాజధానిగా చేస్తుంటే తట్టుకోలేని రామోజీ
- సీఎంను విశాఖకు రాకుండా అడ్డుకునే కుట్ర
- అందుకే విలాసాలు, దుబారా అంటూ కొండంత విషం
- అత్యాధునిక పర్యాటక సౌకర్యాలతో రుషికొండ ప్రాజెక్టు చేపట్టిన ఏపీటీడీసీ
- పాత భవనాలు ఆధునికతకు పనికిరావని కొత్తవి నిర్మాణం
- సీఎం క్యాంపు కార్యాలయం కోసం ప్రత్యేక కమిటీ వేసిన ప్రభుత్వం
- అనేక భవనాలను పరిశీలించి రుషికొండ ప్రాజెక్టు సిఫారసు
- ప్రజలకు, వీవీఐపీలకు ట్రాఫిక్ ఇబ్బందులు ఉండవని కమిటీ వెల్లడి
- గతంలో చంద్రబాబు క్యాంపు కార్యాలయాలకు భారీగా ప్రజాధనం వృథా
- బాబు ఫైవ్‌స్టార్ హోటల్‌లో బసకే రోజుకు రూ.లక్ష ఖర్చు
- సొంత ఇళ్లకు, క్యాంపు కార్యాలయాలకు బాబు రూ. కోట్లు ఖర్చు
- ఇలాంటి దుబారా బాబు.. చాలా నిరాడంబరుడు
- సొంత ఇంటినే క్యాంపు కార్యాలయంగా చేసుకున్న సీఎం జగన్‌ది దుబారానా?

సాక్షి, అమరావతి: అభివృద్ధి చూసి గోల పెట్టడమంటే ఇదే. మంచిని గుర్తించలేని కడుపు మంట అంటే ఇదే. ఒకళ్లపై పడి ఏడవటమంటే ఇదే. ప్రపంచంలో అతి వేగంగా అభివృద్ధి చెందుతున్న నగరాల్లో ఒకటైన విశాఖలో ఓ మంచి ప్రాజెక్టు రావడం రామోజీకి ఇష్టమే ఉండదు. విశాఖను రాజధానిగా చేస్తుంటే తట్టుకోలేరు. విశాఖ సుందర తీరంలో ప్రపంచ పర్యాటకుల్ని ఆకర్షించేలా ఓ అద్భుత ప్రాజెక్టు నిర్మిస్తుంటే అసలే తట్టుకోలేకపోతున్నారు. అందుకే ఉత్తరాంధ్రపై ఆయనకు ఉన్న ఉన్మాదాన్ని మరోసారి ప్రదర్శించారు. రుషికొండ టూరిజం ప్రాజెక్టుపై కొండంత విషం చిమ్మారు. హైదరాబాద్, విజయవాడలో క్యాంపు కార్యాలయాల పేరిట, ఫైవ్ స్టార్ హోటళ్లలో బసకు ఆయన అనుంగు చంద్రబాబు చేసిన కోట్లాది రూపాయల దుబారాను వదిలేసి, ఇప్పుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం చేపట్టిన టూరిజం ప్రాజెక్టుపై విలాసాలు, దుబారా అంటూ చిందులేస్తున్నారు. రుషికొండ ప్రాజెక్టులో ఆధునిక సౌకర్యాలు కల్పించారని, ఇందుకోసం ప్రజాధనం రూ.433 కోట్లు ఖర్చు చేశారంటూ శోకాలు తీస్తున్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ విశాఖ రాకుండా కుట్ర చేస్తున్నారు.

ఆదాయం కోసమే కొత్త రిసార్టు ప్రతిపాదన

వాస్తవానికి రుషికొండపై 1984–89లో 48 వేల చదరపు అడుగులు స్థలంలో నిర్మాణాలు చేశారు. తర్వాత 2002లో మరిన్ని నిర్మాణాలు చేపట్టారు. పర్యాటక రంగానికి తలమానికంగా ఉండాల్సిన ఈ భవనాల్లో తగినన్ని వసతులు లేవు. వాటిని ఆధునికంగా తీర్చిదిద్దడం సాధ్యం కాదని అధికారులు తేల్చారు. పైగా ఈ భవనాలు పాతబడటంతో వాటి స్థానంలో కొత్తవి నిర్మించాలని నిర్ణయించారు. అందుకే ఏపీటీడీసీ 2.15 లక్షల చదరపు అడుగుల్లో కొత్తగా రిసార్ట్ నిర్మాణం చేపట్టింది. గతంలో చదరపు అడుగు స్థలంలో ఏడాదికి వచ్చే ఆదాయం రూ.1,100 అయితే, దానిని రూ.2,300కు పెంచేలా కొత్త రిసార్టులను డిజైన్ చేశారు. అందుకే బీచ్ ముఖద్వారంగా అన్ని రకాల సదుపాయాలతో



రుషికొండలో సీఎం క్యాంపు కార్యాలయానికి

రూ. 433 కోట్లు

నిర్మాణాలు చేసింది. ఈ నిర్మాణాలకు సీఆర్‌జెడ్, ఏపీసీజెడ్ఎంఏ, అటవీ, ఫైర్‌సేఫ్టీ, బిల్డింగ్ ప్లాన్ అప్రూవల్, ఏపీపీసీబీల నుంచి ముందస్తు అనుమతులు తీసుకునే పనులు చేస్తున్నారు. త్వరలో మొత్తం పనులు పూర్తికానున్నాయి.

ఇందుకే రుషికొండ ఎంపిక..

ఉత్తరాంధ్ర అభివృద్ధిపై సమీక్షల కోసం ముఖ్యమంత్రి విశాఖలో విడిది చేయడానికి అనువైన భవనాలను గుర్తించడానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక కమిటీని నియమించింది. విశాఖలోని ఐటీ హిల్స్‌తో పాటు అనేక భవనాలను పరిశీలించింది. ఆంధ్ర యూనివర్సిటీ ప్లాటినం జూబ్లీ హాల్స్, వీఆర్ఎండీఏ బిల్డింగు, వీఎంఆర్డీఏ పీతాపురం షాపింగ్ కాంప్లెక్స్, రుషికొండ వద్ద ట్రైబల్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్, మిలీనియం టవర్స్, రుషికొండపై నిర్మించిన రిసార్టులను తుది పరిశీలనలోకి తీసుకున్నారు. సీఎం క్యాంపు కార్యాలయం, అధికారులతో సమావేశాలు, భద్రత దృష్ట్యా ప్రజలకు ఇబ్బంది లేకుండా భవనం ఎంపిక చేయాలని భావించారు. రుషికొండ రిసార్టు, ట్రైబల్ రీసెర్చి ఇన్‌స్టిట్యూట్ భవనం మినహా మిగిలినవన్నీ నగరంలోని రద్దీ ప్రాంతాల్లో ఉన్నాయి. అధికారులకు, ప్రజలకు ట్రాఫిక్ ఇబ్బందుల్లేకుండా ఉండేలా అనేక కోణాల్లో చర్చించిన తర్వాత రుషికొండ రిసార్టును సీఎం క్యాంపు కార్యాలయానికి అనువైనదని సూచించారు. పైగా దీనికి సమీపంలోనే గత ప్రభుత్వంలో నిర్మించిన హెలిప్యాడ్ ఉంది. ఇది సీఎం సహా వీవీఐపీల రాకపోకలకు అనుకూలంగా ఉంటుందని కమిటీ నివేదికలో పేర్కొంది. రుషికొండ ప్రాజెక్టు సీఎం క్యాంపు కార్యాలయంగా పరిశీలనలోకి రావడం, సీఎం భద్రత దృష్ట్యా చిన్న చిన్న మార్పులను కమిటీ సూచించింది. అంతకు ముందు రుషికొండ ఒక పర్యాటక ప్రాజెక్టు మాత్రమే. దేశ, విదేశీ పర్యాటకులకు అత్యాధునిక పర్యాటక అనుభూతిని అందించే ఉద్దేశంతోనే ఏపీటీడీసీ ఈ ప్రాజెక్టును చేపట్టినందనేది జగమెరిగిన సత్యం. కానీ, ఈనాడు మాత్రం వాస్తవాలను వక్రీకరిస్తూ విశాఖకు సీఎం రాకూడదనే ఉద్దేశంతో నిత్యం బురదజల్లుతూనే ఉంది.

ఫైవ్‌స్టార్ బాబు గుర్తులేడా రామోజీ!

చంద్రబాబు ఎన్ని క్యాంపు కార్యాలయాల కోసం ఖజానా నుంచి ఎన్ని కోట్లు వెచ్చించారో రామోజీ ఓసారి ఐదేళ్లు వెనక్కు వెళ్లి పరిశీలన చేసుకోవాలి. ఐదేళ్లు చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉండగా సీఎం నివాసం క్యాంపు కార్యాలయాల కోసం కోట్ల రూపాయలను వ్యయం చేసి దుబారాకు పాల్పడ్డారు. ముఖ్యమంత్రిగా చంద్రబాబు నాయుడు తన నివాసం, క్యాంపు కార్యాలయంగా హైదరాబాద్‌లోని పార్క్ హయత్ ఫైవ్ స్టార్ హోటల్‌ను ప్రకటించి మరీ సర్కారు ఖజానా నుంచి ఏకంగా రూ.30 కోట్లు చెల్లించారు. ఫైవ్ స్టార్ హోటల్లో బాబు కుటుంబం నెలల తరబడి నివాసం ఉండటం, అందుకు ఖజానా నుంచి కోట్ల రూపాయలు చెల్లించినా రామోజీ రావుకు కనిపించలేదు. ఏ ముఖ్యమంత్రి ఎప్పుడు ఇలా ఫైవ్ స్టార్ హోటల్‌లో నివాసం ఉండలేదు. పార్క్ హయత్ హోటల్‌కు రోజుకు లక్ష రూపాయల చొప్పున అద్దె చెల్లించినట్లు అప్పట్లోనే ఆంగ్ల పత్రికలు ప్రముఖంగా ప్రచురించాయి.

బాబుగారి క్యాంపు ఆఫీసుల బాగోతమిదీ..

చంద్రబాబు తొలుత జూబ్లిహిల్స్‌లోని తన నివాసాన్ని సీఎం క్యాంపు కార్యాలయంగా ప్రకటించి దానిలో హంగులు, ఆర్భాటాల కోసం ఖజానా నుంచి నిధులు ఖర్చు చేశారు. ఆ తరువాత అద్దె ఇంటిలోకి వెళ్లి ఆ ఇంటిని సీఎం నివాసం, క్యాంపు కార్యాలయంగా ప్రకటించారు. ఆ ఇంటికి కూడా ప్రభుత్వ ఖజానా నుంచి కోట్ల రూపాయలు వృథాగా ఖర్చు చేశారు. తొలుత హైదరాబద్‌లోని సెక్రటేరియట్‌లో హెచ్ బ్లాక్‌ను సీఎం కార్యాలయంగా ప్రకటించి రూ. 7 కోట్లతో మరమ్మతులు చేశారు. ఆ తరువాత వాస్తు పేరుతో ఎల్ బ్లాక్‌ను సీఎం కార్యాలయంగా ప్రకటించి అక్కడ మరమ్మతులు, ఫర్నీచర్, హంగుల కోసం ఏకంగా రూ.25 కోట్లు ఖర్చు చేశారు. హైదరాబాద్‌లోనే లేక్‌వ్యూ గెస్ట్ హౌస్‌ను సీఎం క్యాంపు కార్యాలయంగా ప్రకటించి రూ.10 కోట్లు ఖర్చు చేశారు. ఆ తరువాత ఓటుకు కోట్లు కేసులో ఆయన గుట్టు రట్టవడంతో హఠాత్తుగా హైదరాబాద్ వదిలేసి రాత్రికిరాత్రి విజయవాడ వచ్చేశారు. విజయవాడ ఇరిగేషన్ గెస్ట్ హౌస్‌ను సీఎం క్యాంపు కార్యాలయంగా ప్రకటించి రూ.42 కోట్లతో మార్పులు చేశారు. చివరికి కృష్ణా కరకట్ట ఎక్కి లింగమనేని గెస్ట్ హౌస్‌ను సీఎం నివాసం, క్యాంపు కార్యాలయంగా ప్రకటించారు. ఇవన్నీ కూడా అధికారికంగా జీవోల ద్వారానే ప్రభుత్వ ఖజానా నుంచి కోట్ల రూపాయలు దుబారా చేసినవే. హైదరాబాద్ మదీనాగూడలోని చంద్రబాబు సొంత ఫామ్ హౌస్‌లో హెలిప్యాడ్, రహదారుల నిర్మాణం కోసం ప్రభుత్వ ఖజానా నుంచి నిధులు విడుదల చేస్తూ జీవో జారీ చేశారు. మదీనాగూడతో పాటు జూబ్లిహిల్స్‌లో విలాసవంతమైన ఇంద్రభవనాలు నిర్మించుకున్న చంద్రబాబు.. వాటిలో ఇంటీరియర్ కోసం సీఆర్‌డీఏ నిధులను మళ్లించారు. ఇలాంటి దుబారా బాబు.. రామోజీ దృష్టిలో చాలా నిరాడంబరుడు. తన సొంత ఇంటినే క్యాంపు కార్యాలయంగా చేసుకున్న సీఎం జగన్‌ను మాత్రం ఏ కారణం లేకుండా తప్పుపట్టేయొచ్చు.

లేని బ్రాండ్లకు ధరల పెంపా!?

మద్యం బ్రాండ్ల ధరలపై ఎల్లో మీడియా గగ్గోలు

- మార్కెట్‌లో లేని బ్రాండ్ల ధరలు తగ్గాయంటూ అవాస్తవ కథనాలు
- మార్కెట్‌లో అందుబాటులోలేని ఆ కంపెనీల బ్రాండ్ల ధరలే స్వల్పంగా పెరిగాయి
- మార్కెట్‌లో ఉన్న రకాల ధరలు పెరగలేదు
- నిజానికి.. పన్నుల విధానంలో ప్రభుత్వం ఏకరూపత తీసుకొచ్చింది
- అస్మదీయుల బ్రాండ్ల ధరలు పెరగలేదంటూ పెడబొబ్బలు
- కానీ, అవి అసలు మార్కెట్‌లో లేనేలేవు.. పైగా సంబంధిత కంపెనీలు ఆ బ్రాండ్లను రెన్యూవల్ చేసుకోలేదు
- వాటి నిల్వలు దాదాపు చివరి దశకు చేరుకున్నాయి
- మద్యం కంపెనీల పెండింగ్ బిల్లుల బకాయిలన్నీ తీరిపోయాయి
- అవాస్తవాలతో అభాసుపాలైన 'పచ్చ'బ్యాచ్



అస్మదీయుల బ్రాండ్ల ధరలు తగ్గించు..

వారి ఆదాయం పెంచు

బ్రాండ్ల నిల్వల వివరాలు

మద్యం బ్రాండ్	అక్టోబరులో అమ్మకాలు	అందుబాటులో ఉన్న నిల్వ (2023, నవంబరు 20 నాటికి)
ఏసీపీ ప్రెస్టీజ్ డీలక్స్ విస్కీ	నిల్	10 కేసులు
యాంటిక్విటీ ఎక్స్ఆర్ బ్లెండెడ్ బ్రాందీ	3 కేసులు	7 బాటిళ్లు
ఎనీటైమ్ గోల్డ్ విస్కీ	నిల్	1 బాటిల్
యాపిల్ ప్రీమియం వోడ్కా	నిల్	9 బాటిళ్లు
కింగ్‌ఫిషర్ స్ట్రాంగ్ ప్రీమియం బీర్	నిల్	1 బాటిల్
9 సీ హార్స్ విస్కీ	2 కేసులు	76 కేసులు
మంజీరా క్లాసిక్ రిజర్వ్ విస్కీ	నిల్	7 కేసులు
ఆంధ్రాగోల్డ్ విస్కీ	నిల్	18 కేసులు
జీసీ గ్రీన్ చాయిస్ సుపీరియర్ విస్కీ	నిల్	14 కేసులు
ఎస్‌పీవై సెలబ్రిటీ బ్రాందీ	361 కేసులు	592 కేసులు
10000 సూపర్ స్ట్రాంగ్ బీర్	నిల్	139 కేసులు

సాక్షి, అమరావతి : ఎన్టీఆర్ హయాంలోలాగ తాను తలచుకుంటే ఎవరినైనా సీఎం కుర్చీలో కూర్చోబెట్టగలనన్న అతివిశ్వాసం రామోజీరావులో ఇంకా చావలేదు. తన వికృత రాతలతో రాష్ట్ర ప్రభుత్వానికి మద్యంపై పైసా ఆదాయం రాకుండా చేయాలని.. అలా ప్రభుత్వ ఆదాయ మార్గాలకు గండికొడితే రాష్ట్రంలో అమలవుతున్న సంక్షేమ కార్యక్రమాలను అడ్డుకోవచ్చని.. తద్వారా వాటిని అమలుచేయలేని పరిస్థితిల్లోకి నెడితే వైఎస్ జగన్ సర్కార్ ప్రజావిశ్వాసం కోల్పోతుందనేది రామోజీ దింపుడు కళ్లెం ఆశ. కానీ, ఇప్పుడున్నవి ఎన్టీఆర్ హయాం నాటి రోజులు కాదని ఆయన గుర్తించట్లేదు. ఎందుకంటే ఇప్పుడు ఆయన మనసంతా బాబును అర్జెంటుగా సీఎం కుర్చీపై కూర్చోపెట్టడం పైనే కేంద్రీకృతమై ఉంది. ఇందుకోసం ఆయన పడుతున్న ప్రయాస అంతాఇంతా కాదు. ఇందులో భాగమే ఆయన విషపుత్రిక ఈనాడులో అచ్చోసి ప్రజలకు ఏమాత్రం కిక్కివ్వని తాజా కథనం 'ఆ కిక్కు ఎవరికో.. అస్మదీయుల బ్రాండ్ల ధరలు తగ్గింపు'.. బాగోతం. రాష్ట్రంలో మద్యం ధరలపై పన్నుల విధానాన్ని ప్రభుత్వం ఇటీవల హేతుబద్ధీకరిస్తూ ఉత్తర్వులు జారీచేసింది. దీనికి మసిపూసి మారేడుకాయ చేసే క్రమంలో 'పచ్చ'కిక్కు ఎక్కించుకుని ఉన్నవి లేనివి ఊహించుకుని పచ్చమీడియా చేతికొచ్చింది పిచ్చిరాతలు రాసిపారేసింది. అబద్ధాలను రంగరించి చంద్రబాబుకు ప్రీతిగా వండామని సంబరపడ్డాయి. కానీ, ఈ వంటకం వండే క్రమంలో పప్పులో కాలేశారు. అదేమిటంటే.. రాష్ట్ర మార్కెట్‌లో లేని మద్యం బ్రాండ్లు, దాదాపు బ్యాలెన్స్ స్టాక్‌లేని బ్రాండ్ల పేర్లను పేర్కొంటూ కథనాన్ని నమ్మించేందుకు ప్రయత్నించి ఎల్లో ముఠా అభాసుపాలైంది. 'పచ్చ' పైత్యంలోని అసలు వాస్తవాలు ఏమిటంటే..

- మద్యం ఉత్పత్తులపై పన్నుల విధానాన్ని హేతుబద్ధీకరిస్తూ ప్రభుత్వం చాలా స్వల్పంగా ఏఆర్ఈటీ, ఏఈడీ, వ్యాట్ పన్నులతోపాటు స్పెషల్ మార్జిన్‌ను సవరించింది. అన్ని బ్రాండ్ల మద్యం ఉత్పత్తుల బేసిక్ ధరపై పన్నుల శాతాన్ని నిర్ణయిస్తూ పన్నుల విధానంలో ఏకరూపత తీసుకొచ్చింది. దాంతో అతికొద్ది బ్రాండ్ల ధరలే స్వల్పంగా పెరిగాయి. అత్యధిక బ్రాండ్ల ధరలు యథాతథంగానే ఉన్నాయి. మొత్తం మీద ఆదాయం కొద్దిగా పెరిగినట్లు కనిపిస్తున్నా అత్యధిక బ్రాండ్ల మద్యం ధరల్లో మాత్రం ఏమాత్రం మార్పులేదు.
- ఇక అస్మదీయుల బ్రాండ్ల ధరలు పెరగలేదంటూ పచ్చ పత్రికలు ప్రచురించిన మద్యం బ్రాండ్లు అసలు మార్కెట్‌లో లేనేలేవు. సంబంధిత కంపెనీలు ఆ మద్యం బ్రాండ్లను రెన్యూవల్ చేసుకోలేదు. ఆ కంపెనీల మద్యం నిల్వలు దాదాపు ముగింపునకు చేరుకున్నాయి. ప్రస్తుతం రాష్ట్రంలో హోల్‌సేల్, రిటెయిల్ మద్యం దుకాణాల్లో ఆ మద్యం బ్రాండ్ల నిల్వలు కూడా దాదాపులేవు. అంటే ఆ బ్రాండ్లు, వాటి ధరలు కేవలం కాగితాలపైనే కనిపిస్తున్నాయి తప్ప మార్కెట్‌లో అందుబాటులో లేవన్నది వాస్తవం.

కానీ, ఆ బ్రాండ్ల ధరలు పెరగనే లేదంటూ ప్రజలను తప్పుదోవ పట్టించేందుకు పచ్చ పత్రికలు యత్నించాయి.

- రాష్ట్రంలో ప్రస్తుతం అందుబాటులో ఉన్న మద్యం బ్రాండ్ల గురించి పచ్చ పత్రికలు కనీసం పేర్కొనలేదు. ఎందుకంటే ఆ బ్రాండ్ల మద్యం ధరలు ఏమాత్రం పెరగలేదు కనుక. ఆ విషయాన్ని ప్రజలకు తెలియకుండా ఉండేందుకే ఆ బ్రాండ్ల పేర్లను పచ్చ పత్రికలు ఉద్దేశపూర్వకంగా విస్మరించాయి.
- ఎంఎస్ బయోటెక్, ఈగిల్ డిస్టిలరీస్, ఎస్‌పీవై ఆగ్రో ప్రైవేట్ లిమిటెడ్, ఎస్ఎన్‌జీ సుగర్స్ ప్రైవేట్ లిమిటెడ్ ఉత్పత్తి చేసే మద్యం బ్రాండ్లకు సంబంధించి మార్కెట్‌లో అందుబాటులో ఉన్న వాటి ధరలు పెరగలేదు. ప్రస్తుతం రాష్ట్ర మార్కెట్‌లో అందుబాటులోలేని ఆ కంపెనీల బ్రాండ్ల ధరలే స్వల్పంగా పెరిగాయి తప్పా మార్కెట్‌లో ఉన్న బ్రాండ్ల ధరలు పెరగలేదు. ఉదా.. కింగ్‌ఫిషర్ స్ట్రాంగ్ ప్రీమియం బీర్, ఎస్ఎన్‌జే 10000 సూపర్ స్ట్రాంగ్ బీర్ ధరల గురించి పచ్చ పత్రికలు ప్రధానంగా రాశాయి. కానీ, ఆ బ్రాండ్లు ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్ మార్కెట్‌లో దాదాపు అందుబాటులో లేనేలేవు. గతంలో తెచ్చిన స్టాక్ దాదాపు పూర్తయ్యింది.
- పన్నులను హేతుబద్ధీకరించడంతో అతికొద్ది కంపెనీల లీటర్ సైజు లిక్కర్ బాటిళ్ల ధరలు మాత్రమే స్వల్పంగా తగ్గాయి. రాష్ట్రంలో ఒక లీటర్ అంతకంటే పెద్ద పరిమాణంలో మద్యం బాటిళ్ల ఉత్పత్తి, అమ్మకాలు కేవలం నామమాత్రమే.
- ఇక మద్యం కంపెనీల పెండింగ్ బిల్లులను ప్రభుత్వం దాదాపు చెల్లించేసింది. ఇటీవల రూ.175 కోట్లు చెల్లించడంతో బకాయిలన్నీ తీరిపోయాయి.
- కొన్ని కంపెనీలకు మద్యం ఉత్పత్తులపై కేసుకు రూ.250 చెల్లించమన్నారని పచ్చ పత్రికలు పేర్కొన్న విషయం పూర్తిగా అవాస్తవం. పూర్తి పారదర్శక విధానంలో ప్రభుత్వం మద్యం కంపెనీల నుంచి మద్యం కొనుగోలు చేస్తోంది. రాష్ట్రంలో దశలవారీగా మద్య నియంత్రణ విధానాన్ని కచ్చితంగా పాటిస్తూ ప్రభుత్వం మద్యం కొనుగోలు చేస్తోంది.

విద్య, వైద్యం, గృహ కల్పనలో మహా విప్లవం

- ఏఎన్‌యూ ఆర్కిటెక్చర్ భవనం ప్రారంభంలో ఎంపీ విజయసాయిరెడ్డి



రూ. 50 లక్షల చెక్కును వీసీకి అందజేస్తున్న విజయసాయిరెడ్డి

ఏఎన్‌యూ (గుంటూరు): ఏపీలో విద్య, వైద్యం, గృహ కల్పన వంటి రంగాల్లో మహా విప్లవం కొనసాగుతోందని రాజ్యసభ సభ్యుడు వి.విజయసాయిరెడ్డి స్పష్టం చేశారు. ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో నిర్మించిన ఆర్కిటెక్చర్ కళాశాల భవనాన్ని మంగళవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా డైక్‌మెన్ ఆడిటోరియంలో నిర్వహించిన సభలో విజయసాయిరెడ్డి ప్రసంగిస్తూ.. ఆంధ్రప్రదేశ్‌లోని పేద వర్గాల సంపూర్ణ సాధికారతే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చర్యలు చేపడుతున్నారని చెప్పారు. మంచి ఉన్నత విద్యకు, యువత సాధికారతకు ప్రాథమిక, మాధ్యమిక విద్యే మూలస్తంభమని పేర్కొన్నారు. ఈ విషయాన్ని గుర్తించిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో నాడు–నేడు, జగనన్న విద్యాకానుక వంటి పథకాల ద్వారా ఆదర్శవంతమైన సంస్కరణలు అమలు చేస్తున్నారన్నారు. విద్యతోపాటు ఉపాధి కల్పనకూ ఏపీ ప్రభుత్వం అధిక ప్రాధాన్యతనిస్తోందన్నారు. గడచిన నాలుగున్నరేళ్లలో 1.25 లక్షల ప్రభుత్వ ఉద్యోగాలు, వివిధ సంస్థల్లో 6.16 లక్షల ఉద్యోగాలు కల్పించామని తెలిపారు. దివ్యాంగులకు ఉన్నత విద్య, నైపుణ్యాన్ని పెంపొందించే ప్రత్యేక కేంద్రాన్ని నెలకొల్పి వారి కోసం ప్రత్యేక కోర్సులు నిర్వహించాలని యూనివర్సిటీ అధికారులకు సూచించారు. ఇందుకు అవసరమైన నిధులను ప్రభుత్వం నుంచి, విరాళాల రూపంలో సమకూరుస్తానని హామీ ఇచ్చారు. వైస్ చాన్సలర్ పి.రాజశేఖర్ మాట్లాడుతూ.. యూనివర్సిటీలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ మెషిన్ లెర్నింగ్, ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ టెక్నాలజీ ఎక్సలెన్స్ సెంటర్ ఏర్పాటుకు ఎంపీ కోటా నిధుల నుంచి రూ.50 లక్షలు ఇవ్వడం అభినందనీయమన్నారు. అనంతరం రూ.50 లక్షల చెక్కును ఎంపీ విజయసాయిరెడ్డి వీసీ రాజశేఖర్‌కు అందజేశారు.

సాక్షి
ఫ్యామిలీ
బెంగళూరు
బుధవారం ॥ 22-11-2023



లీలారాణి

లైఫ్ స్టయిల్ మారుద్దాం..!

ఈ రోజుల్లో...
ఏం తింటున్నాం, ఎలా ఉంటున్నాం!?
పిల్లలు ఎలా ఎదుగుతున్నారు?
ఉరుకుల పరుగుల జీవనంలో ఇవన్నీ సహజమే అని వదిలేస్తే ..
'భవిష్యత్తు తరాలు ఎదుర్కొనే సమస్యలు అన్నీ ఇన్నీ కావు' అంటున్నారు లీ హెల్త్ డొమైన్ డైరెక్టర్ లీలారాణి. ఆరోగ్య విభాగంలో న్యూట్రాస్యుటికల్, ఫుడ్ సప్లిమెంట్ ఉత్పత్తుల పరిశోధన, అభివృద్ధిపై దృష్టిపెట్టే ఈ సంస్థ ద్వారా మన జీవనవిధానం వల్ల ఎదుర్కొనే సమస్యలకు మూలకారణాలేంటి అనే విషయంపై డేటా సేకరించడంతో పాటు, అవగాహనకు కృషి చేస్తున్నారు. హెల్త్ అండ్ వెల్‌నెస్, సీఐఐ ఇండియన్ ఉమెన్ నెట్‌వర్క్ ఏపీ చాంబర్స్, విశాఖపట్నం జోన్ చెయిర్ పర్సన్‌గానూ ఉన్న లీలారాణి మహిళలు, పిల్లల ఆరోగ్య సమస్యలపై డేటా వర్క్, బేసిక్ టెస్ట్‌లు చేస్తూ తెలుసుకుంటున్న కీలక విషయాలను ఇలా మన ముందుంచారు..



''ప్రస్తుత జీవన విధానం, తీసుకునే ఆహారం వల్ల పిల్లలకు ఎలాంటి దీర్ఘకాలిక జబ్బులు వస్తున్నాయి అనే అంశం ప్రస్తావనకు వచ్చినప్పుడు స్కూళ్లవైపుగా డేటా సేకరించాలనుకున్నాం. ముందు 8-10 ఏళ్ల పిల్లలకు స్కూళ్లలో ఇటీవల ప్రారంభించాం. ఊర్జా ప్రాజెక్టులో భాగంగా బేసిక్ న్యూట్రిషన్ ఫోకస్డ్ ఫిజికల్ ఎగ్జామినేషన్స్ చేస్తున్నాం. ఈ టెస్ట్ ద్వారా పిల్లల్లో .. ఆహారానికి సంబంధించిన సమస్యలు ఏమున్నాయి, తల్లిదండ్రులు– కుటుంబ సభ్యులతో, స్నేహితులతో ఎంత సమయం గడుపుతున్నారు, శారీర చురుకుదనం, డిజిటల్ ఎక్స్‌పోజర్ ఎలా ఉంది, నిద్ర సమస్యలు ఏంటి.. ఇలా కొన్నింటితో ఒక ప్రశ్నాపత్రం రూపొందించాం. పిల్లల దగ్గర సమాధానాలు తీసుకొని, వాటిలో ప్రధాన సమస్యలపై ఫోకస్ పెట్టాం. ఆంధ్రా, తెలంగాణలోని స్కూళ్లలో పెద్ద స్థాయిలో డేటా తీసుకోవాలని ప్రారంభించాం. ఇప్పుడైతే 200 మంది పిల్లలతో విశాఖపట్నంలో ఈ డేటా మొదలుపెట్టాం.

8-15 ఏళ్ల వయసులో ..

పిల్లలతో కలిసి రోజువారి జీవనవిధానం గురించి చర్చించినప్పుడు 'మా పేరెంట్స్ బిజీగా ఉంటారు. వాళ్లు డిజిటల్ మీడియాను చూస్తారు, మేమూ చూస్తాం.' అని చెబుతున్నారు. ఈ వయసు పిల్లలు సోషల్ మీడియాలో అకౌంట్స్ ఉండటమే కాకుండా, చురుకుగా ఉంటున్నారు. కారణం అడిగితే – 'అమ్మనాన్నలను ఏదైనా విషయం గురించి అడిగితే చెప్పరు. అందుకని డిజిటల్‌లో షేర్ చేసుకొని తెలుసుకుంటాం' అంటున్నారు. తెలియని వ్యక్తులతో పరిచయాలు ఈ విధంగా పెంచుకుంటూ సమస్యలు తెచ్చుకుంటున్నారు. ఫిజికల్ యాక్టివిటీకి సంబంధించి స్కూళ్లలో ఎలాంటి గేమ్స్ ఉన్నాయి, ఇంటి బయట ఎలా ఉంటున్నారు,... అనేది కూడా ఒక డేటా తీసుకుంటున్నాం. 8–15 ఏళ్ల లోపు పిల్లల్లో ఫిజికల్ యాక్టివిటీ ఎక్కువ లేకపోవడం వల్ల వారు యంగేజ్‌కు వచ్చేసరికి సమస్యలు ఎదుర్కోవాల్సి వస్తుందని గుర్తించాం.

ఊబకాయమూ సమస్యే

ఎగువ మధ్యతరగతి పిల్లల్లో ఊబకాయం అనేది ప్రధాన సమస్యగా ఉంది. డబ్ల్యూహెచ్‌ఓ సూచించిన టెస్ట్‌లు చేసినప్పుడు ఈ విషయాలు గుర్తించాం. వాటిలో శారీరక చురుకుదనం లోపించడమే ప్రధానంగా కారణంగా తెలుసుకున్నాం. బయట జంక్ ఫుడ్ నెలలో ఎన్ని సార్లు తీసుకుంటున్నారు అనేదానిపైన రిపోర్ట్ తయారుచేశాం. పిల్లల నుంచి సేకరించిన రిపోర్ట్‌ను ఆ స్కూళ్లకు ప్రజెంట్ చేస్తున్నాం. ఆ రిపోర్ట్‌లో 'మీ స్కూల్ కరిక్యులమ్‌లో చేర్చదగిన అంశాలు అని ఓ లిస్ట్ ఇస్తున్నాం. వాటిలో, చురుకుదనం పెంచే గేమ్స్‌తో పాటు న్యూట్రిషన్ కిచెన్, గార్డెనింగ్.. వంటివి ఒక ప్రాక్టీస్‌గా చేయించాలని సూచిస్తున్నాం.

ముందుగా 40 ఏళ్ల పైబడినవారితో..

రెండేళ్ల క్రితం ఒక కార్పోరేట్ సెక్టార్‌లో దాదాపు పది వేల మందికి (40 ఏళ్ల పైబడిన వారికి) ఎన్జీవోలతో కలిసి బిఎమ్‌డి టెస్ట్ చేశాం. వీరిలో బోన్‌డెన్సిటీ తక్కువగా ఉండటమే కాకుండా, మానసిక ప్రవర్తనలు, నెగిటివ్ ఆలోచనలు, స్ట్రెస్ ఇండెక్స్, బ్లడ్ ప్రెజర్, కొలెస్ట్రాల్.. వంటివి దేని వల్ల వస్తున్నాయి అనేది తెలుసుకున్నాం. నిజానికి 60 ఏళ్ల పైబడిన వారి బోన్ డెన్సిటీ బాగుంది. కారణం, ఆ రోజుల్లో వారు చేసే శారీరక శ్రమయే కారణం. ఇప్పుడది తగ్గిపోయింది.

పరిష్కారాలూ సూచిస్తున్నాం..

ఎక్కడైతే టెస్ట్‌లు చేశామో, వారి జీవనవిధానికి తగిన సూచనలూ చేస్తున్నాం. ఆరోగ్య సమస్యలు ఏవి అధికంగా వస్తున్నాయో తెలుసుకుని, వాటిని పరిష్కరించుకునే విధానాలను సూచిస్తున్నాం. చాలావరకు ఈ వయసు వారిలోనూ ఫిజికల్ యాక్టివిటీ లేకపోవడం వల్లే సమస్యలు. ముఖ్యంగా కార్పొరేట్ సెక్టార్ నుంచి ఈ సమస్య అధికంగా ఉంది. పని ప్రదేశంలో శరీర కదలికలు లేకపోడం, అక్కడి వాతావరణం, స్క్రీన్ నుంచి వచ్చే సమస్యలు, డిజిటల్ ఎక్స్‌పోజర్.. వీటన్నింటినీ ఒక్కొక్కరి నుంచి తీసుకొని వారికి తగిన సూచనలు ఇస్తూ వచ్చాం. సమస్యలు ఎక్కువ ఉన్నవారి బాల్య దశ గురించి అడిగితే మరికొన్ని ఆసక్తికర విషయాలు తెలిశాయి.

బాల్య దశ కీలకం

పెద్దవాళ్లలో సమస్యలు గమనించినప్పుడు వారి బాల్య దశ కీలకమైందని గుర్తించాం. దీంతో పిల్లల్లోనే ముందుగా సమస్యను పరిష్కరిస్తే మంచిదని, పిల్లల్లో పరీక్షలు చేసినప్పుడు వారిలో బోన్ డెన్సిటీ సమస్య కనిపించింది. దీని గురించి డాక్టర్లతో చర్చించినప్పుడు మూల కారణం ఏంటో తెలిసింది. ఒకప్పుడు గ్రామాల్లో పిల్లలు పరిగెత్తడం, గెంతడం, దుమకడం.. వంటివి చాలా సహజసిద్ధంగా జరిగిపోయేవి. వారి ఆటపాటల్లో శారీరక వ్యాయామం చాలా బాగుండేది. అది ఈ రోజుల్లో లేదు. క్రీడలు కూడా వృత్తిపరంగా ఉన్నవే తప్ప ఆనందించడానికి లేవు. ఒక స్ట్రెస్ నుంచి రిలీవ్ అయ్యే ఫిజికల్ యాక్టివిటీ రోజులో ఇన్ని గంటలు అవసరం అనేది గుర్తించి, చెప్పాలనుకున్నాం. భవిష్యత్తులో రాబోయే ఆరోగ్యసమస్యలను భరించడం కన్నా ముందే జాగ్రత్తపడటం మంచిది.

మధ్య తరగతే కీలకం

మధ్యతరగతి, దానికి ఎగువన ఉన్న పిల్లల్లో శారీరక చురుకుదనం లోపం ఎక్కువ కనిపించింది. వారి ఎముక సామర్థ్యం బలంగా లేకపోతే భవిష్యత్తులో ఎన్నో ఆరోగ్యసమస్యలను ఎదుర్కోక తప్పదు. పిల్లలు ఎదిగే దశలో వారి ఆహారం, అలవాట్లు బాగుండేలా చూసుకోవాలి. ఈ విషయంలో కార్పొరేట్ కన్నా ప్రభుత్వ స్కూళ్లలో పిల్లలు బాగానే ఉన్నారు. ఈ అన్ని విషయాలపై ఇంకా చాలా డేటా సేకరించాల్సి ఉంది. ముందు మానసిక సమస్యలు అనుకోలేదు. కానీ, సైకలాజికల్ సమస్యలు చాలా ఎక్కువ ఉన్నాయి. కుటుంబంలో ఉన్నవారితో సరైన ఇంటరాక్షన్స్ తగ్గిపోయినట్టుగా తెలుస్తోంది. ఎక్కువ డిజిటల్ మీడియాలో ఉండటం వల్ల కంటి సమస్యలు, కుటుంబంతో గ్యాప్ ఏర్పడం వంటివి జరుగుతున్నాయి. ఈ విషయాలను అవగాహన చేసుకొని, మన జీవన విధానంలో మార్పులు చేసుకోవాల్సిన అవసరం చాలా ఉంది' అని తెలియజేశారు లీలారాణి.

– నిర్మలారెడ్డి



న్యూస్‌మేకర్

కంగ్రాట్యులేషన్స్ ఏక్తా కపూర్

భారతీయ టెలివిజన్ రంగాన్ని మహారాణిలా ఏలుతున్న ఏక్తా కపూర్ చరిత్ర సృష్టించింది. అమెరికా వెలుపల వివిధ దేశాల్లోని టెలివిజన్ కంటెంట్ నుంచి ఎంచి ఇచ్చే ప్రతిష్ఠాత్మక ఇంటర్నేషనల్ ఎమ్మీ అవార్డ్సులో ఆమెను 'డైరెక్టరేట్ అవార్డ్' వరించింది. ఈ అవార్డు అందుకున్న తొలి భారతీయురాలు ఏక్తా. మంగళవారం తెల్లవారుజామున (అమెరికాలో సోమవారం రాత్రి) న్యూయార్క్‌లో ఈ అవార్డు బహూకరించారు.

ఏక్తా కపూర్ (48)కు ముందు అభినందనలు చెప్పాలి. టెలివిజన్ రంగంలో సుదీర్ఘకాలం నిలిచినందుకు, ఢక్కామొక్కీలు తిని విజయం సాధించినందుకు, వేల మందికి ఉపాధి కల్పించినందుకు, టెలివిజన్ చానల్స్ ప్రైమ్‌టైమ్‌ను ఏదో ఒక కాలక్షేపంతో నింపినందుకు, ఇంకా కొనసాగుతున్నందుకు. ఇప్పటివరకూ ఆమె 17,000 గంటల టెలివిజన్ కంటెంట్‌ను ప్రొడ్యూస్ చేసిందంటే దాని వెనుక శ్రమను, ప్యాషన్‌ను, వ్యాపార శ్రద్ధను అర్థం చేసుకోవచ్చు. అంతే కాదు... 45 సినిమాలను కూడా ఆమె ప్రొడ్యూస్ చేసింది. వ్యాపార ఎత్తుగడల్లో భాగంగా నాసిరకం/సరసమైన కంటెంట్‌ను తయారు చేసి విమర్శలు ఎదుర్కొన్నా అన్ని రకాల జానర్స్‌లో కంటెంట్ తయారు చేస్తాను... దేనికి తగ్గ ప్రేక్షకులు దానికి ఉంటారు అనే ధోరణిలో ముందుకు దూసుకుపోతోందామె. అందుకే ఆమె కృషికి అంతర్జాతీయ గుర్తింపు లభించింది.

■ అంతర్జాతీయ గుర్తింపు

అమెరికాలోని 'ఇంటర్నేషనల్ అకాడెమీ ఆఫ్ టెలివిజన్ ఆర్ట్స్ అండ్ సైన్సెస్' ప్రతి సంవత్సరం అమెరికా బయటి దేశాలలో టెలివిజన్ రంగంలో విశేష కృషి చేసిన వారికి 'ఇంటర్నేషనల్ ఎమ్మీ అవార్డు'లను బహూకరిస్తుంది. ఇవి టెలివిజన్ ఆస్కార్స్‌లాంటివి. ఈ అవార్డులు భారతీయులకు వరించడం తక్కువ. వివిధ కేటగిరీల్లో ఇచ్చే ఈ అవార్డుల్లో విశిష్టమైన 'డైరెక్టరేట్ అవార్డు'ను ఈ సంవత్సరానికి ఏక్తా కపూర్‌కు ప్రకటించారు. ఈ అవార్డు పొందిన తొలి భారతీయ మహిళ ఏక్తా. అకాడెమీ సీఈవో బ్రూస్ ప్రెస్నర్ ఈ సందర్భంగా మాట్లాడుతూ 'భారతీయ మాస్ ప్రేక్షకులను, సౌత్ ఏసియా ప్రేక్షకులను ఏక్తా కపూర్ తన సీరియళ్ల ద్వారా చేరగలిగింది. టెలివిజన్ రంగంలో మార్కెట్ లీడర్‌గా ఉంది' అని కొనియాడారు. న్యూయార్క్‌లో అవార్డు అందుకున్న ఏక్తా 'ఈ అవార్డు నా మాతృదేశం కోసం' అంటూ భావోద్వేగానికి గురైంది.

■ భిన్న వ్యక్తిత్వం

ఏక్తా కపూర్ టెలివిజన్ రంగంలో (1995) అడుగు పెట్టే సమయానికి అదంతా పురుష ప్రపంచం. తండ్రి జితేంద్ర (నటుడు) దగ్గర 50 లక్షలు తీసుకొని 'బాలాజీ టెలి ఫిల్మ్స్' కింద కొన్ని పైలట్ ప్రాజెక్ట్స్ తీస్తే అన్నీ రిజెక్ట్ అయ్యాయి. దాంతో 50 లక్షలూ వృథా అయ్యాయి. ఆ తర్వాత ఆమె 'మానో యా మానో', 'హమ్ పాంచ్' సీరియల్స్‌తో హిట్స్ మొదలుపెట్టింది. 2000 సంవత్సరంలో 'కె' అక్షరం సెంటిమెంట్‌తో మొదలెట్టిన 'క్యూంకి సాస్‌భీ కభీ బహూ థీ' టెలివిజన్ చరిత్రను తిరగరాసింది. ఇది పొందినంత టిఆర్‌పి మరే సీరియల్ పొందలేదు. 'కహానీ ఘర్ ఘర్ కీ', 'పవిత్ర రిష్తా', 'కుంకుమ్ భాగ్య' లాంటి 134 సీరియల్స్ ఇప్పటి వరకూ తీసింది. పెద్ద పెద్ద సెట్లు, మహిళా పాత్రధారులకు ఖరీదైన చీరలు, ఆభరణాలు, కుటుంబ రాజకీయాలు ఇవన్నీ ఏక్తా మొదలుపెట్టి మొత్తం దేశంలో అదే ట్రెండ్ ఫాలో అయ్యేలా చేసింది.

■ సరోగసి ద్వారా

ఏక్తా వివాహం చేసుకోలేదు. కాని 2019లో సరోగసి ద్వారా కుమారుడికి జన్మనిచ్చింది. కొడుక్కి తండ్రి పేరు 'రవి కపూర్' అని పెట్టుకుంది. అవార్డు వేదిక మీద ఏక్తా మాట్లాడుతూ 'మా నాన్నకు, నేనిక్కడ ఉంటే నా కొడుకు కోసం బేబీ సిట్టింగ్ చేస్తున్న మా అన్నయ్య తుషార్‌కపూర్‌కు కృతజ్ఞతలు' అంది.

ప్రస్తుతం సొంత ఓటీటీ ప్లాట్‌ఫామ్ ఆల్ట్ బాలాజీ కోసం ఏక్తా ఎక్కువగా కంటెంట్‌ను తయారు చేస్తోంది.

యూత్ పల్స్

నవ యువ నవ్వోదయం

బాధ పడితే బాధ మాత్రమే మిగులుతుంది.
అలా కాకుండా రూల్స్ బ్రేక్ చేసి నవ్వితే ఏమవుతుంది?
'అలా ఎలా కుదురుతుంది? బాధ బాధే, నవ్వు నవ్వే' అని గట్టిగా అనుకున్న బాధాసర్పదష్టులు కూడా వీరి హాస్యం ముందు మౌనంగా ఉండలేకపోయారు. హాయిగా నవ్వేసి ఆ కొద్ది సమయమైనా బాధ నుంచి విముక్తి పొందారు.
యువతరం ఎక్కడ ఉంటుందో నవ్వు అక్కడ ఉంటుంది.
ఆ నవ్వునే పెట్టుబడిగా పెట్టి యువతరంలో ఎంతోమంది కామెడీ కంటెంట్ క్రియేటర్‌లుగా కీర్తి, డబ్బు సంపాదిస్తున్నారు. ఒకరిని చూసి మరొకరు అన్నట్లుగా కొత్త వాళ్లు నవ్వుల రంగస్థలంపై మెరుస్తున్నారు. తమదైన హాస్యాన్ని పరిచయం చేస్తున్నారు...



నవ్వడం అదృష్టం... నవ్వించడం అంతకంటే అదృష్టం

'లాలో మాస్టర్స్ డిగ్రీ చేసినప్పటికీ నా ఆలోచనలన్నీ కంటెంట్ క్రియేషన్ చుట్టే తిరుగుతుంటాయి. ఎవరో చెప్పింది వినడం కంటే మనసు చెప్పింది వినడమే మంచిదని నా నమ్మకం. ఐడియాల కోసం కొన్నిసార్లు 'ఇలా అయితే ఎలా ఉంటుంది' అంటూ కసరత్తులు చేయాల్సి ఉంటుంది. కొన్నిసార్లు మాత్రం స్పాంటేనియస్‌గా వస్తుంటాయి. నా బెస్ట్ కంటెంట్‌లో ఎక్కువ శాతం స్పాంటేనియస్‌గా వచ్చిందే. నవ్వడం అదృష్టం. నవ్వించగలగడం అంతకంటే అదృష్టం.

– చాందిని, కామెడీ కంటెంట్ క్రియేటర్

కొత్తదనం కావాలి

కామెడీ పుస్తకాలు చదివీ, సీరియల్స్ చూసి కామెడీని సృష్టించలేం. జనాల్లోకి వెళ్లి పరిసరాలను గమనించాల్సిందే. ఆసక్తికరమైన సంభాషణలు, పదాలు విన్నప్పుడు పెన్ను పేపర్ తీసుకొని స్క్రిప్ట్ రాస్తుంటాను. ఆ తరువాత షూట్స్, ఎడిట్స్, అప్‌లోడ్స్‌కు వెళతాను. ఎప్పటికీ ఒకే విధంగా కాకుండా కొత్తదనం ఉండేలా జాగ్రత్త పడతాను.

– కరిష్మ గంగ్వాల్, కామెడీ కంటెంట్ క్రియేటర్

కంటెంట్ కోసం...

కామెడీ అయినా సరే కంటెంట్ అనేది నేల విడిచి సాము చేయకూడదు. సహజంగా ఉండాలి. ప్రేక్షకులు దానితో రిలేట్ కావాలి. కంటెంట్ కోసం ఎక్కడికో వెళ్లనక్కర్లేదు. మన ఇంట్లో కావచ్చు, పక్కింట్లో కావచ్చు, వెళ్లిన ఫంక్షన్ కావచ్చు....మనకు కావాల్సిన కంటెంట్ దొరుకుతుంది. దాన్ని మన స్టైల్లో ఎలా ప్రెజెంట్ చేస్తున్నామనేదే ముఖ్యం.

– సలోని గౌర్, కామెడీ కంటెంట్ క్రియేటర్

సోషల్ మీడియాలోని రకరకాల విభాగాల్లో కామెడీ అగ్రస్థానంలో ఉంది. మిథిక ద్వివేది, రాజ్ గ్రోవర్, సలోని గౌర్, విష్ణు కుషాల్‌లాంటి యంగ్ కామెడీ కంటెంట్ క్రియేటర్‌లు దూసుకుపోతున్నారు. వీరిలో ఎక్కువ మంది లాక్‌డౌన్ టైమ్‌లో ఫేమస్ అయిన వారు. అప్పటి రోజుల్లో నుంచే కడుపుబ్బా నవ్వించే షార్ట్–ఫామ్ వీడియో స్కూఫ్‌లను రూపొందించారు.

బ్రాండ్ ప్రమోషన్స్‌లలో కామెడీ ఇన్‌ఫ్లూయెన్సర్‌లను ఏరి కోరి ఎంపిక చేసుకుంటున్నారు.

'కామెడీ ఇన్‌ఫ్లూయెన్సర్‌లు సత్తా ఉన్న రచయితలు. ఆడియెన్స్‌ను ఎలా ఆకట్టుకోవాలో వారికి బాగా తెలుసు. ప్రమోషన్స్‌కు ఎంటర్‌టైన్‌మెంట్‌ను సృజనాత్మకంగా జోడిస్తున్నారు' అంటున్నాడు సోషల్ సమోస సీయివో హితేష్ రజ్వానీ.

ఒకప్పటి టీవీ సీరియల్ 'కస్తూరీ జిందగీ' లోని పాపులర్ పాత్రను చిన్నప్పుడు అనుకరిస్తూ అందరినీ నవ్వించేది కరిష్మా గంగ్వాల్. తాను ఎంటర్‌టైన్‌మెంట్ అండ్ కామెడీని కెరీర్‌గా తీసుకుంటానని ఎప్పుడూ అనుకోలేదు. డిగ్రీ పూర్తి చేసిన తరువాత రేడియో వేదికగా తన టాలెంట్‌ను శ్రోతలకు పరిచయం చేసింది.

అప్పటి వరకు తన గొంతునే పరిచయం చేసిన కరిష్మ ప్రేక్షకులకు ముఖ పరిచయం చేయాలనుకుంది. కోవిడ్ టైమ్‌లో కంటెంట్ క్రియేషన్‌కు శ్రీకారం చుట్టింది.

అత్తా–కోడళ్ల సంభాషణతో తొలిసారిగా ఒక ఫన్నీ వీడియో చేసింది. 'ప్రేక్షకులు ఏమనుకుంటారో ఏమో' అని సందేహించింది. అయితే తన సోదరి సలహాతో సోషల్‌మీడియాలో పెట్టింది. ఆ ఫన్నీ వీడియో 1.3 మిలియన్‌ల వ్యూస్‌ను దక్కించుకొని కరిష్మలో ఆత్మవిశ్వాసాన్ని పెంచింది.

కరిష్మకు ఇన్‌స్టాగ్రామ్‌లో 6.4 మిలియన్‌ల ఫాలోవర్స్ ఉన్నారు.

జమ్ములో పుట్టి పెరిగింది కరిష్మ. డాక్టర్లు, ఇంజనీర్‌ల కుటుంబం వారిది. తాను కూడా డాక్టరో, ఇంజనీరో కావాల్సిందే అన్నట్లుగా ఉండేది పరిస్థితి. అయితే తల్లిదండ్రులను ఒప్పించి కామెడీనే తన కెరీర్ చేసుకుంది.

తన మిమిక్రీ స్కిల్స్‌తో ప్రేక్షకులను కడుపుబ్బా నవ్విస్తోంది చాందిని భాబ్ల. 'ఆలియాభట్‌ను అనుకరించాలంటే చాందిని మాత్రమే' అన్నంతగా పేరు తెచ్చుకుంది. చిన్నప్పుడు తన ఉపాధ్యాయులు, చుట్టాలు పక్కాలను కెమెరా ముందు అనుకరిస్తూ అందరినీ తెగ నవ్వించేది చాందిని.

ఇరవైనాలుగు సంవత్సరాల చాందిని 2016లో కామెడీ కంటెంట్ క్రియేషన్ ప్రారంభించింది. న్యాయశాస్త్రం చదివిన చాందిని అమెజాన్ మినీ టీవీ కామెడీ షో 'కానిస్టేబుల్ గిర్పాడే'లో నటించింది.

తీరిక సమయంలో సలోని గౌర్ ఫన్నీ వీడియోలు బాగా చూసేది. 'నీలో నవ్వించే టాలెంట్ ఉంది' అని ఫ్రెండ్స్ తరచుగా అనడంతో 'ఒకసారి ట్రై చేసి చూద్దాం' అంటూ రంగంలోకి దిగింది.

తక్కువ టైమ్‌లోనే కామెడీ కంటెంట్ క్రియేటర్‌గా సక్సెస్ సాధించింది. సలోనికి 1.3 మిలియన్ ఫాలోవర్స్ ఉన్నారు.

మధ్యతరగతి కుటుంబ నేపథ్యం నుంచి వచ్చిన సలోని అబ్జర్వేషనల్ కామెడీని తన బలంగా చేసుకుంది. ఇరవై సంవత్సరాల వయసులో సోనీ లివ్‌లో 'అన్‌కామన్ సెన్స్ విత్ సలోని' పేరుతో సొంత షో స్టార్ట్ చేసింది.

'ఒక్కరోజు నవ్వకపోయినా ఆ రోజు వృథా అయినట్లే' అంటాడు చార్లీ చాప్లిన్.

అయితే నవ్వడం ఎంత ఈజియో, నవ్వించడం అంత కష్టం. ఆ కష్టాన్ని ఇష్టంగా భుజాల కెత్తుకుంటున్నారు కామెడీ కంటెంట్ క్రియేటర్‌లు. ఒకవైపు సీనియర్‌ల వీడియోలు చూస్తూ ఎంజాయ్ చేస్తూనే మరోవైపు సృజనాత్మక ఆలోచనలతో తమదైన కామెడీ కంటెంట్‌ను క్రియేట్ చేస్తున్నారు.

'ప్రేక్షకుల అర క్షణం నవ్వు చాలు వెయ్యి ఏనుగుల బలం తెచ్చుకోవడానికి' అంటుంది లక్నోకు చెందిన 19 సంవత్సరాల మిథిక ద్వివేది. ఈ కామెడీ కంటెంట్ క్రియేటర్‌కు వేలాదిమంది ఫాలోవర్‌లు ఉన్నారు.

బ్యూటిప్స్ - హెయిర్ కేర్



- మూడు టీ స్పూన్ల ఆలివ్ ఆయిల్,ఒక టీ స్పూను తేనె తీసుకుని రెండింటినీ కలుపుకోవాలి. ఈ మిశ్రమాన్ని తలకు పట్టించి పదిహేను నిమిషాల తర్వాత షాంపూతో తలస్నానం చేయాలి. ఇలా వారానికి మూడు సార్లు చేస్తుంటే పొడిబారిపోయిన జుట్టు కూడా చాలా అందంగా తయారవుతుంది.
- మూడు టీ స్పూన్ల ఆముదాన్ని గోరువెచ్చ చేసుకుని, తలకు పట్టించి మసాజ్ చేసుకోవాలి. తర్వాత జుట్టంతా చిక్కు లేకుండా దువ్వెనతో నెమ్మదిగా దువ్వుకుని, వేడి నీటిలో తడిపిన టవల్‌ను తలకు చుట్టి పావుగంట పాటు ఆవిరి పట్టించాలి. తర్వాత నీటితో జుట్టును కడిగేసి, మర్నాడు షాంపూతో తలస్నానం చేయాలి.
- రెండు టీ స్పూన్ల కొబ్బరి నూనెలో టీస్పూను నిమ్మరసం వేసి తలకు మసాజ్ చేసుకోవాలి.
- కొబ్బరి నూనెలో కొద్దిగా మెంతులు లేదా కరివేపాకు పేస్ట్ లేదా వేపాకుల పేస్ట్ కలిపి గోరువెచ్చగా అయ్యేంతవరకూ వేడి చేసుకోవాలి. ఈ మిశ్రమాన్ని కేశాలకు పట్టించి మసాజ్ చేసి మర్నాడు షాంపూతో తలస్నానం చేయాలి.
- కప్పు నీటిలో టీ స్పూను నిమ్మరసం, రెండు టీ స్పూన్ల ఆపిల్ సీడర్ వెనిగర్ (మార్కెట్‌లో లభిస్తుంది) వేసి కలుపుకోవాలి. షాంపూతో తలస్నానం చేసిన పది నిమిషాల తర్వాత ఈ మిశ్రమంతో తలను తడపాలి. ఇలా చేస్తే జుట్టు ఆరోగ్యంగా, మెరుస్తూ కనబడుతుంది.



జాతీయ హాకీ శిక్షణ శిబిరానికి రజని

వచ్చే నెలలో స్పెయిన్‌లో జరిగే ఐదు దేశాల హాకీ టోర్నమెంట్‌కు సన్నాహాల్లో భాగంగా హాకీ ఇండియా (హెచ్‌ఐ) ఈనెల 22 నుంచి డిసెంబర్ 10 వరకు బెంగళూరులో జాతీయ శిక్షణ శిబిరం నిర్వహించనుంది. 34 మందితో కూడిన బృందంలో ఆంధ్రప్రదేశ్‌కు చెందిన గోల్‌కీపర్ ఇతిమరపు రజని కూడా చోటు దక్కించుకుంది. ఐదు దేశాల హాకీ టోర్నీలో భారత్‌తోపాటు ఐర్లాండ్, జర్మనీ, బెల్జియం, స్పెయిన్ జట్లు బరిలో ఉన్నాయి. ఈ టోర్నీ తర్వాత భారత్ జనవరిలో స్వదేశంలో జరిగే పారిస్ ఒలింపిక్స్ క్వాలిఫయింగ్ టోర్నీలో పోటీపడుతుంది.

రష్మిక శుభారంభం

మహిళల ప్రపంచ టెన్నిస్ టూర్ టోర్నీలో హైదరాబాద్ అమ్మాయి భమిడిపాటి శ్రీవల్లి రష్మిక శుభారంభం చేసింది. బెంగళూరులో జరుగుతున్న ఈ టోర్నీలో సింగిల్స్ తొలి రౌండ్‌లో రష్మిక 6-1, 7-5తో హైదరాబాద్‌కే చెందిన పేక్ హామీరా బహార్మస్‌పై గెలిచింది. ఈ మ్యాచ్‌లో రష్మిక రెండు ఏస్‌లు సంధించింది. డబుల్స్ తొలి రౌండ్‌లో రష్మిక-వైదేహి (భారత్) ద్వయం 6-0, 6-3తో ప్రతిభ-సుహిత (భారత్) జోడీపై నెగ్గి క్వార్టర్ ఫైనల్ చేరింది.



భారత 'ఎ' జట్టులో త్రిష



సాక్షి, హైదరాబాద్: ఇంగ్లండ్ 'ఎ' మహిళల క్రికెట్ జట్టుతో స్వదేశంలో జరిగే మూడు మ్యాచ్‌ల టి20 సిరీస్‌లో పాల్గొనే భారత 'ఎ' జట్టులో హైదరాబాద్ అమ్మాయి గొంగడి త్రిషకు చోటు దక్కిందని హైదరాబాద్ క్రికెట్ సంఘం (హెచ్‌సీఏ) ఒక ప్రకటనలో తెలిపింది. 17 ఏళ్ల త్రిష ఈ ఏడాది జనవరిలో దక్షిణాఫ్రికాలో జరిగిన తొలి అండర్-19 మహిళల టి20 ప్రపంచకప్‌లో విజేతగా నిలిచిన భారత జట్టులో కీలక సభ్యురాలిగా ఉంది. భారత్ 'ఎ'-ఇంగ్లండ్ 'ఎ' జట్ల మధ్య మూడు టి20 మ్యాచ్‌లు ముంబైలోని వాంఖెడే స్టేడియంలో నవంబర్ 29న, డిసెంబర్ 1న, డిసెంబర్ 3న జరుగుతాయి.

బీడబ్ల్యూఎఫ్ వార్షిక అవార్డు రేసులో సాత్విక్-చిరాగ్ జోడీ



న్యూఢిల్లీ: ఈ సీజన్‌లో నిలకడగా రాణిస్తున్న భారత బ్యాడ్మింటన్ పురుషుల డబుల్స్ జోడీ సాత్విక్ సాయిరాజ్-చిరాగ్ శెట్టి ప్రపంచ బ్యాడ్మింటన్ సమాఖ్య (బీడబ్ల్యూఎఫ్) వార్షిక అవార్డు రేసులో నిలిచారు. 2023 సంవత్సరానికిగాను సాత్విక్ సాయిరాజ్-చిరాగ్ శెట్టిని 'పెయిర్ ఆఫ్ ద ఇయర్' పురస్కారం కోసం బీడబ్ల్యూఎఫ్ నామినేట్ చేసింది. భారత ద్వయంతోపాటు చెన్ కింగ్ చెన్-జియా ఇ ఫాన్ (చైనా), జెంగ్ సి వె-హువాంగ్ యా కియాంగ్ (చైనా), సియో సెంగ్ జే-చె యు జంగ్ (దక్షిణ కొరియా) జోడీలు కూడా ఈ అవార్డు కోసం బరిలో ఉన్నాయి. డిసెంబర్ 11న అవార్డు విజేతను ప్రకటిస్తారు. ఈ ఏడాది సాత్విక్-చిరాగ్ ద్వయం అంచనాలకు మించి రాణించి అద్భుత విజయాలు సాధించింది. ఆసియా చాంపియన్‌షిప్‌లో స్వర్ణం, ఆసియా క్రీడల్లో స్వర్ణం సాధించిన సాత్విక్-చిరాగ్ ద్వయం ఇండోనేసియా సూపర్-1000 టోర్నీలో, కొరియా ఓపెన్ సూపర్-500 టోర్నీలో, స్విస్ ఓపెన్ సూపర్-300 టోర్నీలో డబుల్స్ టైటిల్స్ గెలిచింది.

భారత్‌పై ఖతర్‌దే పైచేయి

3-0 గోల్స్‌తో నెగ్గిన ఆసియా చాంపియన్ • ఫుట్‌బాల్ ప్రపంచకప్-2026 ఆసియా క్వాలిఫయర్స్



భారత కెప్టెన్ సునీల్ ఛెత్రి



ముస్తఫా

భువనేశ్వర్: ఎలాంటి అద్భుతం జరగలేదు. ఊహించిన ఫలితమే వచ్చింది. తమకంటే ఎంతో మెరుగైన ర్యాంక్ ఉన్న ఖతర్ జట్టును నిలువరించడంలో భారత పురుషుల ఫుట్‌బాల్ జట్టు విఫలమైంది. ప్రపంచకప్-2026 ఆసియా క్వాలిఫయర్స్ రెండో రౌండ్‌లో భాగంగా ఆసియా చాంపియన్ ఖతర్ జట్టుతో మంగళవారం జరిగిన గ్రూప్ 'ఎ' మ్యాచ్‌లో భారత్ 0-3 గోల్స్ తేడాతో ఓడిపోయింది. ఖతర్ జట్టు తరఫున ముస్తఫా మషాల్ (4వ ని.లో), అల్మోజ్ అలీ (47వ ని.లో), యూసుఫ్ అదురిసాగ్ (86వ ని.లో) ఒక్కో గోల్ సాధించారు. భారత జట్టుకు కూడా గోల్ చేసే అవకాశాలు లభించినా ఫినిషింగ్ లోపంతో మూల్యం చెల్లించుకుంది. ఓవరాల్‌గా ఖతర్ జట్టుతో నాలుగు మ్యాచ్‌లు ఆడిన భారత్ మూడింటిలో ఓడిపోయి, ఒక మ్యాచ్‌ను 'డ్రా' చేసుకుంది. ఈనెల 16న కువైట్‌తో జరిగిన మ్యాచ్‌లో 1-0తో గెలిచిన భారత్ ఈ మ్యాచ్‌లో మాత్రం తడబడింది. ప్రపంచ ర్యాంకింగ్స్‌లో 102వ స్థానంలో ఉన్న భారత్ అనూహ్యంగా ఈ మ్యాచ్‌లో రెగ్యులర్ గోల్‌కీపర్ గుర్‌ప్రీత్ సింగ్ సంధూకు విశ్రాంతి కల్పించి మరో గోల్‌కీపర్ అమరిందర్ సింగ్‌ను ఆడించింది.

మ్యాచ్ గణాంకాలు

భారత్		ఖతర్
0	గోల్‌పోస్ట్‌పై షాట్‌లు	6
46%	బంతి ఆధీనం	54%
363	పాస్‌లు	416
14	ఫౌల్స్	7
1	ఎల్లో కార్డు	0
2	ఆఫ్ సైడ్	4
3	కార్నర్‌లు	11

ప్రపంచ ర్యాంకింగ్స్‌లో 61వ స్థానంలో ఉన్న ఖతర్ భారత రక్షణపంక్తిలోని లోపాలను సద్వినియోగం చేసుకొని ఆట నాలుగో నిమిషంలోనే తొలి గోల్ సాధించింది. ఆ తర్వాత భారత జట్టు తేరుకొని ఖతర్‌కు కాస్త పోటీనిచ్చింది. విరామ సమయానికి ఖతర్ 1-0తో ఆధిక్యంలో ఉంది. రెండో అర్ధభాగం మొదలైన రెండో నిమిషంలోనే ఖతర్ ఖాతాలో రెండో గోల్ చేరింది. ఆ తర్వాత కూడా ఖతర్ తమ జోరు కొనసాగించి మ్యాచ్ ముగియడానికి మరో నాలుగు నిమిషాల ముందు మూడో గోల్‌ను సాధించింది. భారత కెప్టెన్ సునీల్ ఛెత్రి 83 నిమిషాలు ఆడాక అతని స్థానంలో ఇషాన్ సబ్‌స్టిట్యూట్‌గా వచ్చాడు. నాలుగు జట్లున్న గ్రూప్ 'ఎ'లో ఖతర్ ప్రస్తుతం ఆరు పాయింట్లతో అగ్రస్థానంలో ఉండగా... మూడు పాయింట్లతో భారత్ రెండో స్థానంలో ఉంది. భారత్ తమ తదుపరి మ్యాచ్‌ను వచ్చే ఏడాది మార్చి 24న అఫ్గానిస్తాన్‌తో ఆడుతుంది.

ప్రిక్వార్టర్స్‌లో ప్రణయ్



షెన్‌జెన్: చైనా మాస్టర్స్ ఓపెన్ వరల్డ్ టూర్ సూపర్-750 బ్యాడ్మింటన్ టోర్నీ పురుషుల సింగిల్స్‌లో భారత నంబర్‌వన్ హెచ్‌ఎస్ ప్రణయ్ శుభారంభం చేశాడు. మంగళవారం జరిగిన తొలి రౌండ్‌లో ప్రపంచ ఎనిమిదో ర్యాంకర్ ప్రణయ్ 21-18, 22-20తో ప్రపంచ 12వ ర్యాంకర్ చౌ తియెన్ చెన్ (చైనీస్ తైపీ)పై గెలుపొందాడు. ఈ ఏడాది వీరిద్దరు నాలుగుసార్లు ముఖాముఖిగా తలపడగా... రెండుసార్లు ప్రణయ్, రెండుసార్లు చౌ తియెన్ గెలిచారు. మరోవైపు మహిళల సింగిల్స్ తొలి రౌండ్‌లో ఆకర్షి కశ్యప్ (భారత్) 12-21, 14-21తో జాంగ్ యి మన్ (చైనా) చేతిలో ఓడిపోయింది. పురుషుల డబుల్స్ విభాగంలో సాత్విక్ సాయిరాజ్-చిరాగ్ శెట్టి (భారత్) జోడీ ప్రిక్వార్టర్ ఫైనల్లోకి అడుగు పెట్టింది. తొలి రౌండ్‌లో సాత్విక్-చిరాగ్ ద్వయం 21-13, 21-10తో బెన్ లేన్-సీన్ వెండీ (ఇంగ్లండ్) జంటపై గెలిచింది. నేడు జరిగే పురుషుల సింగిల్స్ తొలి రౌండ్ మ్యాచ్‌ల్లో ప్రపంచ చాంపియన్ కున్లావుత్ వితిద్‌సర్న్ (థాయ్‌లాండ్)తో శ్రీకాంత్; షి యు కి (చైనా)తో లక్ష్య సేన్; కెంటా నిషిమోటో (జపాన్)తో ప్రియాన్షు రజావత్ తలపడతారు.

ట్రాన్స్‌జెండర్స్‌కు అర్హత లేదు

మహిళల క్రికెట్‌లో పోటీ పడేందుకు అనర్హులు • ఐసీసీ నిర్ణయం



డానిల్ మెక్‌గహే

అహ్మదాబాద్: అంతర్జాతీయ మహిళల క్రికెట్ సమగ్రతను కాపాడేందుకు, గౌరవం పెంచేందుకు అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ (ఐసీసీ) కీలక నిర్ణయం తీసుకుంది. ఇక మీదట లింగ మార్పిడి చేసుకున్న అబ్బాయిలు పూర్తిగా అమ్మాయిల హోదా పొందినప్పటికీ అంతర్జాతీయ మహిళల క్రికెట్‌లో ఆడేందుకు అర్హత లభించదని మంగళవారం ఇక్కడ జరిగిన ఐసీసీ బోర్డు సమావేశంలో నిర్ణయం తీసుకున్నారు. తొమ్మిది నెలల సంప్రదింపులు, సుదీర్ఘ కసరత్తు తర్వాతే ఈ విధాన నిర్ణయం తీసుకున్నామని ఐసీసీ సీఈఓ జెఫ్ అలర్‌డైస్ తెలిపారు. అయితే దేశవాళీ క్రికెట్‌లో ట్రాన్స్‌జెండర్స్‌ను ఆడించే విషయమై ఆయా సభ్యదేశాలకే నిర్ణయాధికారం కల్పించామని ఆయన పేర్కొన్నారు. ఈ ఏడాది సెప్టెంబర్‌లో అంతర్జాతీయ క్రికెట్‌లో తొలి 'ట్రాన్స్‌జెండర్'గా కెనడాకు చెందిన 29 ఏళ్ల డానిల్ మెక్‌గహే గుర్తింపు పొందింది. 2024 టి20 ప్రపంచకప్‌నకు అర్హత సాధించేందుకు నిర్వహించిన అమెరికస్ క్వాలిఫయర్ టోర్నీలో ఆమె కెనడా జట్టు తరఫున ఆరు మ్యాచ్‌లు ఆడి 118 పరుగులు సాధించింది. డానిల్ మెక్‌గహే కెనడా జాతీయ జట్టు తరఫున ఇప్పటికే కొన్ని మ్యాచ్‌లు ఆడినా వాటికి అంతర్జాతీయ హోదా లేదు. డానిల్ ఆస్ట్రేలియాలో పుట్టి మూడేళ్ల క్రితం కెనడాకు వలస వచ్చింది. 2020లో పురుషుడి నుంచి స్త్రీగా మారేందుకు సిద్ధమైన ఆమె 2021లో వైద్యపరంగా పూర్తి స్థాయిలో మహిళగా మారింది. ట్రాన్స్‌జెండర్స్‌కు అంతర్జాతీయ క్రికెట్‌లో ఆడే అవకాశం కల్పించడంపై తీవ్ర విమర్శలు రావడంతో ఐసీసీ నిబంధనలు మార్చింది. మరోవైపు మ్యాచ్ అధికారులు, అంపైర్లకు ఇకపై లింగబేధం లేకుండా పురుష అంపైర్లతో సమానంగా మహిళా అంపైర్లకు వేతన భత్యాలు ఇస్తారు.

లంకలో కాదు దక్షిణాఫ్రికాలో

శ్రీలంక క్రికెట్ బోర్డుపై తాత్కాలిక నిషేధం కొనసాగుతున్న నేపథ్యంలో వచ్చే జనవరిలో శ్రీలంకలో జరగాల్సిన అండర్-19 పురుషుల ప్రపంచకప్ టోర్నీని ఐసీసీ దక్షిణాఫ్రికాకు తరలించింది.

స్టాప్ క్లాక్‌తో పెనాల్టీ

ఇకపై ఓవర్‌కు ఓవర్‌కు మధ్య సమయం మించిపోతే 5 పరుగుల పెనాల్టీ తప్పదు. బౌలింగ్ జట్టు 60 సెకన్లలోపే మరుసటి ఓవర్ వేసేందుకు బౌలర్‌ను దించాలి. అంపైర్ల చేతికి 'స్టాప్ క్లాక్'తో ఈ సమయాన్ని నిర్ధారిస్తారు. రెండుసార్లు నిర్ణీత వ్యవధి (60 సెకన్లు) దాటితే మన్నిస్తారు. కానీ మూడోసారి కూడా ఆలస్యమైతే ఐదు పరుగుల పెనాల్టీ విధిస్తారు. ఈ డిసెంబర్ నుంచి 2024 ఏప్రిల్ వరకు ప్రయోగాత్మకంగా అమలు చేస్తామని ఐసీసీ తెలిపింది.

రికార్డు స్థాయిలో ప్రేక్షకుల బ్రహ్మరథం

భారత్ ఆతిథ్యమిచ్చిన వన్డే ప్రపంచకప్‌ను రికార్డు స్థాయిలో ప్రేక్షకులు ప్రత్యక్షంగా వీక్షించారు. పది జట్లు పోటీపడిన ఈ మెగా ఈవెంట్ 48 మ్యాచ్‌లను 12,50,307 మంది ప్రేక్షకులు చూశారని ఐసీసీ ధ్రువీకరించింది. అంటే సగటున ఒక్కో మ్యాచ్‌కు 26000 మంది హాజరైనట్లు తెలిపింది. ఆసీస్, న్యూజిలాండ్ సంయుక్తంగా నిర్వహించిన 2015 వన్డే ప్రపంచకప్‌ను 10,16,420 మంది వీక్షించి రికార్డు సృష్టించగా... దీన్ని తాజా ప్రపంచకప్ బద్దలుకొట్టింది.

డేవిడ్ వార్నర్‌కు విశ్రాంతి



మెల్‌బోర్న్: భారత్‌తో రేపటి నుంచి మొదలయ్యే టి20 ద్వైపాక్షిక సిరీస్‌లో డాషింగ్ ఓపెనర్ డేవిడ్ వార్నర్‌కు విశ్రాంతినిచ్చారు. మాథ్యూ వేడ్ సారథ్యంలోని ఆసీస్ జట్టును ఎంపిక చేయగా, ఇందులో తాజా వరల్డ్‌కప్ ఆడిన ఏడుగురు ఆటగాళ్లున్నారు. హెడ్, స్మిత్, మ్యాక్స్‌వెల్, ఇంగ్లిస్, స్టొయినిస్, అబాట్, ఆడమ్ జంపాలు భారత్‌తో తలపడేందుకు అందుబాటులో ఉండగా... కెప్టెన్ కమిన్స్ సహా పలువురు ఆటగాళ్లు ఆస్ట్రేలియాకు పయనమయ్యారు. విశాఖపట్నంలో గురువారం జరిగే తొలి టి20తో భారత్, ఆసీస్ మధ్య సిరీస్ ప్రారంభమవుతుంది.

ఆస్ట్రేలియా టి20 జట్టు: వేడ్ (కెప్టెన్), హెడ్, స్మిత్, ఇంగ్లిస్, మ్యాక్స్‌వెల్, స్టొయినిస్, టిమ్ డేవిడ్, ఆరన్ హార్డీ, బెహ్రెన్‌డార్ఫ్, అబాట్, ఎలిస్, తన్వీర్ సంఘా, షార్ట్, కేన్ రిచర్డ్‌సన్, జంపా.

సినిమా



● మణికందన్, వెంకట్ బోయనపల్లి, వెంకటేశ్, సంతోష్ నారాయణన్, శైలేష్ కొలను

నాలాంటి స్టూడెంట్స్‌కి సహాయం చేయాలి! - వెంకటేశ్

''ఎమోషనల్ యాక్షన్ థ్రిల్లర్‌గా రూపొందిన 'సైంధవ్' నా 75వ చిత్రం. యాక్షన్, భావోద్వేగాలు చాలా అద్భుతంగా వచ్చాయి. నా మనసుకు దగ్గరైన సినిమా ఇది. సంక్రాంతి పండక్కి ఫ్యామిలీతో కలిసి అందరూ ఈ సినిమాని ఎంజాయ్ చేస్తారు'' అని హీరో వెంకటేశ్ అన్నారు. శైలేష్ కొలను దర్శకత్వంలో వెంకటేశ్ హీరోగా నటించిన చిత్రం 'సైంధవ్'. వెంకట్ బోయనపల్లి నిర్మించిన ఈ సినిమా జనవరి 13న విడుదల కానుంది. చిత్ర సంగీతదర్శకుడు సంతోష్ నారాయణన్ స్వరపరచిన ఈ చిత్రంలోని 'రాంగ్ యూసేజ్..' అంటూ సాగే తొలి పాటని సీఎంఆర్ గ్రూప్ కళాశాలలో విద్యార్థుల సమక్షంలో విడుదల చేశారు. చంద్రబోస్ సాహిత్యం అందించిన ఈ పాటను నకాష్ అజీజ్ పాడారు. ఈ సందర్భంగా వెంకటేశ్ మాట్లాడుతూ- ''కళాశాల దశలో నేను బ్యాక్ బెంచర్‌ని. ఇప్పుడున్న నాలాంటి విద్యార్థులకు ఫస్ట్ ర్యాంక్ విద్యార్థులు, అధ్యాపకులు సహకారం అందించాలి. 35 ఏళ్లుగా నా సినీ జర్నీ కొనసాగుతోంది. నా మొదటి చిత్రం విడుదల అప్పటినుంచి ఇప్పుడున్న యువత తల్లిదండ్రులు నన్ను ఆదరిస్తున్నారు. ఇప్పుడు యువత ఆదరిస్తున్నారు. ఈ తరం వారిని కూడా నా సినిమాలు రీచ్ అవ్వడం హ్యాపీగా ఉంది'' అన్నారు.

హీరోని కాదు... యాక్టర్‌ని - వైష్ణవ్ తేజ్



"కథ నచ్చితే సినిమా చేస్తాను. ఆ సినిమా, అందులోని నా పాత్ర కోసం వంద శాతం కష్టపడతాను. అయితే ఫలితం గురించి ఆలోచించను. ఎందుకంటే అది ప్రేక్షకుల చేతుల్లో ఉంటుంది. అందుకే నా గురించి ఎవరైనా అడిగితే నేను హీరోని కాదు.. యాక్టర్‌ని అనే చెబుతాను. నటుడిగా నిరూపించుకుంటే వైవిధ్యమైన పాత్రలు చేయొచ్చు" అని వైష్ణవ్ తేజ్ అన్నారు. వైష్ణవ్ తేజ్, శ్రీ లీల జంటగా శ్రీకాంత్ ఎన్. రెడ్డి దర్శకత్వంలో రూపొందిన సినిమా 'ఆదికేశవ'. సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 24న రిలీజ్ కానుంది. ఈ సందర్భంగా విలేకర్ల సమావేశంలో వైష్ణవ్ తేజ్ చెప్పిన విశేషాలు.

● 'రంగ రంగ వైభవంగా' సినిమా చిత్రీకరణ తుది దశలో ఉన్నప్పుడు నిర్మాత నాగవంశీగారు 'ఆదికేశవ' సినిమా కథ వినమన్నారు. ఓ ప్రేక్షకుడిగా ఈ సినిమా కథ విన్నప్పుడు ఇందులోని సరికొత్త పాయింట్‌ను ఇప్పటివరకు ఎవరూ టచ్ చేయలేదనిపించింది. కమర్షియల్ హంగుల మేళవింపుతో కామెడీ, సాంగ్స్, విజువల్స్, ఫైట్స్ అన్నీ బాగుంటాయి. క్లైమాక్స్ కొత్తగా ఉంటుంది. ఓ మంచి సినిమా చూశామనే అనుభూతితో ప్రేక్షకులు థియేటర్స్ నుంచి బయటకు వస్తారు. ● 'ఆదికేశవ' ఆధ్యాత్మిక నేపథ్యం కాదు కానీ సినిమాలో ఓ పది శాతం శివుడి గురించి అంతర్లీనంగా ఉంటుంది. దర్శకుడు శ్రీకాంత్ చెప్పిన కథను చెప్పినట్లుగా తెరకెక్కించారు. ఈ తరంలో నాలాంటి కుర్రాడు యాక్షన్ చేస్తే ఎలా ఉంటుందో, ఎలాంటి యాక్షన్ వారికి నచ్చుతుందో అదే ఈ సినిమాలో ఉంటుంది. ఓవర్ ది బోర్డ్ ఉండదు. ఫైట్ మాస్టర్స్ రామ్-లక్ష్మణ్ కూడా ఆ జాగ్రత్తలు తీసుకున్నారు. సాధారణంగా నేను డ్యాన్సర్‌ని కాదు. కానీ డ్యాన్స్ మాస్టర్స్ ఓకే అనేంతవరకూ నేను కష్టపడుతూనే ఉంటాను. ● స్క్రీన్‌పై నాకు, శ్రీ లీలకు మధ్య ఉన్న సీన్స్ ప్రేక్షకులను అలరిస్తాయి. శ్రీ లీల పాత్రలోని అమాయకత్వంతో దర్శకుడు శ్రీకాంత్ హాస్యం రాబట్టారు. అలాగే మలయాళ నటుడు జోజు జార్జ్‌గారు పెద్ద నిర్మాత కూడా. అయినా ఆయన సెట్స్‌లో చాలా జోవియల్‌గా ఉండేవారు. అలాగే సీనియర్ నటి రాధికగారు ఉంటే సెట్స్‌లో ఎనర్జీ ఉండేది. ఇలా సీనియర్ నటులతో కలిసి వర్క్ చేయడం హ్యాపీగా ఉంది. సంగీత దర్శకుడు జీవీ ప్రకాశ్‌కుమార్‌గారు మంచి మ్యూజిక్ ఇచ్చారు. ● ఏదైనా కథ వినేటప్పుడు అందులో కొత్తదనం ఉండటంతో పాటు కాస్త కమర్షియాలిటీ కూడా ఉండాలనుకుంటాను. నా తర్వాతి సినిమా కోసం రెండు కథలు ఉన్నాయి.

కల నెరవేరింది - బొమ్మదేవర రామచంద్రరావు



తేజ్ బొమ్మదేవర, రిషికా లొక్రే జంటగా బొమ్మదేవర రామచంద్రరావు స్వీయ దర్శకత్వంలో నిర్మించిన చిత్రం 'మాధవే మధుసూదన'. ఈ చిత్రం ఈ నెల 24న రిలీజ్ కానున్న సందర్భంగా బొమ్మదేవర రామచంద్రరావు మాట్లాడుతూ - ''మేకప్‌మేన్‌గా నాది 40 ఏళ్ల కెరీర్. అప్పట్లో 'దానవీరశూరకర్ణ' సినిమా షూట్‌కి వెళ్లి, ఎన్టీఆర్‌గారిని చూసి ఎప్పటికైనా దర్శకుడిని కావాలనుకున్నాను. నా కలను నెరవేర్చుకోవాలని 'మాధవే మధుసూదన' తీశాను. పాతికేళ్ల ఎదురు చూపు తర్వాత ఓ అమ్మాయి కోరుకున్న వ్యక్తి ఆమెకు తారసపడితే ఏం జరుగుతుందన్నదే ఈ చిత్రకథ. దాదాపు 150 థియేటర్స్‌లో ఈ చిత్రాన్ని రిలీజ్ చేస్తున్నాం'' అన్నారు.

ఈ సినిమాలో హీరోలు లేరు - అల్లు అరవింద్



'దిల్' రాజు, వాసు, తేజా మార్ని, బోయపాటి శ్రీను, అల్లు అరవింద్

''పోలీసులనే పోలీసులు వెంటాడే విచిత్రమైన కథ 'కోట బొమ్మాళి పీఎస్'. ఈ సినిమాలో హీరోలు లేరు.. కథే హీరోగా వెళుతుంటుంది. ఈ చిత్రం ఏ రాజకీయ నాయకుడిని, పోలీస్ ఆఫీసర్‌ని ఉద్దేశించి తీయలేదు. ఈ వైవిధ్యమైన చిత్రాన్ని ప్రేక్షకులు ఆదరిస్తారని ఆశిస్తున్నాను'' అన్నారు నిర్మాత అల్లు అరవింద్. రాహుల్ విజయ్, శివానీ రాజశేఖర్ జంటగా శ్రీకాంత్, వరలక్ష్మీ శరత్ కుమార్ కీలక పాత్రల్లో నటించిన చిత్రం 'కోట బొమ్మాళి పీఎస్'. తేజా మార్ని దర్శకత్వంలో 'బన్నీ' వాసు, విద్యా కొప్పినీడి నిర్మించిన ఈ సినిమా ఈ నెల 24న విడుదల కానుంది. ఈ సందర్భంగా నిర్వహించిన ప్రీ రిలీజ్ వేడుకలో నిర్మాత 'దిల్' రాజు మాట్లాడుతూ- ''లింగిడి లింగిడి..' పాట తర్వాత ఈ సినిమాపై అంచనాలు బాగా పెరిగాయి. ఈ చిత్రం మంచి హిట్టవ్వాలి'' అన్నారు. ''ఈ సినిమా ట్రైలర్ చూశాను. ఇప్పుడున్న పరిస్థితులకి చెప్పాలనుకున్న విషయాన్ని క్లియర్‌గా చెప్పారు'' అని దర్శకుడు బోయపాటి శ్రీను అన్నారు. ''ప్రేక్షకులను ఆలోచింపజేసే చిత్రమిది'' అని 'బన్నీ' వాసు అన్నారు.

సస్పెన్స్ సహస్ర



● సుధీర్, డాలీషా

'సుడిగాలి' సుధీర్, డాలీషా జంటగా నటించిన సస్పెన్స్ థ్రిల్లర్ ఫిల్మ్ 'కాలింగ్ సహస్ర'. అరుణ్ విక్కిరాలా దర్శకత్వంలో విజేష్ తయాల్, చిరంజీవి పమిడి, వెంకటేశ్వర్లు కాటూరి నిర్మించిన ఈ చిత్రం డిసెంబరు 1న విడుదల కానుంది. ఈ చిత్రం ట్రైలర్ విడుదల కార్యక్రమంలో ముఖ్య అతిథి నిర్మాత బెక్కం వేణుగోపాల్ మాట్లాడుతూ- ''థ్రిల్లింగ్ అంశాలతో రానున్న ఈ సినిమా ఆకట్టుకుంటుంది'' అన్నారు. ''గాలోడు' హిట్‌తో నాకు మాస్ ఇమేజ్ వచ్చింది. 'కాలింగ్ సహస్ర'తో సస్పెన్స్ జానర్‌లోకి అడుగుపెడుతున్నా'' అన్నారు 'సుడిగాలి' సుధీర్. ''ఇప్పటివరకు ఇలాంటి కథతో ఇండియన్ స్క్రీన్ మీద సినిమా రాలేదు'' అన్నారు అరుణ్ విక్కిరాలా. ''సినిమా బాగా వచ్చింది'' అన్నారు విజేష్ తయాల్.

చూసుండరు!



● రమ్య ప్రియ, సూపర్ రాజా

సూపర్ రాజా, రమ్య ప్రియ, వంశీ గోనె ముఖ్య తారలుగా రూపొందిన చిత్రం 'ఇలాంటి సినిమా మీరెప్పుడూ చూసుండరు'. రాజాకృష్ణ ప్రొడక్షన్స్‌పై రూపొందిన ఈ చిత్రం టైటిల్ లాంచ్ వేడుకలో హీరో, రైటర్, డైరెక్టర్, ప్రొడ్యూసర్ సూపర్ రాజా మాట్లాడుతూ- ''ఒకే షాట్‌లో తెరకెక్కిన రెండు గంటల చిత్రమిది. ప్రతి అంశం ఎప్పుడూ చూడని విధంగా ఉంటుందని చెప్పగలను. 2024 ఫిబ్రవరిలో సినిమాను రిలీజ్ చేస్తాం'' అన్నారు. ''సింగిల్ షాట్ సినిమా కాన్సెప్ట్ సవాల్‌గా అనిపించింది'' అన్నారు వంశీ గొనె.

ప్రతి పంచ్‌కి నవ్వాను - అనిల్ రావిపూడి




● వీజే సన్నీ, అనిల్ రావిపూడి

''సౌండ్ పార్టీ' ట్రైలర్ చాలా బాగుంది. ప్రతి పంచ్‌కి నవ్వాను. ఈ సినిమా విజయం సాధించి నిర్మాతలు మరింత సౌండ్ పార్టీగా ఎదగాలి'' అని దర్శకుడు అనిల్ రావిపూడి అన్నారు. వీజే సన్నీ, హ్రితికా శ్రీనివాస్ జంటగా సంజయ్ శేరి దర్శకత్వం వహించిన చిత్రం 'సౌండ్ పార్టీ'. జయ శంకర్ సమర్పణలో రవి పొలిశెట్టి, మహేంద్ర గజేంద్ర, శ్రీ శ్యామ్ గజేంద్ర నిర్మించిన ఈ సినిమా ఈ నెల 24న విడుదలవుతోంది. ఈ సందర్భంగా జరిగిన ప్రీ రిలీజ్ వేడుకలో నిర్మాతల మండలి అధ్యక్షుడు కేఎల్ దామోదర్ ప్రసాద్ మాట్లాడుతూ- ''ఈ సినిమా మంచి విజయం సాధించాలి'' అన్నారు. ''మా చిత్రానికి రియల్ సౌండ్ పార్టీలు నిర్మాతలే. రెండు గంటలపాటు మా సినిమా ప్రేక్షకులను నవ్విస్తుంది'' అన్నారు సంజయ్ శేరి.

రీల్స్

లుట్ పుట్ గయా...



● షారుక్ ఖాన్, తాప్సీ

హీరో షారుక్ ఖాన్, దర్శకుడు రాజ్‌కుమార్ హిరాణి కాంబినేషన్‌లో రూపొందుతున్న సినిమా 'డంకీ'. బొమన్ ఇరాని, తాప్సీ పన్ను, విక్కీ కౌశల్, విక్రమ్ కొచ్చర్ కీలక పాత్రల్లో నటించారు. రాజ్‌కుమార్ హిరాణి, గౌరీ ఖాన్ నిర్మించిన ఈ చిత్రం డిసెంబరు 21న విడుదల కానుంది. తాజాగా ఈ సినిమాలోని మెలోడి సాంగ్ 'లుట్ పుట్ గయా..' 'డంకీ డ్రాప్ 2'గా నేడు విడుదలవుతోంది. స్వానంద్ కిర్‌కిరే, ఐపీ సింగ్ సాహిత్యాన్ని అందించిన ఈ పాటను అర్జిత్ సింగ్ పాడారు.

పదిసార్లు ఉలిక్కిపడ్డా! - విశ్వక్ సేన్



● విశ్వక్ సేన్, ప్రియదర్శి, పాయల్, అజయ్ భూపతి

''అజయ్ భూపతి కథ చెబితే సుదర్శన్ థియేటర్లో సినిమా చూస్తున్నట్లు ఉంటుంది. 'మహాసముద్రం' కథ వింటూ పదిసార్లు ఉలిక్కిపడ్డా. అయితే డేట్స్ కుదరక నేనా సినిమా చేయలేకపోయా. ఒక్క మాటలో మాట్లాడుకునే పాయింట్‌తో 'మంగళవారం'ని రెండున్నర గంటల సినిమాగా నిజాయతీగా చెప్పారు అజయ్ భూపతి'' అని హీరో విశ్వక్ సేన్ అన్నారు. పాయల్ రాజ్‌పుత్ లీడ్ రోల్‌లో అజయ్ భూపతి దర్శకత్వం వహించిన చిత్రం 'మంగళవారం'. స్వాతీ రెడ్డి గునుపాటి, ఎం. సురేష్ వర్మ, అజయ్ భూపతి నిర్మించిన ఈ సినిమా ఈ నెల 17న విడుదలైంది. ఈ సినిమా సక్సెస్ మీట్‌లో అజయ్ భూపతి మాట్లాడుతూ-''పాయల్ పాత్రని అర్థం చేసుకుంటారా? రిసీవ్ చేసుకుంటారా అని కాస్త భయపడ్డా. అయితే ప్రేక్షకులు బాగా ఆదరిస్తున్నారు'' అన్నారు. ''మా సంస్థలో తీసిన తొలి సినిమా 'మంగళవారం'ని సక్సెస్ చేసిన ప్రేక్షకులకు పాదాభివందనం'' అన్నారు సురేష్ వర్మ.

కష్టమంతా మరచిపోయాం! - హన్సిక



''మై నేమ్ ఈజ్ శృతి' జెన్యూన్ ఫీమేల్ సెంట్రిక్ ఫిల్మ్. ఈ సినిమా కోసం దర్శక-నిర్మాతలు ఎంత కష్టపడ్డారో నాకు తెలుసు. ఈ చిత్ర విజయం మా కష్టమంతా మరచిపోయేలా చేసింది'' అన్నారు హన్సిక. శ్రీనివాస్ ఓంకార్ దర్శకత్వంలో హన్సిక ప్రధాన పాత్రలో నటించిన చిత్రం 'మై నేమ్ ఈజ్ శృతి'. బురుగు రమ్య ప్రభాకర్ నిర్మించిన ఈ సినిమా ఈ నెల 17న రిలీజ్ అయింది. ఈ చిత్రం సక్సెస్ మీట్‌లో రమ్య ప్రభాకర్ మాట్లాడుతూ- ''స్కిన్ మాఫియా నేపథ్యంలో వచ్చిన మా చిత్రాన్ని ఆదరిస్తున్న ప్రేక్షకులకు థ్యాంక్స్'' అన్నారు. ''మీ బెస్ట్ 10 మూవీస్‌లో 'మై నేమ్ ఈజ్ శృతి' ఉంటుందని హన్సికకి మాట ఇచ్చా. సినిమాకి వస్తున్న స్పందన చూస్తే ఆ మాటని నిలబెట్టుకున్నానని అనుకుంటున్నాను'' అన్నారు శ్రీనివాస్ ఓంకార్.

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు		
సెన్సెక్స్ ▲	276	65,931
నిఫ్టీ ▲	89	19,783

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు (తొలి రెండు రాత్రి 11.30 గంటలకు)		
నాస్‌డాక్	14,191	▼ 93
డోజోన్స్	35,093	▼ 58
ఎఫ్‌టీఎస్ఈ 100	7,482	▼ 14
డాక్స్	15,901	▼ 1
షాంఘై	3,068	0
నికాయ్	33,354	▼ 34

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ (రూ.లలో)

ముంబై		
బంగారం (99.9 స్వచ్ఛత)	61,250	▲ 362
బంగారం (99.5 స్వచ్ఛత)	61,005	▲ 361
వెండి (కిలో)	72,729	▲ 168

ఫారెక్స్ రేట్లు (రూ.లలో)

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎస్‌బీఐ	82.52	84.19
£	బ్రిటన్ పౌండ్	ఎస్‌బీఐ	102.38	105.73
€	యూరో	ఎస్‌బీఐ	89.52	92.61
¥	జపాన్ ఎన్ (100)	ఎస్‌బీఐ	55.11	56.80
AUS	ఆస్ట్రేలియా డాలర్	ఎస్‌బీఐ	52.77	55.74
S$	సింగపూర్ డాలర్	ఎస్‌బీఐ	53.21	55.55
SAR	సౌదీ రియాల్	థామస్‌కుక్	21.27	22.09
UAE D	యూఏఈ దిర్హామ్	థామస్‌కుక్	21.80	23.59
¥	చైనా యువాన్	థామస్‌కుక్	10.56	12.63

ఈసారి రూ. 4.7 లక్షల కోట్ల వ్యాపారం..



న్యూఢిల్లీ: ఈసారి పెళ్లిళ్ల సీజన్‌లో వ్యాపారం భారీగా జరుగుతుందని అఖిల భారత ట్రేడర్ల సమాఖ్య (సీఏఐటీ) అంచనా వేస్తోంది. పెళ్లిళ్లకు సంబంధించిన కొనుగోళ్లు, ఇతరత్రా సర్వీసులపై వినియోగదారులు రూ. 4.74 లక్షల కోట్ల మేర వెచ్చించే అవకాశం ఉందని భావిస్తోంది. గత సీజన్‌లో నమోదైన రూ. 3.75 లక్షల కోట్లతో పోలిస్తే ఇది దాదాపు రూ. 1 లక్ష కోట్లు అధికం. నవంబర్ 23 నుంచి డిసెంబర్ 15 వరకు ఉన్న వివాహాల సీజన్‌లో దాదాపు 38 లక్షల పెళ్లిళ్లు జరగొచ్చని భావిస్తున్నట్లు సీఏఐటీ సెక్రటరీ జనరల్ ప్రవీణ్ ఖండేల్వాల్ విలేకరుల సమావేశం సందర్భంగా తెలిపారు.

- పెళ్లిళ్ల సీజన్‌పై సీఏఐటీ ఆశాభావం
- నవంబర్ 23 నుంచి డిసెంబర్ 15 వరకు సీజన్
- 38 లక్షల పైచిలుకు వివాహాల అంచనా

'గతేడాది సుమారు రూ. 3.75 లక్షల కోట్ల వ్యయంతో దాదాపు 32 లక్షల వివాహాలు జరిగాయి. ఈసారి ఇది దాదాపు రూ. 1 లక్ష కోట్లు మేర పెరగొచ్చని అంచనాలు ఉన్నాయి. దేశ ఎకానమీకి, రిటైల్ వ్యాపారానికి కూడా ఇది మంచిదే' అని ఆయన పేర్కొన్నారు. ఈ ఏడాది నవంబర్‌లో 23, 24, 27, 28, 29 తేదీల్లో, అలాగే డిసెంబర్‌లో 3, 4, 7, 8, 9, 15 తేదీల్లో వివాహాలకు మంచి ముహూర్తాలు ఉన్నాయి. ఒక్క ఢిల్లీలోనే 4 లక్షల పైగా పెళ్లిళ్లు ఉంటాయని, వీటితో రూ. 1.25 లక్షల కోట్ల మేర వ్యాపారం జరగొచ్చని అంచనా వేస్తున్నట్లు ఖండేల్వాల్ తెలిపారు.

ఒకేరోజు @ 4,59,526

విమాన ప్రయాణికుల రికార్డు



న్యూఢిల్లీ: దేశీయంగా ఒకే రోజు 4,59,526 మంది విమాన ప్రయాణం. భారత దేశ చరిత్రలో ఈ స్థాయిలో ఒకేరోజు విమానాల్లో రాకపోకలు సాగించడం ఇదే తొలిసారి. నవంబర్ 20న ఈ రికార్డు నమోదైందని పౌర విమానయాన శాఖ మంగళవారం ప్రకటించింది. దేశీయ విమానయాన రంగం ప్రతిరోజు కొత్త శిఖరాలను తాకుతోందని వ్యాఖ్యానించింది. 2022 నవంబర్ 20న దేశీయంగా విమాన ప్రయాణాలు చేసిన వారి సంఖ్య 3.94 లక్షలు ఉంది. విమాన సర్వీసుల సంఖ్య గతేడాది 5,468 కాగా, ఈ ఏడాది నవంబర్ 20న 5,959 ఉంది. దేశీయంగా నవంబర్ 18న 4,56,748, నవంబర్ 19న 4,56,910 మంది తమ తమ గమ్యస్థానాలకు చేరారు.

నేటి నుంచి పౌల్ట్రీ ఇండియా

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: పౌల్ట్రీ ఇండియా–2023 ప్రదర్శన నవంబర్ 22 (నేటి) నుంచి ప్రారంభం అవుతోంది. మూడు రోజులపాటు సాగే ఈ కార్యక్రమానికి హైదరాబాద్‌లోని హైటెక్స్ వేదిక అయింది. భారత్ నుంచి 380, వివిధ దేశాలకు చెందిన 45 కంపెనీలు తమ ఉత్పత్తులు, సేవలను ప్రదర్శించనున్నాయి.

మైక్రోసాఫ్ట్ గ్లోబల్ డెలివరీ సెంటర్ లీడరుగా అపర్ణ



న్యూఢిల్లీ: ఐటీ దిగ్గజం మైక్రోసాఫ్ట్ తమ గ్లోబల్ డెలివరీ సెంటర్ (జీడీసీ) లీడరుగా అపర్ణ గుప్తాను నియమించింది. కస్టమర్ ఇన్నోవేషన్, డెలివరీ ఎక్సెలెన్స్, క్లౌడ్ విభాగం వృద్ధిని వేగవంతం చేయడం తదితర బాధ్యతలను ఆమె నిర్వర్తించాల్సి ఉంటుంది. మైక్రోసాఫ్ట్ టెక్నాలజీల్లో అపర్ణకు అపార అనుభవం ఉండటంతో కస్టమర్లు తమకు అవసరమయ్యే సొల్యూషన్స్‌ను ఎంచుకోవడంలో తగిన సహాయం అందించగలరని మైక్రోసాఫ్ట్ ఇండియా ప్రెసిడెంట్ పునీత్ చందోక్ తెలిపారు. భారత్‌లో కమర్షియల్ సాఫ్ట్‌వేర్ ఇంజినీరింగ్ (ప్రస్తుతం ఐఎస్ఈ) లీడ్‌గా ఆమె ఆరేళ్ల క్రితం సంస్థలో చేరారు.

ప్రాంతీయ భాషల్లో అవుట్‌లుక్ లైట్ ..

మరోవైపు, మైక్రోసాఫ్ట్ భారత యూజర్ల కోసం ప్రత్యేకంగా తయారు చేసిన తమ అవుట్‌లుక్ లైట్ యాప్‌లో మరిన్ని ఫీచర్లు జోడించింది. ప్రాంతీయ భాషలను కూడా సపోర్ట్ చేసే విధంగా ఈ ఎస్ఎంఎస్, ఈమెయిల్ యాప్‌ను తీర్చిదిద్దడం జరిగింది.

ఐదేళ్లలో 3,000 ఉద్యోగాలు

టైటన్ కంపెనీ ప్రణాళికలు



ముంబై: టాటా గ్రూప్ దిగ్గజం టైటన్ కంపెనీ రానున్న ఐదేళ్ల కాలంలో 3,000కుపైగా ఉద్యోగాలను కల్పించనుంది. వీటిలో ఇంజినీరింగ్, డిజైన్, లగ్జరీ, డిజిటల్, డేటా అనలిటిక్స్, మార్కెటింగ్ తదితర విభాగాలలో సిబ్బందిని నియమించుకోనున్నట్లు కంపెనీ ఒక ప్రకటనలో పేర్కొంది. డేటా అనలిటిక్స్, సైబర్ సెక్యూరిటీ, ప్రొడక్ట్ మేనేజ్‌మెంట్, డిజిటల్ మార్కెటింగ్ తదితర ఆధునిక విభాగాలలో ప్రత్యేకతలున్న నిపుణులను ఎంపిక చేసుకోనున్నట్లు వివరించింది. ఐదేళ్ల కాలంలో రూ. 1,00,000 కోట్ల బిజినెస్‌ను అందుకునే బాటలో ప్రయాణిస్తున్నట్లు టైటన్ తెలియజేసింది. ఇందుకు అనుగుణంగా విభిన్న విభాగాలలో ప్రత్యేకత కలిగిన నిపుణులను ఉద్యోగాలలోకి తీసుకునే వ్యూహాలు అమలు చేయనున్నట్లు వెల్లడించింది. కంపెనీ సొంత సిబ్బందిసహా.. వివిధ విభాగాలలో యువ వృత్తి నిపుణులను జత కలుపుకోనున్నట్లు తెలియజేసింది. వెరసి వృద్ధి, ఆవిష్కరణలతోపాటు పరిశ్రమలో కంపెనీ స్థానాన్ని పటిష్టపరచుకోనున్నట్లు టైటన్ హెచ్‌ఆర్(కార్పొరేట్, రిటైల్) హెడ్ ప్రియా ఎం.పిళ్లై పేర్కొన్నారు.

60:40

ప్రస్తుతం కంపెనీ సిబ్బందిలో 60 శాతం మెట్రో నగరాలలో సేవలందిస్తుండగా.. మరో 40 శాతం మంది ద్వితీయస్థాయి నగరాల(టైర్-2, 3)లో పనిచేస్తున్నట్లు టైటన్ వెల్లడించింది. వర్ధమాన మార్కెట్లలో కార్యకలాపాల పటిష్టతను కొనసాగిస్తూనే స్థానిక నిపుణులను ప్రోత్సహించడం ద్వారా ఉపాధి అవకాశాలకు తెరతీయనున్నట్లు తెలియజేసింది. టాటా గ్రూప్, తమిళనాడు పారిశ్రామికాభివృద్ధి సంస్థ(టిడ్కో) మధ్య భాగస్వామ్య కంపెనీగా టైటన్ ఏర్పాటైన సంగతి తెలిసిందే.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)	
22-11-2023	
విశాఖ	535-00
చిత్తూరు	593-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	535-00
విజయవాడ	535-00
రిటైల్ ధర (డజను)	72.00
21-11-2023 ఫామ్ ధర...	
హైదరాబాద్	520-00
వరంగల్	522-00
రిటైల్ ధర	5.80

రెండు రోజుల నష్టాలకు చెక్

- వడ్డీ రేట్ల పెంపు ఆందోళన తగ్గుముఖం నేపథ్యం
- సెన్సెక్స్ 276 పాయింట్లు ప్లస్
- 19,800 చేరువలో నిఫ్టీ

ముంబై: ఫెడరల్ రిజర్వ్ కీలక వడ్డీ రేట్లను పెంచకపోవచ్చనే అంచనాలతో స్టాక్ సూచీలు మంగళవారం లాభాలతో ముగిశాయి. అధిక వెయిటేజీ రిలయన్స్ ఇండస్ట్రీస్ షేరు 1.25% రాణించింది. సెన్సెక్స్ 276 పాయింట్లు పెరిగి 65,931 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 89 పాయింట్లు బలపడి 19,783 వద్ద నిలిచింది. దీంతో సూచీల రెండు రోజుల వరుస నష్టాల నుంచి గట్టెక్కాయి. ఉదయం లాభాల్లో మొదలైన సూచీలు మిడ్ సెషన్‌లో కొంత అమ్మకాల ఒత్తిడికి లోనయ్యాయి. అయితే యూరప్ మార్కెట్ల లాభాల ప్రారంభంతో ట్రేడర్లు తిరిగి కొనుగోళ్లు చేపట్టారు. ఒక దశలో సెన్సెక్స్ 472 పాయింట్లు బలపడి 66,082 వద్ద, నిఫ్టీ 135 పాయింట్లు పెరిగి 19,829 వద్ద ఇంట్రాడే గరిష్టాన్ని తాకాయి. కన్జూమర్ డ్యూరబుల్స్, రియల్టీ, మెటల్, ఫార్మా షేర్లకు కొనుగోళ్లకు లభించింది. ఎఫ్ఎంజీసీ, ప్రభుత్వరంగ బ్యాంకులు, ఐటీ, ఇంధన రంగాల షేర్లు అమ్మకాల ఒత్తిడికి లోనయ్యాయి. బీఎస్ఈ మిడ్, స్మాల్ క్యాప్ సూచీలు వరుసగా 0.20%, 0.14% చొప్పున లాభపడ్డాయి. విదేశీ ఇన్వెస్టర్లు రూ.456 కోట్ల ఈక్విటీలను విక్రయించారు. సంస్థాగత ఇన్వెస్టర్లు రూ.721 కోట్ల షేర్లు కొన్నారు. ఫెడ్ రిజర్వ్ సమావేశ నిర్ణయాల వెల్లడి ముందు ప్రపంచ ఈక్విటీ మార్కెట్లు సానుకూలంగా ట్రేడవుతున్నాయి.



విదేశాలకు బయోఫ్యాక్టర్ 'బెలోమ్'

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: జీవన ఎరువులు, ప్రాణాధార పోషకాల తయారీలో ఉన్న బయోఫ్యాక్టర్.. ఆధునీకరించిన 'బెలోమ్' ఉత్పత్తులను విదేశాల్లో మార్కెట్ చేసేందుకు సిద్ధమైంది. అనావృష్టి, అతివృష్టిలోనూ మెరుగైన పంట దిగుబడి కోసం అత్యంత సమర్థవంతంగా పనిచేసే బెలోమ్ ఫోలియర్ న్యూట్రిమేషన్ సాంకేతికతకు మరింత సామర్థ్యాన్ని జోడించామని బయోఫ్యాక్టర్ బ్రాండ్‌ను ప్రమోట్ చేస్తున్న బయోఫ్యాక్ ఇన్‌పుట్స్ ఫౌండర్, సీఈవో ఎల్ఎన్ రెడ్డి వెల్లడించారు. 'ఆకుల ద్వారా మొక్కలకు పోషకాలు చేరడం బెలోమ్ ప్రత్యేకత. అన్ని రకాల పంటలను తక్కువ ఖర్చుతో సాగు చేయవచ్చు. దిగుబడి 20–30 శాతం పెరిగిందని నిరూపితమైంది. తెగుళ్లు, వ్యాధుల నుంచి మొక్కలు తట్టుకుంటాయి. కంపెనీ పరిశోధనలకు డిపార్ట్‌మెంట్ ఆఫ్ సైంటిఫిక్, ఇండస్ట్రియల్ రిసర్చ్ నుంచి అనుమతి ఉంది' అని తెలిపారు.

లక్ష మందికి పైగా..

ప్రపంచంలో తొలిసారిగా మెటబోలైట్ అసిస్టెడ్ మైక్రాన్ సైజ్డ్ (ఎంఏఎంఎస్) న్యూట్రిమేషన్ టెక్నాలజీతో తయారైన బెలోమ్‌ను లక్షకు పైచిలుకు రైతులు భారత్‌లో వినియోగిస్తున్నారు. మొక్కకు కావలసిన 13 రకాలైన ప్రాణాధార పోషకాలు ఏంఏఎంఎస్ విధానంలో ప్రత్యేకించి తయారు చేశామని ఎల్ఎన్ రెడ్డి తెలిపారు. దేశవ్యాప్తంగా వివిధ వ్యవసాయ భూముల్లో వరి, మొక్కజొన్న, టమాటా, వంకాయ, బంతి, మిర్చి, పత్తి వంటి పంటలపై పరిశోధనలు జరిపామన్నారు. హైదరాబాద్ కేంద్రంగా 2014లో బయోఫ్యాక్టర్ ఏర్పాటైంది. 650 మంది ఉద్యోగులున్నారు. దేశవ్యాప్తంగా 3,500 పైచిలుకు డీలర్ నెట్‌వర్క్ ఉంది. ప్రోబయాటిక్స్ విభాగంలో 35 ప్రొప్రైటరీ స్ట్రెయిన్స్, నానో టెక్నాలజీలో ఎనిమిది పేటెంట్లు కంపెనీ సొంతం.



బయోఫ్యాక్టర్ ఫౌండర్ ఎల్ఎన్ రెడ్డి

భవిత

జాబ్ పాయింట్

డీజీహెచ్ఎస్ వైద్య సంస్థల్లో 487 గ్రూప్ బి, సి పోస్టులు

కేంద్ర ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ పరిధిలోని.. డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ హెల్త్ సర్వీసెస్(డీజీహెచ్ఎస్).. వివిధ నగరాల్లోని వైద్య సంస్థల్లో గ్రూప్ బి, సి పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- » **పోస్టులు:** రీసెర్చ్ అసిస్టెంట్, టెక్నీషియన్, ల్యాబొరేటరీ అటెండెంట్, ల్యాబొరేటరీ టెక్నీషియన్, హెల్త్ ఇన్‌స్పెక్టర్, ఫీల్డ్ వర్కర్, లైబ్రరీ అండ్ ఇన్ఫర్మేషన్ అసిస్టెంట్, లైబ్రరీ క్లర్క్, ఫిజియోథెరపిస్ట్, మెడికల్ సోషల్ వెల్ఫేర్ ఆఫీసర్, ఎక్స్‌రే టెక్నీషియన్, మెడికల్ ల్యాబొరేటరీ టెక్నాలజిస్ట్, యానిమల్ అటెండెంట్, లైబ్రరీ క్లర్క్, నర్సింగ్ ఆఫీసర్(స్టాఫ్ నర్స్), పారా మెడికల్ వర్కర్, వర్క్‌షాప్ అటెండెంట్.
- » **అర్హత:** పోస్టును అనుసరించి పదో తరగతి, 12వ తరగతి, సంబంధిత విభాగాల్లో ఐటీఐ, డిప్లొమా, డిగ్రీ, పీజీ ఉత్తీర్ణతతోపాటు పని అనుభవం ఉండాలి.
- » **వయసు:** గరిష్ట వయసు ఉద్యోగాన్ని బట్టి మారుతుంది. కొన్ని పోస్టులకు 25 ఏళ్లు, కొన్నింటికి 27 ఏళ్లు, మరికొన్నింటికి 30 ఏళ్లుగా నిర్ణయించారు.
- » **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ విధానంలో దరఖాస్తు చేసుకోవాలి.
- » **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 30.11.2023.
- » **ఆన్‌లైన్ ఫీజు చెల్లింపునకు చివరితేది:**01.12.2023
- » **అడ్మిట్‌కార్డ్ డౌన్‌లోడింగ్:** డిసెంబర్ మొదటి వారం, 2023.
- » **కంప్యూటర్ ఆధారిత పరీక్ష:** డిసెంబర్ రెండో వారం, 2023.
- » **వెబ్‌సైట్:** https://hlldghs.cbtexam.in

పల్నాడు జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖలో 10 పోస్టులు

పల్నాడు జిల్లా మహిళా, శిశు సంక్షేమ, సాధికారత అధికారిక కార్యాలయం.. ఒప్పంద ప్రాతిపదికన వివిధ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- » **మొత్తం పోస్టుల సంఖ్య:** 10
- » **పోస్టుల వివరాలు:** ప్రాజెక్ట్ అసిస్టెంట్-01, బ్లాక్ కోఆర్డినేటర్-09.
- » **అర్హత:** సంబంధిత విభాగంలో డిగ్రీ, పీజీ డిప్లొమా ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి. **వయసు:** 25 నుంచి 42 ఏళ్ల మధ్య ఉండాలి.
- » **వేతనం:** నెలకు జిల్లా ప్రాజెక్ట్ అసిస్టెంట్‌కు రూ.18,000, బ్లాక్ కోఆర్డినేటర్‌కు రూ.20,000.
- » **దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తును జిల్లా మహిళా, శిశు సంక్షేమ, సాధికారత అధికారి కార్యాలయం, బరంపేట, నరసరావుపేట, పల్నాడు జిల్లా చిరునామకు పంపించాలి.
- » **దరఖాస్తులకు చివరితేది:** 28.11.2023.
- » **వెబ్‌సైట్:** htpp://dwcweopalnadu.ap.gov.in

టీచర్ కెరీర్‌కు మార్గం.. సీటెట్



సీటెట్ జనవరి-2024

- » సీటెట్ జనవరి-2024 నోటిఫికేషన్ విడుదల
- » టీచర్ కొలువుకు తప్పనిసరి అర్హతగా సీటెట్
- » డీఈడీ, బీఈడీ ఉత్తీర్ణతతో పోటీ పడే అవకాశం
- » సీటెట్ స్కోర్‌కు జీవిత కాల గుర్తింపు

సెంట్రల్ టీచర్ ఎలిజిబిలిటీ టెస్ట్..సంక్షిప్తంగా సీటెట్! ఈ పరీక్షలో విజయం సాధిస్తేనే.. కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలోని పాఠశాలల్లో.. ఉపాధ్యాయ పోస్ట్‌లకు పోటీ పడే అర్హత లభిస్తుంది. బీఈడీ, డీఈడీ తదితర ఉపాధ్యాయ విద్య కోర్సుల ఉత్తీర్ణులు సీటెట్‌కు దరఖాస్తు చేసుకోవచ్చు. ఇటీవల సీటెట్ జనవరి-2024 నోటిఫికేషన్ వెలువడింది. పరీక్షను జనవరి 21న నిర్వహించనున్నారు. ఈ నేపథ్యంలో.. సీటెట్-2024 వివరాలు, పరీక్ష విధానం, సిలబస్ విశ్లేషణ, ప్రిపరేషన్ గైడెన్స్..

బీఈడీ, డీఈడీ ఉత్తీర్ణులు రాష్ట్ర స్థాయిలో టెట్‌తోపాటు జాతీయ స్థాయిలో సీటెట్‌కు కూడా పోటీ పడుతున్నారు. దీనికి కారణం.. సీటెట్ స్కోర్‌తో దేశ వ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయ పోస్ట్‌లకు దరఖాస్తు చేసుకునే అవకాశం లభిస్తుండటమే. సీటెట్‌ను సీబీఎస్ఈ ఆధ్వర్యంలో ఏటా రెండుసార్లు నిర్వహిస్తారు.

రెండు పేపర్లుగా సీటెట్

సీటెట్ పరీక్షను రెండు పేపర్లుగా నిర్వహిస్తారు. ఒకటి నుంచి అయిదో తరగతి వరకు బోధనకు పేపర్-1కు హాజరు కావలసి ఉంటుంది. అదేవిధంగా ఆరు నుంచి ఎనిమిదో తరగతి వరకు టీచింగ్‌కు పేపర్-2లో ఉత్తీర్ణత సాధించాల్సి ఉంటుంది. రెండు స్థాయిల్లోనూ బోధించాలనుకునే వారు రెండు పేపర్లకు హాజరై ఉత్తీర్ణత సాధించాలి. ఈ పేపర్లు రాసేందుకు నిర్దేశిత విద్యార్హతలు కలిగుండాలి.

అర్హతలు

- పేపర్-1: ఇంటర్మీడియెట్/తత్సమాన కోర్సుల్లో 50 శాతం మార్కులతో ఉత్తీర్ణతతోపాటు రెండేళ్ల డిప్లొమా ఇన్ ఎలిమెంటరీ ఎడ్యుకేషన్ లేదా నాలుగేళ్ల బ్యాచిలర్ ఆఫ్ ఎడ్యుకేషన్ లేదా రెండేళ్ల డిప్లొమా ఇన్ ఎడ్యుకేషన్(స్పెషల్ ఎడ్యుకేషన్) పాసవ్వాలి. లేదా 50 శాతం మార్కులతో బ్యాచిలర్ డిగ్రీ ఉత్తీర్ణత తోపాటు బీఈడీ లేదా బీఈడీ స్పెషల్ ఎడ్యుకేషన్ పాసవ్వాలి. ఎన్‌సీటీఈ మార్గదర్శకాల ప్రకారం-బీఈడీ అభ్యర్థులు సైతం ఎస్‌జీటీ పోస్ట్‌లకు అర్హులే. దీంతో సీటెట్-పేపర్-1కు బీఈడీ ఉత్తీర్ణులకు కూడా అర్హత లభించింది.

పేపర్-2 అర్హత

- బీఏ/బీఎస్సీ/బీకాంలో 50 శాతం మార్కులతో ఉత్తీర్ణతతోపాటు బ్యాచిలర్ ఆఫ్ ఎడ్యుకేషన్ (బీఈడీ) లేదా బ్యాచిలర్ ఆఫ్ ఎడ్యుకేషన్ (స్పెషల్ ఎడ్యుకేషన్) లేదా నాలుగేళ్ల బీఏ ఎడ్యుకేషన్/బీఎస్సీ ఎడ్యుకేషన్‌లలో ఉత్తీర్ణత ఉండాలి. లేదా నాలుగేళ్ల బీఏ బీఈడీ/బీఎస్సీ బీఈడీలలో 50 శాతం మార్కులతో ఉత్తీర్ణత సాధించాలి (లేదా)
- బీఈ/బీటెక్‌లో 50 శాతంతో ఉత్తీర్ణత సాధించి బీఈడీ/బీఈడీ (స్పెషల్ ఎడ్యుకేషన్) పాసవ్వాలి (లేదా) 55 శాతం మార్కులతో పీజీ ఉత్తీర్ణతతోపాటు మూడేళ్ల ఇంటిగ్రేటెడ్ బీఈడీ-ఎంఈడీ ఉత్తీర్ణులవ్వాలి.

150 మార్కులకు పేపర్-1

- ఒకటి నుంచి అయిదో తరగతి వరకు బోధించే వారికి నిర్వహించే పేపర్-1 పరీక్ష అయిదు విభాగాల్లో 150 మార్కులకు ఉంటుంది. ఇందులో..చైల్డ్ డెవలప్‌మెంట్ అండ్ పెడగాజి 30 ప్రశ్నలు-30 మార్కులకు; లాంగ్వేజ్-1, 30 ప్రశ్నలు-30 మార్కులకు; లాంగ్వేజ్ -2, 30 ప్రశ్నలు-30 మార్కులకు; మ్యాథమెటిక్స్ 30 ప్రశ్నలు-30 మార్కులకు; ఎన్విరాన్‌మెంటల్ స్టడీస్ 30 ప్రశ్నలు-30 మార్కులకు ఉంటాయి. పరీక్ష పూర్తిగా ఆబ్జెక్టివ్ విధానంలో కంప్యూటర్ బేస్డ్ టెస్ట్‌గా జరుగుతుంది.

లాంగ్వేజ్-1, లాంగ్వేజ్-2 తప్పనిసరి పేపర్లు. లాంగ్వేజ్1 విభాగంలో అభ్యర్థులు ఎంచుకున్న బోధన మాధ్యమానికి సంబంధించిన ప్రశ్నలు అడుగుతారు. లాంగ్వేజ్-2 విభాగంలో 20 లాంగ్వేజ్‌లలో ఏదో ఒక లాంగ్వేజ్‌ను ఎంచుకోవచ్చు.అయితే ఈ విభాగంలో ఎంచుకునే భాషను లాంగ్వేజ్-1 విభాగంలో ఎంచుకోకూడదు. తెలుగు రాష్ట్రాల అభ్యర్థులకు లాంగ్వేజ్-2లో తెలుగు, ఉర్దూ భాషల్లో హాజరయ్యే అవకాశం ఉంది.

పేపర్-2 ఇలా

ఆరో తరగతి నుంచి ఎనిమిదో తరగతి వరకు బోధించే వారికి నిర్వహించే పేపర్-2 పరీక్ష 150 మార్కులకు ఉంటుంది. ఇందులో.. చైల్డ్ డెవలప్‌మెంట్ అండ్ పెడగాజి 30 ప్రశ్నలు-30 మార్కులకు; లాంగ్వేజ్ 1, 30 ప్రశ్నలు-30 మార్కులకు; లాంగ్వేజ్ 2, 30 ప్రశ్నలు-30 మార్కులకు; మ్యాథమెటిక్స్ అండ్ సైన్స్ 60 ప్రశ్నలు-60 మార్కులకు; సోషల్ స్టడీస్ / సోషల్ సైన్స్ 60 ప్రశ్నలు-60 మార్కులకు ఉంటాయి. అభ్యర్థులు తాము ఏ మాధ్యమంలో బోధించాలనుకుంటున్నారో ఆ మీడియంలో లాంగ్వేజ్-1 పరీక్ష రాయాల్సి ఉంటుంది. లాంగ్వేజ్-2 విభాగంలో లాంగ్వేజ్-1లో హాజరైన భాష కాకుండా.. ఇతర లాంగ్వేజ్‌ను ఎంచుకోవాలి. మొత్తం 20 భాషలు అందుబాటులో ఉన్నాయి. మ్యాథమెటిక్స్ అండ్ సైన్స్ టీచింగ్ అభ్యర్థులు పేపర్-2లో నాలుగో విభాగాన్ని, సోషల్ టీచర్లు అయిదో విభాగాన్ని ఎంచుకుని పరీక్షకు హాజరు కావాలి.

కనీస అర్హత మార్కులు

సీటెట్‌లో ప్రతి పేపర్‌లోనూ.. జనరల్ కేటగిరీ అభ్యర్థులు కనీసం అరవై శాతం మార్కులతో (90 మార్కులు) ఉత్తీర్ణత సాధించాలి. బీసీ కేటగిరీ అభ్యర్థులు 50 శాతం మార్కులతో (70 మార్కులు), ఎస్సీ/ఎస్టీ/దివ్యాంగుల కేటగిరీలకు చెందిన అభ్యర్థులు 40 శాతం మార్కులతో (60 మార్కులు) ఉత్తీర్ణత సాధించాలి.

జీవిత కాల గుర్తింపు

సీటెట్‌లో ఒకసారి నిర్దేశిత అర్హత మార్కులతో స్కోర్ సొంతం చేసుకుంటే.. ఆ స్కోర్‌కు జీవిత కాలం గుర్తింపు ఉంటుంది. అంటే.. ఒకసారి ఈ పరీక్షలో ఉత్తీర్ణత సాధిస్తే.. ఎప్పుడైనా టీచింగ్ ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకోవచ్చు.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
- **ఆన్‌లైన్ దరఖాస్తు చివరి తేదీ:** నవంబర్ 23, 2023
- **సీటెట్ పరీక్ష తేదీ:** 2024, జనవరి 21
- **తెలుగు రాష్ట్రాల్లో పరీక్ష కేంద్రాలు:** గుంటూరు, తిరుపతి, విజయవాడ, విశాఖపట్నం, హైదరాబాద్, వరంగల్.
- **వివరాలకు వెబ్‌సైట్:** https://ctet.nic.in

పరీక్షలో రాణించేలా

చైల్డ్ డెవలప్‌మెంట్ అండ్ పెడగాజి

పరీక్షలో ఎంతో కీలకమైన విభాగం ఇది. ఇందులో ఎడ్యుకేషనల్ సైకాలజీపై ప్రాథమిక స్థాయిలో ప్రశ్నలు ఉంటాయి. అభ్యర్థులు ప్రధానంగా శిశువు సైకాలజీకి సంబంధించిన అంశాలపై ఎక్కువ దృష్టిసారించాలి. వికాస దశలు, వికాస అంశాలైన శారీరక, మానసిక, సాంఘిక, ఉద్వేగ వికాసాలు మొదలైన అంశాలను క్షుణ్నంగా చదవాలి. శిశువు ప్రవర్తనలో మార్పునకు సంబంధించిన అభ్యాసం, అభ్యసన బదలాయింపు అంశాలను చదవాలి. సైకాలజీ అంశాలను చదివేటప్పుడు కీలక భావనలు, సాంకేతిక పదాలు, సిద్ధాంతాలు-సూత్రాలు, ప్రతిపాదించిన శాస్త్రవేత్తలు, వారి గ్రంథాలు తదితర విషయాలను విశ్లేషణాత్మకంగా అధ్యయనం చేయాలి. పెడగాజి అంటే బోధన శాస్త్రం. ఇందులో సహిత విద్య, శిశువు విద్యా ప్రణాళిక, బోధన పద్ధతులు, మూల్యాంకనం-నాయకత్వం-గైడెన్స్-కౌన్సెలింగ్ గురించి అధ్యయనం చేయాలి. ఎడ్యుకేషన్‌కు సంబంధించిన చట్టాలపై పూర్తి అవగాహన పెంచుకోవాలి.

లాంగ్వేజ్ పేపర్లు

లాంగ్వేజ్-1 విభాగంతోపాటు లాంగ్వేజ్-2లో రాణించేందుకు సంబంధిత భాషా విభాగాలపై స్కూల్ స్థాయి పుస్తకాలను పూర్తిగా చదవాలి. లాంగ్వేజ్-2కు సంబంధించి ఎక్కువ మంది అభ్యర్థులు ఇంగ్లిష్‌ను ఎంచుకుంటున్నారు. ఇంగ్లిష్‌లో పార్ట్స్ ఆఫ్ స్పీచ్, ఆర్టికల్స్, డైరెక్ట్ అండ్ ఇన్‌డైరెక్ట్ స్పీచ్, డిగ్రీస్ ఆఫ్ కంపేరిజన్, వొకాబ్యులరీ.. ఇలా అన్ని అంశాలపైనా అవగాహన పెంచుకోవాలి. అభ్యర్థులు నిర్దిష్టంగా ఏదైనా ఒక ప్రామాణిక పుస్తకాన్ని ఎంచుకుని సన్నద్ధం కావాలి. పెడగాజికి సంబంధించి టీచింగ్ మెథడ్స్, అప్రోచెస్, టెక్నిక్స్, లాంగ్వేజ్ స్కిల్స్, ఇంగ్లిష్ నేపథ్యంపై ప్రశ్నలు వస్తాయి.

మ్యాథమెటిక్స్

పేపర్-1లో ఒకటి నుంచి అయిదో తరగతి వరకు పుస్తకాలను చదవాలి. తద్వారా ఈ సబ్జెక్టులో ప్రాథమిక అంశాలపై పూర్తి స్థాయి పట్టు సాధించాలి. పేపర్-2లో ఆరో తరగతి నుంచి ఎనిమిదో తరగతి వరకు ఉండే కాన్సెప్ట్‌లపైనే ప్రశ్నలు అడుగుతారు. ప్రశ్నల క్లిష్టత స్థాయి ఇంటర్ స్థాయిలో ఉంటుంది.

ఎన్విరాన్‌మెంటల్ స్టడీస్

బోటనీ బేసిక్స్‌తోపాటు, పర్యావరణ అంశాలు, సైన్స్ ఇన్ డైలీ లైఫ్ వంటి అంశాలపై దృష్టి పెట్టాలి.

సైన్స్

ఈ సబ్జెక్ట్‌లో మంచి మార్కుల పొందాలంటే.. మూడు నుంచి ఎనిమిదో తరగతి వరకు పుస్తకాలు ఔపోసన పట్టాలి. పేపర్-2 కోసం ప్రత్యేకంగా ఆరు నుంచి పదో తరగతి వరకు పుస్తకాలు చదవాలి. గత టెట్‌లో ఈ విభాగంలో ప్రశ్నలు కాసింత క్లిష్టంగానే ఉన్నాయని చెప్పొచ్చు. కాబట్టి అభ్యర్థులు ఆయా అంశాల బేసిక్స్, అప్లికేషన్స్‌ను ప్రత్యేకంగా అధ్యయనం చేయాలి.

సోషల్ స్టడీస్

హైస్కూల్ స్థాయిలో పుస్తకాలను క్షుణ్నంగా చదవాలి. భూగోళ శాస్త్రంలో ఒక ప్రాంతం గురించి చదువుతున్నప్పుడు ఆ ప్రాంతానికి సంబంధించిన అన్ని అంశాలను తెలుసుకోవాలి. వాతావరణం, భౌగోళిక పరిస్థితులు, నదులు.. వంటి వాటిపై అవగాహన పెంచుకోవాలి. అదేవిధంగా సివిక్స్, ఎకనామిక్స్ అంశాలను సమకాలీన పరిణామాలతో అప్‌డేట్ చేసుకుంటూ అధ్యయనం చేయాలి.

క్లుప్తంగా...

కేఎంసీ ఘటనపై త్రీ మెన్ కమిటీ

విచారణకు ఆదేశించిన కాలేజీ ప్రిన్సిపాల్

కర్నూలు(హాస్పిటల్): కర్నూలు మెడికల్ కాలేజీ(కేఎంసీ)లో వైద్య విద్యార్థులు మత్తు పదార్థాలు సేవించిన ఘటనపై ప్రభుత్వం సీరియస్‌గా స్పందించింది. ఈ వ్యవహారంపై విచారణ కోసం త్రీ మెన్ కమిటీని నియమించింది. కర్నూలు మెడికల్ కాలేజీ హాస్టల్లో ఈ నెల 17వ తేదీ అర్ధరాత్రి డిప్యూటీ వార్డెన్ డాక్టర్ జయరామ్, అసిస్టెంట్ వార్డెన్ డాక్టర్ సోమశేఖర్ ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించగా, ఓ గదిలో వైద్య విద్యార్థులు కొందరు మద్యం తాగుతూ, మరికొందరు చిన్నగాజు సీసాలో గంజాయి పొగను పీలుస్తూ కనిపించారు. వార్డెన్లు వారిని పట్టుకుని ప్రశ్నించగా, ఇక్కడ చాలామందికి ఈ అలవాట్లు ఉన్నట్లు తెలిపారు. మరుసటిరోజు సైతం ఇదే తరహాలో తనిఖీలు నిర్వహించగా, మరికొందరు విద్యార్థులు మద్యం, గంజాయి తాగుతూ దొరికారు. వార్డెన్లు ఈ విషయాన్ని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.సుధాకర్ దృష్టికి తీసుకువెళ్లారు. ఆయన వెంటనే స్పందించి వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ సాయిసుధీర్, ఎండోక్రైనాలజీ హెచ్‌వోడీ డాక్టర్ పి.శ్రీనివాసులు, డిప్యూటీ వార్డెన్ డాక్టర్ జయరామ్‌లతో త్రీ మెన్ కమిటీని నియమించి, పూర్తిస్థాయిలో వివరాలు సేకరించాలని ఆదేశించారు. త్రీ మెన్ కమిటీతో కలిసి ప్రిన్సిపాల్ మంగళవారం కళాశాల, హాస్టళ్లలో తనిఖీలు చేశారు.

సీజీహెచ్‌ఎస్ పరిధిలోకి మంగళగిరి ఎయిమ్స్

సాక్షి, అమరావతి: గుంటూరు జిల్లా మంగళగిరిలోని ఎయిమ్స్‌ను కేంద్ర ప్రభుత్వ ఆరోగ్య పథకం (సీజీహెచ్‌ఎస్)లోకి తీసుకొస్తూ ఉత్తర్వులు వెలువడినట్టు ఏపీ సెంట్రల్ ఎక్సైజ్ పెన్షనర్స్ అసోసియేషన్ ప్రతినిధులు వివేకానంద, తిలక్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు ఎయిమ్స్, సీజీహెచ్‌ఎస్ మధ్య ఒప్పందం జరిగిందని వెల్లడించారు. దీంతో సీజీహెచ్‌ఎస్ కార్డు ఉన్న కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్‌లకు, స్వాతంత్ర్య సమరయోధులు, మాజీ ఎంపీలకు మేలు చేకూరనుందని పేర్కొన్నారు.

నౌకాదళ నిరోధక క్షిపణి గైడెడ్ ఫ్లైట్ ట్రయల్స్ విజయవంతం

సింధియా(విశాఖ పశ్చిమ): భారత నౌకాదళ, డీఆర్‌డీవో సంయుక్తంగా స్వదేశీయంగా అభివృద్ధి చేసిన మొట్ట మొదటి నౌకాదళ నిరోధక క్షిపణి గైడెడ్ ఫ్లైట్ ట్రయల్స్ విజయవంతంగా నిర్వహించాయి. గైడెడ్ టెక్నాలజీతో సాంకేతికంగా అభివృద్ధి పరచిన క్షిపణి ద్వారా కాల్పులు చేయడమే లక్ష్యంగా దీనిని ఉపయోగిస్తారని నేవీ వర్గాలు తెలిపాయి.

ఫిర్యాదుల పరిశీలన తరువాతే సోదాలు

అవినీతి నిరోధక విభాగం

సాక్షి, అమరావతి: బాధితుల నుంచి వస్తున్న ఫిర్యాదులను పరిశీలించిన తరువాతే అవినీతి పరులైన ప్రభుత్వ అధికారుల నివాసాల్లో సోదాలు చేస్తున్నామని అవినీతి నిరోధక విభాగం (ఏసీబీ) మంగళవారం తెలిపింది. ఏసీబీ అందుబాటులోకి తీసుకువచ్చిన 14400 మొబైల్ యాప్, టోల్‌ఫ్రీ నంబరులకు రోజూ భారీగా వస్తున్న ఫిర్యాదులను పరిశీలించి తగిన ఆధారాలు ఉన్నాయని నిర్ధారణ అయిన చర్యలు తీసుకుంటున్నామని పేర్కొంది. అంతేగానీ ప్రభుత్వ అధికారులు, ఉద్యోగులపై ఏకపక్షంగా చర్యలు తీసుకోదని స్పష్టం చేసింది.

ఆడుకుందాం రండి!

15 నుంచి జనవరి 26 వరకు 'ఆడుదాం-ఆంధ్ర' క్రీడలు

- దేశంలోనే అతిపెద్ద క్రీడా టోర్నీ రాష్ట్రంలో నిర్వహణ
- 15 ఏళ్లకు పైబడిన బాలబాలికలకు క్రికెట్, వాలీబాల్, కబడ్డీ, ఖోఖో, బ్యాడ్మింటన్ విభాగాల్లో పోటీలు
- నాన్-కాంపిటీటివ్ విభాగంగా యోగా, టెన్నీకాయిట్, మారథాన్
- 43 రోజులపాటు ఐదుస్థాయిల్లో 2.99 లక్షల మ్యాచ్‌ల నిర్వహణ
- 27 నుంచి క్రీడాకారుల రిజిస్ట్రేషన్ ప్రక్రియ ప్రారంభం
- ప్రత్యేక వెబ్‌సైట్‌ను రూపొందిస్తున్న ప్రభుత్వం
- వలంటీర్ల ద్వారా ఇంటింటి సందర్శనలో క్రీడాకారుల వివరాలు నమోదు
- గ్రామ/వార్డు సచివాలయాల్లోనూ అందించొచ్చు
- క్రీడాకారులే స్వయంగా వెబ్‌సైట్‌లో రిజిస్ట్రేషన్ చేసుకునే వెసులుబాటు
- పోటీల నిర్వహణపై 1.50 లక్షల మంది వలంటీర్లకు శాప్ శిక్షణ



సాక్షి, అమరావతి : దేశంలోనే అతిపెద్ద క్రీడా సంబరానికి రాష్ట్ర ప్రభుత్వం సన్నాహాలు చేస్తోంది. 'ఆడుదాం-ఆంధ్ర' పేరుతో దాదాపు 43 రోజులపాటు రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించే ఈ మెగా టోర్నీకి ఊరూవాడా ముస్తాబవుతున్నాయి. ఈ భారీ క్రీడా పండుగ నిమిత్తం ప్రభుత్వం ఈనెల 27 నుంచి గ్రామ/వార్డు సచివాలయాల వారీగా క్రీడాకారుల రిజిస్ట్రేషన్ ప్రక్రియను ప్రారంభించనుంది. వలంటీర్ల ద్వారా ఇంటింటికీ 'ఆడుదాం-ఆంధ్ర'పై ప్రచారం కల్పించడంతో పాటు ఆసక్తి ఉన్న క్రీడాకారుల వివరాలను నమోదు చేస్తుంది. ఇందు కోసం ప్రత్యేక యాప్‌తో పాటు వెబ్‌సైట్‌ను రూపొందిస్తోంది. ఇక పోటీలకు డిసెంబర్ 15 నుంచి వచ్చే ఏడాది జనవరి 26 వరకు షెడ్యూల్ ఖరారైంది. ఇందులోని ఐదు క్రీడాంశాల్లో రికార్డు స్థాయిలో 2.99 మ్యాచ్‌లు నిర్వహిస్తారు.

మూడు విధాలుగా రిజిస్ట్రేషన్ ప్రక్రియ..

- రాష్ట్రంలోని 15,004 గ్రామ/వార్డు సచివాలయాల వారీగా వలంటీర్లు ఈ పోటీలకు క్రీడాకారుల వివరాలను నమోదు చేయడంతోపాటు ప్రజలను క్రీడా మహోత్సవానికి ఆహ్వానిస్తారు.
- ఔత్సాహిక క్రీడాకారులు తమ పేరు, చిరునామా, ప్రాతినిధ్యం వహించే క్రీడల వివరాలను గుర్తింపు కార్డు ఐడీ/ఫోన్ నంబర్‌తో రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చు.
- ఒకటి కంటే ఎక్కువ క్రీడల్లో ప్రావీణ్యం ఉన్న క్రీడాకారులు ప్రాధాన్యత క్రమంలో పాల్గొనే క్రీడల వివరాలను అందించాలి.
- వలంటీర్ ఇంటికి వచ్చినప్పుడు లేదా క్రీడాకారులే నేరుగా తమ పరిధిలోని గ్రామ/వార్డు సచివాలయాన్ని సంప్రదించి పోటీలకు తమ వివరాలు ఇవ్వొచ్చు.
- వ్యక్తిగతంగానే కాకుండా ఒక గ్రూపుగా కూడా క్రీడాకారులు తమ జట్టును నమోదు చేసుకునే వెసులుబాటు కల్పిస్తున్నారు.
- ఇక ప్రభుత్వం తీసుకొచ్చే వెబ్‌సైట్ ద్వారా కూడా క్రీడాకారులు నేరుగా కూడా రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చు.

1.50 లక్షల మంది వలంటీర్లకు ప్రత్యేక శిక్షణ..

గ్రామ, వార్డు సచివాలయాల పరిధిలో ఐదు రకాల కాంపిటీటివ్ క్రీడాంశాలు, మూడు నాన్-కాంపిటీటివ్ క్రీడాంశాల్లో పోటీలు జరుగుతాయి. వీటిల్లో 15 ఏళ్లకు పైబడిన బాలబాలికలకు క్రికెట్, వాలీబాల్, కబడ్డీ, ఖోఖో, బ్యాడ్మింటన్ క్రీడలతో పాటు సాంప్రదాయ యోగా, టెన్నీకాయిట్, మారథాన్ పోటీలను నిర్వహిస్తున్నారు. ఐదు దశల్లో అంటే.. గ్రామ/వార్డు సచివాలయం, మండలం, నియోజకవర్గం, జిల్లా, రాష్ట్రస్థాయిలో ఈ పోటీలను చేపట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణ రూపొందించింది. ఇందులో భాగంగానే ప్రతి సచివాలయం నుంచి 10 మంది వలంటీర్లను ఎంపిక చేసింది. సుమారు 1.50 లక్షల మంది వలంటీర్లకు క్రీడాంశాల నిర్వహణపై పీఈటీ, పీడీలతో జిల్లా చీఫ్ కోచ్‌ల సహాయంతో ఆన్‌లైన్‌లో ఆంధ్రప్రదేశ్ క్రీడా ప్రాధికార సంస్థ (శాప్) ప్రత్యేక శిక్షణనిస్తోంది. 15,004 గ్రామ/వార్డు సచివాలయాల పరిధిలో ఐదు క్రీడాంశాల్లో బాలబాలిక విభాగాల్లో ఒక్కొక్క జట్టు చొప్పున లెక్కిస్తే 228 మంది పాల్గొంటారు. ఇలా మొత్తం 34.20లక్షల మంది క్రీడాకారుల ప్రాతినిధ్యం వహిస్తారని అంచనా. సచివాలయం పరిధిలో ఒకటికి మించి ఎక్కువ జట్లు వస్తే క్రీడాకారుల సంఖ్య భారీగా పెరుగుతుంది.

ప్రతిభగల క్రీడాకారులకు ప్రోత్సాహం..



యువతను క్రీడల వైపు ప్రోత్సహించడంతో పాటు ఆరోగ్యకర సమాజానికి రాష్ట్ర ప్రభుత్వం కృషిచేస్తోంది. ఆడుదాం-ఆంధ్ర పేరుతో నిర్వహించే ఈ మెగా టోర్నీని దేశంలోనే అతిపెద్ద క్రీడా టోర్నీగా నిలబెడతాం. దీనిద్వారా ఐదు క్రీడాంశాల్లో క్రీడాకారుల సమగ్ర వివరాలు ప్రభుత్వం దగ్గర ఉంటాయి. తద్వారా ప్రతిభగల క్రీడాకారులకు అవసరమైన క్రీడా శిక్షణ, ప్రోత్సాహాన్ని అందించడానికి ఎంతో వీలుంటుంది. ప్రతి క్రీడాంశాన్ని సమర్థవంతంగా నిర్వహించేందుకు పీఈటీలు, పీడీలు, శాప్ కోచ్‌లతో పాటు వలంటీర్లను భాగస్వాములను చేస్తున్నాం. రిజిస్ట్రేషన్ కోసం యాప్, వెబ్‌సైట్‌ను దాదాపు సిద్ధంచేశాం. క్రీడాకారులు వీలైనంత త్వరగా వివరాలు నమోదు చేసుకోవాలి.

– ధ్యాన్‌చంద్, ఎండీ, ఆంధ్రప్రదేశ్ క్రీడా ప్రాధికార సంస్థ

వివిధ స్థాయిల్లో పోటీల నిర్వహణ ఇలా..

- **గ్రామ/వార్డు సచివాలయం:** డిసెంబర్ 15 నుంచి 20 వరకు
- **మండల స్థాయి :** డిసెంబర్ 21 నుంచి జనవరి 4 వరకు
- **నియోజకవర్గం :** జనవరి 5 నుంచి 10 వరకు
- **జిల్లా స్థాయి :** జనవరి 11 నుంచి 21వరకు
- **రాష్ట్రస్థాయి :** జనవరి 22 నుంచి 26 వరకు

23 నుంచి జర్నలిస్టుల దరఖాస్తుల స్వీకరణ

ఇళ్ల స్థలాలకు దరఖాస్తు కోసం జనవరి 6 వరకు గడువు

సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని జర్నలిస్టుల ఇళ్ల స్థలాలకు సంబంధించిన దరఖాస్తులను ఆన్‌లైన్ ద్వారా ఈ నెల 23 నుంచి స్వీకరించనున్నట్టు సమాచార, పౌర సంబంధాల శాఖ కమిషనర్ తుమ్మా విజయ్‌కుమార్‌రెడ్డి మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. మీడియా సంస్థల్లో పని చేస్తున్న అక్రిడిటేడెట్ జర్నలిస్టులకు మూడు సెంట్ల చొప్పున ఇళ్ల స్థలాలు ఇచ్చేందుకు ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. అర్హులైన జర్నలిస్టులు ఇళ్ల స్థలాల కోసం http://ipr.ap.gov.in వెబ్‌సైట్‌లో వివరాలను నమోదు చేసుకోవాలని సూచించారు. గురువారం నుంచి వెబ్‌సైట్ అందుబాటులోకి వస్తుందని.. అప్పటి నుంచి 45 రోజుల్లోగా (జనవరి 6వ తేదీ) ఆన్‌లైన్‌లో దరఖాస్తులు సమర్పించాలన్నారు. జర్నలిస్టులకు కేటాయిస్తున్న ఇళ్ల స్థలం విలువలో 60 శాతం ప్రభుత్వం, 40 శాతం జర్నలిస్టులు చెల్లించాలన్నారు. ఇప్పటికే సరైన స్థలాలను గుర్తించేందుకు వీలుగా వారంలోగా జిల్లా కమిటీలను ఏర్పాటు చేయాలని కలెక్టర్లను కోరినట్టు తెలిపారు.

ప్రైవేటు స్కూళ్లకు ఆఫ్‌లైన్‌లో అనుమతులు

సాక్షి, అమరావతి: ప్రైవేటు స్కూళ్ల గుర్తింపు, అదనపు విభాగాల మంజూరుకు యాజమాన్యాలు ఆఫ్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునేందుకు పాఠశాల విద్యా శాఖ అవకాశం కల్పించింది. ఇది 2024–25 విద్యా సంవత్సరానికి మాత్రమే వర్తిస్తుంది. అలాగే ప్రభుత్వ గుర్తింపును మూడేళ్ల కాలపరిమితి నుంచి ఎనిమిదేళ్లకు పెంచింది. ప్రైవేటు విద్యాసంస్థలు ప్రభుత్వ అనుమతుల కోసం డిసెంబర్ 31లోగా దరఖాస్తు చేసుకోవాలని విద్యా శాఖ కమిషనర్ ఎస్.సురేశ్‌కుమార్ సూచించారు. గతంలో పాఠశాల ఏర్పాటు చేయాలన్నా, ఉన్నవి నడపాలన్నా అగ్నిమాపక శాఖ, మున్సిపల్, పంచాయతీరాజ్, వైద్య శాఖ, రోడ్లు–భవనాల శాఖ, రిజిస్ట్రేషన్ శాఖ, రవాణా శాఖల నిరభ్యంతర పత్రాలు తప్పనిసరి. ఈ నేపథ్యంలో పాఠశాల విద్యా శాఖ సింగిల్ విండో ఆన్‌లైన్ పోర్టల్ https:// cse. ap. gov. in/ PSIS అందుబాటులోకి తెచ్చింది. యాజమాన్యాలు ఈ వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకుంటే.. ప్రభుత్వ విభాగాలు పరిశీలించి అనుమతులు మంజూరు చేస్తాయి.

బోట్ల వెలికితీతకు వీపీఏ సన్నద్ధం

- పనుల్లో నిమగ్నమైన పోర్టు అథారిటీ అధికారులు
- వెలికితీత పూర్తయ్యే వరకు హార్బర్‌లో బోట్ల రాకపోకలకు బ్రేకు



ఫిషింగ్ హార్బర్‌లో కాలిపోయి మునిగిన బోట్లు

సాక్షి, విశాఖపట్నం/మహారాణిపేట(విశాఖ దక్షిణ): విశాఖ చేపల రేవులో జరిగిన అగ్ని ప్రమాదంలో కాలి, మునిగిపోయిన మెకనైజ్డ్ బోట్లను వెలికితీసేందుకు విశాఖ పోర్టు అథారిటీ (వీపీఏ) అధికారులు సన్నద్ధమవుతున్నారు. ఈ ప్రమాదంలో మొత్తం 45 బోట్లు దహనం అవ్వగా.. వాటిలో 36 పూర్తిగా కాలిపోయి నీట మునిగిపోయాయి. మరో తొమ్మిది పాక్షికంగా దెబ్బతిన్నాయి. మునిగిన బోట్లను బయటకు తీసేదాకా ఈ హార్బర్‌లోకి చేపల బోట్లు ప్రవేశించేందుకు వీలు పడదు. ఈ చేపలరేవులో 696 మెకనైజ్డ్ బోట్లు వేట సాగిస్తున్నాయి. సముద్రంలో వేటకు వెళ్లి తిరిగొచ్చిన బోట్లను హార్బర్‌లోని జెట్టీల్లో లంగరేసి ఉంచుతారు. ఇలా లంగరేసిన బోట్లే ఆదివారం రాత్రి అగ్ని ప్రమాదం బారిన పడ్డాయి. ఈ ప్రమాదం వల్ల హార్బర్‌లోకి బోట్ల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. మునిపోయిన ఒక్కో బోటు బరువు 10–12 టన్నుల వరకు ఉంటుంది. వీటిని తీయాలంటే అత్యాధునిక పరిజ్ఞానం కలిగిన క్రేన్లు అవసరం అవుతాయి. ఆ తరహా క్రేన్లు వీపీఏ వద్ద ఉన్నాయి. మునిగిన బోట్లను వెలికి తీసే ప్రక్రియ బుధవారం నుంచి చేపట్టనున్నారు. ఈ బోట్లతో పాటు వాటి అవశేషాలను పూర్తిస్థాయిలో బయటకు తీయడానికి మూడు, నాలుగు రోజుల సమయం పడుతుందని అంచనా వేస్తున్నారు. ప్రస్తుతం ఒకటో నంబర్ జెట్టీలో రోజూ చేపల వేలం జరుగుతోంది. బోట్లను బయటకు తీసేందుకు వీలుగా చేపల వేలం ప్రాంతాన్ని అక్కడకు సమీపంలో చేపలు ఎండబెట్టే ప్రదేశంలోకి గానీ, పాత ఆక్షన్ హాలు ప్రాంతానికి గానీ మార్పు చేయనున్నారు.

హార్బర్‌లో అగ్ని ప్రమాదంపై కమిటీ

ఫిషింగ్ హార్బర్‌లో అగ్ని ప్రమాదంపై కలెక్టర్ ఎ.మల్లికార్జున ఐదుగురు సభ్యులతో కమిటీని నియమించారు. ఈ కమిటీలో విశాఖపట్నం ఆర్డీవో హుస్సేన్ సాహెబ్, హార్బర్ ఏసీపీ మోసెస్ పాల్, జిల్లా మత్స్యశాఖ అధికారి జి.విజయ, జిల్లా అగ్నిమాపక అధికారి, రీడింగ్ సైంటిఫిక్ సర్వీసెస్ లిమిటెడ్ (ఆర్‌ఎస్‌ఎస్‌ఎల్) అసిస్టెంట్ డైరెక్టర్ ఉన్నారు. ఈ కమిటీ అగ్ని ప్రమాదానికి కారణాలపై లోతుగా దర్యాప్తు చేసి బాధ్యులను గుర్తిస్తుంది. అలాగే ఈ ప్రమాదం వల్ల ఎంత మేర నష్టం వాటిల్లిందో కూడా అంచనా వేస్తారు. వీటన్నిటిపైన సమగ్రంగా విచారణ జరిపి రెండు రోజుల్లో కమిటీ నివేదిక ఇవ్వాలని కలెక్టర్ ఆదేశించారు.

అందుబాటులోకి ఆధునిక వైద్యం

ప్రభుత్వ రంగంలో గుండె సంబంధిత చికిత్సల బలోపేతానికి సీఎం జగన్ చర్యలు

సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ బోధనాస్పత్రుల్లో గుండె జబ్బులకు అత్యాధునిక చికిత్సలు అందించేందుకు సీఎం జగన్ ప్రభుత్వం సదుపాయాలు కల్పిస్తోంది. ఇందులో భాగంగా కర్నూలు, కాకినాడ జీజీహెచ్‌లలో క్యాథ్‌ల్యాబ్ సేవలు త్వరలో ప్రారంభం కానున్నాయి. ఒక్కోచోట రూ.6 కోట్ల చొప్పున నిధులను వెచ్చిస్తోంది. కర్నూలు జీజీహెచ్‌లో ఇప్పటికే క్యాథ్ ల్యాబ్ యంత్రాలు అమర్చడం పూర్తయింది. ఈ వారంలోనే ట్రయల్ రన్‌ను ప్రారంభించబోతున్నారు. కాకినాడ జీజీహెచ్‌లో యంత్రాలు అమర్చే ప్రక్రియ రెండు వారాల్లో పూర్తి కానుంది.

గుండె వైద్య సేవల విస్తరణ

మారిన జీవన విధానాలు, ఆహార అలవాట్ల కారణంగా చిన్న వయసు వారు సైతం గుండె జబ్బుల బారినపడుతున్నారు. గుండెపోటు బాధితులకు అత్యంత వేగంగా చికిత్స అందించడం ద్వారా మరణాల నియంత్రణపై సీఎం జగన్ ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ పెట్టింది. దీనికోసం ఎమర్జెన్సీ కార్డియాక్ కేర్ (ఈసీసీ) కార్యక్రమాన్ని కర్నూలు, గుంటూరు, తిరుపతి, విశాఖ జిల్లాల్లో పైలట్ ప్రాజెక్ట్‌గా అమలు చేస్తోంది. మరోవైపు పాత 11 జీజీహెచ్‌లలో అన్నిచోట్ల కార్డియాలజీ, కార్డియోథొరాసిక్ వాస్కులర్ సర్జరీ (సీటీవీఎస్) సేవలు విస్తరించడానికి చర్యలు తీసుకుంటున్నారు. 11 పాత వైద్య కళాశాలలు ఉండగా.. విశాఖపట్నం, కాకినాడ, విజయవాడ, గుంటూరు, అనంతపురం, కర్నూలు కళాశాలలకు అనుబంధంగా పనిచేస్తున్న జీజీహెచ్‌లలో కార్డియాక్, సీటీవీఎస్ విభాగాలు సేవలందిస్తున్నాయి. శ్రీకాకుళం, ఒంగోలు, నెల్లూరు, తిరుపతి, కడప జీజీహెచ్‌లలో కార్డియాలజీ, సీటీవీఎస్ విభాగాలను ప్రభుత్వం ఏర్పాటు చేస్తోంది. ఆయా విభాగాల ఏర్పాటు, సేవలు అందుబాటులోకి తేవడానికి వీలుగా 9 ప్రొఫెసర్, 9 అసోసియేట్, 7 అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులు కలిపి.. పర్ఫ్యూజనిస్ట్, క్యాథ ల్యాబ్, ఈసీజీ టెక్నీషియన్ ఇలా 94 పోస్టులను ఇప్పటికే మంజూరు చేశారు. ఈ ఐదు చోట్ల క్యాథ్ ల్యాబ్ ఏర్పాటుకు ఇప్పటికే డీఎంఈ ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపింది.



సమస్య నిర్ధారణ.. చికిత్సలో కీలకం

రక్తనాళాలు, హృదయ సంబంధిత సమస్యలను నిర్ధారించి.. చికిత్స నిర్వహించడంలో క్యాథ్ ల్యాబ్‌లదే ముఖ్య పాత్ర. గుండెపోటు సంబంధిత లక్షణాలున్న వారికి యాంజియోగ్రామ్ పరీక్షచేసి స్టెంట్ వేయడం, గుండె కొట్టుకోవడంలో సమస్యలున్న వారికి పేస్‌మేకర్ అమర్చడం క్యాథ్ ల్యాబ్ ద్వారానే చేపడతారు. ప్రభుత్వం హబ్ అండ్ స్పోక్ విధానంలో అమలు చేస్తున్న ఈసీసీ కార్యక్రమంలో క్యాథ్ ల్యాబ్ సౌకర్యం ఉన్న బోధనాస్పత్రులు హబ్‌లుగా వ్యవహరిస్తున్నాయి. వీటికి ఏపీవీవీపీ ఆస్పత్రులను అనుసంధానం చేసి గుండెపోటు లక్షణాలతో వచ్చే వారికి గోల్డెన్ అవర్‌లో చికిత్సలు అందిస్తున్నారు.

పూర్తిస్థాయిలో కార్డియాక్ కేర్



క్యాథ్ ల్యాబ్ ఏర్పాటుతో పూర్తిస్థాయి ఎమర్జెన్సీ కార్డియాక్ కేర్ ఆస్పత్రిగా కర్నూలు జీజీహెచ్ రూపాంతరం చెందింది. గుండెకు సంబంధించిన అన్నిరకాల వైద్య సేవలు ఇక్కడ అందుబాటులోకి వచ్చినట్టవుతుంది. రాయలసీమ వాసులకు వైద్యపరంగా పెద్దన్నగా వ్యవహరిస్తున్న ఆస్పత్రిలో పూర్తిస్థాయిలో క్యాథ్‌ల్యాబ్ కూడా అందుబాటులోకి రావడం శుభపరిణామం. ఇది పేద, మధ్యతరగతి ప్రజలకు ఎంతో మేలు చేకూరుస్తుంది.

– డాక్టర్ ప్రభాకర్‌రెడ్డి, సీటీవీఎస్ విభాగాధిపతి, కర్నూలు జీజీహెచ్

జాతీయ మీడియా అవార్డులకు దరఖాస్తుల ఆహ్వానం

- ఓటు హక్కు వినియోగంపై ప్రజలకు అవగాహన కలిగించిన వారికి అవార్డులు
- రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్‌కుమార్ మీనా వెల్లడి



సాక్షి, అమరావతి: ఓటు హక్కు వినియోగంపై ప్రజల్లో చైతన్యం, అవగాహన-2023 పేరుతో జాతీయ మీడియా అవార్డులను ప్రదానం చేసేందుకు భారత ఎన్నికల సంఘం దరఖాస్తులను ఆహ్వానించింది. ఈ విషయాన్ని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్‌కుమార్ మీనా మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రింట్ మీడియా, ఎలక్ట్రానిక్ మీడియా, ఆన్‌లైన్ రంగాల ద్వారా ఓటు హక్కు వినియోగంపై ప్రజల్లో చైతన్యం,అవగాహన పెంపొందించేందుకు ఉత్తమ కృషి చేసిన వారికి అవార్డులు అందిస్తున్నట్లు తెలిపారు. జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా వచ్చే ఏడాది జనవరి 25న ఈ అవార్డుల ప్రదానోత్సవం జరుగుతుందని చెప్పారు. అవార్డు కింద నగదు పురస్కారంతో పాటు ప్రశంసాపత్రం, జ్ఞాపిక అందజేయనున్నట్లు మీనా పేర్కొన్నారు. ఓటు హక్కు వినియోగంపై చైతన్యం, ఓటరుగా నమోదు, రిజిస్ట్రేషన్ తదితర అంశాలతో పాటు ఎన్నికలకు సంబంధించిన ఐటీ అప్లికేషన్లు, యూనిక్, రిమోట్ పోలింగ్ కేంద్రాలపై ప్రత్యేక కథనాలు ప్రచురించడం, ప్రసారం చేయడం ద్వారా ప్రజల్లో అవగాహనకు విశేష కృషి చేసిన మీడియా సంస్థలకు భారత ఎన్నికల సంఘం ఈ అవార్డులను ప్రదానం చేస్తుందని తెలిపారు. ఎంట్రీలను డిసెంబర్ 10లోగా media-division@eci. gov. in మెయిల్‌కు గానీ పంపించాలని స్పష్టం చేశారు.

కోస్ట్‌గార్డ్ రీజియన్ కమాండర్ బాధ్యతల స్వీకరణ



సింధియా(విశాఖ పశ్చిమ): చెన్నైలోని కోస్ట్‌గార్డ్ ఎయిర్‌స్టేషన్‌లో జరిగిన ఉత్సవ కవాతులో ఈస్టర్న్ కోస్ట్‌గార్డ్ రీజియన్ కమాండర్‌గా ఇన్‌స్పెక్టర్ జనరల్ డోనీ మైఖేల్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన చెన్నైలోని లయోలా కళాశాలలో గ్రాడ్యుయేషన్ పూర్తి చేసి 1990 జులై 6వ తేదీన ఇండియన్ కోస్ట్‌గార్డ్‌లో చేరారు. ఎన్‌డీ స్కూల్ కొచ్చి నుంచి నావిగేషన్ అండ్ డైరెక్షన్‌లో స్పెషలిస్ట్ కోర్సును పూర్తి చేసి, ఇండియన్ నేవల్ అకాడమీలో అకడమిక్ ఎక్స్‌లెన్స్ కోసం అనేక అవార్డులు గెలుచుకున్నారు.

రత్నగిరికి నేటి నుంచి భక్తజన తాకిడి

వరుసగా ఆరు రోజులపాటు పర్వదినాలు

30 వేలకు పైగా వ్రతాలు జరిగే అవకాశం

తెప్పోత్సవానికి చురుకుగా సన్నాహాలు



పశ్చిమ రాజగోపురం వద్ద భక్తుల సందడి



సత్యదేవుని తెప్పోత్సావానికి సిద్ధమవుతున్న హంస వాహనం

అన్నవరం: రత్నగిరి సత్యదేవుని ఆలయానికి బుధవారం నుంచి ఆరు రోజుల పాటు భక్తులు పోటెత్తనున్నారు. సోమవారం వరకు వరుసగా పర్వదినాలు రావడమే దీనికి కారణం. బుధవారం కార్తిక శుద్ధ దశమి, గురువారం ఏకాదశి, శుక్రవారం క్షీరాబ్ది ద్వాదశి, శనివారం, ఆదివారం పర్వదినాలు, సోమవారం కార్తిక పౌర్ణమ సత్యదేవుని గిరిప్రదక్షిణ కావడంతో భక్తులు ఎక్కువ సంఖ్యలో తరలి రానున్నారు. దీంతో ఆ మేరకు దేవస్థానంలో విస్తృత ఏర్పాట్లు చేస్తున్నారు.

తెల్లవారుజామునుంచి వ్రతాలు

భక్తుల తాకిడిని దృష్టిలో పెట్టుకుని సత్యదేవుని దర్శనం, వ్రతాల నిర్వహణ తెల్లవారుజాము నుంచి ప్రారంభించనున్నారు. స్వామివారి వ్రతాల టిక్కెట్లు తెల్లవారుజామున ఒంటి గంట నుంచి విక్రయిస్తారు. తెల్లవారుజామున రెండు గంటల నుంచి వ్రతాలు నిర్వహించనున్నారు. తెల్లవారుజామున మూడు గంటల నుంచి భక్తులను దర్శనానికి అనుమతిస్తారు. స్వామివారి నిత్య కల్యాణమండపం, పాత కల్యాణ మండపంలో కూడా వ్రతాల నిర్వహణకు ఏర్పాట్లు చేశారు. సత్యదేవుని నిత్యాన్నదాన పథకం వద్ద రోజూ పది వేల మందికి ఉచితంగా పులిహోర, దద్ధోజనం పంపిణీ చేయడానికి ఏర్పాట్లు చేస్తున్నారు.

ప్రసాదం, వ్రతాల టిక్కెట్లు కౌంటర్లు:

పశ్చిమ రాజగోపురం ఎదురుగా, విశ్రాంతి షెడ్డు ముందు భాగంలోకి ప్రసాదం, వ్రతాల టిక్కెట్లు విక్రయించే కౌంటర్లు మార్చారు. గతంలో ఇవి విశ్రాంతి షెడ్డు చివరలో ఏర్పాటు చేయడంతో భక్తులు తీవ్ర ఇబ్బంది పడ్డారు. దీంతో ఈఓ కే రామచంద్రమోహన్ వీటిని ముందు భాగంలో ఏర్పాటు చేయాలని ఆదేశించారు. కాగా, మంగళవారం సుమారు 20 వేల మంది భక్తులు సత్యదేవుని దర్శించి పూజలు చేశారు. స్వామివారి వ్రతాలు 1,500 జరిగాయి. సత్యదేవుని దర్శించిన భక్తులు సప్తగోకులంలో గోప్రదక్షిణ నిర్వహించి శ్రీకృష్ణునికి పూజలు చేశారు. అన్ని విభాగాల ద్వారా దేవస్థానానికి రూ.20 లక్షలు ఆదాయం వచ్చినట్లు అధికారులు తెలిపారు. దేవస్థానం ఈఓ కే రామచంద్రమోహన్ దేవస్థానంలో ఏర్పాట్లు పరిశీలించి సిబ్బందికి తగు సూచనలిచ్చారు.

తెప్పోత్సవానికి చురుకుగా ఏర్పాట్లు

శుక్రవారం క్షీరాబ్ది ద్వాదశి పర్వదినం సందర్భంగా పంపా నదిలో సత్యదేవుని తెప్పోత్సవం ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. దేవస్థానం సిబ్బంది తెప్పను హంస వాహనంగా అలంకరిస్తున్నారు. పంపా నదిలో ఇరిగేషన్ సిబ్బంది ట్రయల్ రన్ నిర్వహించగా ఎటువంటి సమస్యలు తలెత్తలేదని ఇరిగేషన్ అసిస్టెంట్ కే శ్రీదేవి తెలిపారు. ప్రస్తుతం పంపా నదిలో నీటిమట్టం 92 అడుగులు ఉందన్నారు. ఆయకట్టుకు నీటి విడుదల నిలుపుదల చేశామని 24వ తేదీకి పంపా నీటిమట్టం మరో రెండు అడుగులు పెరిగే అవకాశం ఉందని వివరించారు.

Published and printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published from Vishnu Motor Plaza, 2nd Floor, 31-A, Jawaharlal Nehru Road, Ekkattuthangal, Chennai -600 032 and Printed Jagati Publications Limited, Survey No.172, Vegata Village, Jadigenalhalli, Hoskote Taluk,Bangaluru Rural Dist, MNS Printers Private Limited, Survey no. 76/1, Noombal Village, Velappanchavadi, Poonamallee High Road, Chennai - 600 077. Impression Printing & Packaging Limited, C-18-19-20, Sector -59, Noida, Uttar Pradesh-201 301, Dangat Media Pvt Ltd.,22 Dighe MIDC, Navi Mumbai, Maharashtra- 400708.
Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) RNI No:TNTEL/2008/25943

క్లుప్తంగా

తాగునీటి ఎద్దడి రానివ్వం


చెరువును పరిశీలిస్తున్న అధికారులు

రాయచూరు రూరల్: జిల్లాలోని మాన్వి తాలూకా కల్లూరులో తాగునీటి ఎద్దడి నివారిస్తామని జెడ్పీ అభివృద్ధి అధికారి ప్రకాష్ పేర్కొన్నారు. మంగళవారం కల్లూరులోని చెరువును పరిశీలించి ఆయన జీపీ సభ్యులతో కలిసి పరిశీలించి మాట్లాడారు. తుంగభద్ర ఎడమ కాలువకు నీటిని విడిచినందున పోలీస్ బందోబస్తు మధ్య చెరువులోకి నీరు నింపాలని జిల్లాధికారి ఆదేశించారన్నారు. మరో చెరువు నిర్మాణానికి గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో పనులు చేపడతామన్నారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు సంగప్పగౌడ, సభ్యులు శివకుమార్, వెంకటేష్, అధికారులు శరణప్ప, రవి, మల్లప్పలున్నారు.

నియామక పత్రాల కోసం ఎదురుచూపులు

రాయచూరు రూరల్: జిల్లాలో 250 మంది ఉపాధ్యాయ నియామకాలకు జిల్లా విద్యా శాఖాధికారులు ఇంటర్వ్యూలు నిర్వహించారు. అయితే ఇంతవరకు నియామక పత్రాలను అందించక పోవడంతో పోస్టింగ్ ఆదేశ పత్రాల కోసం భావి ఉపాధ్యాయులకు ఎదురుచూపులు తప్పడం లేదు. మంగళవారం డీడీపీఐ కార్యాలయం వద్ద నాలుగు రోజుల పాటు కౌన్సిలింగ్ చేసిన అధికారులు ఆదేశపత్రాలు ఇవ్వడానికి అభ్యర్థుల రికార్డుల పరిశీలనకు కొంత సమయం పడుతుందని చెప్పడంతో ఉపాధ్యాయులు వేచి చూస్తున్నారు.

ఉపకార వేతనాలు చెల్లించరూ..


వినతిపత్రం సమర్పిస్తున్న కార్యకర్తలు

రాయచూరు రూరల్: రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థులకు ఉపకార వేతనాలు చెల్లించడానికి వెనుకడుగు వేస్తోందని ఏఐడీఎస్ఓ ఆరోపించింది. మంగళవారం టిప్పుసుల్తాన్ ఉద్యానవనంలో చేపట్టిన ఆందోళననుద్దేశించి అధ్యక్షుడు అయ్యాళప్ప మాట్లాడారు. కట్టడ కార్మికుల, ఇతర వర్గాల విద్యార్థులకు రూ.5 వేల నుంచి రూ.60 వేల వరకు వచ్చే ఉపకారవేతనాన్ని కేవలం రూ.1100 నుంచి రూ.11 వేలకు కుదించారన్నారు. కళాశాలల్లో చదవడానికి ఫీజుల భారంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. తగ్గించిన శిష్య వేతనాన్ని పెంచాలని, బకాయి వేతనాలను చెల్లించాలని కోరుతూ స్థానికాధికారికి వినతిపత్రం సమర్పించారు.

మురుఘస్వామికి ఊరట


శివాజీనగర: రెండు పోక్సో కేసుల్లో అరెస్టులు, రిమాండులు ఎదుర్కొంటున్న చిత్రదుర్గ మురుఘ స్వామికి ఊరట దక్కింది. కేసుల విచారణపై హైకోర్టు స్టే జారీ చేయడంతో ఆయనకు బెయిలు దక్కింది. సోమవారం సాయంత్రం దావణగెరెలో ఆయనను అరెస్టు చేసిన చిత్రదుర్గం పోలీసులు స్టే జారీ కావడంతో విడుదల చేశారు.

కారు, లారీ ఢీ


ఘటనాస్థలంలో దృశ్యం

కంప్లి: విజయనగర జిల్లా మరియమ్మనహళ్లి గ్రామ సమీపాన ఉన్న ఎస్ఎల్ఆర్ కర్మాగారానికి వెళ్లే మార్గం వద్ద సోమవారం రాత్రి లారీ, కారు నడుమ రోడ్డు ప్రమాదం సంభవించింది. అయితే ఎవరికీ ఎలాంటి ప్రాణహాని జరగలేదు. కర్మాగార మార్గం మీదుగా వెళుతున్న లారీ ప్రధాన మార్గం మీదుగా వస్తున్న కారు పరస్పరం ఢీకొన్నాయి. విషయం తెలిసిన వెంటనే మరియమ్మనహళ్లి పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించి కేసు దర్యాప్తు ప్రారంభించారు.

పండరీపురానికి పాదయాత్ర


పాదయాత్రలో పాల్గొన్న భక్తులు

గంగావతి: పాండురంగ రుక్మిణి సేవా సంఘం ఆధ్వర్యంలో ప్రప్రథమంగా మంగళవారం కారటగి పట్టణం నుంచి పండరీపురానికి పాదయాత్రను చేపట్టారు. ముందుగా పట్టణంలోని వెంకటేశ్వర స్వామి దేవస్థానంలో విశేష పూజ, ధార్మిక కార్యక్రమాలను నెరవేర్చి పాదయాత్రను ప్రారంభించారు. భక్తులు మాట్లాడుతూ మంచి వర్షాలు కురిసి సమృద్ధిగా పంటలతో వర్ధిల్లాలనే సంకల్పంతో పాదయాత్రను చేపట్టామన్నారు. 30 మందికి పైగా మహిళలు, 40 మందికి పైగా పురుషులు పాదయాత్రలో పాల్గొనగా, పట్టణ ప్రముఖులు వీడ్కోలు పలికారు.

ఎండిన పంటలు..రైతన్న దిగాలు


వర్షాలు లేక నీరందక వాడుముఖం పట్టిన జొన్న పైరు


పంటనష్టం పరిశీలించిన అధికారులు, నాయకులు(ఫైల్)

- వానలు కురవక మెట్ట పంటలు వెలవెల
- విద్యుత్ కోతలతో రైతులు ఉక్కిరిబిక్కిరి

రాయచూరు రూరల్: ఆకాశంలో మబ్బులు కమ్ముకుంటున్నా వరుణుడి జాడ కానరాక గ్రామీణ ప్రాంతాల్లో మెట్ట పంటలు ఎండిపోయి రైతుల ముఖాల్లో కళ కరువైంది. ఈసారి ఖరీఫ్ సీజన్‌లో కళ్యాణ కర్ణాటక ప్రాంతంలోని రాయచూరు, యాదగిరి, కొప్పళ, బీదర్, కలబుర్గి జిల్లాలు కరువు ప్రాంతాలుగా మారాయి. రాయచూరు, కొప్పళ, యాదగిరి, కలబుర్గి జిల్లాల్లోని నదుల్లో నీరు అంతంత మాత్రంగానే ఉన్నాయి. దీంతో రైతులు తమ పొలాల్లో వేసుకున్న జొన్న పంట నీరందక వాడుముఖం పట్టింది. పొలంలో బోరుబావుల ద్వారా పంటలు పండించాలంటే భూగర్భ జలాల స్థాయి కుదించుకుపోయింది. మరో వైపు రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసిన 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ పథకంతో అన్నదాతలకు సరఫరా చేసే విద్యుత్‌లో కోతలు అధికమయ్యాయి.

కూలీకార్మికులకు తప్పని వలస బాట

జిల్లాలో తుంగభద్ర, కృష్ణా నదులున్నా వ్యవసాయ పనులు లభించక కూలికార్మికులకు ఉపాధి కోసం వలస బాట పట్టక తప్పలేదు. రైతులు జిల్లాలో 3 లక్షల ఎకరాల్లో జొన్న, లక్షా 50 వేల ఎకరాల్లో పత్తి, 1.86 లక్షల ఎకరాల్లో మిరప పంటలు వేశారు. పంట నష్టంపై అధికారులు, పాలకులు తూతూమంత్రంగా పరిశీలనలు చేస్తున్నారే తప్ప కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నష్టపరిహారం అందించడం లేదు. ఈ ప్రాంతం నుంచి ఎన్నికైన ప్రజా ప్రతినిధుల్లో సాగునీటి ప్రాధాన్యతను పెంపొందించే ఎలాంటి కొత్త పథకాలను ప్రారంభించాలనే తపన ఏ ఒక్కరి మదిలో లేకపోవడం విడ్డూరంగా ఉందని చెప్పవచ్చు. అధికారం కోసం తహతహలాడే నేతలు వాతావరణ మార్పులతో రైతన్నలు పడుతున్న ఇబ్బందులను నివారించడంలో మాత్రం మౌనం వహిస్తున్నారు.

నేటి నుంచి అంబిగర చౌడయ్య ఉత్సవాలు


మాట్లాడుతున్న శాంతప్ప

రాయచూరు రూరల్: తాలూకాలోని హీరాపురలో బుధవారం నుంచి అంబిగర చౌడయ్య ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు సంఘం జిల్లాధ్యక్షుడు శాంతప్ప పేర్కొన్నారు. ఆయన మంగళవారం పాత్రికేయుల భవనంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. గ్రామంలో రెండు రోజుల పాటు జరిగే ఉత్సవ కార్యక్రమాల్లో నిజశరణ అంబిగర చౌడయ్య పంచలోహ విగ్రహ ప్రతిష్ఠాపన, శిలా మంటపాలను ప్రారంభిస్తున్నట్లు ఆయన తెలిపారు.

బస్సు ఢీకొని పాదచారి మృతి

హుబ్లీ: రోడ్డును దాటుతున్న వ్యక్తి ఆర్టీసీ బస్సు ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందిన ఘటన మంగళవారం తాలూకాలోని శిరగుప్పి గ్రామం వద్ద హైవేపై చోటు చేసుకుంది. మృతుడిని ఆ గ్రామ నివాసి సునీల్ నాయకర(49)గా గుర్తించారు. హుబ్లీ నుంచి గదగ్‌కు వెళుతున్న సదరు బస్సు రోడ్డు దాటుతున్న సునీల్‌ను అదుపు తప్పి ఢీకొంది. ఫలితంగా తీవ్రంగా గాయపడిన ఆయన అక్కడికక్కడే మృతి చెందాడు. ఘటనపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టినట్లు హుబ్లీ రూరల్ పోలీసులు తెలిపారు.

3న ఆన్‌లైన్ కామర్స్ ఒలింపియాడ్ పరీక్ష


మాట్లాడుతున్న సీఏ పన్నారాజ్

బళ్లారి రూరల్: జిల్లా వ్యాప్తంగా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ చార్టెడ్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా(ఐసీఏఐ) ఆధ్వర్యంలో డిసెంబర్ 3న జిల్లాలో 8వ తరగతి నుంచి డిగ్రీ వరకు చదువుతున్న విద్యార్థులకు ఆన్‌లైన్‌లో కామర్స్ ఒలింపియాడ్ పరీక్ష జరుపుతున్నట్లు దక్షిణ చార్టెడ్ అకౌంటెంట్స్ సంఘం అధ్యక్షుడు సీఏ పన్నారాజ్ తెలిపారు. మంగళవారం పార్వతీనగర్‌లోని గౌరీ హళ్లిమనెలో ఏర్పాటు చేసిన పత్రికా సమావేశంలో ఆయన మాట్లాడారు. పరీక్షలో పాల్గొనగోరు విద్యార్థులు పేరు నమోదు చేసుకోడానికి ఈనెల 27 వరకు గడువు ఇచ్చినట్లు తెలిపారు. ఐసీఏఐ ఆధ్వర్యంలో ఈ పరీక్ష నిర్వహించడం దేశంలోనే మొదటిసారన్నారు. గతంలో డిగ్రీలో 50 శాతం మార్కులు పొందిన వారికే సీఏ పరీక్ష రాసేందుకు అర్హత ఉండేదన్నారు. బీకాం పూర్తి చేసిన విద్యార్థులు సీఏ చేయడానికి వేచి ఉండాల్సి వచ్చేదన్నారు. ఇప్పుడు సీఏ కోర్సులో ప్రవేశానికి పీయూసీ నుంచే బీజం పడిందన్నారు. జిల్లాలోని ప్రతి పాఠశాలకు ఒలింపియాడ్ పరీక్ష గురించి తెలిసేలా డీడీపీఐ ద్వారా చర్యలు తీసుకొంటున్నామన్నారు. 10వ తరగతి వరకు సోషియల్, మ్యాథ్స్, బిజినెస్ అవేర్‌నెస్, ఆప్టిట్యూడ్ సబ్జెక్ట్‌లపై పరీక్ష ఉంటుందన్నారు. ఇంటర్, డిగ్రీ విద్యార్థులకు బిజినెస్ స్టడీస్, అకౌంటెన్సీ, ఎకనామిక్స్, ఆప్టిట్యూడ్ సబ్జెక్ట్‌లపై 100 మార్కులకు గాను 50 మార్కులను అర్హతగా నిర్ణయించినట్లు తెలిపారు. ఈసందర్భంగా జిల్లా ఐసీఏఐ ప్రముఖులు నాగనగౌడ, వెంకటనారాయణ, పురుషోత్తమరెడ్డి, రాజశేఖర్, విశ్వనాథాచార్ తదితరులు పాల్గొన్నారు.

నేడు బసవేశ్వర విగ్రహావిష్కరణ


మాట్లాడుతున్న కొట్టూరు బసవలింగ స్వామీజీ


ప్రారంభానికి సిద్ధంగా ఉన్న బసవేశ్వర విగ్రహం

హొసపేటె: కొట్టూరుస్వామి సంస్థానమఠం సంగనబసవ స్వామీజీ స్వర్ణ మహోత్సవం సందర్భంగా బుధవారం నగరంలోని సిద్ధిప్రియ కళ్యాణ మంటపం వద్ద విశ్వగురు బసవేశ్వరుడి అశ్వారూఢ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్నట్లు కొట్టూరు స్వామి సంస్థాన మఠం కొట్టూరు బసవలింగ స్వామీజీ తెలిపారు. మంగళవారం నగరంలోని మఠం ఆవరణలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఉదయం 10 గంటలకు నగరంలో బసవేశ్వర విగ్రహాన్ని అటవీ శాఖా మంత్రి ఈశ్వర్ ఖండ్రే చేతుల మీదుగా ప్రారంభిస్తామన్నారు. ఈ కాంస్య విగ్రహావిష్కరణలో విజయనగర జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి బీజే జమీర్ అహ్మద్‌ఖాన్, ఎమ్మెల్యే హెచ్ఆర్.గవియప్ప, ఎమ్మెల్యే వినయ్ కులకర్ణితో పాటు వివిధ జిల్లాలకు చెందిన ఎమ్మెల్సీలు, ప్రజాసంఘాల నాయకులు పాల్గొంటారన్నారు. సుమారు 12 అడుగుల ఎత్తైన ఈ విగ్రహాన్ని బెంగళూరుకు చెందిన శివకుమార్ అనే శిల్పి తయారు చేశారన్నారు. నగరంలోని మఠం ఆవరణలో నిర్మించిన నూతన శిలామాత, ఇతర అభివృద్ధి పనులను కూడా ఈనెల 23న ప్రారంభిస్తున్నట్లు ఆయన తెలిపారు.

20 టీఎంసీలకు చేరిన టీబీ డ్యాం నీటి నిల్వ


తుంగభద్ర జలాశయం

బొమ్మనహాళ్: హొసపేటె వద్దనున్న తుంగభద్ర జలాశయంలో నీటిమట్టం 20 టీఎంసీలకు పడిపోయింది. గతేడాది ఇదే సమయానికి డ్యాంలో రికార్డుస్థాయిలో 96 టీఎంసీల నీరు నిల్వ ఉండేది. ఈ ఏడాది తీవ్ర కరువు వల్ల జలాశయం వెలవెలబోతోంటే రైతుల్లో తీవ్ర ఆందోళన నెలకొంది. ఇన్‌ఫ్లో 298 క్యూసెక్కులు ఉండగా, అవుట్‌ఫ్లో 9,642 క్యూసెక్కులుగా ఉంది.

జనం మార్పు కోరుతున్నారు

- రెవెన్యూ మంత్రి కృష్ణబైరేగౌడ


సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి కృష్ణబైరేగౌడ

సాక్షి,బళ్లారి: పదేళ్లుగా కేంద్రంలో బీజేపీ అధికారంలో ఉన్నా దేశాభివృద్ధికి చేసిందేమీ లేదని, ఈ నేపథ్యంలో దేశంలో జనం మార్పు కోరుతున్నారని రాష్ట్ర రెవెన్యూ శాఖా మంత్రి కృష్ణబైరేగౌడ అన్నారు. ఆయన మంగళవారం నగరంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. మొన్న జరిగిన కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల్లో 5 గ్యారెంటీలను అమలు చేయడం వల్లే ప్రజలు పార్టీకి బ్రహ్మరథం పట్టారన్నారు. అదే తరహాలో దేశ వ్యాప్తంగా పేద ప్రజలను ఆకట్టుకొనేందుకు వారి సంక్షేమం కోసం కర్ణాటకలో అమలు చేసిన పథకాలకు తోడు మరిన్ని అమలు చేసి కాంగ్రెస్ పార్టీకి జనం మద్దతు పలికే విధంగా కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. కర్ణాటక పథకాలను దేశ వ్యాప్తంగా అన్ని రాష్ట్రాల్లో ప్రజలు మెచ్చుకుంటున్నారని గుర్తు చేశారు. రాబోయే ఎన్నికల్లో తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ ఘన విజయం సాధించనుందన్నారు. అదే విధంగా ఛత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్, రాజస్తాన్‌లో కూడా గెలుస్తుందన్న విశ్వాసం ఉందన్నారు. త్వరలో రాష్ట్రంలోని బోర్డులు, కార్పొరేషన్లకు కార్యకర్తలు, నాయకుల అభీష్టం మేరకు నూతన అధ్యక్షుల నియామకం జరుగుతుందన్నారు. రాష్ట్రంలో సీఎం, డీసీఎంలు కలిసికట్టుగా ఉమ్మడి నాయకత్వంలో ముందుకెళుతున్నారన్నారు. తమలో ఎలాంటి భేదాభిప్రాయాలు లేవన్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి కూడా బాగుందన్నారు. ప్రజల సంక్షేమ కోసం పార్టీ కట్టుబడి ఉందన్నారు. ఎమ్మెల్యే తుకారాం, డీసీసీ అధ్యక్షుడు మహమ్మద్ రఫిక్, మాజీ జెడ్పీ మెంబర్ అల్లం ప్రశాంత్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అధికారులు బాధ్యతగా పని చేయాలి

బళ్లారిటౌన్: జిల్లాలోని అధికారులు బాధ్యతగా పని చేయాలని రెవెన్యూ శాఖ మంత్రి కృష్ణబైరేగౌడ పేర్కొన్నారు. మంగళవారం జిల్లాధికారి కార్యాలయ సభాంగణంలో ఏర్పాటు చేసిన రెవెన్యూ శాఖ ప్రగతి పరిశీలన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇప్పటికే పంట నష్టంపై సమీక్ష జరిపి ఇంతవరకు 33 శాతం మేరకు పంట నష్టం జరిగినట్లు నివేదిక తయారు చేశారన్నారు. రైతులకు పంట నష్ట పరిహారాన్ని ఆన్‌లైన్ ద్వారానే చెల్లిస్తామన్నారు. అయితే కంప్యూటరీకరణ చేసిన వాటికి మాత్రమే పరిహారం లభిస్తుందన్నారు. దీనిపై రైతులకు ఆయా గ్రామ అధికారులు అవగాహన కల్పించాలని సూచించారు. పాణీతో పాటు ఆధార్ లింక్ చేయాలన్నారు. రాష్ట్రంలో 70 శాతం చిన్నకారు రైతులున్నారన్నారు. అయితే కేంద్ర ప్రభుత్వ పాత గణాంకాల ప్రకారం 44 శాతం మాత్రమే ఉన్నందున మిగిలిన వారికి పరిహారం అందడంలో అన్యాయం జరుగుతుందన్నారు. ఈసారి వర్షాలు సక్రమంగా కురవనందున తాగునీటి సమస్య ఉద్భవించకుండా ముందుజాగ్రత్త చర్యగా ఆయా తాలూకాల్లో ఎమ్మెల్యేల నేతృత్వంలో టాస్క్‌ఫోర్స్‌ను రచించి ప్రైవేట్ ట్యాంకర్ల ద్వారా తాగునీటి సరఫరా కల్పించాలని అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా కంప్లి ఎమ్మెల్యే గణేష్, రెవెన్యూ కమిషనర్ సునీల్‌కుమార్, జిల్లాధికారి ప్రశాంత్‌కుమార్ మిశ్రా పాల్గొన్నారు.

వేర్వేరు ఘటనల్లో నగదు వంచన

హుబ్లీ: అమెజాన్ కంపెనీ పేరిట ఫోన్ చేసిన గుర్తు తెలియని వ్యక్తి ఓ మహిళను నమ్మించి రూ.లక్ష వంచించిన ఘటన నగరంలో చోటు చేసుకుంది. ఇక్కడి జేపీ నగర్ నివాసి అనురాధ హెగ్డే బాధితురాలు. ఆమెకు ఫోన్ చేసిన సదరు వ్యక్తి అమెజాన్ కంపెనీ కస్టమర్ కేర్ నుంచి ఫోన్ చేస్తున్నట్లుగా ముందుగా నమ్మించాడు. ఈ క్రమంలో లింక్ పంపించి దీని ద్వారా ఇచ్చిన వస్తువు ఆర్డర్ గురించి సమాచారం తెలుసుకోవచ్చని నమ్మించి లింక్ డౌన్‌లోడ్ చేయించాడు. అనంతరం దశల వారీగా ఆమె బ్యాంక్ ఖాతా నుంచి రూ.లక్ష మేరకు నగదు బదలాయించుకున్నట్లు బాధితురాలు హుబ్లీ సైబర్ క్రైం పోలీసులుకు ఫిర్యాదు చేసింది. మరో ఘటనలో ఆన్‌లైన్‌లో పర్ఫ్యూమ్ ఆర్డర్ చేసిన వ్యక్తికి పిన్‌కోడ్ సరిగ్గా లేదు అంటూ ఫోన్ చేసిన గుర్తు తెలియని వ్యక్తి ఆ మేరకు లింక్ పంపించి దశల వారీగా రూ.99,500 బదలాయించుకొని వంచించిన ఘటన చోటు చేసుకుంది. స్థానిక ఇంతియాజ్ అనే వ్యక్తి బాధితుడు. ఆన్‌లైన్‌లో ఈయన పర్ఫ్యూమ్ ఆర్డర్ చేసిన వెంటనే అవతల నుంచి ఫోన్ చేసిన వ్యక్తి పిన్‌కోడ్ సరిగ్గా వేయలేదని నమ్మించాడు. దీన్ని సరిచేయడానికి లింక్ పంపించానని, దాన్ని డౌన్‌లోడ్ చేసుకోమంటూ మభ్యపెట్టి ఆ సదరు లింక్ ద్వారా పైమొత్తం నగదును బదలాయించుకున్నట్లు బాధితుడు సైబర్ క్రైం పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

ఉప కాలువకు అదనపు నీరు విడుదల


కాలువకు నీరు వదులుతున్న దృశ్యం

బళ్లారి అర్బన్: హెచ్ఎల్‌సీ కాలువ కింద పంటలు ఎండిపోకుండా మంగళవారం 14వ ఉప కాలువ రైతుల పొలాలకు నీరు విడుదల చేయించినట్లు తుంగభద్ర రైతు సంఘం అధ్యక్షుడు దరూరు పురుషోత్తంగౌడ తెలిపారు. కాలువకు అదనంగా నీరు విడుదల చేసిన సందర్భంగా ఆయన మాట్లాడారు. ఆయా గ్రామాలకు చెందిన వందలాది మంది రైతులతో కలిసి వెళ్లి జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి నాగేంద్ర, అధికారులతో మాట్లాడి కాలువ కింద పంటలు ఎండిపోకుండా శ్రీధరగడ్డ, మోకా, కప్పగల్లు తదితర గ్రామాలకు అనుకూలం చేశామన్నారు. కాలువకు అదనంగా నీరు విడుదల చేయడంతో రైతులు హర్షం వ్యక్తం చేశారు. ఈసందర్భంగా రైతు సంఘం నేతలు రంజాన్‌సాబ్, వీరభద్రరావు, వీరణ్ణగౌడ తదితరులు పాల్గొన్నారు.

నేత్ర పరీక్ష శిబిరం విజయవంతం


కంటి ఆపరేషన్లు నిర్వహించిన దృశ్యం

బళ్లారిఅర్బన్: తాలూకాలోని బెణకల్ గ్రామంలో బెళకు చారిటబుల్ ట్రస్ట్, బళ్లారి నేత్రాలయ, బళ్లారి హృదయాలయ, సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి సంయుక్త ఆధ్వర్యంలో కనక జయంతి సందర్భంగా కనక నౌకరుల సంఘం నేతృత్వంలో ఉచిత కంటి పరీక్ష శిబిరం నిర్వహించారు. శిబిరంలో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు 70 మంది నేత్ర పరీక్షలు చేయించుకున్నారు. వారిలో 11 మందికి కంటి ఆపరేషన్లను డాక్టర్ పరసప్ప బంద్రకళ్లి, డాక్టర్ సి.రోహిణి బృందం నిర్వహించి మందులు అందించారు. విమ్స్ నౌకరుల సంఘం వ్యవస్థాపకులు జి.రామచంద్ర, బెణకల్ గ్రామ ప్రముఖుడు, కంటి చికిత్స అధికారులు బండారు మంజునాథ, కే.శివ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అప్రెంటిస్ శిక్షణకు ఎంపిక


ఇంటర్వ్యూ నిర్వహిస్తున్న దృశ్యం

హొసపేటె: హగరిబొమ్మనహళ్లిలోని ప్రభుత్వ ఐటీఐలో మంగళవారం జరిగిన విజయనగర జిల్లా స్థాయి అప్రెంటిస్ మేళాలో 88 మంది అభ్యర్థులు అప్రెంటిస్ శిక్షణకు ఎంపికైనట్లు ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్, నోడల్ అధికారి మోహన్ తెలిపారు. మేళాను హగరిబొమ్మనహళ్లి ఎమ్మెల్యే కే.నేమిరాజ నాయక్ ప్రారంభించారు. వివిధ కంపెనీల పారిశ్రామిక ప్రతినిధులు హాజరయ్యారు. 105 మంది ఐటీఐ చదివిన విద్యార్థులకు ఇంటర్వ్యూలు నిర్వహించగా, వివిధ కంపెనీల్లో అప్రెంటిస్ శిక్షణకు ఎంపికయ్యారు. ప్రభుత్వ, ఎయిడెడ్, ప్రైవేట్ ఐటీఐల ప్రిన్సిపాళ్లు, సిబ్బంది పాల్గొన్నారు.

భూముల ధరలు తగ్గించాలి

రాయచూరు రూరల్: నగరంలో రాష్ట్ర ప్రభుత్వం పెంచిన భూముల ధరలను తగ్గించాలని కర్ణాటక రణధీర పడె డిమాండ్ చేసింది. మంగళవారం టిప్పుసుల్తాన్ ఉద్యానవనంలో చేపట్టిన ఆందోళనలో అధ్యక్షుడు ప్రదీప్ కుమార్ మాట్లాడారు. ప్రభుత్వం ఉన్నఫళంగా 80 శాతం నుంచి 600 శాతం పెంచిందన్నారు. ఇలాగైతే క్రయవిక్రయాలకు విఘాతం కలుగుతుందన్నారు. ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలను వాపస్ తీసుకొని పెంచిన ధరలను తగ్గించాలని కోరుతూ స్థానికాధికారికి వినతిపత్రం సమర్పించారు.

ఇంటి వద్దకే ఫారం-3 పత్రాలు


లబ్ధిదారులకు పత్రాలను అందిస్తున్న అధికారులు

హొసపేటె: జిల్లాధికారి దివాకర్ ఆదేశాల మేరకు విజయనగర జిల్లా కొట్టూరు పట్టణంలో మంగళవారం ఇంటింటికీ ఫారం–3 హక్కుపత్రాల పంపిణీ కార్యక్రమాన్ని అధికారులు చేపట్టారు. పట్టణంలోని రాజీవ్ నగర్‌లో ఆశ్రయ పథకం కింద పేదలు, మధ్య తరగతి వర్గాల ప్రజలు నిర్మించుకున్న ఇంటింటికీ వెళ్లి మొత్తం 25 మందికి ఫారం–3 హక్కుపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ బి.వీరేష్, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తి బలవన్మరణం


తిమ్మణ్ణ(ఫైల్)

కంప్లి: పట్టణ మాజీ యువజన కాంగ్రెస్ అధ్యక్షులు కే.తిమ్మణ్ణ(35) అనే వ్యక్తి మనస్తాపంతో ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మంగళవారం జరిగింది. అయితే అతని ఆత్మహత్యకు కారణాలు ఇంకా తెలియ రాలేదు. ఘటనపై పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సమాచారం.

క్రీడలతో శారీరక ఎదుగుదల


చెస్ పోటీలను ప్రారంభిస్తున్న శివమూర్తి

రాయచూరు రూరల్ : విలేకరులు వార్తలతో పాటు క్రీడలకు ప్రాధాన్యత కల్పించాలని సీనియర్ పాత్రికేయుడు శివమూర్తి అన్నారు. మంగళవారం రాయచూరు రిపోర్టర్స్ గిల్డ్ కార్యాలయంలో జాతీయ పత్రికా దినోత్సవం సందర్భంగా పాత్రికేయులకు ఏర్పాటు చేసిన చెస్, క్యారమ్ పోటీలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. మానసికంగా, శారీరకంగా ఎదగడానికి క్రీడలు అవసరమన్నారు. ఈ సందర్భంగా హనుమంతు, సురేష్ రెడ్డి, శ్రీకాంత్, శివకుమార్, నాగరాజ్, దేశాయిలున్నారు.

ప్రజల ఆశీస్సుల కోసమే వచ్చా

- నటుడు అభిషేక్ అంబరీష్


మాట్లాడుతున్న నటుడు అభిషేక్ అంబరీష్

హుబ్లీ: ఉత్తర కర్ణాటక ప్రజలు కళాకారులకు ఎనలేని గౌరవం ఇస్తారని కన్నడ సినీ నటుడు అభిషేక్ అంబరీష్ తెలిపారు. నగరంలో ఆయన మంగళవారం విలేకరులతో మాట్లాడారు. ఈ నెల 24న తాను హీరోగా నటించిన బ్యాడ్ మ్యానర్స్ అనే సినిమా సుమారు 300కు పైగా థియేటర్లలో విడుదల అవుతుందన్నారు. ఈ ప్రాంత ప్రజల ఆశీస్సులను తీసుకోవడానికే తాను ఇక్కడికి వచ్చానని వివరించారు. ఈ సినిమా మొత్తం కర్ణాటకలోనే షూటింగ్ జరిగిందన్నారు. ఈ చిత్రంలో ఉత్తర కర్ణాటక కళాకారులు కూడా నటించారన్నారు. ఒక సినిమాను పాన్ ఇండియా చేస్తామంటే చాలా కష్టం, పాన్ ఇండియా కన్నా మంచి సినిమా చేయాలి. సినిమా చూశాక ప్రేక్షకులు పాన్ ఇండియా సినిమానా కాదా నిర్ణయిస్తారన్నారు. దర్శకుడు సూరికి, తనకు పెద్ద ప్రేక్షక సైన్యమే ఉందన్నారు. ఆయనతో సినిమా చేయడం చాలా సంతోషకరమన్నారు. సినిమా ట్రైలర్ చూసిన కొందరు తన తండ్రి అంబరీష్‌ను అనుకరించినట్లుగా ఉందని అభిప్రాయపడ్డారన్నారు. తాను ఎట్టి పరిస్థితిలోను రాజకీయాల్లోకి రానన్నారు.

30న కన్నడ సాహిత్య సమ్మేళనం


ఆహ్వానపత్రికను విడుదల చేస్తున్న దృశ్యం

గంగావతి: బాలల కన్నడ సాహిత్య సమ్మేళనాన్ని ఈనెల 30న లిటిల్ హార్ట్స్ పాఠశాలలో నిర్వహిస్తున్నట్లు పాఠశాల సమితి కార్యదర్శి జగన్నాథ్ అలంపల్లి తెలిపారు. ఆయన మంగళవారం పాఠశాలలో ఆహ్వాన పత్రికను విడుదల చేసి మాట్లాడారు. తమ పాఠశాల నుంచి ప్రతి ఏటా బాల విద్యార్థులతో కన్నడ సాహిత్య సమ్మేళనాన్ని నిర్వహించడంలో భాగంగానే ఈ ఏడాది ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కన్నడ సాహిత్య సమ్మేళనం అధ్యక్షుడుతో పాటు పలు రకాల కళా బృందాలతో విద్యార్థులు పలు రకాల వేషధారణలతో ఏపీఎంసీ వద్ద నుంచి పాఠశాల వరకు ఊరేగింపును నిర్వహిస్తామన్నారు. సమ్మేళనానికి అవసరమైన సామగ్రిని విద్యార్థుల నుంచి తయారు చేస్తున్నట్లు తెలిపారు. పాఠశాల హెచ్ఎం ప్రియా కుమారి, పాఠశాల సమితి సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

దుమ్ము లేని గిణిగెరకు డిమాండ్


వినతిపత్రాన్ని అందిస్తున్న గ్రామస్తులు

గంగావతి: గిణిగెరను దుమ్ము లేని గ్రామంగా తీర్చిదిద్దాలన్న డిమాండ్‌తో కొప్పళ జిల్లాధికారి కార్యాలయం ముందు మంగళవారం గిణిగేర నాగరిక సమితి ఆధ్వర్యంలో ధర్నా చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామంలో దుమ్ము, ధూళి, చుట్టు పక్కల ఉన్న సిమెంట్ ఫ్యాక్టరీల ద్వారా ఇళ్ల వద్ద, రహదారిల్లో ఆవరిస్తోందన్నారు. దీంతో పలు రకాల వ్యాధులకు గురై ఒకరిద్దరు ప్రాణాలు కూడా కోల్పోయారన్నారు. గ్రామానికి మంచినీరు, దుస్థితికి చేరిన రోడ్లను మరమ్మతు చేయాలని వారు డిమాండ్ చేశారు. అనంతరం తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని జిల్లాధికారికి అందజేశారు.